www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 13-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 88 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాడమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి మ. 3.06 తదుపరి అష్టమి; నక్షత్రం: హస్త రా. 7.15 తదుపరి చిత్త; వర్జ్యం: తె. 4.12 మొదలు; దుర్ముహూర్తం: ఉ. 5.52-7.35; అమృతఘడియలు: మ. 12.28-2.16; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 5.52; సూర్యాస్తమయం: 6.49 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru




బిజినెస్

విజయవాడ ● శనివారం 13 జూలై 2024

పీఎస్‌యూలకు కాయకల్ప చికిత్స

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకూ ఫుల్ స్టాప్.. మారిన మోదీ వైఖరి



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణపై మోదీ సర్కారు వెనక్కి తగ్గుతోంది. నష్టాల్లో ఉన్న పీఎస్‌యూలను అమ్మేయడం లేదా మూసేయడం, లాభాల్లో ఉన్న పీఎస్‌యూల్లో పెట్టుబడుల ఉపసంహరణ దూకుడుగా చేస్తామని 2021లో మోదీ సర్కార్ గొప్పగా ప్రకటించింది. 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాలతో అది కాస్తా బెడిసి కొట్టింది. కీలక సంకీర్ణ భాగస్వామ్య పార్టీలైన టీడీపీ, జేడీయూ ఎడాపెడా పీఎస్‌యూల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నాయి. దీంతో ఈ సంస్థల ప్రైవేటీకరణకు బదులు వాటి మిగులు భూములు, కీలకేతర ఆస్తులు అమ్మి వాటిని ఆర్థికంగా మరింత పటిష్ఠం చేయాలని మోదీ సర్కారు భావిస్తున్నట్టు సమాచారం. ఈ నెల 23న ప్రకటించే కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి సీతారామన్ దీనిపై స్పష్టమైన ప్రకటన చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు.

అది నుంచీ నత్త నడకే

బీజేపీ నాయకత్వంలోని ఎన్‌డీఏ 2014లో అధికారం చేపట్టినప్పటి నుంచీ పీఎస్‌యూలకు ప్రైవేటీకరణ భయం పట్టుకుంది. గతంలో యూపీఏ సర్కారు హయాంలోనూ కొన్ని సంస్థల ప్రైవేటీకరణ జరిగింది. అయితే అప్పటి సంకీర్ణ పక్షాలు ముఖ్యంగా వామ పక్షాల ఒత్తిడితో మన్మోహన్ సర్కారు ఈ విషయంలో పెద్దగా దూకుడు ప్రదర్శించలేదు. 2014లో బీజేపీకి సంపూర్ణ మెజారిటీ రావడంతో ఇక దేశంలో పీఎస్‌యూలు ఉండవనే ఆందోళన జోరందుకుంది. కొందరు కేంద్ర మంత్రుల ప్రకటనలు ఈ భయాల్ని మరింత పెంచాయి. అయినా గత పదేళ్లలో 2017-18, 2018-19 ఆర్థిక సంవత్సరాల్లో తప్ప ఏనాడూ పీఎస్‌యూల పెట్టుబడుల లక్ష్యం ఆశించిన స్థాయిని చేరుకోలేదు. గత ఆర్థిక సంవత్సరం పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ.51,000 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా నిర్ణయిస్తే రూ.14,564 కోట్లకు మించి సాధ్యం కాలేదు. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలోనూ ఇదే పరిస్థితి. గత రెండేళ్లలో ఎయిర్ ఇండియా తప్ప, మరే ప్రధాన పీఎస్‌యూ ప్రైవేటీకరణ సాధ్యం కాలేదు. ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణ కూడా సెంటిమెంట్‌తో టాటా గ్రూపు కొనడం వల్లే సాధ్యపడింది.

రెట్టింపైన మార్కెట్ క్యాప్

గత ఏడాది కాలంలో బీఎస్‌ఈ సెన్సెక్స్ 22 శాతం పెరిగింది. ఇదే సమయంలో బీఎస్‌ఈ పీఎస్‌యూ సూచీ 100 శాతం పెరిగింది. దీంతో మూడో సారీ బంపర్ మెజారిటీతో గెలిస్తే పెద్ద ఎత్తున పీఎస్‌యూలను ప్రైవేటీకరించి, ద్రవ్య లోటు మరింత పూడ్చుకోవచ్చని మోదీ సర్కారు భావించింది. అయితే ఓటర్లు అందుకు బ్రేక్ వేయడంతో ఆ ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. ఇపుడు పీఎస్‌యూల ప్రైవేటీకరణకు బదులు, వాటిని మరింత బలోపేతం చేసి, వాటి నుంచి పెద్ద మొత్తంలో డివిడెండ్ ఆదాయం రాబట్టాలనేది మోదీ సర్కారు వ్యూహంగా కనిపిస్తోంది. దీంతో బీపీసీఎల్, రెండు ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఒక బీమా కంపెనీ ప్రైవేటీకరణ కథ కూడా కంచికి చేరనుంది. పెద్దగా వ్యతిరేకత రాని ఎన్ఎండీసీ స్టీల్, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌సీఐ) ప్రైవేటీకరణ తప్ప, మిగతా పీఎస్‌యూల ప్రైవేటీకరణ ఉండకపోవచ్చని భావిస్తున్నారు.

ప్రభుత్వ రంగంలోనే వీఎస్‌పీ

తాజా రాజకీయ పరిణామాల పుణ్యమాని విశాఖ స్టీలు ప్లాంటు (వీఎస్‌పీ) ప్రైవేటీకరణ కూడా అటకెక్కినట్టే. ఆంధ్ర ప్రదేశ్ ప్రజల మనో భావాలతో ముడిపడి ఉన్న ఈ ప్లాంటును ప్రైవేటు పరం చేసే ప్రకస్తే లేదని కేంద్ర ఉక్కు, గనుల శాఖ మంత్రి కుమార స్వామి ఇప్పటికే స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వంలో కీలక భాగస్వామ్య పక్షమైన టీడీపీ ఒత్తిడి ఇందుకు కారణమని వేరే చెప్పనవసరం లేదు. వీఎస్‌పీని నష్టాల నుంచి బయట పడేసేందుకు వీలైన అన్ని చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి కుమార స్వామి ప్రకటించడం మరో కొసమెరుపు.

ఒప్పో రెనో12 5జీ ఫోన్లు

» ప్రారంభ ధర రూ.32,999



న్యూఢిల్లీ: చైనా స్మార్ట్‌ఫోన్ కంపెనీ ఒప్పో శుక్రవారం భారత మార్కెట్లో 'రెనో 12-5జీ' సిరీస్ ఫోన్లను విడుదల చేసింది. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ఫీచర్లతో కూడిన ఈ ఫోన్ మూడు వేరియంట్లలో లభించనుంది. 8జీ ర్యామ్, 256 జీబీ స్టోరేజీ సామర్థ్యంతో కూడిన రెనో 12 5జీ ఫోన్ రేటు రూ.32,999 కాగా, రెనో 12 ప్రో 5జీలో 12జీబీ ర్యామ్, 256 జీబీ స్టోరేజీ వెర్షన్ ధరను రూ.36,999గా నిర్ణయించింది. 12జీబీ ర్యామ్, 512 జీబీ స్టోరేజీ వెర్షన్ రూ.40,999కు లభించనుంది. భారత్‌లో రెనో 12 ప్రో 5జీ ఫోన్ల విక్రయాలు ఈనెల 18 నుంచి ప్రారంభమవుతాయని, రెనో 12 5జీ ఫోన్ మాత్రం ఈనెల 25వ తేదీ నుంచి అందుబాటులోకి వస్తుందని కంపెనీ వెల్లడించింది.

అమెజాన్ 'ప్రైమ్ డే'లో వెయ్యి కొత్త ఉత్పత్తులు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెజాన్ ఇండియా తన ప్రైమ్ సభ్యుల కోసం ఈ నెల 20-21 తేదీల్లో పెద్ద ఎత్తున 'ప్రైమ్ డే'ని నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా మొబైల్ ఫోన్లు, గృహోపకరణాలు, హోమ్ డెకార్, ఫ్యాషన్, బ్యూటీ కేర్‌కు సంబంధించి 450 కంపెనీలు, వెయ్యికిపైగా కొత్త ఉత్పత్తులను తమ ఇ-కామర్స్ వెబ్‌సైట్ ద్వారా అమ్మకానికి పెట్టబోతున్నట్టు అమెజాన్ డైరెక్టర్ (షాపింగ్ ఎక్స్‌పీరియన్స్, ఇండియా అండ్ ఎమర్జింగ్ మార్కెట్స్) తోట కిశోర్ విలేకరులతో చెప్పారు. సాంసంగ్, మోటరోలాతో సహా ఏడు ప్రముఖ కంపెనీలు కూడా ప్రైమ్ డే సమయంలో తమ కొత్త ఉత్పత్తులను విడుదల చేయబోతున్నట్టు తెలిపారు. దాదాపు అన్ని కంపెనీలు తమ బ్రాండ్లు, ఉత్పత్తులపై ప్రత్యేక డిస్కౌంట్లు, కాష్‌బ్యాక్‌లు ఆఫర్ చేస్తున్నట్టు చెప్పారు. ఈ ప్రైమ్ డే రోజు అమెజాన్ ద్వారా కొనే వస్తువుల్లో 10 లక్షల వస్తువులను అదే రోజు, మరో 14 లక్షల వస్తువులను మరుసటి రోజు ప్రైమ్ సభ్యులకు డెలివరీ చేస్తామన్నారు.

ఫారెక్స్ నిల్వల్లో ఆల్‌టైం రికార్డు

విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వలు సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. ఈనెల 5తో ముగిసిన వారంలో ఇవి 515.8 కోట్ల డాలర్ల వృద్ధితో 65,715.5 కోట్ల డాలర్లకు చేరుకున్నాయని ఆర్‌బీఐ శుక్రవారం వెల్లడించింది. అంతక్రితం రెండు వారాల్లో నిల్వలు స్వల్పంగా తగ్గాయి.

ఐటీ షేర్లు జిగేల్

» రూ.452 లక్షల కోట్లు దాటిన సంపద



ముంబై: ఐటీ, టెక్నాలజీ షేర్లలో భారీగా కొనుగోళ్లతోపాటు ఫెడ్ రేట్ల తగ్గింపు ఆశలతో స్టాక్ మార్కెట్ సూచీలు వారాంతంలో సరికొత్త ఉన్నత శిఖరాలకు ఎగబాకాయి. శుక్రవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒకదశలో 996.17 పాయింట్లు పెరిగి 80,893.51 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 622 పాయింట్ల లాభంతో మరో జీవన కాల గరిష్ఠ స్థాయి 80,519.34 వద్ద క్లోజైంది. నిఫ్టీ సైతం ఒకదశలో 276.25 పాయింట్లు ఎగబాకి 24,592.20 వద్ద ఇంట్రాడే రికార్డును నమోదు చేసినా చివరికి 186.20 పాయింట్ల లాభంతో 24,502.15 వద్ద మరో రికార్డు స్థాయిలో ముగిసింది. టీసీఎస్ జూన్ త్రైమాసిక ఫలితాలు మార్కెట్ అంచనాలను మించడంతో ఐటీ రంగ వృద్ధి పునరుద్ధరణపై అంచనాలు పెరిగాయి. దాంతో టీసీఎస్, ఇన్ఫోసిస్ సహా ఐటీ షేర్లన్నీ ర్యాలీ తీశాయి. అలాగే, గత నెలకు అమెరికా ధరల సూచీ ఏడాది కనిష్ఠానికి జారుకుంది. దాంతో యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపును ఈ సెప్టెంబరు నుంచే ప్రారంభించవచ్చన్న అంచనాలు బలపడటం ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మరింత మెరుగుపరిచింది.

- ఈ ర్యాలీలో బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ మరో రూ.1.17 లక్షల కోట్లు పెరిగి సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయి రూ.452.38 లక్షల కోట్లకు (5.42 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.
- టీసీఎస్ 6.68 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. టీసీఎస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.94,866 కోట్లకు పైగా పెరిగి రూ.15.14 లక్షల కోట్లకు చేరుకుంది.
- చిన్న, మధ్యస్థాయి కంపెనీల షేర్లలో అమ్మకాలు కొనసాగడంతో బీఎస్‌ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు 0.22 శాతం వరకు నష్టపోయాయి.
- ఆప్టికల్ అండ్ డిజిటల్ సొల్యూషన్స్ కంపెనీ స్టెరిలైట్ టెక్నాలజీస్ లిమిటెడ్ (ఎస్‌టీఎల్) తన గ్లోబల్ సర్వీసెస్ బిజినెస్‌ను ప్రత్యేక సంస్థగా విభజించేందుకు షేర్‌హోల్డర్లతో పాటు రుణదాతల నుంచి ఆమోదం లభించింది.

హెచ్‌సీఎల్ టెక్ భళా

» ఒక్కో షేరుకు రూ.12 మధ్యంతర డివిడెండ్

న్యూఢిల్లీ: హెచ్‌సీఎల్ టెక్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలను మించాయి. జూన్ త్రైమాసికానికి కంపెనీ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 20.4 శాతం వృద్ధి చెంది రూ.4,257 కోట్లకు చేరుకుంది. ఆదాయం 6.6 శాతం పెరిగి రూ.28,057 కోట్లుగా నమోదైంది. కాగా, ఈ ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఆదాయం వృద్ధి 3-5 శాతంగా నమోదుకావచ్చని కంపెనీ అంచనా వేసింది. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.12 మధ్యంతర డివిడెండ్ చెల్లించనున్నట్లు కంపెనీ ప్రకటించింది. అర్హులైన వాటాదారుల రికార్డు తేదీని ఈనెల 23గా నిర్ణయించిన కంపెనీ.. వచ్చేనెల 1న డివిడెండ్ చెల్లింపులు జరపనుంది.

వాట్సాప్ ద్వారా త్వరలో రైలు టిక్కెట్లు: మెటా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మెటా నిర్వహణలోని వాట్సాప్ యాప్ వ్యాపార సేవలను పెద్ద ఎత్తున విస్తరిస్తోంది. హైదరాబాద్ మెట్రో సహా ఇప్పటికే పలు నగరాల్లో మెట్రో రైలు టిక్కెట్లను అందిస్తున్న వాట్సాప్, త్వరలో రైల్వే రిజర్వేషన్ టిక్కెట్లు అందించేందుకూ సిద్ధమవుతోంది. ఇందుకోసం ఐఆర్‌సీటీసీతో చర్చలు జరుపుతున్నట్టు మెటా డైరెక్టర్ (బిజినెస్ మెసేజింగ్) రవి గార్గ్ చెప్పారు. క్రమంగా ఈ సేవలను వివిధ రాష్ట్రాల బస్సు సర్వీసులకూ విస్తరించనున్నట్టు తెలిపారు. వాట్సాప్ బిజినెస్ ప్లాట్‌ఫాం ద్వారా పెద్ద పెద్ద వ్యాపార సంస్థలతో పాటు చిన్న చిన్న వ్యాపార సంస్థలకూ కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ప్రత్యేక సేవలు అందించనున్నట్టు తెలిపారు. చిన్న చిన్న వ్యాపార సంస్థలకు ప్రకటనలు, ప్రచార రూపకల్పనలో తమ ఏఐ ఆధారిత అసిస్టెంట్లు, ఏజెన్సీల ద్వారా ఉచితంగా తోడ్పడనున్నట్టు రవి గార్గ్ తెలిపారు.

ధరల హోరు..

» జూన్ ద్రవ్యోల్బణం 5.08 శాతం



న్యూఢిల్లీ: దేశంలో ధరలు హోరెత్తిపోతున్నాయి. ఆహార వస్తువులు ప్రత్యేకించి కూరగాయల ధరలు ప్రియం అయిన కారణంగా జూన్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 5.08 శాతానికి పెరిగింది. ఇది నాలుగు నెలల గరిష్ఠ స్థాయి. మే నెలలో ఇది 4.8 శాతం ఉండగా గత ఏడాది జూన్‌లో 4.87 శాతం ఉంది. ఈ ఏడాది జనవరి నుంచి తగ్గుముఖంలో ఉన్న రిటైల్ ద్రవ్యోల్బణం జూన్‌లో తిరిగి పైకి ఎగసింది. ఆహార వస్తువుల ధరలు జూన్ నెలలో 9.36 శాతం మేరకు పెరిగాయి. వడ్డీరేట్లపై నిర్ణయం కోసం ఆర్‌బీఐ రిటైల్ ద్రవ్యోల్బణాన్నే గీటురాయిగా తీసుకుంటుంది.

ఏడు నెలల గరిష్ఠానికి పారిశ్రామికోత్పత్తి

పారిశ్రామిక రంగం మే నెలలో మెరుగైన పనితీరు ప్రదర్శించింది. పారిశ్రామికోత్పత్తి వృద్ధిరేటు 7 నెలల గరిష్ఠ స్థాయి 5.9 శాతంగా నమోదయింది. ప్రధానంగా పవర్, మైనింగ్ రంగాలు ఇందుకు దోహదపడ్డాయి. గత ఏడాది అక్టోబరులో నమోదైన గరిష్ఠ వృద్ధి 11.9 శాతం తర్వాత నమోదైన గరిష్ఠ వృద్ధి ఇదే. కాగా ఏప్రిల్‌లో ఇది 5 శాతం ఉండగా గత ఏడాది మేలో 5.7 శాతం ఉంది. ఈ మే నెలలో మైనింగ్ రంగం 6.6 శాతం, విద్యుత్ రంగం 13.7 శాతం వృద్ధిని నమోదు చేశాయి. తయారీ రంగం వృద్ధి మాత్రం 4.6 శాతానికి దిగజారింది.

కొత్త ఫార్ములేషన్‌తో గుడ్‌నైట్

హైదరాబాద్: గోద్రెజ్ కన్స్యూమర్ ప్రోడక్ట్స్ లిమిటెడ్ (జీసీపీఎల్) బహుళ జనాదరణ పొందిన దోమల నివారిణి గుడ్‌నైట్ ఫ్లాష్ లిక్విడ్ వాపొరైజర్‌లో రెనోఫ్లుత్రిన్ ఫార్ములేషన్‌ను ప్రవేశపెట్టింది. దోమల నివారణ విషయంలో జీసీపీఎల్ శాస్త్రవేత్తలు సాధించిన ఘన విజయం ఇది. వారు తమ భాగస్వామితో కలిసి పరిశోధన చేసిన అనంతరం దేశీయంగా అభివృద్ధి చేసి, పేటెంట్ పొందిన రెనోఫ్లుత్రిన్ వల్ల గుడ్‌నైట్ లిక్విడ్ మరింత సమర్థవంతంగా దోమలను నివారించగలుగుతుందని జీసీపీఎల్ ఒక ప్రకటనలో తెలిపింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,750 ▲	67,600 ▲	1,00,000 ▲
ముంబై	72,660 ▲	66,560 ▲	92,204 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

13వ తేదీ

హైదరాబాద్	530	విజయవాడ	555
వరంగల్	532	గోదావరి	555
చిత్తూరు	573	విశాఖపట్నం	575

డజను గుడ్లు రూ. 72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	108	విజయవాడ	113
వరంగల్	108	గుంటూరు	113
కరీంనగర్	108	ఒంగోలు	113
మహబూబ్‌నగర్	108	చిత్తూరు	118
కర్నూలు	108	నెల్లూరు	118
విశాఖపట్నం	105	అనంతపురం	113
గోదావరి	113		

స్పోర్ట్స్



మళ్లీ ఆ ఇద్దరే!

ఫైనల్లో అల్కారజ్ X జొకోవిచ్

మెద్వెదెవ్, ముసేటికి నిరాశ

లండన్: మళ్లీ ఆ ఇద్దరి మధ్యే ఫైనల్‌కు వింబుల్డన్ సెంటర్ కోర్టు సిద్ధమైంది ఏడుసార్లు విజేత నొవాక్ జొకోవిచ్, డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్కారజ్ వరుసగా రెండో ఏడాది తుదిపోరులో అమీతుమీ తేల్చుకోనున్నారు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్స్‌లో 2021 యూఎస్ ఓపెన్ విజేత, రష్యన్ స్టార్ డానిల్ మెద్వెదెవ్‌ను మూడోసీడ్ అల్కారజ్ 6-7(1-7), 6-3, 6-4, 6-4తో చిత్తుచేయగా.. ఇటలీకి చెందిన 22 ఏళ్ల కుర్రాడు లోరెంజో ముసేటి జోరుకు చెక్ పెడుతూ రెండోసీడ్ జొకోవిచ్ 6-4, 7-6(7-2), 6-4తో గెలుపొందాడు. నిరుడు ఇదే వేదికపై హోరాహోరీగా జరిగిన ఫైనల్లో 24 గ్రాండ్‌స్లామ్‌ల వీరుడు జొకోవిచ్ ఆధిపత్యానికి గండికొడుతూ 21 ఏళ్ల అల్కారజ్ తొలిసారి ఆల్ ఇంగ్లండ్ క్లబ్‌లో విజేతగా నిలిచాడు. మరి.. ఈసారీ అదే ఫలితాన్ని పునరావృతం చేసి స్పెయిన్ కుర్రాడు అల్కారజ్ అద్భుతం చేస్తాడా.. లేదంటే 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తో సెర్బియా యోధుడు నొవాక్ చరిత్ర సృష్టిస్తాడా అన్నది ఆదివారం తేలనుంది.

తొలిసెట్ మినహా..: నిరుడు ఇక్కడే తనను ఓడించి ఫైనల్ చేరిన అల్కారజ్‌ను అడ్డుకోవడంలో ఐదోసీడ్ మెద్వెదెవ్ వరుసగా రెండోసారీ విఫలమయ్యాడు. రెండు గంటలా 55 నిమిషాల పాటు సాగిన సెమీస్ పోరులో మెద్వెదెవ్ తొలి సెట్ మినహా ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయాడు. అల్కారజ్ 6 ఏస్‌లు, 55 విన్నర్లను సంధించగా.. మెద్వెదెవ్ 5 ఏస్‌లు, 31 విన్నర్లకు పరిమితమయ్యాడు. ఆదివారం ఫైనల్లో గనక గెలిస్తే అల్కారజ్.. ఒకటి కంటే ఎక్కువసార్లు వింబుల్డన్ అందుకున్న 22 ఏళ్లలోపు వయసు ఆటగాడిగా దిగ్గజాలు బోరిస్ బెకర్, జాన్ బోర్గ్‌ల సరసన చేరతాడు.

జొకో అలవోకగా..: తనకు అచ్చొచ్చిన వేదికపై జొకోవిచ్ మరోసారి విజృంభించాడు. తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ సెమీస్ చేరిన ముసేటిపై రెండు గంటలా 48 నిమిషాల పాటు పోరాడి విజయం సాధించాడు. 37 ఏళ్ల జొకోవిచ్ ఆల్ ఇంగ్లండ్ క్లబ్‌లో ఫైనల్ చేరడం ఇది పదోసారి.

మహిళల ఫైనల్ నేడే



క్రెజికోవాతో పొలిని ఢీ

(సా. 6.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో)

సింధు, ప్రణయ్‌లకు సులువైన డ్రా

పారిస్ ఒలింపిక్స్

న్యూఢిల్లీ: ఈనెలలో జరగబోయే పారిస్ ఒలింపిక్స్‌లో భారత షట్లర్లకు కాస్త అనుకూలమైన డ్రా ఎదురైంది. మహిళల సింగిల్స్‌లో డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ పీవీ సింధు, పురుషుల సింగిల్స్‌లో హెచ్ఎస్ ప్రణయ్‌కు తమ గ్రూపు ఆరంభ మ్యాచ్‌ల్లో బలహీన ప్రత్యర్థులు ఎదురుకానున్నారు. ప్రపంచ 13వ ర్యాంకర్ సింధుకు గ్రూప్ ఎంలో క్రిస్టిన్ కూబా (ఎస్టోనియా), ఫాతిమాత్ నబాహ (మాల్దీవులు) పోటీ ఇవ్వనున్నారు. అయితే ప్రీక్వార్టర్స్‌లో ఆమెకు ఆరో సీడ్ హే బింగ్ జియావో (చైనా)తో సవాల్ తప్పదు. ఇక తొలిసారి ఒలింపిక్ బరిలోకి దిగుతున్న 13వ సీడ్ హెచ్ఎస్ ప్రణయ్, లక్ష్య సేన్ తమ గ్రూపుల్లోని ప్రత్యర్థులను ఓడిస్తే.. ఇద్దరూ ప్రీక్వార్టర్స్‌లో తలపడాల్సి ఉంటుంది. అలాగే మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-తనీష క్రాస్టోలకు క్లిష్టమైన డ్రా ఎదురైంది. మరోవైపు సాత్విక్-చిరాగ్ తలపడుతున్న పురుషుల డబుల్స్ ఈవెంట్ డ్రాను సాంకేతిక కారణాలరీత్యా వాయిదా వేశారు.



కాలిఫోర్నియాలో జరిగిన ఈఎస్‌పీవై అవార్డుల కార్యక్రమంలో అమెరికా మాజీ టెన్నిస్ స్టార్ సెరెనా విలియమ్స్

మూడోరోజే ముగించారు

» అట్కిన్సన్‌కు ఐదు వికెట్లు
» తొలి టెస్టులో విండీస్‌పై ఇంగ్లండ్ ఇన్నింగ్స్ విజయం

వెస్టిండీస్‌తో జరుగుతున్న మూడు టెస్టుల సిరీస్‌ను ఇంగ్లండ్ ఘనంగా ఆరంభించింది. అరంగేట్ర పేసర్ గస్ అట్కిన్సన్ రెండో ఇన్నింగ్స్‌లోనూ ఐదు వికెట్లతో చెలరేగాడు. దీంతో ఆతిథ్య జట్టు ఇన్నింగ్స్ 114 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మూడో రోజు శుక్రవారం 79/6 స్కోరుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన విండీస్ 136 పరుగులకే కుప్పకూలింది. మోటీ (31 నాటౌట్) మాత్రమే రాణించాడు. ఇంగ్లండ్ బౌలర్లు కేవలం గంటన్నరలోనే మ్యాచ్‌ను ముగించారు. అండర్సన్‌కు 3, స్టోక్స్‌కు 2 వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 371, విండీస్ 121 రన్స్ చేశాయి. మొత్తమ్మీద 12 వికెట్లు తీసిన అట్కిన్సన్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

అండర్సన్ టెస్టు కెరీర్ ఇలా..	మ్యాచ్‌లు	పరుగులు	వికెట్లు	ఉత్తమ బౌలింగ్
	188	1353	704	7/42



'హేయ్ జిమ్మీ! నీ 22 ఏళ్ల అద్భుత స్పెల్‌తో క్రికెట్ ప్రేమికులను అలరించావు. అలాగే నీ బౌలింగ్ శైలి, వేగం, కచ్చితత్వం, స్వింగ్, ఫిట్‌నెస్‌తో ముందు తరాలకు ఆదర్శంగా నిలిచావు. ఇకముందు కుటుంబంతో కొనసాగించే సరికొత్త ఇన్నింగ్స్ సుఖఃసంతోషాలతో సాగాలని కోరుకుంటున్నాను'

- సచిన్ టెండూల్కర్

సిరీస్‌పైనే గురి

- ఆత్మవిశ్వాసంతో భారత్
- ఒత్తిడిలో జింబాబ్వే

సా. 4.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

నేడు నాలుగో టీ 20



హరారే: తొలి మ్యాచ్‌లో అనూహ్య పరాజయం ఎదురైనప్పటికీ.. జింబాబ్వేతో ఐదు టీ20ల సిరీస్‌లో యువ భారత్ ఆశించినరీతిలోనే ముందుకు సాగుతోంది. వరుసగా రెండు విజయాలతో జోష్‌లో ఉన్న గిల్ సేన ఇప్పుడు సిరీస్‌పై కన్నేసింది. శనివారం హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో ఇరు జట్ల మధ్య నాలుగో టీ20 మ్యాచ్ జరగనుంది. 2-1 ఆధిక్యంతో ఉన్న భారత్ ఈ మ్యాచ్ గెలిస్తే సిరీస్ వశమవుతుంది. అందుకే ఎలాంటి అలసత్వానికి తావీయకుండా మరో మ్యాచ్ ఉండగానే సిరీస్‌ను ముగించాలనుకుంటోంది. అటు జింబాబ్వే అద్భుత ప్రదర్శన ఒక్క మ్యాచ్‌కే పరిమితమైంది. భారత్‌ను అడ్డుకోవడంతో పాటు తమ ఆశలను సజీవంగా ఉంచుకోవాలనుకున్నా.. వారికీ మ్యాచ్ గెలవడం తప్పనిసరి. అలాగైతేనే చివరి పోరు ఇరువురికీ కీలకమవుతుంది.

మార్పులుంటాయా?: మూడో టీ20లో భారత జట్టు మూడు మార్పులతో బరిలోకి దిగింది. దీంతో టీమ్‌లో జైస్వాల్, గిల్, అభిషేక్, రుతురాజ్‌ల రూపంలో నలుగురు ఓపెనర్లు టాప్-4లో ఆడాల్సి వచ్చింది. మిడిలార్డర్ బ్యాటర్ లేని లోటును నేటి మ్యాచ్‌లో పూరించాలనుకుంటున్నారు. అదే జరిగితే అభిషేక్ స్థానంలో రియాన్ పరాగ్‌కు చాన్స్ దక్కవచ్చు. ఇక బౌలింగ్‌లో రెండో టీ20లో ఖలీల్‌ను, మూడో టీ20లో ముకేశ్‌ను ఆడించలేదు. ఇప్పుడు పేసర్ అవేశ్‌కు విశ్రాంతినిచ్చి హర్షిత్‌ను పరీక్షించవచ్చు.

తుది జట్లు (అంచనా)

భారత్: గిల్ (కెప్టెన్), జైస్వాల్, గైక్వాడ్, పరాగ్, రింకూ సింగ్, దూబే, శాంసన్, సుందర్, బిష్ణోయ్, హర్షిత్, ముకేశ్.

జింబాబ్వే: మరుమని, ఇన్నోసెంట్, బెన్నెట్, మధెవెరె, సికిందర్ రజా (కెప్టెన్), మదండె, క్యాంప్‌బెల్, జోంగ్వే, మసకద్జ, ఎన్‌గరవ, ముజరబాని.



పేస్ యోధుడు ముగించాడు

21 ఏళ్ల కెరీర్‌కు అండర్సన్ వీడ్కోలు

700 వికెట్లు తీసిన ఏకైక పేసర్‌గా రికార్డు

ప్రపంచ క్రికెట్‌లో ఓ పేస్ యోధుడి శకం ముగిసింది. ఒకటా.. రెండా.. ఏకంగా 21 ఏళ్ల పాటు అత్యంత సవాల్‌తో కూడిన టెస్టు ఫార్మాట్‌ను శాసించిన ఇంగ్లండ్ గ్రేట్ జేమ్స్ మైకేల్ అండర్సన్ అంతర్జాతీయ క్రికెట్‌కు అధికారికంగా వీడ్కోలు పలికాడు. వెస్టిండీస్‌తో జరిగే తొలి టెస్టే తన కెరీర్‌లో ఆఖరిదని 41 ఏళ్ల జిమ్మీ గతంలోనే ప్రకటించాడు. తాజాగా ఇన్నింగ్స్ 114 పరుగుల తేడాతో ఇంగ్లండ్ విజయం సాధించడంతో.. తన అరంగేట్ర టెస్టు వేదిక లార్డ్స్‌లోనే ఆఖరి మ్యాచ్‌ను కూడా ఘనంగా ముగించినట్టయ్యింది. అలాగే ఈ మ్యాచ్‌లో నాలుగు వికెట్లు తీసి గెలుపులోనూ భాగస్వామ్యం కావడం మరో విశేషం. అద్భుత స్వింగ్-సీమ్‌తో మైదానంలో ప్రత్యర్థి బ్యాటర్లను వణికించిన ఈ పేసర్ బయట వివాదరహితుడిగా కొనసాగాడు. వాస్తవానికి క్రికెట్‌లో ఓ బౌలర్ ఇంత సుదీర్ఘ ప్రయాణం కొనసాగించడమంటే ఆషామాషీ కాదు. గాయాలను తట్టుకుంటూ.. శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకుని.. సుదీర్ఘ ఫార్మాట్‌లో తనదైన ముద్రను వేస్తూ ఇంగ్లండ్ తరఫున అత్యంత విజయవంతమైన బౌలర్‌గా అండర్సన్ నిలిచిన విధానం ఓ అద్భుతం. తన తరంతోపాటే కాదు.. తర్వాతి తరంతోనూ ఆడి మురిపించడం అతడికి మాత్రమే సాధ్యమైంది. అందుకే ఓ పేసర్ కెరీర్‌లో ఎవరికీ సాధ్యం కాని రీతిలో 700 వికెట్లకు పైగా తీయగలిగాడు. 2002లో వన్డేల్లో అరంగేట్రం చేసిన అండర్సన్ తర్వాతి ఏడాది తొలి టెస్టును ఆడాడు. అలాగే చివరి టీ20ని 2009లో.. చివరి వన్డేను 2015లో ఆడగా, అప్పటి నుంచి పూర్తిగా టెస్టులపైనే దృష్టి సారించాడు. ఇక మూడు ఫార్మాట్లలో కలిపి ఆడిన 401 మ్యాచ్‌ల్లో 991 వికెట్లు తీశాడు. రికార్డుల విషయానికి వస్తే.. మురళీధరన్ (800), వార్న్ (708) తర్వాత టెస్టుల్లో అత్యధిక వికెట్లు (704) తీసిన మూడో బౌలర్‌గా కొనసాగుతున్నాడు. అలాగే సచిన్ (200) తర్వాత ఎక్కువ టెస్టులు (188) ఆడింది కూడా జిమ్మీనే.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

అమ్మాయిల ఆసియా కప్‌లో ఫ్యాన్స్‌కు ఎంట్రీ ఫ్రీ

19న భారత్, పాక్ మ్యాచ్‌తో టోర్నీ షురూ

కొలంబో: మహిళల టీ20 ఆసియా కప్‌లో అభిమానులకు ఉచిత ప్రవేశం కల్పించనున్నారు. ఈ మేరకు శ్రీలంక క్రికెట్ బోర్డు ఈ విషయాన్ని శుక్రవారం వెల్లడించింది. మొత్తం ఎనిమిది జట్లు పోటీపడుతున్న ఈ టోర్నీ తొలి మ్యాచ్ 19న భారత్-పాక్ జట్ల మధ్య జరగనుంది. గ్రూప్-ఎలో భారత్, పాకిస్థాన్, యూఏఈ, నేపాల్ ఉండగా.. ఆతిథ్య శ్రీలంక, బంగ్లాదేశ్, మలేసియా, థాయ్‌లాండ్‌లకు గ్రూప్-బిలో చోటు దక్కింది. ప్రతి గ్రూప్ నుంచి తొలి రెండుస్థానాల్లో నిలిచిన జట్లు సెమీస్ చేరతాయి. ఈనెల 28న ఫైనల్ జరగనుంది.

ఫిట్‌గా ఉంటే.. 'మూడూ' ఆడాల్సిందే

టీమిండియా చీఫ్ కోచ్ గంభీర్

న్యూఢిల్లీ: టీమిండియా ప్రధాన కోచ్‌గా కొత్త ఇన్నింగ్స్ మొదలుపెట్టిన గౌతం గంభీర్ తన పనితీరు ఎలా ఉండనుందో ఇప్పుడే స్పష్టత ఇచ్చాడు. జట్టులోని ఆటగాళ్లు అన్ని ఫార్మాట్లలో ఆడడం వంటి అంశాలపై గంభీర్ స్పష్టంగా వివరించాడు. 'ఎవరైతే బాగా ఆడుతూ, ఫిట్‌గా ఉంటారో వాళ్లు మూడు ఫార్మాట్లలోనూ ఆడాలని కోరుకుంటా. గాయపడితే... విశ్రాంతి తీసుకొని కోలుకొని మళ్లీ జట్టులోకి రావాలి. ప్రొఫెషనల్ క్రికెటర్లుగా, దేశానికి ప్రాతినిధ్యం వహించే సమయంలో వీలైనన్ని ఎక్కువ మ్యాచ్‌లు ఆడాలి. ఆటగాళ్లకు వ్యక్తిగత మైలురాళ్ల కంటే దేశ ప్రయోజనాలే ముఖ్యం కావాలి' అని ఓ టీవీ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో గంభీర్ తెలిపాడు. కాగా, దక్షిణాఫ్రికా దిగ్గజం మోర్నీ మోర్కెల్‌ను టీమిండియా బౌలింగ్ కోచ్‌గా నియమించాలని బీసీసీఐని గంభీర్ కోరినట్టు సమాచారం. గతేడాది వన్డే ప్రపంచకప్ సమయంలో మోర్కెల్ పాక్ జట్టుకు సేవలు అందించాడు.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
శనివారం | 13-7-2024
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

ఎమర్జెన్సీ ప్రకటించిన జూన్ 25..

రాజ్యాంగ హత్యా దినం

8

- కేంద్ర ప్రభుత్వ సంచలన నిర్ణయం.. బాధితులు, పోరాట వీరుల స్మరణ
- అత్యవసర పరిస్థితి.. దేశ చరిత్రపై కాంగ్రెస్ రాసిన చీకటి అధ్యాయం: మోదీ
- ఇందిర ప్రజాస్వామ్యం గొంతునొక్కారు.. చీకటి రోజులకు నిరసనగానే: షా

మోదీ ముక్తి దివస్‌గా జూన్ 4
నవంబరు 8 ఆజీవక హత్యా దివస్ : ఖర్గే



'గ్యారంటీ'గా గోల్‌మాలే!

'చెల్లని' ష్యూరిటీలతో డిస్కమ్‌ల నుంచి భారీగా అడ్వాన్సులు

జగన్ హయాంలో అస్మదీయ కంపెనీల నిర్వాకం

- ఆ కంపెనీలకు రూ.వేల కోట్ల స్మార్ట్‌మీటర్ల కాంట్రాక్టు
- విదేశాల్లోని ఓ బ్యాంకు గ్యారంటీతో భారీగా అడ్వాన్స్‌లు
- ఆ గ్యారంటీలకు అభ్యంతరం చెప్పని డిస్కమ్‌లు
- దేశీయ బ్యాంకు గ్యారంటీలే తీసుకోవాలన్న రూల్ బ్రేక్
- సంతోషరావు, పద్మాజనార్దనరెడ్డి తీరు వివాదాస్పదం
- దందాలో వైసీపీ అధికారుల్లా వ్యవహరించారన్న విమర్శలు
- విజిలెన్స్ దర్యాప్తు జరపాలని సర్వత్రా డిమాండ్

(అమరావతి, ఆంధ్రజ్యోతి)

ఐదేళ్ల జగన్ అరాచక పాలనలో వ్యవస్థలను ముంచేసి, అస్మదీయ కాంట్రాక్టు కంపెనీలను మేపారు. చివరికి అవి 'చెట్లుబాటు' కాని గ్యారంటీలను చేతిలో పెట్టినా, మహాప్రసాదంలా డిస్కమ్‌లు వాటిని తీసుకున్న వైనం విద్యుత్ శాఖ వర్గాల్లో ప్రధాన చర్చనీయాంశంగా మారింది. ఈ కంపెనీలు రాష్ట్రానికి చెందిన మాజీ మంత్రి, పొరుగు రాష్ట్రానికి చెందిన మంత్రికి చెందినవి కావడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. ఏం జరిగిందంటే.. రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ స్కీమ్ (ఆర్‌డీఎస్‌ఎస్) కింద బిడ్‌లను దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థలు... పనులు చేపట్టేందుకు డిస్కమ్‌ల నుంచి అడ్వాన్సులు తీసుకున్నాయి. నిబంధనల ప్రకారం రూ. 100 అడ్వాన్సు తీసుకుంటే దానికి రూ. 110 విలువైన గ్యారంటీని సదరు సంస్థలు చూపించాలి. దేశీయబ్యాంకుల

మిగతా 9వ పేజీలో...

పెండింగ్‌పై దోబూచులాట

- చెల్లించాల్సిన బిల్లులు 28 వేల కోట్లేనట!
- ఇందులో ఇరిగేషన్ బిల్లులు 18 వేల కోట్లు
- మిగతా అన్ని శాఖల బిల్లులు 10 వేల కోట్లే
- మరి ఎనర్జీలోని 36 వేల కోట్ల మాటేమిటి?
- సీఆర్‌డీఏలోని 8 వేల కోట్లను లెక్కించరా?
- ఉద్యోగుల పెండింగ్ బిల్లు 25 వేల కోట్లు, మార్చి 31న ల్యాప్స్ చేసిన బిల్లు రూ.50 వేల కోట్లు ఏమైపోయినట్టు?
- పైపైన లెక్కిస్తేనే లక్ష కోట్లు దాటుతున్నాయి
- అయినా, సహకరించని పలు శాఖలు
- దీంతో ఆర్థికంపై శ్వేతపత్రం జాప్యం



(అమరావతి, ఆంధ్రజ్యోతి)

బిల్లులు చేయిస్తే లాభం గానీ, బిల్లులు చూపిస్తే మాకేంటి అని అనుకుంటున్నారో, లేదా ఇప్పుడు ఆ పాతఫైళ్లన్నీ ఎవరు బూజు దులుపుతారులే అని బద్ధకిస్తున్నారో గానీ పెండింగ్ బిల్లుల లెక్క తేల్చడంపై అధికారులు, కిందిస్థాయి సిబ్బంది తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నారు. 15 రోజుల

మిగతా 8వ పేజీలో...



జగన్‌పై హత్యాయత్నం కేసు



- సీఐడీ, ఐబీ మాజీ చీఫ్‌లు సునీల్‌కుమార్, పీఎస్‌ఆర్‌పైనా
- రఘురామరాజు ఫిర్యాదుతో గుంటూరు పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్
- ఏ-1గా సునీల్, ఏ-2గా పీఎస్‌ఆర్, ఏ-3గా మాజీ ముఖ్యమంత్రి
- నాటి అదనపు ఎస్పీ విజయ్‌పాల్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రభావతిపైనా కేసు
- 2021 మే 14న గుంటూరు సీఐడీ ఆఫీసులో రఘురామపై థర్డ్ డిగ్రీ
- బైపాస్ సర్జరీ జరిగిందన్నా వినకుండా గుండెలపై కూర్చున్నారు
- బెల్టు, లాఠీలతో కొట్టి చంపే యత్నం
- నగరంపాలెం పోలీసులకు మెయిల్‌లో ఫిర్యాదు పంపిన టీడీపీ ఎమ్మెల్యే

గుంటూరు, జూలై 12: నాటి నరసాపురం వైసీపీ ఎంపీ, ప్రస్తుత ఉండి టీడీపీ ఎమ్మెల్యే కె.రఘురామకృష్ణంరాజుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి హత్యాయత్నం చేశారన్న ఆరోపణలతో మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయనతోపాటు అప్పటి సీఐడీ చీఫ్ పీవీ సునీల్‌కుమార్, నాటి నిఘా విభాగం అధిపతి పీఎస్‌ఆర్ ఆంజనేయులుపైనా

మిగతా 10వ పేజీలో...

వివాదంలో ఐపీఎస్ సునీల్!

- సుప్రీంకోర్టు నిర్ణయానికి వక్రీకరణ
- రఘురామ కేసులో ఎఫ్ఐఆర్‌పై అసత్యాలు
- ఏబీవీకో రూల్.. ఈయనకో రూలా?

10



శుక్రవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ముఖ్యమంత్రి చంద్రబాబు

గోతుల రోడ్లకు మోక్షం



4 వేల కిలో మీటర్ల మేర తక్షణం రోడ్లకు మరమ్మతులు

- రూ.286 కోట్ల విడుదలకు ఓకే
- ఆర్‌అండ్‌బీకి చంద్రబాబు ఆదేశం
- మరో 2 వేల కిలోమీటర్ల రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు కూడా
- బూడిద వినియోగంపై అధ్యయనం
- జగన్ నిర్లక్ష్యంపై విస్తుపోయిన సీఎం

అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): వాహనదారులకు ఇదో శుభవార్త. జగన్ పాలనలో రహదారులపై మోకాల్లోతు గోతులతో పడిన ఇబ్బందులకు కూటమి సర్కారు చెక్ పెట్టే కార్యక్రమానికి తెరదీసింది. రహదారులపై ఉన్న గుంతలు, మినీ చెరువులను పూడ్చివేసి చక్కటి ప్రయాణానికి వీలుగా వాటిని తీర్చిదిద్దాలని ప్రభుత్వం రోడ్లు భవనాల శాఖ(ఆర్‌అండ్‌బీ)ను ఆదేశించింది. దీనికి అవసరమైన రూ.286 కోట్ల నిధులు ఇచ్చేందుకు సంసిద్ధతను వ్యక్తం

మిగతా 10వ పేజీలో...

సోలార్ కార్పొరేషన్ నుంచి..

ధనుంజయ్‌రెడ్డి బామ్మర్ది అవుట్

- సీవోవోగా మురళీకృష్ణారెడ్డి తొలగింపు.. డీఈఈగా వెనక్కి
- నాడు అర్హత లేకున్నా.. లేని పదవి సృష్టించి అందలం
- సోలార్ కార్పొరేషన్, జెన్‌కో, ట్రాన్స్‌కోలపై పూర్తి పెత్తనం
- ఎండీలకు, ప్రత్యేక సీఎస్‌కూ ఆదేశాలిచ్చేంతగా తెగింపు
- జగన్ ఓటమితో పాత పోస్టుకు పంపిన ఇంధన శాఖ

9



కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిలు

8

- ఈడీ కేసులో మంజూరు చేసిన సుప్రీం కోర్టు.. పలు షరతులు
- సీబీఐ కేసులో 25వరకు కస్టడీ



ఏపీ సీఈవోగా వివేక్ యాదవ్

- మీనా స్థానంలో నియామకానికి ఆమోదం
- సీఎస్ నీరబ్‌కు కేంద్ర ఎన్నికల సంఘం లేఖ

10

టైటిల్ చట్టం 'నీతి' తప్పెన్!

కేంద్ర సంస్థ చెప్పిన అంశాలకు భిన్నం

భూ సర్వే ఫైనల్ రికార్డుల్లో భారీగా తప్పులు



- వైసీపీ కార్యాలయాలకు 300 కోట్ల భూములు
- పేదల ఇళ్ల స్థలాల పేరిట వైసీపీ నేతల దోపిడీ
- ఆ పార్టీ నాయకుల చేతుల్లో అసైన్డ్ భూములు
- తిరుపతిలో విలువైన భూములు పరాధీనం
- పుంగనూరులో 982 ఎకరాలకు తప్పుడు పట్టా
- చంద్రబాబుకు రెవెన్యూ శాఖ ప్రజెంటేషన్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ సర్కారు తీసుకొచ్చిన టైటిల్ చట్టం (ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్) ప్రజల ఆస్తులను ప్రమాదంలో పడేసేలా ఉందని రెవెన్యూ శాఖ నిర్ధారణకు వచ్చింది. ఆ చట్టం ఉపయోగించుకుని ప్రజల భూములను వైసీపీ నేతలు దోచుకునే అవకాశం ఉందని, అది అత్యంత ప్రమాదకరమైనదని సర్కారుకు నివేదించింది. సహజ వనరుల విభాగంలో భూములు, గనులు, ఖనిజాలు, అటవీ సంరక్షణపై ముఖ్యమంత్రి చంద్రబాబు త్వరలో శ్వేతపత్రం విడుదల చేయనున్నారు. అయితే, ఈ మూడు శాఖలు అందుకు అవసరమైన పూర్తి నివేదికలు ఇంకా రూపొందించలేదు. తమకు మరికొంత సమయం కావాలని

మిగతా 8వ పేజీలో...

12 గంటల్లోపు సేకరిస్తే చెత్త

సంపదే

- గ్రామాల స్వయం సమృద్ధికి దోహదకారి
- ఏడాదికి 2,643 కోట్ల ఆదాయానికి చాన్స్
- పిఠాపురంలో ఎస్ఎల్ఆర్ఎం పైలట్ ప్రాజెక్టు
- ఘన, ద్రవ వనరుల నిర్వహణపై అవగాహన
- రాష్ట్రంలో ప్రతి అవినీతి వెనకా ఓ ఐఏఎస్ అధికారి
- ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

10



వ్యర్థాల నిర్వహణపై ఏర్పాటు చేసిన ప్రదర్శనను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ప్రచండ నిష్క్రమణ!

నేపాల్ ప్రధానిగా ఉన్న గత ఏడాదిన్నరకాలంలో నాలుగుసార్లు అవిశ్వాసం ఎదుర్కొని పదవిని కాపాడుకోగలిగిన పుష్పకుమార్ దహల్ అలియాస్ ప్రచండ, శుక్రవారం నాటి అవిశ్వాసతీర్మానంలో ఘోరంగా ఓడిపోయి రాజీనామా చేయాల్సివచ్చింది. అరవైతొమ్మిదేళ్ళ ప్రచండకు అనుకూలంగా అరవైమూడు ఓట్లు వస్తే, వ్యతిరేకంగా 194 ఓట్లు పడ్డాయి. మొన్న మూడోతేదీ పరిణామం తరువాత ఆయన నిష్క్రమణ ఖాయమైపోయింది. ఇంతకాలమూ ఆయనను ప్రధాని పదవిలో కూచోబెట్టిన కేపీ శర్మ ఓలి మళ్ళీ తాను ప్రధాని కావడం కోసం సభలో అతిపెద్ద పార్టీగా ఉన్న నేపాలీ కాంగ్రెస్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. నేపాలీ కాంగ్రెస్‌కు 89స్థానాలు, శర్మ నేతృత్వంలోని సీపీఎన్–యుఎంఎల్‌కు 78సీట్లు ఉన్నందున, 138స్థానాల కనీస బలాన్ని ఈ కూటమి గట్టిగానే దాటింది. ఓలి కాబోయే ప్రధాని అని నేపాలీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేర్ బహదూర్ దేవ్‌బా వారం క్రితమే తేల్చేశారు.

ఈ రెండు ప్రధాన పార్టీల మధ్యా ఏడుసూత్రాల ఒప్పందం కుదరడంతో కలసికట్టుగా ప్రచండను దించేశాయి, ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమని దేశాధ్యక్షుడికి విజ్ఞప్తిచేసుకున్నాయి. ఇంకా కొన్ని కీలకమైనశాఖల పంపకం దగ్గర లెక్కలు తేల్చుకోవాల్సి ఉన్నదనీ, మిత్రపక్షం నుంచి డిప్యూటీ పీఎంను పెట్టుకోవడం శర్మకు ససేమిరా ఇష్టం లేదనీ వార్తలు వస్తున్నాయి. ఇక, కనీస ఉమ్మడి కార్యాచరణ వంటి మాటలు ప్రజలకు అర్థంకానివేమీ కావు. ఈ కొత్తకూటమితో తమకు ఒరిగేదేమీ ఉండదనీ, ఈ పరిణామం తమకు సంబంధించింది కాదని వారికి తెలుసు. తొలి ఏడాదిన్నర డెబ్బైరెండేళ్ళ ఖడ్గప్రసాద్ శర్మ ఓలీ ప్రధానిగా ఉండి, ఆ తరువాత డెబ్బయ్ఎనిమిదేళ్ళ దేవ్‌బా ఆ పదవిని అలంకరిస్తారన్నది ఈ ఒప్పందంలోని ప్రధానమైన అంశం. అంటే, ప్రచండ ఏడాదిన్నర ప్రధానిగా ఉన్నారు కనుక, ఆయనను దించేసి మిగతాకాలాన్ని వీరిద్దరూ పంచుకున్నారు. వీరి కలయికని అక్రమం, అనైతికం అంటున్నారు ప్రచండ.

ఈ రెండుపార్టీలతో పోల్చితే తక్కువ బలంతో, కేవలం ముప్పైరెండు సీట్లతో సభలో మూడోస్థానంలో ఉన్న ప్రచండ ఇంతకాలం ప్రధానిగా ఉండగలగడం విశేషం. 2022 నవంబరు ఎన్నికల తరువాత ఆయన అటు నేపాలీ కాంగ్రెస్, ఇటు సీపీఎన్–యుఎంఎల్ రెండింటినీ మార్చిమార్చి వాడుకొని పదవిలో కొనసాగారు. యుఎంఎల్ మద్దతుతో ప్రధాని అయిన ఆయన ఆ తరువాత దేవ్‌బాతో కలిశారు. నేపాలీ కాంగ్రెస్‌కు చెందిన వ్యక్తిని రాష్ట్రపతి అభ్యర్థిగా సమర్థించి శర్మకు పొగబెట్టేశారు. ఆ తరువాత నేపాలీ కాంగ్రెస్‌తో విభేదాలు వచ్చి మొన్నమార్చిలో మళ్ళీ కేపీశర్మ ఓలీతో చేతులు కలిపారు. నడిరోడ్డుమీద బిచ్చమైనా ఎత్తుకుంటాను కానీ, ఓలీతో చేతులు కలిపేది లేదని ప్రచండ గతంలో చేసిన ప్రతిజ్ఞ ఆ సందర్భంగా చాలామందికి గుర్తుకు వచ్చింది. ఆ వెంటనే ఉపప్రధాని నారాయణ్ కాజీ శ్రేష్ట చైనా వెళ్ళి, బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ (బీఆర్ఐ) ప్రాజెక్టుల విషయంలో తిరిగి కాస్తంత కదలిక తెచ్చారు. కేపీశర్మ ఓలి చైనాకు సన్నిహితుడు కావడం, రెండు కమ్యూనిస్టు పార్టీలూ చేతులు కలిపిన ఈ సందర్భంలో చైనాను సంతోషపెట్టడం ఆ పర్యటన లక్ష్యం. ఇప్పుడు కూడా పదవినుంచి దిగిపోయేముందు ప్రచండ బీఆర్ఐకు సంబంధించి కొన్ని మంత్రివర్గ నిర్ణయాలు తీసుకున్నారని, ఇది కొత్త కూటమిని ఇరకాటంలో పెట్టడం లక్ష్యంగా జరిగిందని వార్తలు వస్తున్నాయి.

ఏ పార్టీకీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగల బలం లేని త్రిశంకుస్థితిలో ప్రచండ మిగతా రెండుపెద్ద పార్టీలను వరుసగా వాడుకొని ఇంతకాలం పదవిలో కొనసాగగలిగారు. ఆయనను ఇలా మార్చిమార్చి మోసేకంటే, తామే అధికారాన్ని పంచుకోవడం ఉత్తమమని ఆ రెండు పార్టీలు ఇప్పుడు నిర్ణయించుకున్నాయి. గత పదహారు సంవత్సరాల్లో నేపాల్ పదమూడు ప్రభుత్వాలను చూసింది. ఎన్నికల విధానంలో సంస్కరణలతో ఈ అస్థిరతను పరిష్కరించాలని కొత్తకూటమి భావిస్తోందట. ఈ పొత్తు ఎంత కాలం అన్నది అసలు ప్రశ్న. రాబోయే ఏడాదిన్నర చక్కగా నిలిచినా, ఆ తరువాత కేపీశర్మ ఓలీ ప్రధాని పదవిని నేపాలీ కాంగ్రెస్‌కు అప్పగిస్తారన్న నమ్మకమైతే లేదు. అధికారాన్ని పంచుకొనే విషయంలో గతంలో ప్రచండతో ఈయన అన్యాయంగా వ్యవహరించిన చరిత్ర అందరికీ తెలిసిందే.

కొత్త నేర చట్టాలపై జవాబు లేని ప్రశ్నలు

భారత శిక్షాస్మృతి (ఐపిసి), 1860; నేర విచారణా స్మృతి (సిఆర్‌పిసి), 1973; భారత సాక్ష్యాధార చట్టం (ఐఇఎ), 1872 రద్దు చేసి వాటి స్థానంలో కొత్త శాసనాలను ప్రవేశపెట్టడానికి ఉద్దేశించిన బిల్లులు, వాటిపై చర్చను సహేతుక కారణాలతో ప్రతిపక్షాలు బహిష్కరించిన తరువాత, పార్లమెంటు ఆమోదం పొందాయి. కొత్త బిల్లులకు (వాటి ఆంగ్ల పాఠాలకు సైతం) హిందీ (లేదా సంస్కృతం)లో నామకరణం చేశారు. రాష్ట్రపతి ఆ బిల్లులకు ఆమోదం తెలిపారు. కొత్త నేర చట్టాలు జూలై 1, 2024 నుంచి అమలులోకి రానున్నాయని ప్రభుత్వం నోటిఫై చేసింది.

కొత్త నేర చట్టాలను ప్రతిపక్షాలే కాదు, న్యాయకోవిదులు, పౌర సమాజ ప్రముఖులు తీవ్రంగా వ్యతిరేకించారు. అన్ని ఆక్షేపణలను ప్రభుత్వం కొట్టివేసింది. కొత్త నేర చట్టాలపై విమర్శలు, అభ్యంతరాలు అసంబద్ధమైనవని, రాజకీయ దురుద్దేశాలతో కూడినవని ప్రభుత్వం ఆరోపించింది. పార్లమెంటు ఆమోదించిన నేర చట్టాలను యథాతథంగా అమలుపరుస్తామని స్పష్టం చేసింది. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రంతో ఏకీభవించలేదు. కొత్త నేర చట్టాలను తమ శాసన సభలలో నిర్దిష్ట సవరణలతో మాత్రమే తాము ఆమోదిస్తామని స్పష్టం చేశాయి. ఎటువంటి మార్పులు చేయాలో నెలరోజులలోగా సూచించాలని కోరుతూ తమిళనాడు ప్రభుత్వం ఒక ఏక సభ్య కమిటీ నేర్పాటు చేసింది. కర్ణాటక, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఇదే మార్గాన్ని అనుసరించవచ్చు. ఈ దృష్ట్యా కొత్త నేరచట్టాల వాస్తవాలు, సమస్యలను ప్రజలకు విపులంగా నివేదించవలసిన అవసరమున్నది. ప్రజలు తమ సొంత అభిప్రాయానికి రావడానికి ఆ నివేదన తోడ్పడగలదు.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

'క్రిమినల్ లా' (క్రిమినల్ న్యాయ శాసనం) ఉమ్మడి జాబితాలోని అంశం. కనుక ఈ అంశంపై చట్టాలు చేసే అధికారాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండిటికీ ఉంది. కేంద్రం చేసిన ఒక చట్టం, ఒక రాష్ట్ర శాసనసభ చేసిన ఒక చట్టం పరస్పర ప్రతికూలంగా ఉన్న పక్షంలో రాజ్యాంగంలోని అధికరణ 254 నిర్దేశించిన విధంగా వెళ్లవలసి ఉంటుంది. అయితే ఇది, ఒక రాష్ట్ర శాసనసభ ఒక చట్టాన్ని తీసుకువచ్చిన తరువాత దాన్ని రాష్ట్రపతి ఆమోదించని పక్షంలో తలెత్తే సమస్య.

ఇదిలా వుండగా కొత్త నేర చట్టాలను వ్యతిరేకిస్తున్న వారి ప్రశ్నలకు సమాధానామివ్వవలసి ఉన్నది. దురదృష్టవశాత్తు ప్రభుత్వం వాటికి పార్లమెంటులో గానీ, పార్లమెంటు వెలుపల గానీ జవాబిచ్చేందుకు అంగీకరించడంలేదు ఆ ప్రశ్నలు ఏమిటో వివరంగా పేర్కొంటాను: (1) కొత్త చట్టాలలోని అత్యధిక నిబంధనలు రద్దయిన మూడు చట్టాల నుంచి తీసుకున్నవే అన్న ఆక్షేపణ సరైనదేనా? ఐపిసి, సిఆర్‌పిసి నుంచి 90 నుంచి 95 శాతం మేరకు ఐఇఎ నుంచి 95 నుంచి 99 శాతం మేరకు నిబంధనలను కొత్త చట్టాలలో యథాతథంగా ఉంచి, ప్రతి సెక్షన్‌కు కొత్త క్రమసంఖ్య నిచ్చారన్న విమర్శ నిరాధారమైనదా? అమలులో ఉన్న చట్టాలలో మార్పులు, చేర్పులు అవసరమైనపక్షంలో సవరణల ద్వారా వాటిని ఎందుకు చేయకూడదు? కొత్త నేర చట్టాలతో వలసపాలన వారసత్వానికి ముగింపు పలికామన్న ప్రభుత్వ వాదన ఒక తప్పుడు వాదన కాదా?



> ఒక వ్యక్తిని అరెస్ట్ చేసేందుకు లేదా పోలీస్ కస్టడీలోకి తీసుకునేందుకు పోలీసులకు కొత్త చట్టాలు మరిన్ని అధికారాలు ఇవ్వలేదా? అరెస్ట్ చేయడానికి అధికారాలు ఉండడమంటే విధిగా అరెస్ట్ చేయడానికి కాదు అన్న సుప్రీం కోర్టు నిర్దేశాన్ని కొత్త చట్టాలు ఎందుకు ఉపేక్షించాయి? ... ఇలా కొత్త నేర చట్టాలపై అనేక మంది అనేక ప్రశ్నలు అడుగుతున్నారు. ప్రభుత్వంలో ఉన్నవారు గానీ, అధికారపక్షం నాయకులు గానీ ఇంతవరకూ ఏ ప్రశ్నకూ సమాధానమివ్వలేదు. అయినంత మాత్రాన ఆ ప్రశ్నలు సమసిపోతాయా?

2) కొత్త చట్టాలను తీసుకురావడంలో ప్రభుత్వ ఉద్దేశం నేర చట్టాలను సమగ్రంగా, మౌలికంగా సవరించడమే అయితే, మన సువ్యవస్థిత రాజ్యాంగ సంప్రదాయం ప్రకారం, ఆ అంశాన్ని లా కమిషన్ పరిశీలనకు ఎందుకు నివేదించలేదు? నేర చట్టాలలో మార్పులపై సంబంధిత వ్యక్తులు, వ్యవస్థలను సంప్రదించి, ముసాయిదా బిల్లులతో సహా సిఫారసులను ప్రభుత్వం, పార్లమెంటు పరిశీలనకు సమర్పించేందుకు లా కమిషన్ అర్హమైన సంస్థ కదా? ఈ బాధ్యతను లా కమిషన్‌కు కాకుండా న్యాయశాస్త్ర ఆచార్యులతో కూడిన వేరే కమిటీకి ఎందుకు అప్పగించారు?

3) కొత్త నేర చట్టాలు నేర న్యాయశాస్త్ర సూత్రాలకు అనుగుణంగా ఉన్నాయా? గత పదేళ్లలో దేశ సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన ప్రముఖ తీర్పులు నిర్దేశించిన ప్రగతిశీల న్యాయసూత్రాలను గుర్తించి కొత్త చట్టాలలో చేర్చారా? కొత్త చట్టాలలోని అనేక నిబంధనలు భారత రాజ్యాంగానికి సుప్రీం కోర్టు ఇచ్చిన వివరణలు, ఆ మౌలిక శాసనంపై సర్వోన్నత న్యాయస్థానం భాష్యానికి విరుద్ధంగా లేవా?

4) అనేక ప్రజాస్వామిక దేశాలు రద్దు చేసిన మరణశిక్షను కొత్త చట్టాలు ఎందుకు ఆమోదిస్తున్నాయి? పైగా 'ఏకాంత నిర్బంధం' అనే క్రూర, అమానుష శిక్షను ఎందుకు ప్రవేశపెట్టారు? 'వ్యభిచారం'ను మళ్లీ కొత్త చట్టాలలోకి ఎందుకు తీసుకువచ్చారు? పరువునష్టం వ్యవహారాన్ని క్రిమినల్ నేరంగా పరిగణించడం తప్పనిసరా? 'పరువునష్టం'పై ఒక క్రిమినల్ ఫిర్యాదును దాఖలు చేసేందుకు నిర్దిష్ట కాలపరిమితిని విధించడమూ తప్పనిసరా? 'కమ్యూనిటీ సర్వీస్ (నేరం చేసిన వ్యక్తి జైలుకు వెళ్లడానికి బదులు చేసే సేవ) శిక్షను స్పష్టంగా ఎందుకు నిర్వచించలేదు. కమ్యూనిటీ సర్వీస్ అంటే ఏమిటో కనీసం ఉదాహరణలు కూడా ఎందుకు ఇవ్వలేదు?

5) 'రాజద్రోహం' నేరాన్ని విస్తృతపరిచి, దేశ ద్రోహంగా మార్చి కొత్త నిబంధనలతో ఎందుకు ఉంచారు? 'ఉగ్రవాద' నేరాలపై విచారణకు 'చట్ట విరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (ఊపా) అనే శాసనం ఉండగా ఆ నేరాలను సాధారణ నేర న్యాయవిచారణ చట్టం పరిధిలోకి ఎందుకు తీసుకువచ్చారు? ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950; ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951 అనే ప్రత్యేక చట్టాలు ఉండగా ఎన్నికల సంబంధిత నేరాలను కొత్త చట్టాల పరిధిలోకి ఎందుకు చేర్చారు?

6) ఒక వ్యక్తిని అరెస్ట్ చేసేందుకు లేదా పోలీస్ కస్టడీలోకి తీసుకునేందుకు పోలీసులకు కొత్త చట్టాలు మరిన్ని అధికారాలు ఇవ్వలేదా? అరెస్ట్ చేయడానికి అధికారాలు ఉండడమంటే విధిగా అరెస్ట్ చేయడానికి కాదు అన్న సుప్రీంకోర్టు నిర్దేశాన్ని కొత్త చట్టాలు ఎందుకు ఉపేక్షించాయి? 'బెయిల్ అనేది నియమం, జైలు మినహాయింపు' అన్న న్యాయసూత్రాన్ని కొత్త చట్టాల్లో స్పష్టంగా చేర్చడం తప్పనిసరి కాదా? అరెస్ట్ న్యాయబద్ధతను, అరెస్ట్ ఆవశ్యకతను మెజిస్ట్రేట్ నిర్ధారించడం తప్పనిసరి కాదా? అరెస్ట్ అయిన 40 నుంచి 60 రోజుల తరువాత సైతం మెజిస్ట్రేట్ బెయిల్ నిరాకరించేందుకు అనుమతించే నిబంధనలు సక్రమంగా ఉన్నాయా?


7) నేరం ఎక్కడ జరిగినప్పటికీ దానిపై ఎఫ్ఐఆర్‌ను దేశంలోని ఏ పోలీస్ స్టేషన్‌లోనైనా దాఖలు చేసేందుకు అనుమతినిస్తున్న నిబంధన రాజ్యాంగ విహితమేనా? 'పోలీస్' అనే అంశం రాష్ట్ర జాబితాలోది కనుక ఎఫ్ఐఆర్ ఏ రాష్ట్రంలో అయితే నమోదయిందో ఆ రాష్ట్ర పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి నేర దర్యాప్తునకు పూనుకోవడం రాజ్యాంగ విరుద్ధం కాదా? సదరు నిబంధనలు రాజ్యాంగ మౌలిక లక్షణమైన 'సమాఖ్య పాలన' స్ఫూర్తిని కాలరాచివేయడం లేదూ?

కొత్త నేర చట్టాల రాజ్యాంగబద్ధతపై ఇంకా అనేక ప్రశ్నలు ఉన్నాయి. వాటికి సమాధానమిచ్చేది ఎవరు? ప్రభుత్వంలో ఉన్నవారు గానీ, అధికార పక్షం నాయకులు గానీ ఇంతవరకూ ఏ ప్రశ్నకూ సమాధానమివ్వలేదు. అయినంత మాత్రాన ఆ ప్రశ్నలు సమసిపోతాయా? అయినా నేర విచారణ న్యాయపాలనకు ప్రాతిపదికలు అయిన ఆ కొత్త చట్టాలు ఇప్పటికే అమలులోకి వచ్చాయి. కొంత మంది ప్రజల కోసం కొంత మంది ప్రజలతో నడిచే ప్రభుత్వానికి ఇదొక ఉదాహరణ.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

బౌలర్ల కంటే బ్యాట్స్‌మెన్‌కు ప్రాధాన్యమెందుకు?

క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ ఆత్మకథ 'I Have the Streets : A Kutty Cricket Story' కవర్ చూసి ఆశ్చర్యపోయాను. రచయిత తెల్ల ప్యాంటు, తెల్ల షర్టులో, ఒక బ్యాట్ పిడిని తన చేతులతో పట్టుకుని కూర్చున్న భంగిమలో ఉన్న ఛాయాచిత్రమది. ఒక వికెట్ పడిపోవడం కోసం వేచి చూస్తూ తన సమయం వచ్చినప్పుడు డ్రెస్సింగ్ రూం నుంచి గ్రౌండ్‌లోకి దూసుకెళ్లడానికి సిద్ధంగా ఉన్న ఆటగాడిని ఆ కవర్‌పై ఉన్న అశ్విన్ బొమ్మ తలపిస్తుంది. ఇప్పుడు నేను అశ్విన్ బ్యాటింగ్ చేయగలడని అర్థం చేసుకున్నాను. అశ్విన్ ఆత్మకథ ప్రచురితం కావడానికి చాలా కాలం ముందే స్కూల్ బాయ్ క్రికెట్‌లో వికెట్లు తీసుకోవడం కంటే పరుగులు చేయడంలో సామర్థ్యానికే బాల అశ్విన్ ప్రసిద్ధుడని అందరికీ తెలుసు. అశ్విన్ ఆటను నేను ప్రత్యక్షంగా చూడలేదు. నేను ఎక్కువగా టెస్ట్ క్రికెట్ మ్యాచ్‌లనే చూస్తాను (కొన్ని కారణాల వల్ల ఈ రోజుల్లో బెంగళూరులో టెస్ట్ క్రికెట్ మ్యాచ్‌లు పెద్దగా జరగడం లేదు). అయినప్పటికీ టీవీలో అశ్విన్ ఆటను చూసిన జ్ఞాపకాలు నా మనస్సులో పదిలంగా ఉన్నాయి.



akbar

> ప్రముఖ బ్యాట్స్‌మెన్ స్టీవ్ వా, రికీ పాంటింగ్‌లు ఆస్ట్రేలియా టీమ్‌కు వరుసగా 57, 72 సార్లు కెప్టెన్‌గా ఉన్నారు. అద్భుత బౌలర్ అయిన షేన్ వార్న్‌కు ఒక్కసారి అంటే ఒక్కసారి కూడా కెప్టెన్సీ బాధ్యత అప్పగించలేదు. టీమ్ ఇండియా కెప్టెన్ల ఎంపికలోనూ ఈ పక్షపాతం కనిపిస్తోంది. విరాట్ కోహ్లి 69 టెస్ట్ మ్యాచ్‌లలోను, రోహిత్ శర్మ 16 టెస్ట్ మ్యాచ్‌లలోను కెప్టెన్‌గా ఉన్నారు. అశ్విన్ ఒక్కసారి కూడా టీమ్ ఇండియాకు కెప్టెన్‌గా లేరు. స్పిన్ బౌలర్లు సైతం సాటిలేని మేటి టెస్ట్ కెప్టెన్లు కాగలరని ఇంగ్లాండ్‌కు చెందిన రే ఇల్లింగ్ వర్త్, ఆస్ట్రేలియా ఆటగాడు రిచి బెనౌడ్‌లు నిరూపించలేదూ? ఆ కోవలోనివాడే మన అశ్విన్ కూడా.

నా మనోనేత్రంలో ఒక ఫాస్ట్ బౌలర్ వేసిన బంతిని అశ్విన్ ఎంత నేర్పుగా, సొగసుగా ఎదుర్కొన్నాడో కనిపిస్తూనే ఉన్నది. బంతిని స్పిన్నర్ తల మీదుగా సైట్ స్క్రీన్ వైపుకు కొట్టిన దృశ్యమూ నా మనోనేత్రం నుంచి చెరిగిపోలేదు. టెస్ట్ క్రికెట్‌లో అశ్విన్ ఆడిన రెండు అతి ముఖ్యమైన ఇన్నింగ్స్‌లో ఈ రెండు షాట్‌లు సంభవించలేదు. 2021లో జనవరి, ఫిబ్రవరి నెలల్లో వేర్వేరు గ్రౌండ్స్‌లో భిన్న ప్రత్యర్థులపై ఆడిన సందర్భంలో అవి చోటుచేసుకున్నాయి. మొదటిది సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో సంభవించింది. ఆస్ట్రేలియన్ ఆటగాళ్ల దాడిని హనుమ విహారితో కలిసి అశ్విన్ సమర్థంగా ఎదుర్కొన్నారు. ఇద్దరూ కలిసి 40 ఓవర్స్ దాకా ఉండి, ఏ జట్టూ గెలవని స్థితి కల్పించి తమ జట్టుకు ఒక సానుకూలతను సృష్టించారు. మరింత స్పష్టంగా చెప్పాలంటే తమ జట్టును ఒక ఎపిక్ డ్రాకు తీసుకువెళ్లారు. ఓవర్స్ మధ్య అశ్విన్, విహారి ఇరువురూ సుదీర్ఘంగా మాటా మంతీ జరిపారు. అది తమిళంలో జరిగిందని ఆ తరువాత వెల్లడయింది. ఇది చెపాక్ స్టేడియంలో క్రికెట్ మ్యాచ్‌లను వీక్షించేందుకు తరచుగా వచ్చే వారికి సంతృప్తి కలిగించి ఉండవచ్చు గానీ పొట్టి శ్రీరాములు భావజాల వారసులకు మనస్తాపం కలిగించిందేమో?!

నా మనోనేత్రంలో కదులుతున్న అశ్విన్ రెండో ఇన్నింగ్స్ ఆయన హోమ్ గ్రౌండ్ అంటే చెన్నైలో ఇంగ్లాండ్‌కు వ్యతిరేకంగా ఆడింది. భారత్ మొదటి ఇన్నింగ్స్‌లో లీడ్‌లో ఉన్నప్పటికీ రెండో ఇన్నింగ్స్‌లో బాగా వెనుకబడిపోయింది. అప్పుడు అశ్విన్ గ్రౌండ్‌లోకి వచ్చాడు. కోహ్లి, కుల్దీప్, ఇషాంత్, సిరాజ్‌లతో కలిసి భారత్ పరుగులను 286కు తీసుకువెళ్లి విజయాన్ని సులభసాధ్యం చేశాడు. అశ్విన్ స్వయంగా సెంచరీ సాధించాడు. అశ్విన్ బ్యాటింగ్ చేయగలడని నాకు తెలుసు. అతని పుస్తకం కొన్నవారికి, కొనేవారికి కూడా ఆ విషయం తెలుసు. భారత క్రికెట్ చరిత్రలో అశ్విన్ తన బౌలింగ్ సామర్థ్యానికే జ్ఞాపకముండిపోతారు. అయినప్పటికీ 500కి పైగా టెస్ట్ వికెట్‌లను పడగొట్టిన ఆటగాడు, అనీల్ కుంబ్లేను మినహాయిస్తే భారత్‌కు ఎన్నో టెస్ట్ మ్యాచ్‌లను గెలిచిన క్రీడా మేటి తన ఆత్మకథ పుస్తకం అట్టపై బ్యాట్ పట్టుకుని ఉన్న తన ఫోటోను ఎందుకు ముద్రింపచేశారు? నేను ఎప్పుడూ అశ్విన్‌ను స్వయంగా కలుసుకోలేదు. అయితే ఆయన గురించి నేను చదివిన, విన్నదాన్ని బట్టి ఆయన దృఢమైన, ఆలోచనాదాయకమైన అభిప్రాయాలు కలవాడని తెలిసింది. ఆయన ఆత్మకథ అట్టపై ఫోటోను ఎంపిక చేసింది ప్రచురణ కర్త గాని, రచనా సహకారి సిద్ధార్థ మోనిజియా గానీ కాదని, అశ్వినే స్వయంగా ఆ చిత్రాన్ని ఎంచుకున్నారని నిర్ధారణ అయింది. బాల్‌ను కాకుండా బ్యాట్‌ను పట్టుకున్న విధంగా తన బొమ్మ ఆత్మకథ కవర్‌పై ఉండాలని అశ్విన్ ఎందుకు కోరుకున్నారు?



■ రామచంద్ర గుహ

గతానుగతం

ఈ ప్రశ్నకు నేను కచ్చితమైన సమాధానాన్ని ఇవ్వలేను (భవిష్యత్తులో అశ్వినే ఇవ్వగలరని భావిస్తున్నాను). అయితే నేను కొన్ని ఊహలు చేయగలను. ఆ ఫోటోలో ఒక సంకేత సందేశం లేదా సందేశాలు ఏమైనా ఉన్నాయా? ప్రపంచ క్రికెట్ (ప్రత్యేకించి భారత క్రికెట్) క్రికెట్‌లో ప్రతిభాపాటవాలను గుర్తించి గౌరవించే విధానంలోని ఒక క్రూర వాస్తవాన్ని అందరి దృష్టికి తీసుకురావడానికి అశ్విన్ ప్రయత్నిస్తున్నారా? ఏమిటి ఆ క్రూర వాస్తవం? కీర్తి, కనకాలు, అభిమానుల ఆప్యాయతలు, ఎక్కువ ఆమోదాలను, మరిన్ని టీవీ ఆమోదాలను, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ సిరీస్ అవార్డులను, సెల్ఫీలు, ఆటోగ్రాఫ్‌లకు అత్యధికుల అభ్యర్థనలను బౌలర్స్ కంటే బ్యాటర్సే ఎందుకు ఎక్కువగా పొందుతున్నారు?

క్రికెట్ అభిమానులు బ్యాట్స్‌మెన్‌నే ఎందుకు మిక్కిలిగా గౌరవిస్తున్నారు? బ్యాటర్స్‌ను ఆ అందమైన ఆట ఉన్నత స్థాయి ఆటగాళ్లు కాగా, బౌలర్స్ అధిక శ్రమ చేసే నిమ్న శ్రేణి క్రీడాకారులు అనేది ఒక సత్యం. అయితే ఇది సర్వాజనామోదం పొందలేదు. బ్యాట్స్‌మెన్ పట్ల పక్షపాతం, బౌలర్స్ విషయంలో వివక్ష చూపే ధోరణులకు వ్యతిరేకంగా నేను చాలాసార్లు వాదించాను. అయితే నా గోసను ఎవరూ పట్టించుకోలేదు. తన ఆత్మకథ అట్టపై ఫోటో ఎంపిక, క్రికెట్‌లో తనకు ఉన్న సమున్నత స్థానంతో అశ్విన్ ఆ సత్యాన్ని మరింత సున్నితంగా, మరింత సూక్ష్మంగా చెప్పుతున్నారా?

మ్యాచ్‌ను గెలిచిన బ్యాటర్లకు, మ్యాచ్‌ను గెలిచిన బౌలర్ల కంటే ఎక్కువ ధన లాభం, పేరు ప్రఖ్యాతులు ఎలా లభిస్తున్నాయో చాలాసార్లు మాట్లాడాను, విపులంగా రాశాను. దురదృష్టకరమైన విషయమేమిటంటే బౌలర్ల పట్ల వివక్ష డబ్బుకు సంబంధించిన వ్యవహారాలకే పరిమితం కాదు. ప్రముఖ బ్యాట్స్‌మెన్ స్టీవ్ వా, రికీ పాంటింగ్‌లు ఆస్ట్రేలియా టీమ్‌కు వరుసగా 57, 72 సార్లు కెప్టెన్లుగా ఉన్నారు. అయితే అద్భుత బౌలర్ అయిన షేన్ వార్న్‌కు ఒక్కసారి అంటే ఒక్కసారి కూడా కెప్టెన్సీ బాధ్యత అప్పగించలేదు. షేన్‌వార్న్ ఒక ప్రతిభావంతుడైన క్రికెట్ వ్యూహకర్త స్టీవ్ వా, పాంటింగ్ కంటే షేన్‌వార్న్ నిస్సందేహంగా మరింత విజయవంతమైన కెప్టెన్ అయి వుండే వాడనడంలో నాకు ఎలాంటి సందేహం లేదు.

టీమ్ ఇండియా కెప్టెన్ల ఎంపికలో కూడా ఈ పక్షపాతం కనిపిస్తోంది. విరాట్ కోహ్లీ 69 టెస్ట్ మ్యాచ్‌లలోను, రోహిత్ శర్మ 16 టెస్ట్ మ్యాచ్‌లలోను కెప్టెన్‌గా ఉన్నారు. అయితే అశ్విన్ ఒక్కసారి కూడా టీమ్ ఇండియాకు కెప్టెన్‌గా లేరు. మొదటి ఇద్దరు బ్యాట్స్‌మెన్ కాగా అశ్విన్ ప్రధానంగా బౌలర్ కావడమే అందుకు కారణం కావచ్చు. అయినప్పటికీ ఇండియా తరఫున ఆడిన క్రికెటర్లలో అశ్విన్ అత్యంత ప్రతిభావంతుడు అనే విషయం మనకు తెలుసు. ఈ మద్రాసు ఆటగాడికి కెప్టెన్ అయ్యే అవకాశం లభించి ఉంటే ఆయన భారత్‌కు మరింత మహత్తర విజయాలు సాధించేవాడనడంలో సందేహం లేదు. స్పిన్ బౌలర్లు సైతం సాటిలేని మేటి టెస్ట్ కెప్టెన్లు కాగలరని ఇంగ్లాండ్‌కు చెందిన రే ఇల్లింగ్ వర్త్, ఆస్ట్రేలియా ఆటగాడు రిచి బెనౌడ్‌లు నిరూపించలేదూ? ఆ కోవలోనివాడే మన అశ్విన్ కూడా.

తన ఆత్మకథ కవర్ ఫోటోగ్రాఫ్‌కు సంబంధించిన అశ్విన్ ఎంపిక, కెప్టెన్సీ విషయమై ఆయన (గత, ప్రస్తుత) ఆకాంక్షలను సూచన ప్రాయంగా తెలుపుతున్నాయా అని నేను అనుమానిస్తున్నాను. కెప్టెన్సీకి అశ్విన్ అర్హుడు. ఆయన చాలా హుందాగా వ్యవహరించే వ్యక్తి. భ్రమలు లేని మంచి మనిషి. నా మొదటి ఊహ చాలా సుసంబద్ధమైనది. గ్రౌండ్‌లోనూ, గ్రౌండ్ వెలుపల బ్యాటర్లు బౌలర్ల పట్ల వ్యవహరిస్తున్న తీరుతెన్నులలో వ్యత్యాసాన్ని, వివక్ష గురించి క్రికెట్ అభిమానులకు అవగాహన కల్పిస్తున్నాడని నేను భావిస్తున్నాను. ఈ రెండూ గాక మూడో కారణం కూడా ఉండి ఉండవచ్చు. బ్యాటింగ్‌ను నిజంగా ప్రేమించిన ఆటగాడు అశ్విన్. అలాగే షేన్‌వార్న్, అనీల్ కుంబ్లేలు కూడా.

షేన్‌వార్న్ రాసిన ఐదు పుస్తకాలలో రెండిటిపై ఆయన ముఖం ఉండగా మిగతా మూడు పుస్తకాల కవర్‌పై బౌలింగ్ చేస్తున్నట్టుగానో లేక వికెట్‌ను పడగొడుతున్న ఫోటోలు ఉన్నాయి. కుంబ్లే ఆత్మకథ ఇంకా రాలేదు. అది వచ్చినప్పుడు 619 టెస్ట్ వికెట్లు పడగొట్టిన ఆటగాడు బ్యాట్ పట్టుకుని ఉన్న ఫోటో, ఆ ఆత్మకథ కవర్ ఫోటోగ్రాఫ్‌గా ఉండే అవకాశం లేదు. ఇంకా మన మధ్య నడయాడుతున్న గొప్ప క్రికెట్ రచయిత ఒకసారి ఏకైక క్రికెట్ ఫోటోగ్రాఫ్ గురించి ఏకంగా ఒక పుస్తకమే రాశాడు. అదొక అద్భుతమైన పుస్తకం. దాని గురించి నేను కూడా చాలా సంవత్సరాల క్రితం ఈ కాలమ్‌లో రాయడం జరిగింది. అయితే నేను గిడియోన్ హైగ్‌ను కాను కనుక ఒక క్రికెట్ ఫోటో గురించి 100కి పైగా పదాలతో ఒక వ్యాసం మాత్రమే రాశాను. అశ్విన్ ఆత్మకథలోని ఒక ప్రస్తావన కనీసం ఆ పుస్తకంపై ఫోటోగ్రాఫ్‌ను అశ్విన్ ఎందుకు ఎంచుకున్నారన్న విషయమై నా విశ్లేషణను ధ్రువీకరించింది. ఆ ప్రస్తావన ఇలా ప్రారంభమవుతుంది: 'అది అంతిమంగా బౌలర్–బ్యాటర్–కోచ్ డబ్ల్యువి రామన్‌తో మరో సంభాషణ అయింది. బౌలర్లను బ్యాటర్స్ తాము కోరుకున్నరీతిలో బ్లూ కాలర్ కార్మికులు (చేతితో పనిచేసే వారు)గా ఉపయోగించుకుంటున్నారు. ఒక బౌలర్ ఒక బ్యాడ్ బాల్ వేసినప్పుడు నెట్స్‌లో ఉన్న ఒక బ్యాటర్‌కు క్షమాపణలు చెప్పుతాడు. అయితే ఒక బ్యాటర్ తన బ్యాడ్ షాట్‌కు ఎవరికీ ఎలాంటి క్షమాపణలు చెప్పడు. ఎందుకని?'

(వ్యాసకర్త చరిత్రకారుడు)

మూఢవిశ్వాసాల ఊబిలో చిక్కుకున్నాం!

భారతదేశం భిన్న మతాలకు, భిన్న భాషలకు, భిన్న సంస్కృతులకు నిలయం. సత్యాహింసలను, శాంతి సహనాలను ప్రపంచానికి చాటిచెప్పిన బౌద్ధం వంటి భావోద్యమాలు రెండువేల ఐదువందల సంవత్సరాలకు పూర్వమే ఈ దేశంలో వర్ధిల్లాయి. ప్రత్యేకించి బౌద్ధం దాదాపు వెయ్యి సంవత్సరాలకు పైగా ఈ దేశాన్ని ప్రగతిపథంలో నడిపి దేదీప్యమానంగా వెలిగింది. ఆ తరువాత సామాన్య శకానికి పూర్వం రెండవ శతాబ్దంలో బ్రాహ్మణుడైన పుష్యమిత్రశుంగుడు కుట్రపూరితంగా మౌర్యరాజైన బృహద్రథుడిని సంహరించి రాజ్యాధికారాన్ని చేపట్టాడు. ఇది భారతదేశ చరిత్రలో అత్యంత విషాదకర ఘట్టం.

అప్పటి నుంచే భారతదేశం తిరోగమన మార్గానికి మళ్లింది. అప్పటికే అడుగంటిపోయిన వేద సంస్కృతికి తిరిగి ప్రాణప్రతిష్ఠ జరిగింది. యజ్ఞయాగాది క్రతువులు పునఃప్రారంభమయ్యాయి. విషపూరితమైన వివక్షలకు, అసమానతలకు, అన్యాయాలకు పట్టంకట్టిన స్మృతులు ఆవిర్భవించాయి. వర్ణ వ్యవస్థను పరిరక్షించడానికి, బ్రాహ్మణాధిపత్యాన్ని నిలబెట్టడానికి మను ధర్మశాస్త్రం పేరుతో రచించబడిన మనుస్మృతి ప్రపంచంలోనే అత్యంత దుర్మార్గమైన రచనగా నిలబడిపోయింది. అందుకే డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ మనుస్మృతిని 1927 డిసెంబర్ 25న బహిరంగంగా దహనం చేశాడు.

> ఆధునిక విజ్ఞానం అందిస్తున్న కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు, చలనచిత్రాలు, విమానయానాలు, ఆధునిక వైద్య పరికరాల వంటి అనేక సౌకర్యాలను అనుభవిస్తున్నాం. కాని శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోలేక పోతున్నాం. అనుభవించేది సైన్సు ఫలితాలను, ఆచరించేది మాత్రం మూఢవిశ్వాసాలనే. అడుగడుగునా ఈ వైరుధ్యం కనిపిస్తోంది.

ఆనాడు వర్ణధర్మం పేరుతో శూద్రులను అత్యంత హీనంగా చిత్రించి ఘోరంగా హింసించారు. నాటి నుంచి నేటి వరకు కుల వివక్ష ఈ దేశంలో భయంకరంగా కొనసాగుతూనే ఉంది. అణగారిన అట్టడుగు కులాల వారు నేటికీ దోపిడీకి, హత్యలకు, అత్యాచారాలకు గురవుతున్నారు.

పురాణాల రాకతో భారతదేశంలో భావగమనం వెనక్కి నడిచింది. స్పష్టత నుంచి అస్పష్టతకు, జ్ఞానం నుంచి అజ్ఞానం, సత్యం నుంచి అసత్యం వైపు, ఐహికం నుంచి ఆముష్మికం వైపు, సమత నుంచి అసమత వైపు, మానవత నుంచి దైవం వైపు నడిచింది. చివరికి పౌరాణిక సంస్కృతి భారతదేశాన్ని భ్రష్టు పట్టించింది.

ఈ దేశంలో తత్వశాస్త్రానికి, మతానికి తేడా లేకుండా పోయింది. అందువల్ల భారతీయ తత్వశాస్త్రం అంటే హిందూ మతంగా అర్థం చేసుకోబడుతుంది. అయినా హిందువులకు పవిత్రగ్రంథాలుగా చలామణి అవుతున్న వేదాలు, ఉపనిషత్తులు, స్మృతులు, పురాణాలు, ఇతిహాసాలు, భగవద్గీత వంటివన్నీ ఒకే జీవన పద్ధతిని నిర్ణయించడం లేదు. మౌలిక సత్యాలకు, విలువలకు సంబంధించి కూడా ఆ గ్రంథాలు పరస్పర విరుద్ధమైన ప్రతిపాదనలు చేశాయి. నిజానికి అవన్నీ మతానికి సంబంధించినవే గాని తత్వానికి సంబంధించినవి కావు. పరలోకానికి సంబంధించినవే గాని ఈ లోకానికి సంబంధించినవి కావు. దైవానికి సంబంధించినవే కాని మనిషికి సంబంధించినవి కావు. మరణానంతర స్థితికి సంబంధించినవే గాని బతికి ఉన్నప్పటి స్థితికి సంబంధించినవి కావు. అయినప్పటికీ ఈ దేశంలో మతమే తత్వంగా పరిగణింపబడుతోంది. మతానికి భిన్నమైన తత్వానికి సంబంధించిన చార్వాక, జైన, బౌద్ధాల్లోను, సాంఖ్య, వైశేషిక, న్యాయ దర్శనాల్లో ఉన్నప్పటికీ వాటికి జనబాహుళ్యంలో ప్రాచుర్యం లేదు. తత్వం–మతం రెండూ ఒకటి కాదు. తత్వం లక్ష్యం సత్యాన్వేషణ కాగా, మతం లక్ష్యం అసత్యంపై విశ్వాస స్థాపన.

భారతదేశంలో మతానికి–తత్వానికి తేడా లేనట్లే, పురాణాలకు –చరిత్రకు కూడా తేడా లేకుండా పోయింది. కట్టుకథలతో కూడిన రామాయణ, భారత, భాగవతాది గ్రంథాలలో పేర్కొన్న సంఘటనలన్నీ వాస్తవంగా జరిగిన చరిత్రగా భావించడం జరుగుతోంది. ఆ కట్టుకథలకు విపరీతమైన వక్రభాష్యాలను జోడించి ప్రచారం చేయడం హిందూ ప్రవచనకారులు తమ కర్తవ్యంగా భావిస్తున్నారు. అద్వైత సిద్ధాంత ప్రవక్తగా పేరుగాంచిన శంకరుడు బౌద్ధాన్ని నాశనం చేయడానికి కంకణం కట్టుకున్నాడు. పాలకుల అండదండలతో బౌద్ధభిక్షువులను చంపించాడు, బౌద్ధారామాలను ఆక్రమించుకుని హిందూ దేవాలయాలను నిర్మించడానికి కృషి చేశాడు. ఈనాడు భారతదేశంలోని హిందూ దేవాలయాల్లో అత్యధిక భాగం బౌద్ధ విహారాలు, ఆరామాలు, చైత్యాలను ధ్వంసం చేసి నిర్మించినవేనని చరిత్రకారులు పేర్కొంటున్నారు.

'ధర్మో రక్షతి రక్షితః' అనేది ఆకర్షణీయమైన అందమైన నినాదం. నీవు ధర్మాన్ని రక్షిస్తే, ధర్మం నిన్ను రక్షిస్తుందని దాని భావం. ఇక్కడ ధర్మమంటే మానవులందరికీ వర్తించే ధర్మం కాదు. అది వర్ణధర్మం మాత్రమే. అదే నేడు కులధర్మంగా మారింది. సర్వ ధర్మశాస్త్రాల సారంగా చెప్పుకునే భగవద్గీతలో 'బ్రాహ్మణ కులాన్ని సంరక్షించడం ద్వారానే వైదికధర్మం సంరక్షింపబడుతుంద'ని కృష్ణుని నోటితో చెప్పించారు. గీతలో మొదటి నుంచి చివరి వరకు పడిన తంటాలన్నీ కులవ్యవస్థను కాపాడటం కోసమే. శంకరుడు అద్వైతాన్ని ప్రతిపాదించినా, రామానుజుడు విశిష్టాద్వైతాన్ని ప్రతిపాదించినా, మధ్వుడు ద్వైతాన్ని ప్రతిపాదించినా వారంతా సారాంశంలో వర్ణవ్యవస్థను, అంటే కులవ్యవస్థను కాపాడటానికే కృషి చేశారని స్పష్టమవుతుంది.



వినాయకుడి తల నరికిన శివుడు ఏనుగు తలను అతికించాడంటే తలలు మార్చే శస్త్రచికిత్స ప్రాచీనకాలంలోనే భారతదేశంలో ఉందని సైన్స్ కాంగ్రెస్ మహాసభల్లో ప్రధానమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి మాట్లాడటం నిస్సందేహంగా దేశానికి తలవంపులు తెచ్చే సంఘటనగానే మిగిలిపోతుంది. విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్లు, ఐఐటి ప్రొఫెసర్లు కూడా అదే స్థాయిలో మాట్లాడటం విడ్డూరంగా కనిపిస్తోంది. జ్యోతిషం, వాస్తు వంటి అశాస్త్రీయ అంశాలను విశ్వవిద్యాలయ స్థాయిలో విద్యార్థులకు పాఠ్యాంశాలుగా పెట్టడం, భూతవైద్యాన్ని కూడా ఒక కోర్సుగా ప్రవేశపెట్టడం చూస్తుంటే మనం ఎంతగా దిగజారిపోతున్నామో అర్థమవుతోంది.

ప్రపంచవ్యాప్తంగా సైన్సు దినదినాభివృద్ధి చెందుతూ అప్రతిహతంగా దూసుకుపోతోంది. ఆధునిక విజ్ఞానం అందిస్తున్న కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు, చలనచిత్రాలు, విమానయానాలు, ఆధునిక వైద్య పరికరాల వంటి అనేక సౌకర్యాలను అనుభవిస్తున్నాం. కాని సైన్సు తత్వాన్ని అర్థం చేసుకోలేకపోతున్నాం. శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోలేకపోతున్నాం. అనుభవించేది మాత్రం సైన్సు ఫలితాలను, ఆచరించేది మాత్రం మూఢవిశ్వాసాలనే. అడుగడుగునా ఈ వైరుధ్యం స్పష్టంగా కనిపిస్తోంది. భారత దేశం నేడు మూఢవిశ్వాసాల ఊబిలో చిక్కుకుపోయింది. సైన్సు కంటే మతమే గొప్పదనే ప్రచారం జోరుగా సాగుతోంది. మత కల్లోలాలకు, మత మారణకాండకు హద్దులు లేకుండాపోయాయి. మనం రాజ్యాంగంలో రాసుకున్న సోషలిజం, సెక్యులరిజం వంటివి నీటి మీద రాతలుగా మారిపోయాయి.

'శాస్త్రీయ స్పృహను, మానవవాదాన్ని, పరిశీలనాతత్వాన్ని, సంస్కరణను ప్రజల్లో పెంపొందించడం ప్రతి భారతీయ పౌరుడి ప్రాథమిక విధి' అని రాజ్యాంగంలోని అధికరణం 51–ఎ(హెచ్)లో రాసుకున్నాం. కాని పాలకులతో సహా దాన్ని ఎవరూ పట్టించుకోవడంలేదు. పాలకులు ప్రజల్లో ప్రశ్నించే తత్వాన్ని చంపేస్తున్నారు. ప్రశ్నించిన వారిని జైళ్లలో పెడుతున్నారు. రాజకీయాల్లో స్వార్థం పరాకాష్ఠకు చేరింది. ఒకే మతం, ఒకే జాతి, ఒకే పార్టీ వంటి ఫాసిస్టు లక్షణాలు క్రమంగా బలపడుతున్నాయి. భిన్న మతాలను, భిన్న భావాలను సహించే పరిస్థితులు క్షీణించిపోతున్నాయి. వివక్ష, ద్వేషం, దోపిడీ, నియంతృత్వ పోకడలు రాజ్యమేలుతున్నాయి. వీటన్నిటికీ విరుగుడు కావాలి. దాని కోసం ప్రజల్లో హేతువాద, మానవవాద భావవిప్లవం రావాలి. దానికి మీడియా తోడ్పాటు కావాలి. అభ్యుదయాన్ని కాంక్షించే వారంతా ఈ దిశగా తమవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలి.

■ డాక్టర్ గుమ్మా వీరన్న
ఉపాధ్యక్షులు, భారత హేతువాద సంఘం

(జూలై 13, 14 తేదీల్లో బాపట్ల ఎన్జీవో హోమ్‌లో భారత హేతువాద సంఘం వార్షిక మహాసభలు)

గాడి తప్పిన సంక్షేమ గురుకులాలు

రాష్ట్రంలో 195 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు/జూనియర్ కళాశాలల్లో సుమారు లక్ష మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరి ఆలనా పాలనా చూసేది ఈ గురుకులాలే. ఇక్కడ చదివిన విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదిగారు. ఇంతటి ఘన చరిత్ర కలిగిన పాఠశాలలను గత ప్రభుత్వం పట్టించుకోలేదు. రెండున్నర సంవత్సరాలుగా గ్యాస్ ఏజెన్సీలకు డబ్బులు విడుదల చేయనందున అవి సరఫరా నిలిపేశాయి. దీంతో వంట సిబ్బంది, పిల్లలు చుట్టుపక్కల ఎండు పుల్లలు ఏరుకు వచ్చి వంట చేయాల్సి వచ్చింది. కొన్ని చోట్ల సిబ్బంది అప్పులు చేసి నడిపించారు. పాఠశాల ప్రాంగణంలో తుప్పలు పేరుకుపోవడంతో తేళ్లు, జెర్రులు చేరుతున్నాయి. హాస్టల్‌లో వంట సరుకులు గతంలో జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ పాఠశాల వారీగా గుత్తేదారులను నియమించేది. సరఫరాలో లోపాలుంటే ఆయన పరిష్కరించేవారు. తరువాత రాష్ట్రమంతటా ఒకే గుత్తేదారుకు ప్రభుత్వం అప్పగించింది. దీంతో సరుకు నాణ్యత లేకపోయినా, తూకంలో తేడా ఉన్నా, కొన్ని సరుకులు ఇవ్వకపోయినా ఎవరికి చెప్పాలో తెలియదు. ఈ విధానానికి స్వస్తిచెప్పి స్థానిక మహిళా సంఘాలకు, యువతకు అప్పగిస్తే వారికి ఉపాధి లభిస్తుంది. టీచర్లకు, వంటవాళ్లకు రెండు మూడు నెలలకు; స్వీపర్లు, ఇతర ఔట్ సోర్సింగ్ వారికి ఆరు నెలలకు జీతాలిస్తున్నారు. ఈ విషయాలను నూతన మంత్రివర్యులు దృష్టిలో పెట్టుకుని తగు చర్యలు తీసుకోవాలి.

– కనకం రామలింగేశ్వరరావు

● రథయాత్ర

ఇస్కాన్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో పూరి జగన్నాథుడి రథయాత్ర జరగగా, మంత్రి కొలుసు పార్థసారథి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ తదితరులు రథం లాగారు.





మరొకరు మృతి

అల్ట్రాటెక్ ప్రమాదంలో మూడుకు చేరిన మృతుల సంఖ్య



మృతుడి సోదరుడికి చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, తహసీల్దార్ (ఇన్‌సెట్‌లో) అర్జునరావు (ఫైల్)

జగ్గయ్యపేట రూరల్, జూలై 12 : అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారం ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న పరిటాల అర్జునరావు గురువారం రాత్రి మృతిచెందారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. శుక్రవారం మధ్యాహ్నానికి గ్రామానికి చేరిన మృతదేహాన్ని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, ఆర్డీవో రవీంద్ర, తహసీల్దార్ శ్రీహరి సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి సోదరుడికి నష్టపరిహారం కింద రూ.50 లక్షల చెక్కు అందించారు. కాగా, విజయవాడ ఆసుపత్రిలో అర్జునరావు మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను నివాళులర్పించారు. అనంతరం గ్రామానికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడికి భార్య నాగలక్ష్మి, ఇద్దరు కుమారులు గురుసాయి, పవన్ తేజ ఉన్నారు. మృతదేహాన్ని విజయవాడ నుంచి బూదవాడకు అంబులెన్స్‌లో తీసుకొచ్చారు. బంధువులు, కుటుంబ సభ్యుల రోదనల నడుమ అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

ముగ్గురి పరిస్థితి విషమం

అల్ట్రాటెక్ కర్మాగార ప్రమాదంలో గాయపడిన 16 మందిలో ఐదుగురికి తీవ్ర గాయాలైన విషయం తెలిసిందే. ఇప్పటికే ముగ్గురు మృతిచెందగా, గోపీనాయక్, బొంతు శివనారాయణ, బాణావతు సైదులు పరిస్థితి కూడా విషమంగానే ఉందని, ఐసీయూలో చికిత్స అందిస్తున్నామని వైద్యులు తెలిపారు.

వెంటాడిన మృత్యువు

విధి ఎంత బలీయమైందో. ఎవరిని ఎప్పుడు ఎలా బలి తీసుకుంటుందో అంతుచిక్కని ప్రశ్న. అర్జునరావు కథ కూడా అలాగే ముగిసింది. ఎలక్ట్రీషియన్‌గా శిక్షణ పొందిన అర్జున్ సిమెంట్ కర్మాగారంలో ఉద్యోగం చేస్తున్నారు. ఈ కంపెనీలో ప్రధానంగా మూడు షిఫ్టుల్లో కార్మికులు పని చేస్తుంటారు. ప్రమాదం జరిగిన రోజు ఆదివారం ఉదయం అర్జున్ బి-షిఫ్టులో పని చేయాల్సి ఉంది. గ్రామంలో ఓ వేడుకకు హాజరయ్యేందుకు గానూ ఆయన ఏ-షిఫ్టుకు వెళ్లాడు. పని పూర్తిచేసుకుని ఇంటికి వెళ్లేందుకు లిఫ్టులో నుంచి కిందకు దిగుతున్న అర్జున్‌కు కిలన్‌లో సాంకేతిక సమస్య వచ్చిందని సమాచారం అందింది. ఏమైందా.. అని లిఫ్టు దిగి చూస్తుండగానే పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో అర్జున్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఆదివారం నుంచి గురువారం వరకు మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.

తండ్రి బాటలో..

పరిటాల వెంకటేశ్వర్లు, వెంకటమ్మల రెండో కుమారుడు అర్జున్. ఎలక్ట్రీషియన్‌గా శిక్షణ పొంది సిమెంట్ కర్మాగారంలో ఉద్యోగం చేస్తున్నాడు. వెంకటేశ్వర్లు పెద్ద కుమారుడు సైదులు కూడా అదే కంపెనీలో మైనింగ్‌లో పని చేస్తున్నాడు. చిన్న కుమారుడు రాంబాబు తండ్రి కాంట్రాక్టు పనులను పర్యవేక్షిస్తూ వ్యవసాయ పనులు చూసుకుంటాడు. వెంకటేశ్వర్లు పదేళ్లు సర్పంచ్‌గా పనిచేశారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్‌బీకేల మండల చైర్మన్‌గా వ్యవహరించారు. కాంట్రాక్టరుగా మారి చిన్నచిన్న పనులు చేసుకుంటున్నారు. మంచి పేరున్న తండ్రి అడుగుజాడల్లోనే అర్జున్ కూడా పెరిగి, అంతే పేరు సంపాదించారు.

బుడమేరును యథేచ్ఛగా పూడ్చేశారు. ప్లాట్లుగా చదును చేసేశారు. ఆనక దర్జాగా అమ్మకాలు జరిపేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో న్యూ రాజరాజేశ్వరిపేటలో జరిగిన భూ కబ్జా తాజాగా వెలుగులోకి వచ్చింది. స్థానిక వైసీపీ కార్పొరేటర్ ఇష్టానుసారంగా బుడమేరును మెరక చేసి ప్లాట్లుగా విభజించడం, ఇందుకు ప్రభుత్వ శాఖలు సహకరించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



వైసీపీ నేతలు పూడ్చేసిన బుడమేరు సరిహద్దు ప్రాంతం

బుడమేరును అమ్మేశారు

న్యూ ఆర్ఆర్ పేటలో స్థలాలుగా మార్చి అమ్మకాలు

- రూ.50 లక్షల విలువచేసే భూమిని అమ్మేసిన వైసీపీ నేత
- ప్లాట్లు కొని, ఇళ్లు కట్టుకుంటున్న అమాయకులు
- కబ్జా స్థలాల్లో స్తంభాలు వేసిన విద్యుత్ అధికారులు



ఇరిగేషన్ స్థలంలో నిర్మాణం

అజిత్‌సింగ్‌నగర్ : న్యూ ఆర్ఆర్‌పేటలో వైసీపీ నేతల కబ్జా వ్యవహారం వెలుగుచూసింది. అజిత్‌సింగ్‌నగర్ పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న సెల్ టవర్ రోడ్డులో బుడమేరును దర్జాగా కబ్జా చేసి చదును చేసిన స్థానిక వైసీపీ నేతలు గుట్టుచప్పుడు కాకుండా అమ్మకాలు కూడా జరిపేశారు. ఇందులో వివిధ శాఖల అధికారులు సైతం తమ వంతు సహకారం అందించడం విశేషం.

బుడమేరును పూడ్చేసి..

న్యూ రాజరాజేశ్వరిపేట మీదుగా బుడమేరు ప్రవహిస్తూ ఉంటుంది. కొన్నేళ్లుగా బుడమేటికి ప్రవాహం తగ్గడంతో స్థానిక వైసీపీ కార్పొరేటర్ భర్త, మరికొందరు అనుచరులు ఆరు నెలల క్రితం కబ్జాకు తెరలేపారు. దశలవారీగా బుడమేరును పూడ్చుకుంటూ వెళ్లారు. ఇరిగేషన్ శాఖ కిందకు వచ్చే బుడమేరు సరిహద్దును పూడ్చి సుమారు 500 గజాల స్థలాన్ని చదును చేసి 39/2బీ సర్వే నెంబరుతో నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు.

రూ.50 లక్షల పైమాటే..

బుడమేరు వద్ద ఆక్రమించిన ఇరిగేషన్ స్థలాల విలువ రూ.50 లక్షల పైనే ఉంటుంది. ఆరు నెలల క్రితమే గుట్టుచప్పుడు కాకుండా కబ్జా చేసిన నేతలు అప్పట్లోనే ప్లాట్ల కింద విడదీసి గజం రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు విక్రయించారు. స్థానికంగా గజం రూ.30 వేల నుంచి రూ.35 వేలు పలుకుతుండగా, సగం రేటుకే స్థలాలు లభించడంతో చాలామంది కొనుగోలు చేసి మోసపోయారు. అయితే, కబ్జా స్థలాల్లో నిర్మాణాలు జరిగినా ఇరిగేషన్, రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించలేదు.

విద్యుత్ శాఖ అత్యుత్సాహం

వైసీపీ నేతలు కబ్జాకు పాల్పడిన స్థలాల వద్ద విద్యుత్ శాఖ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించినట్లు తెలుస్తోంది. కబ్జా స్థలాల వద్ద నిర్మాణాలకు అనుకూలంగా ఉండేందుకు గత ఎన్నికలకు 20 రోజుల ముందే కొత్తగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటుచేసి స్వామిభక్తి చాటుకున్నారు.

ఈజీగా ఉచిత ఇసుక

త్వరలో రవాణా వాహనాలకు జీపీఎస్ పరికరాలు

స్టాక్ యార్డుల్లో ఈ-పోస్ యంత్రాల ఏర్పాటు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉచిత ఇసుక పథకంలో వ్యవస్థీకృత లోపాలను సరిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఇసుక అవసరమైన వారు ఇబ్బందులు పడకుండా ఉండటానికి త్వరగా రవాణా జరిగేలా చర్యలు తీసుకోవటంతో పాటు రవాణా వ్యవస్థను నియంత్రించటానికి వీలుగా కీలకమైన రెండు జాగ్రత్తలు చేపట్టింది. త్వరలోనే రవాణా వాహనాలన్నింటికీ జీపీఎస్ పరికరాలు అమర్చనున్నారు. దీనిద్వారా ఆయా వాహనాలు ఎక్కడికి వెళ్తున్నాయి? ఏయే ప్రాంతాలకు వెళ్తున్నాయి? ఒకేచోటకు వెళ్తున్నాయా? వంటి వివరాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ పర్యవేక్షించనుంది. దీనివల్ల ఇసుక పక్కదారి పడుతుందా, లేదా అనే విషయం తెలుస్తుంది. ఇసుక స్టాక్ యార్డుల్లో రవాణా సిండికేట్‌తో కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిని నియంత్రించటానికి జీపీఎస్ పరికరాలు దోహదపడతాయి. అలాగే, యార్డుల వద్ద ఆన్‌లైన్ విధానం జాప్యమవుతోంది. ఈ సమస్యకు కూడా చెక్ పెట్టేందుకు ఈ-పోస్‌లను ప్రవేశపెట్టనున్నారు. కీసర స్టాక్ యార్డులో 8 ఈ-పోస్‌లను ప్రవేశపెట్టనున్నారు. దీనివల్ల ప్రస్తుతం ఒక వాహనంలో ఇసుక నింపటానికి అవుతున్న 40 నిమిషాల సమయం 20 నిమిషాలకు తగ్గుతుంది.

జిల్లాలో పాలన.. ఓ చాలెంజ్



మీడియా సమావేశంలో కలెక్టర్ సృజన

- ప్రజల నమ్మకాన్ని నిలబెట్టడానికి నిరంతర కృషి
- చట్టబద్ధమైన ఏ సమస్యకైనా పరిష్కారం
- సంక్షేమం, అభివృద్ధిపై ప్రధాన దృష్టి
- విద్యారంగాన్ని మరింత పటిష్టపరుస్తాం..
- అంతర్గత సమస్యలను తీరుస్తాం..
- మీడియా సమావేశంలో కలెక్టర్ సృజన

'చైతన్యవంతమైన జిల్లాలో పనిచేయటం చాలెంజ్‌గా తీసుకుంటున్నా. ప్రజలు వ్యవస్థలపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడతాం. చట్టప్రకారం ఏ సమస్యనైనా పరిష్కరించేందుకు మేం సిద్ధంగా ఉంటాం. ఎన్టీఆర్ జిల్లా అభివృద్ధి చెందినదిగా ఉన్నప్పటికీ కొన్ని అంతర్గత సమస్యలున్నాయి. సంక్షేమం, అభివృద్ధితో పాటు లోకల్ డెవలప్‌మెంట్ అంశాలపై దృష్టి సారిస్తాం.' అని కలెక్టర్ సృజన అన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. జిల్లాలో తాను ప్రాధాన్యమిచ్చే కొన్ని విషయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లాగా ఉన్నప్పుడు తాను విజయవాడ సబ్ కలెక్టర్‌గా పనిచేశానని, దాదాపు పదేళ్లు కావడం వల్ల పరిస్థితుల్లో మార్పులు వచ్చాయన్నారు. విభజన జిల్లాలో కలెక్టర్‌గా పనిచేయటం కాస్త కొత్తగానే ఉందన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా కొనసాగిస్తామన్నారు. అభివృద్ధి కార్యక్రమాలను కూడా కార్యరూపంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. లోకల్ డెవలప్‌మెంట్‌పై, విద్యారంగంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తానన్నారు. తరగతి గదిలో బోధన విద్యార్థులకు అర్థమవుతుందా, లేదా అనే అంశంపై దృష్టిసారించి, మెరుగైన విద్యాబోధన విద్యార్థులకు అందేలా చేస్తానన్నారు. హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి ఉంటుందని, విద్యార్థులకు అందే మౌలిక సదుపాయాలే ప్రధానమన్నారు. హాస్టళ్ల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ వంటి కార్యక్రమాలు నిర్వహించి, లక్ష్యం దిశగా వారిని పయనింపజేసేందుకు మార్గం చూపిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఉపాధి పొందేలా స్కిల్ డెవలప్‌మెంట్‌పై విస్తృతంగా శిక్షణ కల్పిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. స్కిల్ ఓరియంటేషన్‌పై ఎక్కువ దృష్టి పెడతామని కలెక్టర్ సృజన చెప్పారు.

త్వరలో సోలార్ డ్రయ్యర్ ప్రాజెక్టు

మహిళలు ఏదైనా సాధించగలరని చెప్పటానికి, వారిని స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయించటానికి కృషి చేస్తానన్నారు. కర్నూలు జిల్లాలో తాను పనిచేసినపుడు ఉల్లి, టమాటా సోలార్ డ్రయ్యర్ ప్రాజెక్టులను చేపట్టామని, తద్వారా మహిళలు నెలకు రూ.15 వేలు ఆర్జిస్తున్నారని తెలిపారు. ఈ తరహా కార్యక్రమాలను ఎన్టీఆర్ జిల్లాలో కూడా కొనసాగిస్తానని చెప్పారు.

ఏ.కొండూరు మంచినీటి సమస్య తీరుస్తాం

ఏ.కొండూరు మండలంలో రక్షిత మంచినీటి వ్యవస్థను మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. ట్యాంకర్ల ద్వారా రక్షిత మంచినీటిని అందిస్తున్నామని, త్వరలో శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. జల్‌జీవన్ మిషన్ (జేజేఎం) స్కీమ్‌లో భాగంగా ఈ సమస్యకు ముగింపు పలుకుతామని, ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య సమస్యతో పాటు కాల్వల పరిశుభ్రత, మంచినీటి కాలుష్యం తదితర సమస్యలపైనా దృష్టిపెడతానన్నారు.

సీపీ సార్.. అన్నీ సమస్యలే..

పరిష్కారమే ముందున్న మార్గం



కొత్త సీపీ రాజశేఖర్‌బాబు

విజిబుల్ పోలీసింగ్ ఉన్నా నిరంతరం నిఘా పెట్టే సీసీ కెమెరాలు ఎప్పుడు పనిచేస్తాయో తెలియదు. రాజధాని నగరంలో ట్రాఫిక్ పెరుగుతున్నా పాతకాలం నాటి సిగ్నలింగ్ వ్యవస్థ ఎప్పుడు మారుతుందో అర్థంకాదు. నగరంలో నానాటికీ గంజాయి ఛాయలు పెరుగుతున్నా, గంజాయి బ్యాచ్ ఆగడాలు మీతిమీరుతున్నా పూర్తిగా అరికట్టే రోజు ఎప్పుడొస్తుందో తెలియదు. కొత్త సీపీ రాజశేఖర్‌బాబు ముందున్న ప్రధాన సమస్యలివే. కమిషనరేట్‌కు కమిషనర్లు మారుతున్నా ఈ ప్రధాన సమస్యల పరిష్కారానికి అడుగులు ముందుకు పడుతూ, ఆ తర్వాత ఆగిపోతున్నాయి. కొత్త సీపీ అయినా వీటి పరిష్కారానికి చొరవ చూపించాల్సిన అవసరముంది. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

అక్కరకు రాని సిగ్నలింగ్ వ్యవస్థ

ప్రస్తుతం నగరంలో పనిచేస్తున్న ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థకు స్వస్తిచెప్పి అధునాతన ఏటీసీఎస్ (అడాప్టివ్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టం)ను ఏర్పాటు చేయాలని ఎప్పుడో ప్రతిపాదించారు. పాత సిగ్నలింగ్ వ్యవస్థను తొలగించడానికి అధికారులు ప్రణాళికలు తయారు చేశారు. నగరంలోని 25 కూడళ్లలో ట్రాఫిక్ రద్దీని అధ్యయనం చేశారు. అయితే 17 కూడళ్లకే ఏటీసీఎస్‌ను పరిమితం చేయాలని నిర్ణయించారు. హైదరాబాద్ నగరంలో ఉన్న హెచ్‌ట్రిమ్స్ మాదిరిగానే విజయవాడలో ఏటీసీఎస్‌ను ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులు, వీఎంసీ అధికారులు నిర్ణయించారు. 10 లక్షల జనాభా దాటిన నగరాల్లో గాలి కాలుష్యాన్ని తగ్గించేందుకు కేంద్రం మిలియన్ ప్లస్ నగరాలకు నిధులను విడుదల చేసింది. రూ.5 కోట్లతో ట్రాఫిక్ వ్యవస్థకు కొత్త వెలుగులు తీసుకురావాలనుకున్నారు. కాగా, ఈ పనులు ఎన్నికల ముందు వరకు జరిగినా తర్వాత ముందుకు సాగలేదు.

పనిచేయని సీసీ కెమెరాలు

నగరంలో 800 వరకు సీసీ కెమెరాలు ఉన్నాయి. వాటిలో పనిచేస్తున్నవి కొన్నే. ఆందోళనలు, నిరసనలు, ప్రముఖుల పర్యటనలు ఉన్నప్పుడు అప్పటికప్పుడు వాటికి మరమ్మతులు చేయించాల్సి వస్తోంది. ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఉన్నా, నిర్వహణ లేకపోవడంతో పనిచేయడం మానేశాయి. సీసీ కెమెరాల నిర్వహణను ఒక ప్రైవేట్ సంస్థకు అప్పగించారు. ఇందుకయ్యే ఖర్చును గత ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో ఆ సంస్థ మరమ్మతులు చేయడం మానేసింది. కొన్ని నేరాలు జరిగినప్పుడు సమీపంలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తే క్లూ దొరుకుతుందని పోలీసులు భావించేవారు. తీరా చూస్తే.. ఆ కెమెరాలు పనిచేసేవి కావు. దీనికి శాశ్వత పరిష్కారం చూపించాల్సి ఉంది.

గంజాయి లింక్ తెగితేనే..

నగరంపై గంజాయి ఛాయలు చెరపలేని విధంగా ఉన్నాయి. గంజాయి వినియోగం, అమ్మకం పోటాపోటీగా సాగుతున్నాయి. గంజాయికి బానిసలవుతున్న యువకుల సంఖ్య పెరుగుతోందని ఇటీవల నిర్వహించిన మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం రోజు జరిగిన సదస్సులో వక్తలు వెల్లడించారు. కొన్నాళ్లుగా టాస్క్‌ఫోర్స్ విభాగం గంజాయిని కట్టడి చేయడానికి పనిచేస్తోంది. అయినా ఈ లింక్‌లు మాత్రం తెగడం లేదు. ఇక్కడి నుంచి బైకులపై విశాఖ మన్యానికి వెళ్లి గంజాయిని తెచ్చుకుంటున్నారు. కొంతమంది యువకులతో సరుకును రప్పించుకుంటున్నారు. మన్యంతో ఉన్న లింక్‌లు మాత్రం తెగడం లేదు. మాదకద్రవ్యాల ఛాయలను చెరిపేయడానికి గత సీపీ పీహెచ్‌డీ రామకృష్ణ యాంటీ నార్కోటిక్ సెల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సెల్ కొద్దిరోజుల క్రితం నుంచే పని మొదలుపెట్టింది. దీనిని పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరముంది.

పింఛన్ సొమ్ము మింగిందెవరు!

4లో..

- మైలవరం వీఆర్వోపై కలెక్టర్ చర్యలకు ఆదేశించినా పట్టని పోలీసులు
- వాస్తవాలు బయటకొస్తాయని అడ్డుపడుతున్న తహసీల్దార్



ఇంద్రకీలాద్రికి ఆషాఢ శోభ..

- దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు
- ఒక పక్క ఆర్జిత సేవలు, మరోవైపు సారె సమర్పణలు

వన్‌టౌన్, జూలై 12 : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆషాఢమాసం.. శుక్రవారం సందర్భంగా భక్తజనం పోటెత్తారు. పవిత్రమైన రోజు కావడంతో అమ్మవారికి సారె సమర్పించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్త బృందాలు తరలివచ్చాయి. స్థోమత మేరకు అమ్మవారికి చీరలు, పండ్లు, ఫలహారాలు, వివిధ రకాల తీపి వంటకాలు తదితరాలను సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. భక్తుల రద్దీని పురస్కరించుకుని అమ్మవారి శీఘ్ర దర్శనం కోసం ఈవో కేఎస్ రామారావుతో పాటు సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకున్నారు. శుక్రవారం శ్రీచక్రనవావరణార్చన, లక్షకుంకుమార్చన, చండీహోమం, ఉదయాస్నే ఖడ్గమాలసేవ, శాంతి కల్యాణం తదితర ఆర్జిత సేవలలో పాల్గొని భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఎక్కడా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఈవో సుడిగాలి పర్యటన చేశారు. భక్తుల నుంచి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం సందర్భంగా ఉపాలయంగా ఉన్న వల్లీ, దేవసేన, సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. పుట్టలో భక్తులు పాలు పోసి పూజలు చేశారు.





దుర్గమ్మను దర్శించుకున్న మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి

దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి

వన్‌టౌన్, జూలై 12 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో కనకదుర్గమ్మను శుక్రవారం మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.వెంకటరమణ కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈవో కేఎస్ రామారావు, అర్చక బృందం ఆయనకు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం ఈవో వారికి అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు. శుక్రవారం ఆలయానికి పలువురు ఎమ్మెల్యేలు, ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు. అధికారులు వారికి అమ్మవారి ప్రసాద, శేషవస్త్రం, చిత్రపటం తదితరాలు అందజేశారు.

విషజ్వరాలతో అప్రమత్తం

- డీఎం అండ్ హెచ్‌వో గీతాబాయి



కూచిపూడి, జూలై 12 : గ్రామపంచాయతీలు తాగునీటి విషయంలో పూర్తిస్థాయి జాగ్రత్తలు తీసుకోవాలని కృష్ణా జిల్లా వైద్య అధికారిణి డాక్టర్ జెగీతాబాయి పేర్కొన్నారు. శుక్రవారం మొవ్వ పీహెచ్‌సీని ఆమె పరిశీలించారు. మంచినీటిలో లార్వా ద్వారా పలు రకాల జ్వరాలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఇళ్ల పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. గ్రామాల్లో విష జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని, తమ సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజల ఆరోగ్య క్షేమ సమాచారం తెలుసుకుంటున్నట్టు తెలిపారు. జిల్లాలో 471 ఆర్వో ప్లాంట్లు ఉండగా, ఇప్పటి వరకు 357 ప్లాంట్లలో నీరు పరిశుభ్రంగానే ఉన్నట్టు తెలిపారు. మచిలీపట్నం రూరల్, అర్బన్, పెడన తదితర ప్రాంతాల్లో 32 డెంగ్యూ జ్వరాలు వెలుగు చూసినట్టు తెలిపారు. ప్రాథమిక, వైద్య, ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు 24 గంటలపాటు అందుబాటులో ఉంటారని, జ్వరాలు వచ్చిన వారు వెంటనే ప్రభుత్వ వైద్యశాలల్లో చికిత్స పొందాలని సూచించారు. గ్రామాల్లో తాగునీరు, ప్రజారోగ్యంపై కలెక్టర్ బాలాజీ ప్రత్యేక దృష్టి సారించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో రోగులను ఆమె పరామర్శించారు.

అభివృద్ధికి సహకరించండి : వర్ల రాజా



అధికారులతో సమీక్షిస్తున్న వర్ల కుమార్‌రాజా

పామర్రు, జూలై 12 : నియోజకవర్గ అభివృద్ధిలో అన్ని శాఖల అధికారులు భాగస్వాములు కావాలని పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్ తెలిపారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్ రాజా మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధిలో ప్రధాన భూమిక పోషించే పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు తక్షణ సేవలు అందించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల వ్యవధిలో రోడ్ల మరమ్మతులకు రూ1.05 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. జలజీవన్ మిషన్ పథకం పనులు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఉద్యోగులకు విధి నిర్వహణలో సమస్యలు ఎదురైతే నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చన్నారు. కార్యక్రమంలో పామర్రు, పమిడిముక్కల, మొవ్వ, తోట్లవల్లూరు మండలాల అధికారులతో పాటు జిల్లా రైతు సంఘ ప్రధాన కార్యదర్శి వల్లూరిపల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

'నీరు-చెట్టు' పెండింగ్ బిల్లులపై సమీక్ష



'నీరు-చెట్టు' పెండింగ్ బిల్లులపై సమీక్ష చేస్తున్న బీద రవిచంద్ర యాదవ్

వన్‌టౌన్, జూలై 12 : వైసీపీ ప్రభుత్వ హయాంలో పెండింగ్ పడిన 'నీరు-చెట్టు' బిల్లులపై మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు, వీరంకి గురుమూర్తిలతో కలిసి శుక్రవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బీద రవిచంద్రయాదవ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, 2015 నుంచి 2019 వరకు 'నీరు-చెట్టు' పథకంలో నీటి సంఘాల ప్రతినిధులు, రైతులు రూ.1700 కోట్లతో 28 వేల పనులు చేశారన్నారు. దీనికి గాను రూ.1395 కోట్లకు టోకెన్ పడింది. ఆ తరువాత వైసీపీ ప్రభుత్వ వేధింపులతో చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు 9,331 రిట్ పిటిషన్లు వేశారు. 6625 మంది ధిక్కార పిటీషన్లు వేశారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి రూ.968 కోట్లు జమ కాగా.. కోర్టు ధిక్కరణ పిటిషన్లకు సంబంధించి ఇంకా రూ. 427 కోట్లు బకాయిలున్న విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. ఉపాధి పథకానికి సంబంధించి కూడా రూ. 528 కోట్లు బకాయిలు రావాల్సి ఉందన్నారు. ఈ అంశాన్ని కూడా సీఎం చంద్రబాబుదృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు. సమావేశంలో పోతుగంటి పీరయ్య కవులూరి రాజా, చంద్రమౌళి, చెన్నుపాటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

9 నెలల్లో కొత్త టెర్మినల్ పూర్తి చేస్తాం

- నిర్మాణ పనులపై ఎంపీ కేశినేని చిన్ని సమీక్ష



విమానాశ్రయ కొత్త టెర్మినల్ పనులను పరిశీలిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, జూలై 12 : అమరావతి రాజధాని పరిధిలో ఉన్న ఏకైక అంతర్జాతీయ విమానాశ్రయాన్ని గత ప్రభుత్వం విస్మరించి అభివృద్ధి చేయకుండా కొత్త టెర్మినల్‌ను అటకెక్కించింది. ముఖ్యమంత్రి చంద్రబాబును స్ఫూర్తిగా తీసుకుని కొత్త టెర్మినల్‌ను తొమ్మిదినెలల్లో పూర్తి చేసి ప్రజలకు, ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువస్తామని ఎయిర్‌పోర్టు అథారిటీ కమిటీ వైస్ చైర్మన్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. కొత్త టెర్మినల్ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చేపట్టాల్సిన కార్యచరణపై శుక్రవారం గన్నవరం విమానాశ్రయం కాన్ఫరెన్స్ హాలులో సమీక్ష సమావేశం జరిగింది. అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయలేకపోవటం గత ప్రభుత్వ అసమర్థతగా పేర్కొన్నారు. కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఎయిర్‌పోర్టు టెర్మినల్ అభివృద్ధి పనులను తొమ్మిది నెలల్లో పూర్తి చేస్తామన్నారు. విమానాశ్రయంలోని టెర్మినల్‌ను ఏడాదిలోపే కట్టిన ట్రాక్ రికార్డు ఉందని గుర్తు చేశారు. టెర్మినల్ భవన నిర్మాణ పనులపై వారం వారం సమీక్ష సమావేశాలు నిర్వహిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో రాష్ట్రంలోనే విజయవాడ ఎయిర్‌పోర్టును నెంబర్‌వన్ స్థానంలో ఉంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. గత నెలలో ఇక్కడ నుంచి ముంబైకి విమాన సర్వీసు ప్రజలకు అందుబాటులోకి రాగా ఈ నెల 16 నుంచి ముంబై, ఢిల్లీకి అదనపు సర్వీసులు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం రాకుండా చూడాలని అధికారులు, కాంట్రాక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, గత ప్రభుత్వం రాష్ట్రంతో పాటు రాజధానిలో ఉన్న విమానాశ్రయాన్ని కూడా గాలికి వదిలేసిందని మండిపడ్డారు. విమానాశ్రయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. మల్లవల్లి ఇండస్ట్రీయల్ కారిడార్, ఎయిర్‌పోర్టుకి సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిలో ఐటీ కంపెనీలను తీసుకువచ్చి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయటంతో పాటు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. అనంతరం కొత్త టెర్మినల్ నిర్మాణ పనులను పరిశీలించి ఆరాతీశారు. ఎయిర్‌పోర్టు డైరెక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి, జనరల్ మేనేజర్ ఎ.రామాచారి తదితరులు పాల్గొన్నారు.



నూతన ఉత్పత్తులు అవిష్కరిస్తున్న సంస్థ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి

మార్కెట్‌లోకి.. క్రిషి నూతన ఉత్పాదనలు

లబ్బీపేట, జూలై 12 : క్రిషి రసాయన్ ఎక్స్‌పోర్ట్ క్రిమిసంహారిణ ఉత్పత్తిలో 50సంవత్సరాల సుదీర్ఘ అనుభవం కలిగి దాదాపు 40 దేశాలకు పైగా ఎగుమతి చేస్తున్న అతి పెద్ద భారతీయ బహుళజాతీయ సంస్థ అని కంపెనీ అధిపతులు (సేల్స్ అండ్ మార్కెటింగ్) ఎస్.ఈశ్వర్ రెడ్డి తెలిపారు. బందరోడ్డులోని ఓ హోటల్‌లో శుక్రవారం క్రిషి రసాయన్ ఎక్స్‌పోర్ట్ అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందించిన క్రిఫాస్ గోల్డ్, క్రిల్ క్రి క్రియేట్ కౌగర్ అండ్ కాక్సి55 నూతన ఉత్పాదనలను అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 10 మందితో ప్రారంభమై దినదినాభివృద్ధి చెందుతూ 10వేల కంటే ఎక్కువ ఛానల్ భాగస్వాములతో నెట్‌వర్క్ కు నాయకత్వం వహిస్తున్నదని తెలిపారు. 14 పేటెంట్ పొందిన ఆవిష్కరణలు సహా 142 అధిక నాణ్యత ఉత్పత్తులు తమ సంస్థ ప్రత్యేకత అన్నారు. రానున్న రోజుల్లో మరికొన్ని నూతన ఉత్పాదనలతో పంట దిగుబడిన పెంచే ఉద్దేశంతో 1బిలియన్ వ్యాపార లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్టు తెలిపారు. నూతనంగా అవిష్కరించిన 4ఉత్పాదనలు పత్తి, మిర్చి, వరిలో రసం పీల్చే, గొంగళి పురుగుల నివారణకు సమర్థవంతంగా పనిచేసి అధిక దిగుబడులకు తోడ్పాడతాయని తెలిపారు. కాక్సి 55 శిలీంద్రనాశిని ప్రత్తి, మిర్చి, కాయగూరలు, ఉద్యాన పంటల్లో కాయకుళ్లు, వేరుకుళ్లు తెగుళ్లను సమర్థవంతంగా అరికడుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థ జనరల్ మేనేజర్ ఎ.అంజనేయులు, ఫీల్డ్ మార్కెటింగ్ మేనేజర్ సి.హెచ్.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బందరును అభివృద్ధి బాట పట్టిస్తా

- మచిలీపట్నం ఎంపీ బాలశౌరి



మండలి బుద్ధప్రసాద్, బాలశౌరిలను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

అవనిగడ్డ, జూలై 12 : మచిలీపట్నం పార్లమెంటరీ నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి అన్నారు. శుక్రవారం అవనిగడ్డలో ప్రజా కృతజ్ఞత సభలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గ ప్రజల అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అపార అనుభవంతో కంపెనీ ఏర్పాటు ప్రక్రియను తుది దశకు తీసుకొచ్చారని బాలశౌరి అన్నారు. సుమారు రూ.70 నుంచి 80 వేల కోట్లతో వస్తున్న రిఫైనరీ కారణంగా బందరు పార్లమెంట్ పరిధిలో 50 వేల మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. నాబార్డు నిధులతో ఎదురుమొండి, ఎడ్లంక వారధిని నిర్మిస్తామని, జల్ జీవన్ మిషన్, ఎంపీ నిధులు, అర్బన్ డెవలప్‌మెంట్ నిధులు, అమృత్-2 నిధులతో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీటి పథకాల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, గడిచిన ఐదేళ్లలో జరిగిన అక్రమాలను సరిదిద్దుతామని, మళ్లీ అలాంటివి జరగకుండా కార్యకర్తలు బాధ్యత తీసుకోవాలని కోరారు. ప్రతీ ఎకరాకు సాగునీటిని అందించాలన్న లక్ష్య సాధన కోసం కృషి చేస్తానని తెలిపారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల నేతృత్వంలో రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతుందన్న ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మచిలీపట్నం జనసేన ఇంచార్జ్ బండి రామకృష్ణ, ఆరు మండలాల టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

చోడవరం వద్ద రూ. 2500 కోట్లతో ఆనకట్ట

పెనమలూరు : పెనమలూరు మండలం చోడవరం వద్ద నాలుగు టీఎంసీల కృష్ణా నీటిని నిల్వ ఉంచేందుకు రెండున్నర వేల కోట్లతో ఆనకట్ట కట్టేందుకు కృషి చేస్తానని ఎంపీ వల్లభనేని బాలశౌరి పేర్కొన్నారు. దీనివల్ల కృష్ణా డెల్టాకు వేసవికాలం సాగునీటితో పాటు మంచినీటి సమస్యకూడా తీరే అవకాశం ఉంటుందని తెలిపారు. శుక్రవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో ఆయన స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం కనీస మ్యాచింగ్ గ్రాంటులు ఇవ్వకపోవడంతో ఉయ్యూరు మునిసిపాలిటీకి కృష్ణా నీళ్లను అందించలేకపోయామన్నారు. త్వరలో సీఎం, డిప్యూటీ సీఎం, బందరు పార్లమెంటు పరిధిలోని ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు చేసి ఈ ప్రాంత అవసరాలను చర్చిస్తామని తెలిపారు. కంకిపాడు నుంచి గుడివాడకు నాలుగు వరుసల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డును నిర్మించే ప్రతిపాదన ఉన్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరిని ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ నాయకులు అభినందించారు. కార్యక్రమంలో జనసేన నేతలు ముప్పా రాజా, తాతపూడి గణేష్, టీడీపీ సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్ తదితరులు ఉన్నారు.

వ్యవసాయం, స్వయం ఉపాధికి ప్రాధాన్యం

- వార్షిక రుణ లక్ష్యాలు సాధించండి
- ప్రభుత్వ ప్రాధాన్య పథకాల అమల్లో భాగస్వాములు కావాలి
- డీసీసీ, డీఎల్‌ఆర్‌సీ సమావేశంలో బ్యాంకర్లతో కలెక్టర్ సృజన



నాబార్డు పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కృష్ణలంక, జూలై 12 : అత్యంత కీలకమైన వ్యవసాయం, పారిశ్రామిక రంగాలతో పాటు స్వయం ఉపాధి కల్పన పథకాలకు ప్రాధాన్యమివ్వాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన బ్యాంకుల ప్రతినిధులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో లీడ్ బ్యాంక్ జిల్లా కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ), జిల్లాస్థాయి సమీక్షా కమిటీ సమావేశం (డీఎల్‌ఆర్‌సీ) జరిగింది. సమావేశాలకు విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఆర్‌బీఐ ఏజీఎం సీహెచ్ నవీన్‌కుమార్, యూబీఐ డిప్యూటీ రీజనల్ హెడ్, కన్వీనర్, ఐఎస్ఎస్ మూర్తి, నాబార్డు డీడీఎం మిలింద్ చౌసాల్కర్, ఎల్‌డీఎం కె.ప్రియాంక తదితరులతో పాటు వివిధ బ్యాంకుల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాల సాధన, వ్యవసాయం, ఎంఎస్ఎంఈ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు-బ్యాంకు లింకేజీ, ఆర్థిక సాక్షరత కార్యక్రమాలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో బ్యాంకింగ్ రంగానికి సంబంధించిన అంశాల్లో పురోగతి తదితరాలపై చర్చించారు. తొలుత ఎల్‌డీఎం కె.ప్రియాంక అజెండాలోని అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో 90, సెమీ అర్బన్‌లో 122, అర్బన్-మెట్రోలో 326 మొత్తం 538 బ్యాంకు బ్రాంచిలు వున్నట్టు తెలిపారు. అదేవిధంగా మొత్తం డిపాజిట్లు, అడ్వాన్సులు, ఎస్‌హెచ్‌జీలకు అడ్వాన్సులు, కీలక బ్యాంకింగ్ సూచికల్లో పురోగతిని వివరించారు. 2023-24 ఆర్థిక సంవత్సర వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాల సాధనను వివరించారు. ప్రాధాన్య రంగంలో 136.15 శాతం, ప్రాధాన్యేతర రంగంలో 333.91 శాతం మేర లక్ష్యాలను సాధించినట్టు తెలిపారు. మొత్తం లక్ష్యం రూ.39 వేల కోట్లు కాగా రూ.92,651 కోట్లు (237.57 శాతం) మేర అందించినట్టు వివరించారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల (ఎంఎస్ఎంఈ)కు సంబంధించిన లక్ష్యాలు-సాధించిన ప్రగతిని తెలియజేశారు.


బ్యాంకులు, బ్రాంచీల వారీగా ప్రగతి

ప్రజా సంక్షేమం లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన వివిధ పథకాలు, కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేయడంలో బ్యాంకులది కీలకపాత్ర అని, ప్రభుత్వ ప్రాధాన్యతల ఆధారంగా బ్యాంకులు, బ్రాంచీల వారీగా లక్ష్యాల సాధనకు కృషి చేయాలని కలెక్టర్ వివరించారు. పీఎంఈజీపీ, స్టాండప్ ఇండియా, ప్రధానమంత్రి ముద్ర యోజన వంటి పథకాల ద్వారా పూర్తిస్థాయిలో సమాజానికి ప్రయోజనాలు లభించేలా బ్యాంకులు కృషి చేయాలన్నారు. ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిష్కరించాలని, అర్హులైన వారిని స్వయం ఉపాధి దిశగా చేయిపట్టి నడిపించేందుకు కృషి చేయాలన్నారు. ఆర్థిక సాక్షరత కార్యక్రమాలను క్రియాశీలకంగా నిర్వహించాలని, బ్యాంకుల సేవలపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సృజన సూచించారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు ప్రభుత్వం అమలు చేసే వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాల అమలులో బ్యాంకులు కీలక పాత్ర పోషించాలని, సమష్టి భాగస్వామ్యంతో ప్రజల ఆర్థిక సాధికారతకు కృషి చేయాలని కోరారు. రుణాల మంజూరుకు సంబంధించిన దరఖాస్తులను త్వరతగతిన పరిష్కరించి అర్హులకు మేలు జరిగేలా చూడాలన్నారు.

సమావేశంలో భాగంగా జిల్లాకు సంబంధించి నాబార్డు పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ (2024-25)ను ఆవిష్కరించారు. వ్యవసాయ, అనుబంధ కార్యకలాపాలకు రూ.12,611 కోట్లు, ఎంఎస్ఎంఈలకు రూ.8,193 కోట్లు, ఎగుమతుల క్రెడిట్‌కు రూ.93.50 కోట్లు, విద్యా రంగానికి రూ.458 కోట్లు, హౌసింగ్‌కు రూ.1695 కోట్లు తదితర రంగాలకు మొత్తం రూ.24,413 కోట్లకు అంచనాలను విడుదల చేశారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, జీఎం డీఐసీ ఎ.సుధాకర్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.

పింఛన్ సొమ్ము మింగిందెవరు!

- వీఆర్వోపై కలెక్టర్ చర్యలకు ఆదేశించినా.. పట్టని పోలీసులు
- వాస్తవాలు బయటకొస్తాయని అడ్డుపడుతున్న తహసీల్దార్!
- కలెక్టర్ ఆదేశాలతో.. కొత్త మలుపు తిరిగిన కేసు



కలెక్టర్ జారీ చేసిన లేఖ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి మకిలి పట్టించే విధంగా వృద్ధుల పింఛన్ల సొమ్మును మింగేసిన మైలవరం గ్రేడ్-2 వీఆర్వో తరుణ్ వ్యవహారం కొత్త మలుపు తిరిగింది. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పింఛన్ల పంపిణీని అపహాస్యం పాలు చేసిన వీఆర్వోపై క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సిందిగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన ఆదేశిస్తే మైలవరం మండల రెవెన్యూ అధికారులు అతడ్ని కాపాడారు. స్థానిక ఎంపీడీవో కేసు పెట్టినా రెవెన్యూ అధికారులు మాత్రం ఎఫ్ఐఆర్ కాకుండా మేనేజ్ చేశారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి వచ్చింది. వృద్ధుల సొమ్మును మింగేసిన వీఆర్వోపై తక్షణం ఎఫ్ఐఆర్ నమోదు చేయించాలని కలెక్టర్ సృజన, మైలవరం ఎంపీడీవోను శుక్రవారం ఆదేశించారు. దీంతో ఇప్పటి వరకు వీఆర్వోపై ఎఫ్ఐఆర్ నమోదు కాలేదన్న విషయం వెలుగులోకి వచ్చింది. కలెక్టర్ ఆదేశాలతో మైలవరం ఎంపీడీవో కార్యాలయం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఫిర్యాదు ఇచ్చి పదకొండు రోజులు గడిచినా పోలీసులు ఎఫ్ఐఆర్ కట్టకపోవటంతో ఎంపీడీవో కార్యాలయ అధికారులు పోలీసుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకు వచ్చారు. దీంతో శుక్రవారం ఎంపీడీవో కార్యాలయానికి పోలీసులు వెళ్లి వీఆర్వోపై ఫిర్యాదు ఇవ్వవలసిందిగా కోరారు. వీఆర్వోపై ఇప్పటికే ఫిర్యాదు చేశాం కదా.. అని ప్రశ్నిస్తే తమ దగ్గర లేదని పోలీసులు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. నాటి ఫిర్యాదు కాపీ ఇవ్వగా.. అది వద్దని ప్రస్తుత తేదీతో మళ్లీ ఫిర్యాదు ఇవ్వవలసిందిగా కోరడంతో ఎఫ్ఐఆర్ కట్టడంలో స్థానిక పోలీసుల నిర్వాకం బయటపడుతోంది. వాస్తవానికి ఘటన జరిగిన రోజునే వీఆర్వోపై ఎంపీడీవో ఫిర్యాదు చేశారు. వీఆర్వో తరుణ్‌పై కేసు విషయంలో వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. వీఆర్వో తరుణ్ గతంలో సబ్ కలెక్టర్ ఆఫీసు పర్యవేక్షణలో నడిచే పెట్రోల్ బంకులో పనిచేసినపుడు నగదును మాయం చేయటంతో అతనిపై బదిలీ వేటు పడింది. అయినా బుద్ధి మారక చివరకు వృద్ధుల పింఛను సొమ్ము రూ. 48 వేల మేర సొంతానికి వాడేసుకున్నాడు. వీఆర్వో తరుణ్‌పై ఎఫ్ఐఆర్ పెట్టి విధుల నుంచి తొలగించమని కలెక్టర్ ఆదేశించినా చేయకపోవటానికి మరో ట్విస్ట్ వెలుగులోకి వచ్చింది. ఈ డబ్బులను వీఆర్వో స్థానిక తహసీల్దార్‌కి ఇచ్చినట్టుగా ప్రచారం జరుగుతోంది. తహసీల్దార్ విజ్ఞప్తి మేరకే మైలవరం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదన్న విమర్శలు కూడా వస్తున్నాయి. వీఆర్వో తరుణ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తే.. వాస్తవాలు ఎక్కడ బయటపెడతాడోనని ఈ పని చేసినట్టుగా ప్రచారం జరుగుతోంది.

గడ్డి మందు తాగి ఆత్మహత్య



పెనుగంచిప్రోలు, జూలై 12 : నవాబు పేట గ్రామానికి చెందిన తిమ్మసత్తి రవి (52) గడ్డి మందు తాగి శుక్రవారం ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ రాంబాబు తెలిపిన సమాచారం ప్రకారం.. తిమ్మసత్తి రవి దుస్తుల వ్యాపారం చేసేవాడు. వ్యాపారంలో నష్టాలు రావటంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో గడ్డి మందును కూల్ డ్రింక్‌లో కలిపి తాగాడు. ఇది గమనించిన తల్లి 108కి సమాచారం అందించగా రవిని నందిగామ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం రవిని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు.



బైక్ ప్రమాదంలో మృతి చెందిన వీఆర్వో

బైక్ అదుపుతప్పి వీఆర్వో మృతి

నందిగామ రూరల్ : అడవిరావులపాడు గ్రామ శివారు కెకంద్రిక అగ్రహారం వద్ద బైక్ అదుపుతప్పి నందిగామ వీఆర్వో కీసర ప్రభాకరరావు (51) మృతి చెందాడు. సేకరించిన సమాచారం ప్రకారం.. పెనుగంచిప్రోలు మండలం శనగపాడు గ్రామానికి చెందిన ప్రభాకరరావు నందిగామ పట్టణంలోని ఏడవ సచివాలయంలో వీఆర్వోగా పనిచేస్తున్నాడు. కొద్ది రోజులుగా ప్రభాకరరావు అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం విజయవాడ ఆసుపత్రికి వెళ్లి తిరిగి అత్తగారి స్వగ్రామం బొబ్బిళ్లపాడుకు గురువారం రాత్రి బైక్‌పై బయలుదేరాడు. కెకంద్రిక అగ్రహారం వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన కందకంలో పడి మృతి చెందాడు. శుక్రవారం ఉదయం అడవిరావులపాడు గ్రామానికి చెందిన పలువురు రైతులు పొలానికి వెళ్తూ గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ హనీష్ ఎస్ఐ పండుదొర, తహసీల్దార్ సరస్వతీ, డీటీ, ఆర్ఐ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలంలో వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా ఫిడే రేటింగ్ చెస్ చాంపియన్‌షిప్

విజయవాడ స్పోర్ట్స్, జూలై 12 : స్కార్క్ చెస్ అకాడమి ఆధ్వర్యంలో కానూరులోని ఓ కల్యాణమండపంలో మూడు రోజులపాటు సాగే రెండో ఇంటర్నేషనల్ బీ ఫిడే రేటింగ్ ఓపెన్ చెస్ టోర్నీ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథులుగా పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ధనేకుల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఎండీ రవికుమార్, జనసేన పార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షులు బండ్రెడ్డి రామకృష్ణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్లాసికల్ ఈవెంట్‌లో భారత్, కెన్యా, పాకిస్థాన్, అమెరికా క్రీడాకారులు బరిలో దిగారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114, 123, 134
చికెన్ విత్ స్కిన్	214
చికెన్ స్కిన్‌లెస్	224

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.55

19 నుంచి షిర్డీ సాయి ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు

భవానీపురం, జూలై 12 : హెచ్‌బీ కాలనీ(పాత)లోని సంకల్పసిద్ధి షిర్డీ సాయిబాబా ఆలయంలో ఈ నెల 19 నుంచి 21 వరకు వైభోపేతంగా గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించాలని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ పాలక కమిటీ అధ్యక్షుడు బూర్లె వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు మోటమర్రి సుబ్బారావు, సెక్రటరీ గుడివాడ విజయ్‌కుమార్‌లు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో గురుపౌర్ణమి వేడుకలకు సంబంధించిన బ్రోచర్లను శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా భక్తుల సహకారంతో సాయిబాబాకు కేజీ 100 గ్రాముల బంగారంతో తయారు చేయించిన స్వర్ణ కిరీటాన్ని 19న ప్రత్యేక అభిషేకాలు నడుమ అలంకరించనున్నట్లు తెలిపారు. సభ్యులు పొతర్లంక రజనీకాంత్, యెనిగళ్ల సుబ్బారావులు పాల్గొన్నారు.

కలుషిత నీరు సరఫరా

- తాగునీటిలో నలకలు
- భయాందోళనలో పకీరుగూడెం వాసులు
- పట్టించుకోని 19వ డివిజన్ కార్పొరేటర్



కలుషిత నీటిని చూపిస్తున్న స్థానికులు



కుళాయిల నుంచి నలకలతో వస్తున్న నీరు

లబ్బీపేట, జూలై 12: పకీరుగూడెంలో గత కొన్ని రోజులు నుంచి మున్సిపల్ కుళాయిల నుంచి కలుషిత నీరు వస్తుండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 19వ డివిజన్ పకీరుగూడెంలోని మాతంగి లక్ష్మయ్య వీధి నుంచి ప్రగతి నగర్ వరకు ఉన్న కార్పొరేషన్ మంచినీటి కుళాయిల నుంచి పూర్తిగా నలకలతో నిండిన నీరు వస్తోంది. మొదట్లో పంపులు వదిలిన కొంత సేపటి వరకు వచ్చి తరువాత సాధారణ నీరు వచ్చేదని, అయితే కొన్ని రోజులు నుంచి పూర్తిగా కలుషిత నీరు వస్తోందని స్థానికులు తెలిపారు. దీంతో ఈ నీటిని తాగాలంటే భయంగా ఉందని, తాగునీటిని మినరల్ ప్లాంట్‌ల నుంచి కొని తెచ్చుకుంటున్నామని అంటున్నారు. తాగునీటిలో నల్లని నలకలు వస్తున్నాయని స్థానిక కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళదామంటే ఎన్నికలైనప్పటి నుంచి అందుబాటులో లేరని తెలిపారు. వెంటనే సంబంధిత అధికారులు కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళతాం

ఈ ప్రాంతంలో మంచినీటి కుళాయిల నుంచి కలుషిత నీరు వస్తున్న విషయాన్ని స్థానికులు తమ దృష్టికి తీసుకుని వచ్చారని, ఈ సమస్యను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తాం. ఎన్నికలు అయినప్పటి నుంచి డివిజన్ కార్పొరేటర్ కనిపించడం లేదు. ప్రజలు తాగడానికి నీరు లేక ఇబ్బందులు పడుతుంటే కార్పొరేటర్ పట్టనట్లు వ్యవహరించడం దారుణం, సంబంధిత అధికారులు కూడా వెంటనే సమస్యను పరిష్కరించాలి.

- భాగం సాయి ప్రసాద్, టీడీపీ డివిజన్ అధ్యక్షుడు

ప్రణాళికగా యూజీడీ, స్ట్రామ్ వాటర్ పనులు

20వ డివిజన్ రోడ్డు శంకుస్థాపనలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

కృష్ణలంక, జూలై 12 : నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, స్ట్రామ్ వాటర్ పనులను ఒక ప్రణాళికగా పూర్తి చేస్తామని, కొన్ని ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యర్థాలు రోడ్డుమీదకు వస్తున్నాయని, ఇవన్నీ కూడా త్వరలో పరిష్కరించడం జరుగుతుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. కృష్ణలంకలోని 20వ డివిజన్ నెహ్రూనగర్ డొంకరోడ్డులో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ శుక్రవారం పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం చర్చి వద్ద రోడ్డు నిర్మాణ పనులకు, డ్రెయినేజీ పనులకు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. అనంతరం వంగవీటి మోహనరంగా స్మృతివనాన్ని పరిశీలించి, స్మృతివనంలో పార్కు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి స్మృతి వనాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకొంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ నగరాన్ని విశ్వవ్యాప్త నగరం చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని, అందుకు నగర వాసులు అందరూ ఆయనకు కృతజ్ఞతలు తెలపాలన్నారు. స్థానిక కార్పొరేటర్ అడపా శేషు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ముమ్మనేని ప్రసాద్, మోటేపల్లి చిన్నా, కొడాలి సాయిబాబు, గల్లా శ్రీను, జి.జయ కుమార్, గుండు శ్రీను, పోలాటి దుర్గారాణి, పొనమోలు లక్ష్మీ, మహ్మద్‌హాజీ, వాసా పల్లపురాజు, గద్దె రమేష్ పాల్గొన్నారు.



కృష్ణలంక రైతుబజార్‌లో బియ్యం, కందిపప్పు ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రం ప్రారంభం

కృష్ణలంక రైతుబజారులో బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాన్ని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రారంభించి తక్కువ ధరలకు బియ్యం, కందిపప్పు ప్యాకెట్లను ప్రజలకు విక్రయించారు. కార్పొరేటర్ ప్రసాద్, టీడీపీ, జనసేన నాయకులు గోరిపర్తి నామేశ్వరరావు, వేములపల్లి రంగారావు, పి.అన్నారావు, తోట శ్రీను, పెద్ది అన్నారావు, నడికొప్పుల శివ, కేశనం భావన్నారాయణ, కొవ్వూరి కిరణ్ కుమార్, కొర్రా అప్పన్న పాల్గొన్నారు.

పటమట: పటమట రైతుబజార్‌లో కందిపప్పు, బియ్యం విక్రయ కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రారంభించారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, కోనేరు రాజేష్, పోతంశెట్టి నాగేశ్వరరావు, కొలసాని నాగమణి, గొల్లపూడి నాగేశ్వరరావు, గన్నె రవి, పి.సాంబశివరావులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి

వన్‌టౌన్, జూలై 12: 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు వార్డు పర్యటనలో భాగంగా శుక్రవారం శుభోదయం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికులు వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని కోరారు. స్థానికులు విన్నవించిన సమస్యలను ఆయన మునిసిపల్ కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించారు.

రోడ్ల పక్క వర్షంనీరు నిల్వకుండా చూడండి

ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ మహేష్

చిట్టినగర్, జూలై 12: రోడ్ల పక్క వర్షంనీరు నిల్వకుండా చూడాలని ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ ఏ.మహేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరంలో ప్రతి ఒక్కరూ నిర్దీత సమయంలో వీఎంసీ నుంచి వచ్చే తాగునీటిని పట్టుకొని వాడుకోవాలని సూచించారు. శుక్రవారం నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ మహేష్ పలువురు అధికారులతో కలసి పారిశుధ్య పనులతోపాటు మంచినీటిని పరిశీలించారు. సర్కిల్-2 బీర్టీఎస్ రోడ్డు, జింఖానా గ్రౌండ్, గాంధీనగర్, శారదా కళాశాల ప్రాంతం, సర్కిల్-3లో గురునానక్‌కాలనీ, బెంజ్‌సర్కిల్ ప్రాంతాల్లో పారిశుధ్యం, మంచినీటిని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పలు ప్రాంతాల్లో పొంగిపొర్లుతున్న అండర్‌గ్రౌండ్ డ్రెయినేజి సమస్యను గమనించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు.



పొంగుతున్న డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ మహేష్

నూతన విద్యావిధానంలో విస్తృత అవకాశాలు

- నాగాలాండ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యుడు దీపక్ సిన్హా

వన్‌టౌన్, జూలై 12: కేంద్ర ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానంలో విద్యార్థి విస్తృతమైన అవకాశాలను పొందవచ్చని నాగాలాండ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యుడు దీపక్ సిన్హా అన్నారు. కొత్తపేటలోని కేబీఎన్ కాలేజీ రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నూతన విధానంలో క్రెడిట్ ఫ్రేమ్ వర్క్ అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్తగా హాజరైన ఆచార్య దీపక్ సిన్హా మాట్లాడుతూ విజ్ఞానంతో పాటుగా ఉపాధి అవకాశాలను పెంపొందించే లక్ష్యంతో నూతన విద్యావిధానం కొనసాగుతుందన్నారు. అందులో క్రెడిట్ సిస్టమ్ ద్వారా విద్యార్థులు మరింత సాధన చేసేందుకు మెరుగుపరిచే అనేక అంశాలను ఆయన వివరించారు. పెన్‌స్టేట్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఆచార్యుడు అరుణ్ కే.శర్మ ఔషధ పరిశ్రమలో నూతన సవాళ్లు, అవకాశాలను వివరించారు. నూతన ఆవిష్కరణలపై విద్యార్థులతో ముచ్చటించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమాన్ని విభాగాధిపతి డాక్టర్ జి.కృష్ణవేణి నిర్వహించారు.



పేదలకు అన్నదానం

అజిత్‌సింగ్‌నగర్, జూలై 12 : కళ్లే లలిత జ్ఞాపకార్థం ప్రతి నెల 12వ తేదీన పేదలకు అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కళ్లే లలిత ట్రస్ట్ డైరక్టర్లు కళ్లే సీతామహాలక్ష్మి, కళ్లే జయదుర్గలు అన్నారు. సింగ్‌నగర్‌లోని కళ్లే లలిత వీధిలో శుక్రవారం పేదలకు అన్నదానం చేసి పండ్లు పంపిణీ చేశారు. ముప్పూరి హరీష్, ఎం. జశ్విన్, జి. ధ్రువన్, స్థానికులు ఆమెకు నివాళులు అర్పించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

భారతీనగర్, జూలై 12 : రింగ్‌రోడ్డు సెక్షన్‌లో పరిధిలోని విద్యుత్‌లైన్లు మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 10.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరి బాబు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనగర్ కాలనీ, నోవాటెల్ హోటల్ వెనుక రోడ్డు, సర్వీస్ రోడ్డు, సమోసా కంపెనీ ఏరియా, అక్కినేని ఉమెన్స్ హాస్పిటల్, చందమామ హాస్పిటల్ ఏరియా, న్యూ పీఅండ్‌టీ కాలనీ, విద్యుత్ కాలనీ, సాయిబాబా గుడి ఏరియా, ఎన్టీఆర్ సర్కిల్, భద్రయ్య నగర్, నిర్మలా కాన్వెంట్ రోడ్డు, కేపీ నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా పోలేరమ్మ తిరునాళ్ల ప్రారంభం



భవానీపురం, జూలై 12 : ఊర్మిళానగర్‌లో ఉన్న గ్రామదేవత పోలేరమ్మ తిరునాళ్ల శాస్త్రోక్తంగా శుక్రవారం ప్రారంభం అయ్యాయి. స్థానిక భక్తులు కుంకుమాభిషేకులు, ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు గంటి సన్యాసిరావు, కమిటీ అధ్యక్షుడు సూరసాని రామిరెడ్డిల పర్యవేక్షణలో భక్తులకు తీర్థప్రసాదాల వినియోగం జరిగింది. తిరునాళ్లలో ఈ నెల 14న ఆదివారం ప్రత్యేకంగా భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకుంటారు. సాయంత్రం పోలేరమ్మ ఊరేగింపు కన్నులపండుగగా సాగనుంది.



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

భవానీపురం, జూలై 12 : ప్రభుత్వం అధికారంలోకి రాగానే హామీలు అమలు చేసి చిత్తశుద్ధితో ముందుకు సాగడం హర్షణీయమని టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు లింగంపల్లి మోహన్‌రావు అన్నారు. జోజినగర్ చర్చిసెంటర్‌లో చంద్రబాబు చిత్రపటానికి టీడీపీ, కార్మికసంఘాల నాయకులతో శుక్రవారం పాలాభిషేకం చేశారు. టీడీపీ నాయకులు మోరబోయిన రాంబాబు, రమేష్, డివిజన్ టీడీపీ ఉపాధ్యక్షుడు ఏడుకొండలు, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, ఎల్.సీతారామయ్య, ఎన్.వెంకటేశ్వర రావు, ఆటో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థినికి ఆర్థిక చేయూత

పటమట, జూలై 12 : పటమటలంక కేఎస్ఆర్ జిల్లా పరిషత్ పాఠశాలలో గత సంవత్సరం పదో తరగతిలో 586 మార్కులు సాధించిన జుజ్జవరపు కృష్ణచైత్రకు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రావిపాటి పరంధామయ్య, విజయలక్ష్మి దంపతులు ప్రోత్సాహక నగదు బహుమతి రూ.30వేల చెక్కును శుక్రవారం పాఠశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు.



కృష్ణచైత్రకు చెక్కును అందిస్తున్న రావిపాటి పరంధామయ్య

ముగ్గురికి ఐఐటీ సీట్లు

పటమటలంక బాలికల హైస్కూల్‌లో చదివిన విద్యార్థినులు కృష్ణ చైత్ర, అనన్యలకు ఐఐటీ నూజివీడులో ప్రవేశం లభించిందని, ఇడుపులపాయ ఐఐటీలో ప్రసన్నకు ప్రవేశం లభించిందని ప్రదానోపాధ్యాయులు మురళీకృష్ణారెడ్డి తెలిపారు. విద్యార్థినులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

నేలకూలిన భారీవృక్షం

లబ్బీపేట, జూలై 12: పశువుల ఆసుపత్రి రోడ్డులో పోలీస్ క్వార్టర్స్ వద్ద భారీ వృక్షం శుక్రవారం మధ్యాహ్నం నేలకొరిగింది. ఇన్నాళ్లు అనేక మందికి నీడను ఇచ్చిన వృక్షం రోడ్డువైపు కాకుండా పోలీస్ క్వార్టర్స్ ప్రహరీ గోడపై పడడంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం కలగలేదు. ఇన్నాళ్లు నీడనిచ్చిన ఈ వృక్షం తను ఒరిగిపోతూ కూడా ఎవరికి ఇబ్బంది లేకుండా పక్కకు ఒరగడంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. దీనిని అధికారులు తొలగించాల్సి ఉంది. అధికారులు ఈ ప్రాంతంలో మరో చెట్టు నాటాలని, నగరంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రకృతి ప్రేమికులు, ప్రజలు కోరుతున్నారు.



హెల్మెట్‌ధారణ తప్పనిసరి

వన్‌టౌన్, జూలై 12 : రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు తమ ప్రాణాలను కాపాడుకు నేందుకు వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ సీఐ మహేంద్ర సూచించారు. బందరురోడ్డులోని డాక్టర్ నోరి రామశాస్త్రి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు అయన ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

వారాహి మాతగా కాళీమాత



కృష్ణలంక, జూలై 12 : వారాహి నవరాత్రుల సందర్భంగా ఏడవ రోజైన శుక్రవారం కాళీమాత వారాహి దేవతగా అవతరించారు. శుక్రవారం అమ్మవారికి హోమాలు, పండితులు వేదపారాయణ నిర్వహించారు. సాయంత్రం సువాసినుల చేత అమ్మవారికి వారాహి అష్టోత్తరం, సహస్ర నామం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జి.పుల్లయ్య, కొప్పురావూరి జగదీష్ కుమార్, ఆలయ ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్‌కిరణ్ శర్మ, సభ్యులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



మధురానగర్, జూలై 12: మధురా నగర్‌లో మంచినీటి కనెక్షన్ల కోసం తవ్విన గోతులు పూడ్చడంలో జరుగుతున్న ఆలస్యం వల్ల స్థానికులు భయపడుతున్నారు. డివిజన్‌లో ప్రతి ఇంటి ముందు ప్రధాన లైను నుంచి ఇంటి లోపలికి వెళ్లే కనెక్షన్లు ఇచ్చే పనులను కాంట్రాక్టర్‌లకు అప్పగించారు. వీరు గోతులు తవ్విన వెంటనే కనెక్షన్ ఇచ్చి పూడ్చడం లేదు. దీంతో పాదచారులు, ద్విచక్రవాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి వేళ పిల్లలు, సైకిళ్ల మీద ఇంటికి వచ్చే సమయంలో గోతులు కనబడక వాటిలో పడుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.




విజిలేస్కో...

తమిళ హీరో విజయ్ కథానాయకుడిగా వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ది గోట్' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్). శుక్రవారం చిత్ర బృందం తొలి పాటను విడుదల చేసింది. 'విజిలేస్కో' అంటూ సాగే ఈ మాస్ గీతానికి రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. యువన్ శంకర్ రాజా స్వరాలు సమకూర్చడంతో పాటు నకాష్ అజీజ్‌తో కలసి ఆలపించారు. ప్రశాంత్, ప్రభుదేవా, స్నేహ, లైలా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ బేనర్ నిర్మిస్తోంది. సినిమాటోగ్రఫీ: సిద్ధార్థ నుని.

ఆర్.సి 16లో శివన్న



రామ్‌చరణ్, జాన్వీ కపూర్ జంటగా రూపొందుతున్న ఆర్.సి. 16 చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ శుక్రవారం వచ్చింది. చిత్ర పరిశ్రమలో అందరూ ఆప్యాయంగా 'శివన్న' అని పిలుచుకునే శివ రాజ్‌కుమార్ ఇందులో నటిస్తున్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా సినిమాలో ఆయన లుక్‌ను విడుదల చేశారు. తెలుగు చిత్ర పరిశ్రమలోకి ఆహ్వానిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. 'ఉప్పెన' చిత్ర దర్శకుడు బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. సంగీత సంచలనం ఏ.ఆర్.రెహమాన్ ఈ సినిమాకు స్వరాలు అందిస్తున్నారు.



అప్పుడు సోలో.. ఇప్పుడు యుగళం

లవ్, రొమాంటిక్, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్.. ఈ జానర్లలో రూపుదిద్దుకునే చిత్రాలను ప్రేక్షకులకు దగ్గర చేసేవి వాటిల్లో పాటలే. సంగీతం ఇంత ముఖ్య పాత్ర పోషిస్తుంది కనుక పాటల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంటారు. ప్రియదర్శి, నభా నటేశ్ జంటగా నటిస్తున్న 'డార్లింగ్' చిత్రం నుంచి ఇప్పటి వరకూ రెండు పాటలు విడుదలయ్యాయి. ఇవి ప్రియదర్శి, నభా నటేశ్‌ల సోలో సాంగ్స్. ఇప్పుడు వీరిద్దరూ కలిపి పాడుకున్న లవ్ సాంగ్ 'నువ్ చెలియా' ను శుక్రవారం విడుదల చేశారు. కాసర్ల శ్యామ్ రాసిన ఈ పాటను అనురాగ్ కులకర్ణి పాడారు. వివేక్ సాగర్ సంగీత దర్శకుడు. ఈ నెల 19న విడుదల కానున్న ఈ చిత్రాన్ని అశ్విన్ రామ్ దర్శకత్వంలో కె.ని రంజన్‌రెడ్డి, శ్రీమతి చైతన్య నిర్మించారు.

మా అల్లుడని డబ్బులిచ్చి ఆదుకున్నాం



లావణ్య తల్లితండ్రులు


ప్రస్తుతం టాలీవుడ్‌లో నటుడు రాజ్‌తరుణ్, లావణ్య వ్యవహారం ఓ హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటివరకూ లావణ్య మాత్రమే మీడియాతో మాట్లాడారు. ఇప్పుడు ఆమె తల్లితండ్రులు కూడా మీడియా ముందుకు వచ్చి ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. చెప్పుకోలేని సంఘటనలు జరిగాయని కన్నీళ్లు పెట్టుకున్నారు. కరోనా సమయంలో రాజ్‌తరుణ్‌కి ఎవరూ సాయం చేయకపోయినా అతన్ని అల్లుడిగా భావించి డబ్బు సాయం చేసి ఆదుకున్నట్లు వారు చెప్పారు. 'మా అమ్మాయికి రాజ్‌తరుణ్ అన్యాయం చేశాడు. అతను ఎక్కడున్నా తీసుకువచ్చి వాళ్లిద్దరినీ కలిపేవరకూ వెనుకంజ వేయం' అని లావణ్య తండ్రి స్పష్టం చేశారు. లావణ్యకు డ్రగ్స్ తీసుకునే అలవాటు లేదనీ, అక్రమ సంబంధాలు ఉన్నాయనడం కట్టుకథ అనీ, ఓ ఆడపిల్ల మీద ఇలా నిందలు వేయడం తగదనీ ఆయన అన్నారు. తనకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయనీ, 'డ్రగ్స్ కేసులో నువ్వు బెయిల్ మీద బయటకు వచ్చావనీ, ఇలాంటి న్యూసెన్స్ చేస్తే బెయిల్ రద్దయి, ఇక జైలు నుంచి తిరిగి రాలేవని రాజ్‌తరుణ్, హీరోయిన్ మాల్వి బెదిరించారని లావణ్య చెప్పారు. రూ. ఐదు కోట్లు ఇచ్చి సెటిల్‌మెంట్ చేసుకుంటామని, కేసు వెనక్కి తీసుకోమని కూడా చెబుతున్నారని ఆమె వెల్లడించారు. 'నేను డ్రగ్స్ తీసుకుని ఉంటే రాజ్‌తరుణ్ కూడా తీసుకున్నట్లే. నేను వాటిని అమ్మితే .. అమ్మించింది అతనే. ఇందులో నిజం ఏవిటో పోలీసులే తేల్చాలి' అన్నారు లావణ్య. 'ఈ పోరాటం ఆపను. రాజ్ ఎక్కడ ఉంటే అక్కడికి వెళతాను. 14 ఏళ్ల పరిచయం, పదేళ్ల సహజీవనం ఎలా కాదంటాడో నేనూ చూస్తా' అని స్పష్టం చేశారు లావణ్య.

ప్రేమకథలు జీవితకాలం వెంటాడుతాయి



సంతోష్ శోభన్, సోషల్ మీడియాలో పాపులర్ అయిన అలేఖ్య హారిక జంటగా ఓ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఎస్.కె.ఎన్., దర్శకుడు సాయిరాజేశ్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రమిది. సుమన్ పాతూరి దర్శకుడు. హీరో సంతోష్ శోభన్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ కొత్త పోస్టర్ విడుదల చేశారు. ఇందులో ఉన్న 'ప్రేమకథలు జీవితకాలం వెంటాడుతాయి' అనే క్యాప్షన్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఆగస్టు నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమయ్యే ఈ చిత్రం మ్యూజిక్ సిట్టింగ్స్ సంగీత దర్శకుడు విజయ్ బుల్గానిన్ సారథ్యంలో ప్రస్తుతం జరుగుతున్నాయి.

అక్షయ్‌కుమార్‌కు కరోనా



చిత్ర ప్రముఖుల్ని కరోనా రక్కసి ఇంకా వదిలి పెట్టలేదు. తాజాగా బాలీవుడ్ నటుడు అక్షయ్‌కుమార్ ఈ రక్కసి చేతికి చిక్కారు. ప్రపంచ కుబేరుడు ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ వివాహానికి వెళ్లడం కోసం శుక్రవారం కొవిడ్ టెస్ట్ చేయించుకున్నారు. పాజిటివ్ రావడంతో పెళ్లికి వెళ్లడం మానుకుని ఇంటి గదికి పరిమితం అయ్యారు. తమిళంలో హిట్ అయిన సురారై పోట్రు' చిత్రం ఆధారంగా రూపొందిన 'సర్ఫిరా' చిత్రం శుక్రవారం విడుదల అయింది. ఈ సినిమా ప్రమోషన్స్ కోసం ఇటీవల చాలా చోట్లకు వెళ్లారు అక్షయ్. అప్పుడే ఆయనకు వైరస్ సోకి ఉంటుందని అంటున్నారు.

నా ఫ్లాపుల్ని ఎంజాయ్ చేస్తున్నారు

'సర్ఫిరా' ప్రమోషన్స్‌లో భాగంగా అక్షయ్ ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'నా ఫ్లాపుల్ని చూసి కొంతమంది ఎంజాయ్ చేస్తున్నారు. పరిశ్రమలో ఇలాంటి రాజకీయాలు బాధ కలిగిస్తున్నాయి' అని ఆవేదనతో చెప్పారు. ఏడాదికి నాలుగు సినిమాలు చేస్తూ, ఓవర్ ఎక్స్‌పోజ్ అవుతున్నాడంటూ వచ్చిన కామెంట్స్ ను ఆయన కొట్టి పడేశారు. 'నేను రెండేళ్లకు ఒక్క సినిమానే చేస్తా. అది హిట్ అవుతుందని ఎవరైనా గ్యారంటీ ఇవ్వగలరా?' అని అక్షయ్ ప్రశ్నించారు. 'వర్క్ చేస్తూనే ఉండాలి. నీ దగ్గరకు వచ్చిన అవకాశాల్ని పోగొట్టుకోకు. ఎవరి మాటా వినకు. నీ నటన ప్రేక్షకులకు నచ్చితే వాళ్లే నిన్ను నెత్తిన పెట్టుకుంటారు' అని అమితాబ్ చెప్పిన మాట పాటిస్తున్నా' అని చెప్పారు అక్షయ్.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/bmGd9pLలో చదవండి.

చిన్న సినిమా... వసూళ్లలో మిన్న

ఈ మధ్యకాలంలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన చాలా చిత్రాలు బాక్సాఫీసు దగ్గర వసూళ్ల సునామీ సృష్టించడం చూసిందే. రూ. 300 కోట్లు, రూ. 500 కోట్ల వసూళ్లు అనే మాట చాలా సామాన్యంగా వినిపిస్తోంది. కానీ అవన్నీ భారీ బడ్జెట్‌తో తెరకెక్కడం వల్లే వసూళ్లు కూడా ఖర్చుకు తగిన స్థాయిలో వచ్చాయి. కానీ పరిమిత బడ్జెట్‌తో, అది కూడా ఎలాంటి స్టార్స్ లేకుండా వచ్చిన కొన్ని బాలీవుడ్ సినిమాలు రూ. వంద కోట్ల వసూళ్లను సాధిస్తున్నాయి. అగ్రహీరోలు, దిగ్గజ దర్శకులు లేకున్నా ఆకట్టుకునే కథలతో ప్రేక్షకులను అలరిస్తూ, కాసుల వర్షం కురిపిస్తున్నాయి.

ఓ సినిమా కమర్షియల్‌గా హిట్టా, ఫట్టా అనేది చెప్పడానికి రూ. 100 కోట్ల వసూళ్లు అనేది ఇప్పుడు ఓ కొలబద్దగా మారింది. అయితే అగ్రతారలకు సైతం అన్నిసార్లు ఈ ఫీట్ సాధ్యం కావడం లేదు. భారీ హైప్‌తో వచ్చిన పాపులర్ హీరోల చిత్రాలు సైతం బాక్సాఫీసు దగ్గర రూ. వంద కోట్ల వసూళ్లను దాటలేక చతికిలపడుతున్నాయి. దీనికి భిన్నంగా ఎలాంటి స్టార్స్ లేకుండా, కంటెంట్‌ను మాత్రమే నమ్ముకొని వచ్చిన కొన్ని చిన్న సినిమాలు బాలీవుడ్‌లో అలవోకగా వందకోట్ల మార్క్‌ను అధిగమిస్తున్నాయి.





కోట్లు కొల్లగొట్టిన పిల్లదెయ్యం

బాలీవుడ్ తాజా సంచలనం 'ముంజ్యా' చిత్రం రూ. వంద కోట్ల క్లబ్‌లో చేరింది. హారర్ కామెడీ జానర్ సత్తా ఏంటో మరోసారి చూపింది. ఇందులో పేరున్న బాలీవుడ్ తారాగణం లేదు. శార్వరీ వాఘ్, అభయ్ వర్మ లాంటి చిన్న నటీనటులే. దర్శకుడు ఆదిత్య సర్పోదర్‌కు గతంలో భారీ హిట్లు ఇచ్చిన వ్యక్తి కాదు. అయినా 'ముంజ్యా' మాత్రం విడుదలైన రెండు వారాల్లోనే రూ. వంద కోట్ల క్లబ్‌లో చేరింది. రూ. 30 కోట్లతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 150 కోట్ల వసూళ్లను సాధించింది. ఈ ఏడాది అత్యధిక వసూళ్లు సాధించిన హిందీ చిత్రాల్లో ఐదో స్థానంలో నిలిచింది.

అగ్రతారలు లేకున్నా కాసుల వర్షం

సీనియర్ నటీమణులు కరీనాకపూర్, టబు... యువ కథానాయిక కృతీసనన్ ప్రధాన తారాగణంగా రూపొందిన హీరోయిన్ ఓరియంటెడ్ మూవీ 'క్రూ' సైతం అంచనాలు మించి వసూళ్లను అందుకొంది. ప్రచార చిత్రాలతోనే ప్రేక్షకుల్లో ఆసక్తి ఏర్పడడంతో దాదాపు 2500 స్క్రీన్లలో ఈ చిత్రాన్ని విడుదల చేశారు. ఈ కామెడీ థ్రిల్లర్ ప్రపంచవ్యాప్తంగా రూ. 150 కోట్ల వసూళ్లను సాధించింది. స్టార్ హీరోల రేంజ్‌లో ఈ చిత్రం వసూళ్లను సాధించడం ఇండస్ట్రీ వర్గాలను ఆశ్చర్యపరిచింది.


కంటెంట్‌తోనే కలెక్షన్లు

కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో రూపొందిన హిందీ చిత్రం 'ఆర్టికల్ 370'. ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదలైంది. రూ. 20 కోట్లతో తెరకెక్కిన ఈ చిత్రం రూ. 110 కోట్ల వసూళ్లను సాధించింది. కథానాయికగా ఇప్పటివరకూ పెద్ద విజయాలు దక్కని యామీ గౌతమ్ ఈ సినిమాలో లీడ్‌రోల్ పోషించగా, ప్రియమణి కీలకపాత్రలో నటించారు. వీరు తప్ప పేరున్న నటీనటులెవరూ ఈ చిత్రంలో లేరు. ఆర్టికల్ 370ని తొలగించే క్రమంలో ప్రభుత్వానికి ఎదురైన సవాళ్లు, లోయలో శాంతి భద్రతలను కాపాడేందుకు మిలిటరీ చేసిన ఆపరేషన్స్‌ను దర్శకుడు ఆదిత్య సుహాస్ ఆవిష్కరించిన తీరు ప్రేక్షకులను మెప్పించింది. ఫలితమే బాక్సాఫీసు దగ్గర మంచి మార్కులు కొట్టేసింది.

సక్సెస్ బాటలో చిన్న సినిమా

కరోనా ప్రభావానికి బలైన చిత్రపరిశ్రమల్లో బాలీవుడ్‌ది అగ్రస్థానం. అప్పటివరకూ వరుస హిట్లతో కళకళలాడిన పరిశ్రమ కాస్తా ప్రేక్షకులు థియేటర్లకు రాక వెలవెలబోయింది. వరుస అపజయాలతో అగ్రహీరోలు, నిర్మాతలకు ఏం పాలుపోని పరిస్థితి. ఇంకా ఇప్పటికీ బాలీవుడ్ మునుపటి జోరు చూపించలేకపోతోంది. అగ్రహీరోలతో రూ. వందల కోట్లు ఖర్చుపెట్టి సినిమాలు తీసిన కొన్ని పెద్ద నిర్మాణ సంస్థలు దివాళా అంచుకుచేరాయి. ఈ పరిస్థితి ఇలా కొనసాగుతుండగా కొత్త తరహా కంటెంట్‌తో వచ్చిన కొన్ని చిన్న చిత్రాలు బాక్సాఫీసును దునేస్తున్నాయి.





అయితే కొంతమంది విమర్శకులు ప్రాపగాండా చిత్రాలుగా పేర్కొన్న 'ది కేరళ స్టోరీ', 'ది కశ్మీర్ ఫైల్స్' చిత్రాలు ఆశ్చర్యపరిచే వసూళ్లను సాధించాయి. మత మార్పిడికి గురైన అమాయక యువతి చివరకు సరిహద్దులు దాటి ఉగ్రవాద సంస్థ ఐసిస్ చెరలో బంధీగా మారిన వైనాన్ని ఇందులో చూపించారు. అదాశర్మ ప్రధాన పాత్ర పోషించిన ఈ చిత్రంలో పేరున్న బాలీవుడ్ నటీనటులు లేరు. కథ కూడా పూర్తిగా కేరళ నేపథ్యంలో సాగుతుంది. దక్షిణాదిన ఈ సినిమాకు కమర్షియల్‌గా లాభించకపోయినా ఈ సినిమా హిందీ వెర్షన్‌ను ప్రేక్షకలోకం అమితంగా ఆదరించింది. అందుకే రూ. 20 కోట్లతో తెరకెక్కిన ఈ చిత్రం ఏకంగా రూ. 250 కోట్ల వసూళ్లతో బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. 2022లో వచ్చిన 'కశ్మీర్ ఫైల్స్' చిత్రం సైతం రికార్డులను తిరగరాసిందనే చెప్పాలి. ఒక డాక్యుమెంటరీలా సాగే కథనంతో తెరకెక్కిన ఈ సినిమా ఊహించని వసూళ్లను సాధించింది. తొలి రోజు 600 స్క్రీన్లలో విడుదల చేస్తే, వారం తిరగకుండానే నాలుగు వేల స్క్రీన్లకు పెంచాల్సి వచ్చింది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో రూ. 20 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన చిత్రం కాస్తా రూ. 300 కోట్ల వసూళ్ల మార్క్‌ను అధిగమించింది. బాలీవుడ్‌లో విక్కీ కౌశల్‌కు ఒక్కసారిగా స్టార్‌డమ్ సంపాదించిపెట్టిన చిత్రం 'యురి' కేవలం రూ. 25 కోట్ల వ్యయంతో తెరకెక్కింది. ఈ చిత్రం హిందీ బెల్ట్‌లోనే రూ. 250 కోట్ల వసూళ్లను రాబట్టింది. ప్రపంచవ్యాప్తంగా రూ. 350 కోట్ల వసూళ్లను రాబట్టింది. పలువురు అగ్రహీరోల చిత్రాలను పక్కకునెట్టి 2019లో అత్యధిక వసూళ్లు సాధించిన మూడో చిత్రంగా నిలిచింది.

నారింజ పానకం

సుపక్వా నారంగ ఫలం సుపీడితం సంయోజితం శర్కరయాతిశుభ్రయా
సహార్ధకం చెందూకర్ణేన వాసితం మహీతలె కేన న సంస్మృతం క్షణమ్!



శ్రీకృష్ణ దేవరాయలు 'ఆముక్తమాల్యద'లో 'వాణిజ్యము పెంచి యేలగానగున్' అన్నాడు. ఆనాటి రాజులు ఆ విధానాన్నే పాటించారు. పోర్చుగీసులతో వాణిజ్యంవల్ల మిరప, బొప్పాయి, జామ, సపోటా, కమలా, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, బంగాళదుంపలతో పాటు పొగాకు మనకు పరిచయం అయ్యాయి. 1606లో డచ్ వాళ్లు బతావియా నుంచి తెచ్చి పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో పండ్ల తోటలు వేయించారు. వాటి కాయల్ని 'బతావియా నారింజ' అని పిలిచారు. జన వ్యవహారంలో అవే 'బత్తాయి పండ్లు' అయ్యాయి. ఆఖరికి బాతులు, సీమకుక్క పిల్లలు కూడా విదేశీయుల నుంచే మనకు చేరాయి. కాఫీ కూడా డచ్చి వాళ్లవలనే మనకు తెలిసింది. మిరప, బొప్పాయి, బత్తాయి, పొగాకు, సపోటా, బాదం లాంటి కొత్త పదాలు తెలుగులో ఏర్పడ్డాయి.

అంతకు ముందు మనకు తెలిసింది నారింజ (నారంగి) మాత్రమే. నారంగిలోంచి 'నాఖ' శబ్దం లోపించి 'ఆరెంజ్' అనే కొత్త పదం ఆంగ్ల భాషలో చేరింది. పంపరపనస కూడా మన నారింజలాగానే ఉండే పుల్లని పండు (మాండారిన్). నారింజ పంపరపనస ఫలాల సంకరంగా కమలాపండు ఏర్పడింది. ఆయుర్వేద గ్రంథాలు నారంగ ఫలం గురించి మాత్రమే పేర్కొన్నాయి. నారంగ లేదా నారింజ గుణాలే ఇంచుమించుగా బత్తాయి, కమలాలకూ ఉన్నాయి. ఈ మూడింటిలోనూ అత్యంత శక్తిమంతమైనది నారింజే. కమలా గానీ, బత్తాయి గానీ పైమెరుగులతో మెరుస్తూ, గుజ్జు ఎక్కువగా, తోలు వదులుగా ఉన్నవి జన్యుపరమైన రూపాంతరాలు చేసినవి కావచ్చు. అవి ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తాయన్నది తెలియదు. చిన్నవిగా ఉన్న పండ్లనే ఎంచుకోవాలి.

నారంగఫల సంభూతం పానకం వాతనాశనమ్!

మధురం విశదం రుచ్యం సుస్నిగ్ధం పిత్తహృద్వరమ్!

నారింజ పండు రసంతో చేసిన ఈ పానకం వాత వ్యాధుల్లో చాలా మేలు చేస్తుంది. అకారణంగా వచ్చే నొప్పులు, మైగ్రేన్ తలనొప్పి, చర్మవ్యాధుల్లో మంచిది. వేడివల్ల కలిగే జలుబుల్ని తగ్గిస్తుంది. వేడిని పోగొట్టి శరీరానికి కూలెంట్ ప్రభావాన్నిస్తుంది. ఉద్రేకం తగ్గిస్తుంది. రక్తనాళాలను శుభ్రపరుస్తుంది. జీర్ణశక్తిని పెంచుతుంది. రుచిని కలిగిస్తుంది. తక్షణం శక్తిని, ఉత్సాహాన్ని ఇస్తుంది.



ఈ పండ్ల నుంచి రసం తీసి లోపలి గుజ్జుని పారేయటం మంచిది కాదు. తోలు వలిచాక బత్తాయి, కమలాలపై ఉండే తెల్లని పీచును కూడా అలా పారేయకండి. ఈ పీచులో పెప్టిన్, ఏడు శాతం ప్రొటీన్, తగినంత సి, బి విటమిన్లతో సమానమైన 'హెస్పెరిడిన్' ఉంది. 'సి విటమిన్' శరీరానికి వంటబట్టేలా ఈ హెస్పెరిడిన్ దోహదపడుతుంది. రక్తస్రావాన్ని అరికడుతుంది. కేరెట్లో ఉండే బీటాకెరొటీన్ దీంట్లోనూ ఉండటాన, కాషాయ రంగులో దీని గుజ్జు ఉంటుంది. ఇది కంటిచూపునకు మేలు చేస్తుంది. గుండెను బలసంపన్నం చేస్తుంది. ఇందులో ఫాస్ఫరస్, పొటాషియం, కాల్షియం కూడా చాలినంత ఉన్నాయి. తొనలుగా తింటే గుజ్జు, పీచు కూడా ఏకంగా కడుపులోకి వెడతాయి.

జ్వరం రాగానే అన్నం మానేసి ఈ ఫలాల్ని తింటే వెంటనే జ్వరం ఉపశమిస్తుంది. జ్వరానికి వేసుకున్న బిళ్లలు బాగా పని చేస్తాయి. కొంతమందికి ఇవి జలుబు చేస్తాయనే భయం. వ్యక్తిగతంగా ఈ పండు సరిపడని వారికి తప్ప, తక్కినవారందరికీ జలుబుని తగ్గించే గుణమే వీటికి ఉంది. రక్తనాళాలను శుభ్రపరుస్తుంది. అజీర్తిని పోగొట్టి ఆకలిని పెంచుతుంది. నోటికి రుచిని కలిగిస్తుంది. గుండెకి మంచిది. వేడిని తగ్గిస్తుంది. తక్షణ శక్తినిస్తుంది. అలసట పోగొడుతుంది. వాతాన్ని, ఉద్రేకాన్ని, కఫాన్ని తగ్గిస్తుంది.

షుగరు వ్యాధి ఉన్నవారు పంచదార కలపకుండా ఈ పానకం తాగవచ్చు. అల్లం బాగా ఫైబరుతో కూడినది కాబట్టి, ఈ రసం అంతగా షుగరుని పెంచదు. నారింజ లభించకపోతే... బత్తాయి, కమలాలు సంవత్సరం పొడవునా దొరుకుతున్నాయి. వీటిలో మీకు అందుబాటులో ఉన్న ఫలాన్ని రసం తీసి కమ్మని పానకం చేసుకుని తరచూ తాగుతూ ఉండండి. ఆరోగ్యానికి భరోసా ఇచ్చే పండ్లు ఈ నారింజ, బత్తాయి, కమలా.

నారింజ పండ్ల రసంతో పానకం చేసుకునే విధానాన్ని క్షేమశర్మ తన 'క్షేమ కుతూహలం' గ్రంథంలో వివరంగా పేర్కొన్నాడు:

- బాగా పండిన ఫలాన్ని ఎంచుకుని, మధ్యకు కోసి, చక్కగా రసాన్ని పిండాలి.
- ఈ రసంలో చాలినంత పంచదార కలపాలి. తగినంత అల్లం తీసుకొని, పొట్టు తీసి, మిక్సీ పట్టి, ముద్దగా చేయాలి. ఆ ముద్దని కూడా ఈ పండ్ల రసంలో కలపాలి.
- పరిమళం కోసం కొద్దిగా పచ్చకర్పూరం కలిపితే కమ్మని ఆరోగ్యదాయకమైన నారింజపండ్ల రసం తయారవుతుంది. బత్తాయితోనూ, కమలాలతో కూడా ఇదే పద్ధతిలో పానకం లేదా షర్బత్ చేసుకోవచ్చు.
- దీన్ని వేడి చేయటం, పాకం పట్టటం లాంటివి చేయకూడదు. అప్పటికప్పుడు కలుపుకోవటమే మంచిది.

• గంగరాజు అరుణాదేవి

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/69O24m1లో చదవండి.

అలలపై ఆమె సంతకం



పురుషుల ఆధిపత్యం కొనసాగే వాణిజ్య నౌకాయాన రంగంలో... తొలి భారతీయ మహిళా ఇటీఓ రొమీతా బుందేలా. ఈ ఘనత సాధించినా... ఆమె ప్రయాణం అంత సజావుగా సాగలేదు. అడుగడుగునా ఒడుదుడుకులనూ ఎదుర్కొన్నారు. అంకితభావంతో, నైపుణ్యంతో... విమర్శించిన వారితోనే 'భేష్' అనిపించుకొని... కెరీర్‌లో దూసుకెళ్తున్నారు.

"అది 2017 డిసెంబర్. ఒక మెర్స్క్ వాణిజ్య నౌకలో ఉద్యోగిగా నాకు మొదటి రోజు. నౌక మేనేజర్‌కు రిపోర్ట్ చెయ్యడానికి వెళ్లాను. అతను నావైపు చిరాగ్గా చూశారు. 'ఇక్కడ నువ్వేం చేస్తున్నావ్? ఇది నీకు ఉద్దేశించిన ఉద్యోగం కాదు. మనం ఇంకా పోర్టునుంచి బయల్దేరలేదు. నువ్వు ఓడ దిగిపో. ఇంటికి వెళ్ళు. వేరే ఉద్యోగం ఏదైనా చూసుకో' అన్నారు"అంటూ తనకు ఎదురైన అవహేళనను గుర్తు చేసుకున్నారు రొమీతా బుందేలా. మహారాష్ట్రలోని భుసావల్‌లో జన్మించిన ఆమెకు నౌకారంగంలో పని చెయ్యాలనేది చిన్ననాటి కోరిక. "9-5 ఉద్యోగం నా స్వభావానికి సరిపడదు. ప్రపంచమంతా తిరగడానికి వీలు కలిగించే ఉద్యోగాన్ని నేను కోరుకున్నాను. ఓడల్లో పని చెయ్యాలనుకున్నాను. దానికోసం ఎంత శ్రమించడానికైనా సిద్ధమయ్యాను" అంటున్న రొమీతా ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ తరువాత... షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌సిఐ)లో ఉద్యోగానికి అప్లై చేశారు. కానీ ఎంపిక కాలేదు. దాంతో వేరే మార్గాలు కోసం వెతికారు. పుణేలోని తొలానీ మెరిటైమ్ ఇనిస్టిట్యూట్‌లో ఎలక్ట్రో టెక్నికల్ ఆఫీసర్ (ఇటీఓ) కోర్సు ఉందనీ, వాణిజ్య నౌకల్లో పని చేసేందుకు ఆ అర్హత ఉపకరిస్తుందనీ తెలుసుకున్నారు. ఆ కోర్సులో చేరారు. ఆ బ్యాచ్‌లో ఆమె ఏకైక మహిళ, అంతేకాదు, ఆ సంస్థలో ఆ కోర్సు చేసిన మొదటి మహిళ కూడా. కాలేజీలో నాలుగు నెలల శిక్షణ తీసుకున్న తరువాత.. ఎనిమిది నెలలపాటు ఓడలో శిక్షణ ఉంటుంది. దాన్ని కూడా పూర్తి చేశారు.

అది గొప్ప కాంప్లిమెంట్..

"ఇటీవో హోదాతో ఉద్యోగంలో చేరిన ఒక వాణిజ్య నౌకలో మొదటి భారతీయ మహిళను నేనే. అయితే తొలిరోజే నాకు ఎగతాళి, అవమానాలు ఎదురయ్యాయి. నియామకం జరిగింది కాబట్టి... నన్ను తిరస్కరించడానికి కుదరలేదు. ఇరవై మంది పురుషుల మధ్య... సముద్రం మధ్యలో ఒకే ఒక మహిళగా నేను పని చెయ్యడానికి రకరకాల ఇబ్బందులు పడ్డాను. దానికి తోడు నా నైపుణ్యాన్నీ, నిబద్ధతను క్షణక్షణం అనుమానించారు. నా నైతిక స్థైర్యాన్ని దెబ్బతియ్యాలని చూశారు. నాలుగు నెలల ప్రయాణం ఎన్నో ఒడుదొడుకులతో సాగినా... చివరికొచ్చేసరికి నా పనితీరు చూసి అందరూ గౌరవించడం మొదలుపెట్టారు. ఆ ఓడలో మొదట నాకు నాలుగు నెలలు కాంట్రాక్ట్ ఇచ్చారు. ఏ మేనేజరైతే మహిళ ఈ పనికి పనికిరాదన్నారో... అతనే నన్ను మళ్ళీ రికమండ్ చేశారు. 'నీ పనితీరును చూడకుండానే... నిన్ను తప్పుగా అంచనా వేశాను' అన్నారు. అది నాకు గొప్ప కాంప్లిమెంట్" అంటారు రొమీతా. "ఇటీవో లేదా ఎలక్ట్రికల్ ఇంజనీర్‌కు ఎన్నో బాధ్యతలు ఉంటాయి. షిప్‌లోని ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్, ఆటోమేషన్, కంట్రోల్ సిస్టమ్స్... అన్నిటికీ మాదే బాధ్యత. సరుకులు లోపలికీ, బయటకు క్షేమంగా రాకపోకలు సాగించడానికి అవసరమైన వ్యవస్థలన్నిటినీ పర్యవేక్షిస్తూ ఉండాలి. ప్రతి ఎలక్ట్రిక్ వైరు లేదా కేబుల్ సరిగ్గా ఉందో లేదో ఎప్పటికప్పుడు చెక్ చేసుకుంటూ ఉండాలి. వాటితో పాటు డెక్ సేఫ్టీ పరికరాలు, లైటింగ్ సిస్టమ్, రిఫ్రిజిరేషన్, వెంటిలేషన్, పవర్... వీటన్నిటి మేనేజిమెంట్... ఇలా ఎన్నో బాధ్యతలు ఉంటాయి. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రమాదం తప్పదు" అని చెప్పారామె.

నరకం అనుభవించాం...

ఆ తరువాత ఆమె అనేక మర్చంట్ వెసెల్స్‌లో పని చేశారు. కరోనా సమయంలో చాలా ఇబ్బందులు పడ్డారు. చైనాలో తొమ్మిది నెలలకు పైగా సముద్రంలోనే ఉండిపోవాల్సి వచ్చింది. ఓడను వదిలి వెనక్కు రావాలనుకున్నా విమానాలు తిరగలేదు. ఎప్పుడూ మాస్కులు, పిపిఇ కిట్స్ ధరించి ఉండాల్సి వచ్చేది. "మేము మానసికంగా నరకం అనుభవించాం ఓడలో జీవితం కష్టంగా ఉంటుందనేది అందరికీ తెలిసిందే. కనీసం మూడు నాలుగు నెలలు కుటుంబానికి, స్నేహితులకు దూరంగా ఉండాలి.

మన కదలికలు ఒక ఓడ పరిధికే పరిమితం చేసుకోవడం అంత సులువేం కాదు" అని అన్నారు. రొమీతా. ఆమె తన సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు రుజువు చేసుకుంటూ... కేవలం నాలుగేళ్లలోనే... ఇటీఓ నుంచి సీనియర్ ఇటీఓగా, ఆ తరువాత ఎలక్ట్రిక్ సూపరింటెండెంట్‌గా... అంచెలంచెలుగా ఎదిగారు. "మెర్స్క్‌లో తొలి లేడీ సూపరింటెండెంట్‌ను నేనే. అలాగే తక్కువ వయసున్న వ్యక్తిని కూడా. అప్పుడు నాకు ఇరవయ్యారేళ్ళు. అప్పటికే నేను 64 ఓడల్ని హ్యాండిల్ చేశాను అని చెబుతున్న ఆమె కిందటి ఏడాది... 'కార్నివాల్ యూకే' సంస్థలో చేరారు. "మా ఊర్లో నేనెప్పుడూ సౌకర్యవంతమైన జీవితాన్ని దాటి బయటకు రాలేదు. ఇప్పుడు విభిన్నమైన, ప్రమాదకరమైన వాతావరణాల్లో... ప్రపంచాన్ని చుట్టేస్తున్నాను. ఎక్కడికక్కడ పురుషాధిక్యత ఎదురవుతూనే ఉంటుంది. కానీ నా సామర్థ్యంతోనే దాన్ని ఎదుర్కొంటున్నాను. నా అనుభవంతో... తోటి మహిళలకు, బాలికలకు చెప్పేది ఒక్కటే. "నువ్వు ఆడపిల్లవు, నువ్వేం చెయ్యగలవు?" అనే మాటలు మీకు నిత్యం వినిపిస్తూనే ఉంటాయి. వాటిని పట్టించుకోకండి. మీ లక్ష్యాన్ని నిర్దేశించుకోండి. కృషి చేసి దాన్ని సాధించండి. మీ కెరీర్ మీద దృష్టి పెట్టండి. పురుషులు చేసే వృత్తులన్నీ మనం చెయ్యగలం" అంటున్న రొమీలా... మరింతమంది మహిళలు ఈ కెరీర్ ఎంచుకోవడానికి తన కథ స్ఫూర్తినిస్తుందని ఆశిస్తున్నారు.

కంటేనే అమ్మ కాదని... అమ్మతనం అనేది గుండెల్లో నుంచి రావాలని అంటారు రక్షా జైన్. అందుకే ఏ తల్లి బిడ్డయినా తన బిడ్డగానే భావిస్తారు ఆమె. తల్లి పాలు దానం చేసి... వేలమంది పిల్లలకు అమ్మ అయ్యారు. పసిబిడ్డల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు కారణమై... 'యశోదమ్మ'గా ఎందరో తల్లులకు స్ఫూర్తిమంత్రమై నిలిచారు. 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లోనూ స్థానం సంపాదించారు.



నిలువెత్తు అమ్మతనం

"పుట్టిన బిడ్డకు తల్లి పాలు పట్టకపోతే అది వారి ఎదుగుదల మీద ప్రభావం చూపిస్తుంది. మార్కెట్‌లో ఎన్ని ఉత్పత్తులున్నా... అవేవీ తల్లి పాలకు సరితూగవు. అందుకే నా వంతు బాధ్యతగా తల్లి పాలు దానం చేస్తున్నాను. దీనివల్ల ఎంతోమంది పసిపిల్లల ఆరోగ్యవంతమైన బాల్యానికి నేను కూడా ఒక కారణం అవుతాను కదా. ఒక తల్లిగా దీనికి మించిన సంతృప్తి ఏముంటుంది! ఈ ఆలోచనతోనే మరికొన్ని సంఘాలతో కలిసి 'లైఫ్ వెల్ఫేర్ సొసైటీ పింక్ స్క్వాడ్' నెలకొల్పాను. వివిధ కారణాలవల్ల మా సొసైటీలో సభ్యత్వం తీసుకోవడానికి ఆరంభంలో మహిళలు ఎవరూ ముందుకు రాలేదు. ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించడంవల్ల ప్రస్తుతం ఇరవైమంది సభ్యులు ఉన్నారు. రాజస్తాన్‌లోని బిల్వాడా నగరం మాది. వృత్తిరీత్యా నేను ఎలక్ట్రోథెరపిస్టను. ఇద్దరు పిల్లల తల్లిని.

అప్పుడే అనుకున్నా...

ఆరేళ్ల కిందట మా అబ్బాయికి జన్మనిచ్చాను. అదే నా తొలి కాన్పు. మూడు రోజులపాటు వాడికి పాలు ఇవ్వలేకపోయాను. ఆ సమయంలో ఎంతో వేదనకు లోనయ్యాను. మా కుటుంబం కూడా తీవ్ర ఆందోళన చెందింది. దాంతో మహాత్మాగాంధీ ఆసుపత్రిలోని 'ఆంచల్ మదర్ మిల్క్ బ్యాంక్'ను సంప్రతించాను. అక్కడి నుంచి తెచ్చిన వేరొక తల్లి పాలు నా బిడ్డను కాపాడాయి. ఆ క్షణమే భగవంతుడిని వేడుకున్నా... 'తల్లి పాలు దానం చేసే అదృష్టం నాకు కూడా కల్పించ'మని. నా ప్రార్థనలు ఫలించాయి. కొన్నాళ్లకే నా బిడ్డకు నేను పాలు ఇవ్వగలిగాను. అంతేకాదు... మిగిలిన పాలు వ్యర్థం కాకుండా 'ఆంచల్ మదర్ మిల్క్ బ్యాంక్'కు ఇస్తూ వచ్చాను.

వద్దని వారించినా...

అయితే ఆరంభంలో అందరూ నన్ను వద్దని వారించారు. అలా ఇస్తూపోతే నా ఆరోగ్యం దెబ్బతింటుందని హెచ్చరించారు. నేను వినలేదు. తల్లిపాల దానం వినడానికి చాలా గొప్పగా అనిపిస్తుంది. కానీ దానివల్ల ఎంతో నొప్పిని భరించాల్సి వస్తుంది. అలాగని వెనకడుగు వేయలేదు. వేరొక తల్లి పాలు నా బిడ్డను కాపాడినప్పుడు... నేనెందుకు ఆ పని చేయకూడదని అనుకున్నాను. అవసరంలో ఉన్న పసి పిల్లల ఆకలి తీర్చడంలో ఎనలేని ఆనందం ఉంటుంది. అది వెల కట్టలేనిది. అందుకే మా అబ్బాయి పుట్టిన మూడో రోజు నుంచీ మిగిలిన పాలను మిల్క్ బ్యాంక్‌కు డొనేట్ చేస్తున్నాను.

కన్న కూతురులా...

తొలి కాన్పు సమయంలో మండల్‌లోని మా అత్తవారింట్లో ఉండేదాన్ని. అక్కడి నుంచి రోజూ బిల్వాడాలోని మిల్క్ బ్యాంక్‌కు ట్యాక్సీలో వెళ్లేదాన్ని. రానూ పోనూ రూ.700 ఖర్చయ్యేది. అలా నెల రోజులు తిరిగాను. ఖర్చు మరీ ఎక్కువైపోవడంతో మా అబ్బాయిని నడుముకు కట్టుకుని, స్కూటీ మీద తిరిగాను. జోరు వానల్లో సైతం వెళ్లి వచ్చిన సందర్భాలు అనేకం. నా జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేని ఘటన ఒకటి ఐదేళ్ల కిందట జరిగింది. మహాత్మాగాంధీ ఆసుపత్రికి వెళ్లినప్పుడు అక్కడి సిబ్బంది అప్పుడే పుట్టిన పాపను నా దగ్గరికి తెచ్చారు. పాపకు జన్మనిచ్చి తల్లి పురుట్లోనే చనిపోయిందని, నా పాలు ఆ చిన్నారికి పట్టామని చెప్పారు. నా కళ్లు చమర్చాయి. పసిపాపను నా చేతుల్లోకి తీసుకున్నప్పుడు తెలియని ఉద్వేగం. తను నా కూతురేనన్న అనుభూతి కలిగింది. రక్తదానం జీవితంలో ఎప్పుడైనా చేయవచ్చు. కానీ తల్లి పాలు దానం చేసే అవకాశం అరుదుగా లభిస్తుంది.

మరింతమందిని ప్రోత్సహిస్తూ...

నన్ను చూసి మా బిల్వాడాలో అనేకమంది తల్లులు స్ఫూర్తి పొందుతున్నారు. వివిధ ప్రాంతాలకు వెళుతూ ఈ దిశగా మహిళలనే కాదు మగవారిని కూడా ప్రోత్సహిస్తున్నాను. ఎందుకంటే దీనికి కుటుంబ మద్దతు చాలా అవసరం. ఆ విషయంలో నేను అదృష్టవంతురాలిని. మావారు సునీల్, అమ్మ శారదాదేవి, సోదరుడు రాహుల్ సోనీ నా ఈ ప్రయాణంలో కీలక పాత్ర పోషించారు. మిల్క్ బ్యాంక్‌లకు వెళ్లాల్సి వచ్చినప్పుడు రాహుల్ నన్ను తీసుకువెళతాడు. నేను బయటకు వెళితే అమ్మ ఇల్లు, పిల్లల్ని చూసుకొంటుంది. తల్లి పాలు దానం చేయడానికి ఎవరూ సంకోచించక్కర్లేదు. ఆరోగ్య సమస్యలు వస్తాయని భయం అక్కర్లేదు. ఇన్నిసార్లు డొనేట్ చేసినా నేను పూర్తి ఆరోగ్యంగా ఉన్నాను. నా పేరు 'ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లోకి ఎక్కింది. స్థానికులు నన్ను ఆప్యాయంగా 'యశోదమ్మ' అంటుంటారు. ఏదిఏమైనా... ఇప్పటివరకు నావల్ల ఐదు వేలమంది పసిబిడ్డలకు లబ్ధి చేకూరింది. వారి మోముపై మెరిసే చిరునవ్వుకు నేను కూడా ఒక కారణమని తెలిసినప్పుడు... నా మనసు ఉప్పొంగుతుంది." •

ఒక సంకల్పంతో...

గత ఏడాది నాకు రెండో సంతానం కలిగింది. కాన్పు తరువాత ఆసుపత్రి నుంచి బయటకు రాగానే పాలు దానం ఇవ్వడం ప్రారంభించాను. అలా దాదాపు పది నెలలు ఇచ్చాను. శారీరకంగా ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. కానీ నా సంకల్పానికి అవేవీ అవరోధం కాలేదు. అవసరంలో అండగా నిలవడమే కదా మానవత్వం. కన్న బిడ్డకు పాలు ఇవ్వలేక ఎంతోమంది తల్లులు వేదన అనుభవిస్తున్నారు. అలాంటివారికి నేను మనోధైర్యం కల్పిస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఇప్పటికి 160 లీటర్ల పాలు దానం చేశాను. రాజస్తాన్‌లోనే కాదు... బహుశా దేశంలోనే ఇంత మొత్తంలో తల్లి పాలు డొనేట్ చేసింది నేనే కావచ్చు. మా ప్రాంతానికే పరిమితం కాకుండా పక్క జిల్లాలకు కూడా వెళ్లి వచ్చాను.





వంటిల్లు

కూరగాయల్లో పీచుపదార్థంతో పాటు విటమిన్లు, మినరల్స్, న్యూట్రిన్లు పుష్కలం. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. పలురకాల కూరగాయలతో వండుకునే ఈ మిక్స్‌డ్ వెజిటెబుల్ ఫుడ్‌ను ఇంట్లోనే చేసుకోండిలా..

కూరగాయల్ని మిక్స్ చేసి వండితే..

మిక్స్ వెజిటెబుల్ సబ్జి

కావాల్సిన పదార్థాలు: నూనె- 4 టేబుల్ స్పూన్లు, వెల్లుల్లి రెబ్బలు-6, పచ్చి మిర్చి-2, అల్లం ముక్కలు- 2 (చిన్నవి), ఎండుమిర్చి- 3, ఉల్లిపాయలు-2 (ముక్కలుగా తరగాలి), టమోటాలు-3 (ముక్కలుగా తరగాలి), జీడిపప్పులు- 10, పనీర్ క్యూబ్స్- 100 గ్రాములు, మీడియం సైజ్ బంగాళ దుంప- 1 (ముక్కలుగా కట్ చేయాలి), క్యారెట్-1 (ముక్కలుగా తరగాలి), బీన్స్- 8 (ముక్కలుగా తరగాలి), కాలిఫ్లవర్ ముక్కలు- 10, క్యాప్సికం ముక్కలు- 6, నానబెట్టిన పచ్చి బఠాణీలు- టేబుల్ స్పూన్, జీలకర్ర- టీస్పూన్, పసుపు- కొద్దిగా, కసూరీ మేతీ- అర టీస్పూన్, కారం పొడి- అరటీస్పూన్, జీలకర్ర పొడి- అరటీస్పూన్, ధనియాల పొడి- అర టీస్పూన్, గరం మసాలా- అర టీస్పూన్, కొత్తిమీర- టీస్పూన్, పెరుగు- రెండు టేబుల్ స్పూన్లు

తయారీ విధానం: మూకుడులో రెండు టేబుల్ స్పూన్ల నూనె వేయాలి. కాస్త వేడయ్యాక వెల్లుల్లి రెబ్బలు, అల్లం ముక్కలు, పచ్చిమిర్చి వేసిన తర్వాత గరిటెతో కదపాలి. ఆ తర్వాత ఎండుమిర్చి, ఉల్లిపాయ ముక్కలు వేసి కలపాలి. ఉల్లిపాయల రంగు మారిన తర్వాత టమోటా ముక్కలు వేసి మూడు నిముషాల పాటు కలిపాక జీడిపప్పు వేయాలి. మూకుడుపై మూత ఉంచి ఆరు నిముషాల పాటు లోఫ్లేమ్‌లో కుక్ చేయాలి. మూకుడులోని కూరగాయలు మగ్గుతాయి. గరిటెతో కదిపిన తర్వాత ప్లేట్‌లోకి తీసి చల్లబర్చిన తర్వాత రెండు స్పూన్ల నీళ్లు పోసి మిక్సీ పట్టాలి. మెత్తటి పేస్ట్‌లా వస్తుంది. ఇప్పుడు మరో ప్యాన్ తీసుకుని టేబుల్ స్పూన్ నూనె వేసి పనీర్ ముక్కలు వేయాలి. రెండు మూడు నిముషాల పాటు వీటిని వేయిస్తే రంగు మారుతుంది. దీన్ని ప్లేట్‌లో వేసి పక్కన ఉంచుకోవాలి. అదే ప్యాన్‌లో బంగాళ దుంప ముక్కలు, క్యారెట్ ముక్కలు, బీన్స్, కాలిఫ్లవర్ ముక్కలు వేసి మూడు నిముషాల పాటు కుక్ చేయాలి. క్యాప్సికం ముక్కలు, పచ్చి బఠాణీలు వేశాక తగినంత ఉప్పు వేసి కలపాలి. మూడు నిముషాల పాటు కుక్ చేసిన తర్వాత ఈ కూరగాయముక్కల మిశ్రమాన్ని పక్కన ఉంచుకోవాలి. అదే ప్యాన్‌లో టేబుల్ స్పూన్ నూనె వేసి జీలకర్ర, పసుపు, కారం, కసూరీ మేతీ వేసి లోఫ్లేమ్‌లో కలపాలి. ఆ తర్వాత మిక్సీ పట్టిన పేస్ట్ వేయాలి. మీడియం ఫ్లేమ్‌లో నాలుగు నిముషాల పాటు కదుపుతూ కుక్ చేయాలి. అవసరం అనుకుంటే కొద్దిగా నీళ్లు పోయాలి. వేయించుకున్న వెజిటేబుల్స్ ముక్కలు వేయాలి. జీలకర్ర పొడి వేసి కొద్దిగా అవసరం అనుకుంటే కారం, ఉప్పు సరి చూసుకుని తగినంత ఉప్పు వేసుకోవాలి. ధనియాల పొడి వేసిన తర్వాత మూత ఉంచి నాలుగు నిముషాల పాటు కుక్ చేయాలి. చివరగా వేయించిన పనీర్ ముక్కలు వేసి రెండు నిముషాల పాటు ఉడికించాలి. చివరగా గరం మసాలా వేసి కలిపిన తర్వాత పెరుగు వేసి నిముషం పాటు కలిపాక.. కొత్తిమీరతో గార్నిష్ చేసుకోవాలి. ఈ కర్రీని చపాతీలోకి రుచిగా ఉంటుంది.

వెజిటెబుల్ కట్‌లెట్

కావాల్సిన పదార్థాలు: నూనె- 2 టేబుల్ స్పూన్లు, జీలకర్ర- అర టీస్పూన్, ఉల్లిపాయ-1 (సన్నగా తరగాలి), ఉప్పు- తగినంత, తరిగిన అల్లం ముక్కలు- అర టీస్పూన్, పచ్చిమిర్చి-1 (సన్నగా తరగాలి), క్యాబేజీ- 1 కప్పు, క్యారెట్- 1 (తురమాలి), తరిగిన కాలిఫ్లవర్- అరకప్పు, తరిగిన క్యాప్సికమ్ ముక్కలు- పావు కప్పు, పసుపు- చిటికెడు, కారంపొడి-అర టీస్పూన్, ధనియాల పొడి- అర టీస్పూన్, పావు బజ్జీ మసాలా- అరటీస్పూన్, పెప్పర్ పౌడర్- అరటీస్పూన్, పెద్ద బంగాళదుంప- 1, కొత్తిమీర- టేబుల్ స్పూన్, బ్రెడ్ -2 పీస్‌లు,

తయారీ విధానం: బంగాళదుంపను ఉడికించి మెత్తగా మ్యాష్ చేసుకుని పెట్టుకోవాలి. ప్యాన్‌లో నూనె వేసి.. కాస్త వేడయ్యాక జీలకర్ర, తరిగిన ఉల్లిపాయలు, తగినంత ఉప్పు వేసి కలపాలి. అల్లం, పచ్చిమిర్చి ముక్కలు వేసి కలపాలి. నిముషం తర్వాత ఉల్లిపాయ ముక్కల రంగు మారుతుంది. వెంటనే క్యాబేజ్ ముక్కలు, తురిమిన క్యారెట్, క్యాప్సికమ్, కాలిఫ్లవర్ మిశ్రమాన్ని వేయాలి. నిముషం పాటు కలిపాక పసుపు, కారంపొడి, ధనియాల పొడి, పావుబజ్జీ మసాలా, పెప్పర్ పౌడర్ వేసి కలపాలి.



ప్యాన్‌మీద మూత ఉంచి లోఫ్లేమ్‌లో రెండు నిముషాల పాటు కుక్ చేయాలి. ఆ తర్వాత ప్యాన్‌పై మూత తీసి గరిటెతో కలిపాక.. బంగాళదుంప మిశ్రమం వేసి కలపాలి. కూరగాయల మిశ్రమం మెత్తగా అవుతుంది. స్టవ్ ఆఫ్ చేసి ఈ మిశ్రమాన్ని ప్లేట్‌లో వేసుకుని పక్కన ఉంచుకోవాలి.

బ్రెడ్ పీస్‌లను ముక్కలుగా చేసి పొడి పొడిగా మిక్సీ పట్టాలి. ఈ బ్రెడ్ ముక్కల పొడితో పాటు కొత్తిమీరను వెజిటెబుల్ మిశ్రమంలో వేసి కలపాలి. దీన్ని వడల్లా ఒత్తుకోవాలి. చదునైన ప్యాన్‌లో టేబుల్ స్పూన్ నూనె వేసి ప్యాన్ అంతా తిప్పిన తర్వాత ఈ కట్‌లెట్‌ను ఉంచి.. రెండువైపులా కాల్చుకోవాలి. ఈ వెజిటెబుల్ కట్‌లెట్స్‌ను టమోటా కెచప్‌తో తింటే రుచిగా ఉంటాయి. •

వంటనూనెను తిరిగి వాడచ్చా?

వంటనూనె లేని వంటిల్లు ఉండదు. కానీ వంటనూనెను ఎలా వాడుకోవాలో ఎవరికీ తెలియదు. ఒక సారి వేడి చేసిన నూనెను మళ్లీ వాడచ్చా? దానిని ఎలా భద్రపరచుకోవాలి? అనే విషయాలను తెలుసుకుందాం.

ఎలాంటి నూనెలు వాడుతున్నాం? ఎంత వేడిలో నూనెను కాచాం? నూనెను ఎలా భద్రపరిచాం? అనే విషయాలపై ఆధారపడి ఉంటుంది. కొన్ని నూనెలకు ఎక్కువ స్మోక్ పాయింట్ (ఎక్కువ వేడిని తట్టుకొని నిలబడే శక్తి) ఉంటుంది. ఉదాహరణకు కనోలా, వేరుశనగనూనె, సన్‌ఫ్లవర్ వంటి నూనెలను ఎక్కువ ఉష్ణోగ్రతల వరకు వేడి చేయవచ్చు. ఆలీవ్ ఆయిల్ వంటి నూనెలు వేడిని తట్టుకొని నిలబడలేవు. వీటిని ఎక్కువగా వేడి చేస్తే చెడు వాసన వస్తుంది. అదే విధంగా కొన్ని నూనెలను పదే పదే వేడి చేస్తే- వాటి కణ నిర్మాణంలో మార్పు వచ్చి వాటి ద్వారా ఆరోగ్యానికి చెడు చేసే రసాయనాలు విడుదలవుతాయి. ఇలాంటి వాటిని పదే పదే వాడకూడదు. ఒక సారి వాడిన తర్వాత- నూనెలో పేరుకుపోయిన చిన్న చిన్న కణాలను తొలగించి ఒక గాజు లేదా స్టీలు డబ్బాలో నిల్వ చేసుకుంటే మంచిది. ఇలా నిల్వ చేసుకున్న నూనెను మళ్లీ వాడినప్పుడు అది నల్లగా అయిపోతే వాడకుండా బయట పారబోయటం మంచిది. •



తప్పుడు పత్రాలతో ఐఏఎస్?

» పూజా ఖేద్కర్‌పై తీవ్ర ఆరోపణలు..

» రుజువైతే సర్వీస్ నుంచి అవుట్



న్యూఢిల్లీ, జూలై 12: ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ వరుస వివాదాల్లో కూరుకుపోతున్నారు. అఖిల భారత సర్వీసుకు ఎంపికయ్యేందుకు దివ్యాంగ, ఓబీసీ కోటాను ఆమె దుర్వినియోగం చేశారని తాజాగా ఆరోపణలు వచ్చాయి. ఆమె తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించినట్టు ఆరోపణలు రావడంతో విచారణ చేసేందుకు కేంద్రం ఓ కమిటీని నియమించింది. ప్రొబేషనరీ టైమ్‌లో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొన్న పూజను మహారాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసిన సంగతి తెలిసిందే. 2023 బ్యాచ్‌కు చెందిన ఆమె యూపీఎస్సీ పరీక్షలో 841 ర్యాంక్ సాధించారు. ఆమె ఓబీసీ నాన్ క్రిమిలేయర్ కోటాలో ఐఏఎస్‌కు ఎంపికైనట్టు ఓ సీనియర్ అధికారి వెల్లడించారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.8 లక్షలు ఉన్నట్టు పేర్కొన్నారని తెలిపారు. అయితే శిక్షణ పొందేందుకు లాల్ బహదూర్ శాస్త్రి అకాడమీలో జాయిన్ అయ్యాక సమర్పించిన ఆస్తుల ధ్రువీకరణ పత్రంలో రూ.22 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నట్టు పేర్కొన్నారని వెల్లడించారు. ఓబీసీ నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్, ఆస్తుల ధ్రువీకరణ పత్రంలో పూజ పేర్కొన్న వివరాల్లో పొంతన లేదని.. ఈ విషయం యూపీఎస్సీ, సిబ్బంది శిక్షణ విభాగం పరిశీలనలో ఉందని పలువురు ఐఏఎస్ అధికారులు తెలిపారు. తాజా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన పూజ తండ్రి దిలీప్ కొండిబా ఖేద్కర్ అఫిడవిట్‌లో తనకు 40 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్టు పేర్కొన్న విషయం వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో పూజ తప్పుడు పత్రాలు సమర్పించి ఐఏఎస్‌కు ఎంపికైనట్టు రుజువైతే ఆమెను సర్వీసు నుంచి తొలగించడంతో పాటు క్రిమినల్ చర్యలు తీసుకోవచ్చని అధికార వర్గాలు తెలిపాయి.

ఢిల్లీలో జనమే జనం!

» ప్రపంచంలోనే అత్యధిక జనసమ్మర్ధ నగరాల్లో రెండోది

న్యూఢిల్లీ, జూలై 12: ప్రపంచ జనాభా శరవేగంగా పెరుగుతోంది. నగరాలు, పట్టణాల్లో ఈ పెరుగుదల మరింత వేగంగా ఉంది. ఉద్యోగావకాశాలు, వలసల కారణంగా ప్రజలు నగరాలకు తరలివచ్చి స్థిరపడుతున్నారు. ఐక్యరాజ్యసమితికి చెందిన వరల్డ్ అర్బనైజేషన్ ప్రాస్పెక్ట్ తాజా నివేదిక ప్రకారం.. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన నగరాల జాబితాలో మన దేశ రాజధాని ఢిల్లీ రెండో స్థానంలో నిలిచింది. ప్రస్తుతం 3.3కోట్ల మంది ఢిల్లీలో నివాసం ఉంటున్నారు. ప్రపంచంలో టాప్-10 అత్యంత జనసమ్మర్ధ నగరాల జాబితాలో భారత్ నుంచి ఢిల్లీ, ముంబై(9వ స్థానం) చోటు దక్కించుకున్నాయి. హైదరాబాద్ 34వ స్థానంలో ఉంది. 2028 నాటికి ఢిల్లీ ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక జనాభా కలిగిన నగరంగా అవతరించనుందని నివేదిక అంచనా వేసింది. కాగా 3.7 కోట్ల మంది జనాభాతో టోక్యో ఈ జాబితాలో టాప్‌లో నిలిచింది. ఈ నివేదిక ప్రకారం.. 2062 నాటికి భారత్ జనాభా 170 కోట్లకు చేరనుంది. 2050 నాటికి ప్రతి ముగ్గురిలో ఇద్దరు నగరాలు లేదా పట్టణ కేంద్రాల్లో నివసించే అవకాశం ఉంది.

లోకం తీరు



టైటిల్ చట్టం 'నీతి' తప్పెన్!

(మొదటి పేజీ తరువాయి)

కోరుతున్నాయి. శుక్రవారం చంద్రబాబు వద్ద జరిగిన సన్నాహక సమావేశంలో ఇదే అంశంపై చర్చ జరిగింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్, సీసీఎల్ఏ, జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా, గనుల శాఖ కార్యదర్శి యువరాజ్, ఇతర అధికారులు పాల్గొన్నారు. టైటిల్ చట్టం, భూములు తదితర అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా భూముల అంశంపై ప్రజెంటేషన్ ఇచ్చినట్లు తెలిసింది. నీతి అయోగ్ చెప్పిన అంశాలకు భిన్నంగా చట్టాన్ని రూపొందించారు. ఈ చట్టం అమలయితే ప్రజల ఆస్తులను వైసీపీ నేతలు దోచుకోవడం ఖాయం. టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారులను ప్రభుత్వం నియమించినా వారు వైసీపీ నేతల నియంత్రణలో పని చేసే అవకాశం ఉంటుంది. సివిల్ కోర్టుల ప్రమేయాన్ని తొలగించారు. టైటిల్ చట్టం అమలు కోసం భూముల సర్వే చేపట్టారు. జగన్ ఫొటోలతో కూడిన పాస్‌బుక్‌లు 21.75 లక్షల మేర రైతులకు పంపిణీ చేశారు. జగన్ ఫొటోలున్న 74.6 లక్షల సర్వే రాళ్లను గ్రామాలకు పంపించారు. సర్వే సందర్భంగా అధికారులపై చాలా ఒత్తిడి తీసుకొచ్చారు. ఫలితంగా భూముల సర్వే ఫైనల్ రికార్డుల్లో భారీగా తప్పులు వచ్చాయి. ఆతప్పులను సరిదిద్దాలి.

వైసీపీకి 300 కోట్ల భూములు

రాష్ట్రవ్యాప్తంగా వైసీపీకి ఆఫీసు భవనాల నిర్మాణం కోసం 300 కోట్ల విలువైన 40.78 ఎకరాల భూమిని ఉచితంగా కేటాయించారు. ఎలాంటి అనుమతులు లేకుండానే పార్టీ ఆఫీసుల నిర్మాణం చేపట్టారు. ఇళ్ల పట్టాల పంపిణీలో పేదల సంక్షేమం పేరిట వైసీపీ నేతలు లబ్ధిపొందారు. జగన్ సర్కారు చెబుతున్న 30 లక్షల పట్టాల్లో పేదలకు ఇచ్చింది 19 లక్షలే. అందులోనూ సౌకర్యంగా లేని భూములను ఇళ్ల స్థలాల కోసం కేటాయించారు. నిషేధ జాబితాలో ఉన్న భూములను కూడా కేటాయించారు. మార్కెట్ ధరపైన ఒకటిన్నర రెట్ల పరిహారం చెల్లించి వైసీపీ నేతలకు మేలు చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో 361.05 ఎకరాల ఆవభూమికి 162.49 కోట్లు చెల్లించారు. కాకినాడ వైసీపీ నేతలు 101.16 ఎకరాల మడ అడవులను భూసేకరణ కింద చూపారు. అసైన్డ్ భూములపై శాశ్వత హక్కులు కల్పించే నిర్ణయాన్ని వైసీపీ నేతలు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. అసైన్డ్ భూములను ముందుగానే వైసీపీ నేతలు తీసుకున్నారు. కానీ ఆ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే శాశ్వత హక్కులు కట్టబెట్టారు. జీపీఏ ద్వారా వైసీపీ నేతలు కారుచౌకగా అసైన్డ్ భూములు కొన్నారు. ఆ తర్వాత ఆ భూములను 22(ఏ) నుంచి తొలగించి వైసీపీ నేతలు తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం రాగానిపల్లె గ్రామంలో 973 ఎకరాల భూమికి ఇనాం పట్టా ఇచ్చారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఆయన అనుచరులు ఈ భూమిని తీసుకున్నారని ఆరోపణలు, ఫిర్యాదులు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా పట్టా ఇచ్చారని రెవెన్యూ శాఖ సీఎంకు నివేదించింది. ఎస్టేట్ అబాలిషన్ యాక్ట్-1948కి విరుద్ధంగా పట్టా ఇచ్చారని తేల్చింది.

తిరుపతిలో 22(ఏ) నుంచి విముక్తి

తిరుపతి జిల్లా పరిధిలో అత్యంత విలువైన భూములను నిబంధనలకు విరుద్ధంగా 22(ఏ) నుంచి తొలగించారని, ఆ భూములు పరాధీనం అయ్యాయని రెవెన్యూ శాఖ సీఎంకు నివేదించింది. తిరుచానూరులోని 4.5 ఎకరాల కాలువ పోరంబోకు భూమి(విలువ 50 కోట్లు), దుర్గసముద్ర గ్రామంలోని 7.98 ఎకరాల ప్రభుత్వ భూమి(25 కోట్లు), తిరుపతి రూరల్ మండలంలోని దామినీడు గ్రామంలోని 3.32 ఎకరాలు (25 కోట్లు), తిరుపతి పట్టణంలోని 27.14 ఎకరాల ప్రభుత్వ భూమి(50 కోట్లు)ని నిబంధనలకు విరుద్ధంగా 22(ఏ) నుంచి తొలగించారని రెవెన్యూ శాఖ నివేదించింది. జగన్ పాలనలో వైసీపీ నేతలు రెవెన్యూ వ్యవస్థను గుప్పిటపట్టారు. ఉద్యోగుల పదోన్నతులు, పోస్టింగ్‌లు, చివరకు తప్పుచేసిన వారిపై తీసుకునే క్రమశిక్షణా చర్యలను సైతం వైసీపీ నేతలు నిర్ణయించారు. వైసీపీ నేతలకు ఇష్టం వచ్చినట్లుగా, వారు కోరుకున్న భూములే నాలా కన్వర్షన్ జరిగేలా ఒత్తిడి తీసుకొచ్చారు.

పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా నిజం!

కాకినాడ పోర్టు నుంచి 750 కోట్ల విలువైన బియ్యం ఎగుమతి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), జూలై 12: కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి ప్రజా పంపిణీ పథకానికి(పీడీఎస్) సంబంధించిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించిన మాట వాస్తవమేనని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ తెలిపారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో రూ.750 కోట్ల విలువైన బియ్యం ఎగుమతి అయినట్లు గుర్తించామన్నారు. ఏడాదికి రూ.150 కోట్ల విలువైన బియ్యం చొప్పున విదేశాలకు అక్రమార్కులు తరలించారని తెలిపారు. ప్రధానంగా ఆఫ్రికా దేశాలకు ఈ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి తరలించినట్లు గుర్తించామన్నారు. ఈ నేపథ్యంలో కాకినాడ యాంకరేజ్ పోర్టు వద్ద చెక్‌పోస్టు పెట్టి అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. రేషన్ బియ్యం తరలింపులో పాత్రధారులైన 13 మందిపై '6ఏ' కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

జూన్ 25 రాజ్యాంగ హత్యా దినం

ఎమర్జెన్సీ ప్రకటించిన రోజుపై కేంద్రం సంచలన నిర్ణయం.. ఆ చీకటి రోజులకు నిరసనగానే: అమిత్ షా

» ఎమర్జెన్సీ.. దేశ చరిత్రపై కాంగ్రెస్ రాసిన చీకటి అధ్యాయం: మోదీ



న్యూఢిల్లీ, జూలై 12: దేశ ప్రజాస్వామ్య చరిత్రలో అత్యంత వివాదాస్పదమైన అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించిన జూన్ 25వ తేదీని 'రాజ్యాంగ హత్యా దినం'గా ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై ఏటా జూన్ 25ను ఈ విధంగానే వ్యవహరించాలంటూ శుక్రవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా 'ఎక్స్' వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. '1975 జూన్ 25న ప్రధానిగా ఉన్న ఇందిరాగాంధీ నియంతలా మారి ప్రజాస్వామ్యం గొంతునొక్కారు. మీడియాను అణచివేశారు. కారణం లేకుండా లక్షల మందిని జైల్లో పెట్టారు. ఎమర్జెన్సీ బాధితులు, దానిపై పోరాడిన వీరులను స్మరించుకునేందుకు, ఆ చీకటి రోజులను గుర్తు చేసుకునేందుకు జూన్ 25ను రాజ్యాంగ హత్యా దినం (సంవిధాన్ హత్యా దివస్)గా నిర్వహించాలని నిర్ణయించాం" అని పేర్కొన్నారు. షా ప్రకటన అనంతరం ప్రధాని మోదీ స్పందించారు. "ఎమర్జెన్సీ.. దేశ చరిత్రపై కాంగ్రెస్ పార్టీ రాసిన చీకటి అధ్యాయం. నాడు రాజ్యాంగాన్ని తొక్కిపెట్టి పరిపాలన సాగించారు. నష్టపోయిన ప్రతి ఒక్కరినీ స్మరించుకునే రోజు" అని ట్వీట్ చేశారు. మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ, ఎన్నికల సంఘం, న్యాయ వ్యవస్థ వంటి రాజ్యాంగ వ్యవస్థలను బలహీనం చేస్తోందంటూ కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ, ఇతర ప్రతిపక్షాల నేతలు తీవ్ర విమర్శలు చేస్తున్న సంగతి తెలిసిందే. మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారని, రిజర్వేషన్లు ఎత్తేస్తారని ఎన్నికల వేళ విపక్షాలు పెద్దఎత్తున ప్రచారం చేశాయి. పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లోనూ రాహుల్ సహా 'ఇండియా' ఎంపీలు పలువురు రాజ్యాంగ ప్రతులతో హాజరై ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నేపథ్యంలో ఇండియా కూటమి ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు బీజేపీ సర్కారు జూన్ 25ను "రాజ్యాంగ హత్యా దినం"గా ప్రకటించింది. ఇదిలా ఉండగా, మోదీ హయాంలో నిరుద్యోగం, ధరల పెరుగుదల, అసమానతలతో కోట్లాది ప్రజల జీవితాలు ఛిన్నాభిన్నం అయ్యాయని, త్వరలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లోనైనా దేశ ప్రాథమిక ఆర్థిక అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ప్రధాని మోదీకి సూచించారు.


మోదీ ముక్త్ దివస్‌గా జూన్ 4

న్యూఢిల్లీ, జూలై 12: దేశంలో ఎమర్జెన్సీ విధించిన 1975 జూన 25ను 'సంవిధాన్ హత్యా దివస్' (రాజ్యాంగ హత్యా దినం)గా పాటించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడంపై శుక్రవారం కాంగ్రెస్ పార్టీ తీవ్ర నిరసన తెలిపింది. పత్రికల్లో పతాక శీర్షికల కోసం ప్రధాన మోదీ ప్రదర్శిస్తున్న కుటిలనీతి అని విమర్శించింది. నిజానికి వ్యక్తిగతంగా, రాజకీయంగా నైతిక ంగా మోదీ ఓడిపోయిన రోజైన 2024 జూన్ 4వ తేదీయే (లోక్‌సభ ఫలితాలు వెల్లడయిన రోజు) చరిత్రలో మోదీ ముక్త్ దివస్‌గా మిగిలిపోతుందని వ్యాఖ్యానించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ట్వీట్ చేస్తూ 'రాజ్యాంగం' అన్నది పవిత్రమైన పదమని, దాన్ని 'హత్య' చేయడం అంటే అంబేడ్కర్‌ను అవమానించడమేనని విమర్శించారు. నోట్లను రద్దు చేసిన 2016 నవంబరు 8వ తేదీని 'ఆజీవక హత్యా దివస్'గా పరిగణిస్తామని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం గత పదేళ్లుగా ప్రతి రోజూ రాజ్యాంగాన్ని హత్య చేస్తునే ఉందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ట్వీట్ చేస్తూ.. దేశంలో గత పదేళ్లుగా అప్రకటిత అత్యయిక పరిస్థితి అమలవుతూనే ఉందన్నారు. 'మానవేతర ప్రధాని' ఒక పద్ధతి ప్రకారం రాజ్యాంగ విలువలు, సిద్ధాంతాలు, రాజ్యాంగ సంస్థలపై దాడి చేస్తునే ఉన్నారని ఆరోపించారు.

ప్రెసిడెంట్ అయ్యే అర్హత కమల హ్యారిస్‌కే ఉంది

» మరోసారి తడబడ్డ బైడెన్..

జెలెన్‌స్కీని పుతిన్ అంటూ పరిచయం



వాషింగ్టన్, జూలై 12: అమెరికా ఉపాధ్యక్షురాలు, భారత సంతతికి చెందిన కమలా హ్యారిస్ అధ్యక్ష పదవి చేపట్టేందుకు అన్ని అర్హతలున్నాయని ఆ దేశ అధ్యక్షుడు జో బైడెన్ పేర్కొన్నారు. గురువారం జరిగిన నాటో కూటమి దేశాల సదస్సు అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "కమలా హ్యారిస్ సమర్థురాలు. అందుకే ఆమె పేరు ప్రతిపాదిస్తున్నా"నని బైడెన్ తెలిపారు. డెమోక్రాట్ పార్టీ నుంచి అధ్యక్ష అభ్యర్థిగా అమెరికన్ల నుంచి బైడెన్ విషయంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇదిలా వుండగా, బైడెన్ మరోసారి నోరుజారారు. కమలా హ్యారిస్‌నుద్దేశించి మాట్లాడే సందర్భంలో ఆయన పొరపాటున మాజీ అధ్యక్షుడు ట్రంప్ పేరు ఉటంకించారు. అదేవిధంగా నాటో సభ్య దేశాల ప్రతినిధులకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని పరిచయం చేస్తూ "ఉక్రెయిన్ అధ్యక్షుడు పుతిన్" అని సంబోధించారు. మరోవైపు, బైడెన్ అభ్యర్థిత్వంపై వ్యతిరేకత నేపథ్యంలో తాను న్యూరాలాజికల్ వైద్యపరీక్షలకు సిద్ధమని ఆయన ప్రకటించారు.

ప్రత్యేక హోదాపై బిహార్‌లో పోరు

ఎన్డీయే, మహాకూటమి పరస్పర విమర్శలు

పట్నా, జూలై 12: పార్లమెంటు బడ్జెట్ సమావేశాల ముంగిట ప్రత్యేక హోదాపై బిహార్లో అధికార ఎన్డీయే, విపక్ష మహాకూటమి పరస్పరం విమర్శలు చేసుకుంటున్నాయి. హోదా ఇవ్వాలంటూ ఇటీవల ఎన్డీయే భాగస్వామి జేడీయూ కార్యవర్గ సమావేశాల్లో తీర్మానించారని.. మిత్రపక్షం డిమాండ్‌ను కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఆమోదించడం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత, లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ ధ్వజమెత్తారు. మోదీ ప్రభుత్వం జేడీయూపై ఆధారపడి ఉన్నా పట్టించుకోవడం లేదని శుక్రవారం అన్నారు. అయితే కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వమే హోదా డిమాండ్‌ను అటకెక్కించిందని జేడీయూ నేత శ్రావణ్‌కుమార్ దుయ్యబట్టారు. ఎన్డీయే మరో భాగస్వామి ఎల్‌జేపీ(రాంవిలాస్) ఎంపీ అరుణ్ భారతి కూడా హోదా డిమాండ్‌ను సమర్థించారు. రాష్ట్రానికి హోదా గానీ, ప్రత్యేక ప్యాకేజీ గానీ ఇస్తారని ఆశాభావంతో ఉన్నామని తెలిపారు. రాష్ట్రంలో, కేంద్రంలో ఎన్డీయేనే అధికారంలో ఉందని.. హోదా ఇవ్వడానికి చర్యలు తీసుకోకుండా ప్రజలను మభ్యపెడుతున్నారని ప్రతిపక్షంలోని ఆర్జేడీ ఆరోపించింది. రాష్ట్రాన్ని చీల్చి జార్ఖండ్‌ను ఏర్పాటుచేసిన తర్వాత ఖనిజ సంపదను బిహార్ కోల్పోయింది. దీనికి ప్రతిగా ప్రత్యేక హోదా ఇవ్వాలన్న డిమాండ్ 2000 నుంచీ వినిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్ విభజన చేసినప్పుడు ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని అప్పటి ప్రధాని మన్మోహన్ హామీ ఇచ్చారు. కానీ 14వ ఆర్థిక సంఘం ఏ రాష్ట్రానికీ ప్రత్యేక హోదా ఇవ్వొద్దని చెప్పిందంటూ మోదీ ప్రభుత్వం పక్కనపెట్టేసింది.

కేజ్రీకి మధ్యంతర బెయిలు

ఈడీ కేసులో మంజూరు చేసిన సుప్రీంకోర్టు

» మరోవైపు సీబీఐ కేసులో కేజ్రీవాల్ కస్టడీని 25 వరకు పొడిగించిన ప్రత్యేక కోర్టు

» బెయిలొచ్చినా జైల్లోనే ఢిల్లీ సీఎం



న్యూఢిల్లీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు శుక్రవారం మధ్యంతర బెయిలు మంజూరు చేసింది. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై అరెస్టయిన కేజ్రీవాల్ ప్రస్తుతం తిహాడ్ జైల్లో ఉన్నారు. మనీలాండరింగ్ కేసులో తనను ఈడీ అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన కొన్ని చట్టపరమైన ప్రశ్నలను విస్తృత ధర్మాసనానికి నివేదించాల్సి ఉందని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం అభిప్రాయపడింది. మధ్యంతర బెయిల్‌ను పొడిగించేందుకు, రద్దు చేసేందుకు విస్తృత ధర్మాసనానికి అధికారాలు ఉన్నాయని తెలిపింది. సుప్రీంకోర్టు మధ్యంతర బెయిలు ఇచ్చినా.. కేజ్రీవాల్‌కు నిరాశే మిగిలింది. ఢిల్లీ మద్యం కుంభకోణంలో అవినీతికి సంబంధించి సీబీఐ దాఖలు చేసిన కేసులో రౌస్ అవెన్యూ కోర్టు ఆయన జ్యుడీషియల్ కస్టడీని పొడిగించింది. శుక్రవారంతో ఆయన కస్టడీ ముగియడంతో ప్రత్యేక జడ్జి కావేరి బవేజా ముందు కేజ్రీవాల్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుపరిచారు. కస్టడీని ఈ నెల 25 వరకు పొడిగిస్తున్నట్లు జడ్జి ప్రకటించారు. దీంతో కేజ్రీవాల్ తిహాడ్ జైల్లోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా, మధ్యంతర బెయిల్‌పై కేజ్రీవాల్‌ను విడుదల చేయాలని చెప్పినంత మాత్రాన ఆయనపై మనీలాండరింగ్ చట్టం కింద ఉన్న ఆరోపణలను తిరస్కరించినట్లు కాదని జస్టిస్ ఖన్నా చెప్పారు. మధ్యంతర బెయిల్ కాలంలో కేజ్రీవాల్ ముఖ్యమంత్రి కార్యాలయానికి కానీ, ఢిల్లీ సచివాలయానికి కానీ వెళ్లరాదని ధర్మాసనం ఆంక్షలు విధించింది. ఇక కేజ్రీవాల్‌ను సీఎం పదవి నుంచి తొలగించాలన్న వాదనపై స్పందిస్తూ.. ఆయన ఎన్నికైన నాయకుడని తమకు తెలుసని, గద్దె దిగాల్సిందిగా ఎలాంటి ఆదేశాలూ జారీ చేయబోమని ధర్మాసనం స్పష్టం చేసింది.

ఇదేం గెలుపు కాదు: బీజేపీ

కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిలు వచ్చినంత మాత్రాన ఆమ్ ఆద్మీ పార్టీ విజయం సాధించినట్లు కాదని బీజేపీ పేర్కొంది. కేజ్రీవాల్‌పై ఆరోపణలకు సుప్రీంకోర్టు ఆమోదముద్ర వేసిన విషయాన్ని మరిచిపోరాదని వ్యాఖ్యానించింది. రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారు నేరాలకు పాల్పడితే తమ పదవులకు రాజీనామా చేయాలని సుప్రీంకోర్టు సూచించిందని, కేజ్రీవాల్ మొండి వైఖరి వల్ల ఢిల్లీలో పాలన స్తంభించిపోయిందని బీజేపీ ఎంపీ బాన్సురీ స్వరాజ్ చెప్పారు.

సత్యానికి లభించిన గెలుపు

సుప్రీంకోర్టు కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడాన్ని ఆప్ స్వాగతించింది. ఇది సత్యానికి లభించిన విజయమని, బీజేపీ కుట్రలకు దక్కిన ఓటమి అని పేర్కొంది. 'సత్యమేవ జయతే' అని ట్వీట్ చేసింది. ప్రతి కోర్టూ కేజ్రీవాల్‌పై బీజేపీ కుట్రను బహిర్గతం చేసిందని ఢిల్లీ మంత్రి అతిషీ వ్యాఖ్యానించారు.

రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ప్రతిఘటించాలి

» సీపీఎం నేత బి.వి. రాఘవులు

తాడేపల్లి, జూలై 12: విభజన హామీలైన విశాఖ రైల్వే జోన్, ప్రత్యేక హోదా తదితర అంశాల్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని టీడీపీ, జనసేన ప్రతిఘటించాలని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బి.వి. రాఘవులు కోరారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని సుందరయ్య స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో శుక్రవారం ప్రారంభమైన సీపీఎం రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో పెనుమార్పు జరిగిందని అందరూ అనుకుంటున్నారని, సీపీఎం దృష్టిలో అది పెద్ద మార్పేమీ కాదని చెప్పారు. చంద్రబాబు, జగన్ గతంలోనూ బీజేపీకి మద్దతు పలికారని ఇప్పుడు టీడీపీ, జనసేన బీజేపీకి మద్దతు పలుకగా వైసీపీ బయటనుంచి మద్దతు పలుకుతోందని వ్యాఖ్యానించారు. మతోన్మాద బీజేపీని ప్రతిఘటించాల్సిన బాధ్యత వామపక్షాలపై ఉందని తెలిపారు. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న వైసీపీ తమ బాధ్యతను విస్మరించిందని, ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించకపోతే అసెంబ్లీకి రానని జగన్ చెప్పడం బాధ్యతా రాహిత్యమని మండిపడ్డారు. కేంద్రంలో బీజేపీ అనుసరిస్తున్న మతతత్వ రాజకీయాలను ప్రజలు తిరస్కరించారని అందువల్లే 2024 ఎన్నికల్లో పట్టుకోల్పోయిందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎంఏ బేబీ అన్నారు. దేశంలో అనేక పార్టీలు బీజేపీ తీరును తీవ్రంగా వ్యతిరేకించాయని, అటువంటి వారిలో ఇద్దరు సీఎంలను జైలులో పెట్టించి నియంతృత్వంగా వ్యవహరించారని విమర్శించారు. టీడీపీ, జేడీయూ లాంటి కొన్ని పార్టీలు బీజేపీకి ఊతకర్రలా మారాయని, వారు కూడా పునరాలోచించాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి పి మధు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌పై దోబూచులాట!

(మొదటి పేజీ తరువాయి)

నుంచి ఆర్థిక శాఖ అడుగుతుంటే మొదట వచ్చినవి రూ.10,000 కోట్ల పెండింగ్ బిల్లులే! మరింత ఒత్తిడి చేయగా రూ.28,000 కోట్ల లెక్క తేలింది. ఇందులో ఒక్క ఇరిగేషన్ బిల్లులే రూ.18,000 కోట్లు కాగా, మిగతా అన్ని శాఖల బిల్లులూ కలిపి రూ.10,000 కోట్లేనట! ప్రభుత్వం మారినా పెండింగ్ బిల్లుల లెక్క తేలడం లేదు. ఆర్థిక శాఖకు కొత్త మంత్రి, సెక్రటరీలు వచ్చినా పెండింగ్ బిల్లులు ఒక కొలిక్కి రావడం లేదు. ఒక్క ఇరిగేషన్ తప్ప ఏ ఒక్క శాఖ కూడా పెండింగ్ బిల్లులపై దృష్టి సారించడం లేదు. దీంతో ఆయా శాఖల సెక్రటరీలు, హెచ్ఓడీలు, కిందిస్థాయి ఉద్యోగుల తీరు ప్రభుత్వ వర్గాలనే విస్మయపరుస్తోంది.

కోర్టుల్లోనే వేల పిటిషన్లు

ఉద్యోగులకు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లులే రూ.25,000 కోట్లు ఉన్నాయని వైసీపీ హయాంలో అప్పటి మంత్రివర్గ ఉపసంఘం తేల్చి అధికారికంగా ప్రకటించింది. ఎనర్జీ శాఖలో రూ.36,000 కోట్లు పెండింగ్ బిల్లులు ఉన్నాయని ఆ శాఖ అధికారికంగా తేల్చింది. సీఆర్‌డీఏలో రూ.8,000 కోట్ల పెండింగ్ బిల్లులు రావాలని ఆ కాంట్రాక్టర్లు పలు సందర్భాల్లో మీడియా సమావేశాల్లో చెప్పారు. 2024 మార్చి 31న ఆర్థిక శాఖ అధికారులు ల్యాప్స్ చేసిన పెండింగ్ బిల్లులు రూ.50,000 కోట్లుపైనే. ఇలా ఐదేళ్ల పాటు ప్రతి ఏడాది మార్చి 31న వేలకోట్ల బిల్లులు ల్యాప్స్ చేశారు. మరి ఇవన్నీ లెక్కలోకి ఎందుకు రావడం లేదు. ఆర్ అండ్ బీ, హెల్త్, ఎడ్యుకేషన్, ఎనర్జీ, వ్యవసాయ, అనుబంధ శాఖలు, పట్టణాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల్లో పెండింగ్ బిల్లులు భారీగా ఉంటాయి. ఈ శాఖల ఉన్నతాధికారులెందుకు స్పందించడం లేదు. రాష్ట్ర ఆర్థిక రంగంపై శ్వేతపత్రం ఇవ్వాలనేది ప్రభుత్వ నిర్ణయం. తొలికేబినెట్‌లో తీసుకున్న నిర్ణయం. అయినప్పటికీ ఆయా శాఖల ఉన్నతాధికారులు దీన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తున్నారు. హైకోర్టు, ఎంఎస్ఎంఈ కోర్టుల్లో పెండింగ్ బిల్లులకు సంబంధించి వేల సంఖ్యలో పిటిషన్లు ఉన్నాయి. పెండింగ్ బిల్లుల వివరాలతో పాటు, ఆయాశాఖలు కోర్టుకేసుల వివరాలు కూడా ఆర్థిక శాఖకు తెలియజేయాలి.

పాత ఉద్యోగులు ఉండగా ఏదీ బయటకు రాదు

పెండింగ్ బిల్లులకు సంబంధించి అన్ని శాఖలకు ఒక ప్రొఫార్మా పంపి దాని ప్రకారం బిల్లుల వివరాలు సమర్పించాలని కోరుతున్నారు. కానీ, పాత ఉద్యోగులను అక్కడ నుంచి తొలగించకుండా ఉన్నంత కాలం పక్కా సమాచారం రావడం అసాధ్యం. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక టీడీపీ హయాంలో జరిగిన ఆర్థిక వ్యవహారాలపై అప్పటి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి శ్వేతపత్రం విడుదల చేశారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.40,000 కోట్లు పెండింగ్ బిల్లులు వదిలి వెళ్లిందంటూ ఐదేళ్లు ప్రతి ప్రెస్‌మీట్లోనూ చెప్పారు. ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం వదిలి వెళ్లిన పెండింగ్ బిల్లులు రూ. లక్ష కోట్లకు పైనే ఉంటాయి. అయినా, ఆ వివరాలు బయటకు రాకపోవడం విచిత్రం.

ఆయా శాఖల అధికారులే బాధ్యులు: కేశవ్

ఏ శాఖలో పెండింగ్ బిల్లులు పూర్తిస్థాయిలో రాలేదో ఆ బిల్లులకు ఆ శాఖ ఉన్నతాధికారులనే బాధ్యులను చేయాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ భావిస్తున్నారు. పెండింగ్ బిల్లులపై సరైన సమాచారం ఇవ్వని శాఖల అధికారులపై చర్యలు తీసుకుంటామని, ఆ తర్వాతి పరిణామాలకు వారినే బాధ్యులను చేస్తామని మంత్రి 'ఆంధ్రజ్యోతి'కు తెలిపారు.

యాప్ పెట్టొచ్చు

పెండింగ్ బిల్లుల వివరాల కోసం పబ్లిక్ డొమైన్‌లో ఒక యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలి. ఇప్పుడు అన్ని శాఖలకు పంపుతున్న పెండింగ్ బిల్లుల ప్రొఫార్మాను ఆ యాప్‌లో అందుబాటులో ఉంచితే బిల్లు బాధితులంతా వివరాలను ఆ యాప్‌లో నమోదుచేస్తారు. ఎంత బిల్లు పెండింగ్, బిల్లు సమర్పించిన తేదీ, సంవత్సరం, కోర్టు కేసుల్లో ఉన్నవి, సీఎఫ్ఎంఎస్, నిధిల్లోకి అప్‌లోడ్ అయిన బిల్లులు, అప్‌లోడ్ కాని బిల్లులు, అప్‌లోడ్ అయి ల్యాప్స్ అయిన బిల్లులు, ఒకసారి ల్యాప్స్ అయి తిరిగి మళ్లీ వ్యవస్థలోకి రాని బిల్లుల వివరాలను కేటగిరీల వారీగా యాప్ ద్వారా సమాచారం తీసుకోవచ్చు. ఏపీఎఫ్ఎస్ఎస్ వద్ద ఇలాంటి యాప్‌లు తయారుచేసే సాధనసంపత్తి ఉంది. రెండుమూడురోజుల వ్యవధిలోనే యాప్‌ను రూపొందించొచ్చు. పెండింగ్ బిల్లుల వివరాలు సులభంగా సేకరించవచ్చు.

'నిధి'తో మాయ

సీఎఫ్ఎంఎస్‌లో ఉన్న పకడ్బందీ నిబంధనల కారణంగా అస్మదీయులకు బిల్లుల చెల్లింపులు కుదరడం లేదని 'నిధి' అనే ఇంకో సాఫ్ట్‌వేర్‌ను వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చింది. సీఎఫ్ఎంఎస్‌లో వర్క్ బిల్లులను ఎంటర్ చేసే విధానం స్పష్టంగా ఉంది. ఉదాహరణకు, రూ.10 కోట్లతో ఒక రోడ్డేస్తే ఆ బిల్లును ఆ హెడ్ కింద ఎంటర్ చేయాలి. అప్పటికి ఆ హెడ్‌లో బడ్జెట్ ఉన్నా లేకపోయినా సీఎఫ్ఎంఎస్‌లో అది రికార్డు అవుతుంది. ఆ హెడ్‌లోకి బడ్జెట్ వచ్చినప్పుడు మొదట ఈ బిల్లుకు పేమెంట్ జరుగుతుంది. ఈ బిల్లుకు పేమెంట్ జరగకుండా దాని వెనుక వచ్చిన బిల్లులకు పేమెంట్ చేయడం సీఎఫ్ఎంఎస్‌లో కుదరదు. అందుకే వైసీపీ ప్రభుత్వం 'నిధి' అనే కొత్త సాఫ్ట్‌వేర్‌ను తీసుకొచ్చింది. ఇందులో వర్క్ చేసిన హెడ్‌లో బడ్జెట్ ఉంటేనే బిల్లు ఎంటర్ అవుతుంది. పైగా ఇందులో ముందొచ్చిన బిల్లులతో సంబంధం లేకుండా అస్మదీయుల బిల్లులు ఏ చివరన ఉన్నా సెలక్ట్ చేసి చెల్లింపులు చేయొచ్చు. ఈ బిల్లులకు ముందున్న బిల్లుల వివరాలు 'నిధి'లో రికార్డు కావు. ఇలా గల్లంతైన బిల్లులు బోలెడు.

ఆ రూ.140 కోట్లు మాయం

ప్రస్తుతం ఆర్థిక శాఖకు రూ.28,000 కోట్ల పెండింగ్ బిల్లులు తేలాయి. పెండింగ్ బిల్లుల కోసం దాదాపు రెండేళ్లు పోరాటం చేసి ఆశలు వదిలేసుకున్న కొంతమంది బిల్లు బాధితులు వారి సమస్యను 'ఆంధ్రజ్యోతి' దృష్టికి తెచ్చారు. పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, పాఠశాల విద్య, గ్రామీణాభివృద్ధి శాఖలకు చెందిన ఈ బిల్లుల విలువ రూ.140 కోట్లు. ప్రస్తుతం ఆర్థిక శాఖ వద్దకు చేరిన రూ. 28,000 కోట్ల బిల్లుల్లో ఈ రూ.140 కోట్లకు సంబంధించిన బిల్లులు లేవు. దాదాపు అన్ని శాఖల్లో ఇలాంటి యాక్టివ్‌లో లేని బిల్లులు కోకొల్లలుగా ఉన్నాయి. ఈ సమాచారం అందించడానికి ప్రభుత్వ శాఖల్లో ఆసక్తి లేదు.





పొలంలో హత్యకు ముందు గుండమ్మ, పురుషోత్తంతో వాగ్వాదానికి దిగిన రాఘవరెడ్డి (కింద కూర్చున్న వ్యక్తి); పురుషోత్తంరెడ్డిని కొడుతున్న దృశ్యం

భూతగాదాలో దళిత మహిళ దారుణ హత్య

» ట్రాక్టర్‌తో గుద్ది చంపిన వైనం.. కర్నూలు జిల్లా ఆదోనిలో ఘటన



గుండమ్మ (ఫైల్)

ఆదోని రూరల్, జూలై 12: భూతగాదాలో ఓ దళిత మహిళను ట్రాక్టర్‌తో గుద్ది హతమార్చిన సంఘటన కర్నూలు జిల్లా ఆదోనిలోని నాగనాథహళ్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. నాగనాథహళ్లికి చెందిన గుండమ్మ(47)కు భర్త మరణించారు. దీంతో ఆదోనికి చెందిన పురుషోత్తం రెడ్డితో కలిసి గుండమ్మ రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించారు. ఈ క్రమంలో తిరుమలమ్మ అనే వితంతువు.. ఉమ్మడి ఆస్తిలో భాగంగా తన వాటాకు వచ్చిన సర్వే నం.500-డిలోని 4 ఎకరాల పొలాన్ని రియల్టర్ గుండమ్మకు 2019లో విక్రయించింది. గుండమ్మ ఆ పొలాన్ని సాగు చేస్తుండగా తిరుమలమ్మ భర్త కుటుంబీకులైన మదిరెకు చెందిన తండ్రీ కొడుకులు రాఘవరెడ్డి, శ్రీధర్ రెడ్డి శుక్రవారం అడ్డుకున్నారు. గుండమ్మతో పాటు ఆమె వ్యాపారంలో భాగస్థుడైన పురుషోత్తంపై రాఘవరెడ్డి కర్రతో దాడి చేశాడు. అదే సమయంలో శ్రీధర్ రెడ్డి ట్రాక్టర్‌తో గుండమ్మను ఢీకొట్టాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన పురుషోత్తంరెడ్డిని స్థానికులు ఆదోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలి దత్త పుత్రుడు కిశోర్ ఫిర్యాదు మేరకు ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గుండమ్మను హత్య చేసిన నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. కాగా దాడులకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న విజయానంద్

వీధిదీపాలకూ విద్యుత్ కొరత ఉండొద్దు

- వినియోగదారులకు 24 గంటలూ కరెంటు ఇవ్వాలి
- ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్

అమరావతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్తు సంస్థలు వినియోగదారులకు అత్యుత్తమ సేవలందిస్తూ.. 24 గంటలూ విద్యుత్తు సరఫరా చేయాలని ఇంధనరంగ సంస్థ ఉద్యోగులకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. విద్యుత్తు సౌధలో శుక్రవారం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సౌరవ్‌కుమర్‌షా, పీఎఫ్‌సీ రాష్ట్ర నోడల్ అధికారి అశోక్‌కుమార్ రాథోడ్‌తో కలసి కేంద్రం అమలు చేస్తోన్న రివ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ సిస్టమ్ (ఆర్డీఎస్ఎస్) స్కీమ్ అమలుపై సమీక్షించారు. రాష్ట్రంలో నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా ఉండేలా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పథకంలో భాగంగా రైతులకు ఉచితంగా పగటిపూట 9గంటల విద్యుత్తు అందించాలన్నారు. డిస్కమ్‌ల సర్కిల్ పరిధిలో 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లలో విద్యుత్తు సరఫరాలో ఎలాంటి ఆటంకాలూ లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత సూపరింటెండింగ్ ఇంజనీర్లదేనని విజయానంద్ స్పష్టంచేశారు. విద్యుత్తు సరఫరాపై డిస్కమ్‌లు ఎప్పటికప్పుడు స్టేటస్ రిపోర్టు ఇవ్వాలని ఆదేశించారు. గ్రామాల్లో లోవోల్టేజీ విద్యుత్తు సమస్య తలెత్తేందుకు వీల్లేదన్నారు.

కుంభకోణాలకు నిలయం ఆప్కో

- జగన్ అవినీతిని వెలికితీసే వరకు విశ్రమించం
- చేనేత రంగానికి పూర్వవైభవం: మంత్రి సవిత



హిందూపురం, జూలై 12: జగన్‌రెడ్డి హయాంలో ఆప్కో కుంభకోణాలకు నిలయంగా మారిందని బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత విమర్శించారు. శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లిలో జరిగిన చేనేతల ఆత్మీయ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆప్కోను ప్రక్షాళన చేస్తానని అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి.. చేనేత సహకార సంఘాలను నిర్వీర్యం చేశారని చెప్పారు. జగన్ రాసిన మరణశాసనంలో ఆ సంస్థ పూర్తిగా కుంగి కుచించుకుపోయిందన్నారు. రాజకీయ అవసరాల కోసం జనం సొమ్మును జగన్ స్వాహా చేశారని విమర్శించారు. అస్మదీయులకు మేలు చేసేందుకు అవసరంలేని క్లాత్‌ను కొనుగోలుచేసి, గోదాముల్లో నిల్వ చేశారని ఆరోపించారు. ఇప్పటికీ సొసైటీల వద్ద రూ.కోట్లు విలువచేసే సరుకు మూలనపడిందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం చేనేతలను భవన నిర్మాణ కూలీలుగా మారేలా చేసిందని, ఫలితంగా చేనేతరంగం పూర్తిగా కుదేలైందని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో రూ.12 మాస్కును రూ.31కు కొనుగోలు చేసినట్లు బిల్లులు చూపి.. నిధులు స్వాహా చేసిన విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. మొత్తం అవినీతిని వెలికితీస్తామని, చేనేత రంగానికి పూర్వవైభవం తీసుకొస్తామని మంత్రి సవిత చెప్పారు.

'గ్యారంటీ'గా గోల్‌మాలే!

(మొదటి పేజీ తరవాయి)

నుంచే ఈ గ్యారంటీలను తీసుకోవాలనేది కచ్చితమైన నిబంధన. దీనికి భిన్నంగా కాంట్రాక్టు సంస్థలు.. వెస్టిండీస్‌కు చెందిన యూరో ఎగ్జిమ్ బ్యాంక్ గ్యారంటీలను సమర్పించాయి. నిజానికి, ఈ బ్యాంకు వ్యాపార దక్షత ఏమిటో, రిజర్వు బ్యాంకు గుర్తింపు ఉన్నదో లేదో తెలియదు. అయినా, ఈ సంస్థలు సమర్పించిన గ్యారంటీలను డిస్కమ్ సంస్థలైన ఎస్పీడీసీఎల్, సీపీడీసీఎల్‌ల సీఎండీలు సంతోషరావు, పద్మాజనార్దనరెడ్డి ఆమోదించారు. వీరిద్దరూ వైసీపీ అధికారులుగానే అప్పటి ప్రభుత్వంలో వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. కొత్త ప్రభుత్వంలో కూడా సంతోషరావు ఎస్పీడీసీఎల్ సీఎండీగా కొనసాగుతున్నారు. కాగా, ఏపీఈపీడీసీఎల్‌కు కూడా అదే బ్యాంకు గ్యారంటీలను సమర్పించేందుకు కాంట్రాక్టు సంస్థలు ముందుకు రాగా, ఆ సంస్థ సందేహపడింది. దీనిపై అప్పటి జగన్ ప్రభుత్వానికి లేఖ రాసింది. విదేశీ బ్యాంకు గ్యారంటీలను సమ్మతించేదిలేదని రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది. అలాంటప్పుడు, సీపీడీసీఎల్ .. ఎస్పీడీసీఎల్ మాత్రం విదేశీ బ్యాంకు గ్యారెంటీలను ఏకపక్షంగా ఎందుకు ఆమోదించాయని విద్యుత్ శాఖ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. దీని వెనుక భారీ కుంభకోణం జరిగిందని అనుమానిస్తున్నాయి. దీనిపై విజిలెన్స్ దర్యాప్తును జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

అలా ఎలా ఇస్తారు?

కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ స్కీమ్ (ఆర్‌డీఎస్ఎస్) కింద ఏపీకి పనులు మంజూరు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో రూ.11,000 కోట్లతో సిస్టమ్ స్ట్రెన్త్‌నింగ్, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ... రూ.20000 కోట్లతో మోడ్రనైజేషన్ పనులపై అప్పటి జగన్ ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు కోరింది. ఈ మేరకు అప్పటి జగన్ ప్రభుత్వం సిస్టమ్ స్ట్రెన్త్‌నింగ్ .. స్మార్ట్ మీటర్ల కోసం టెండర్లను పిలిచింది. ఈ టెండర్లను జగన్ అస్మదీయ షిర్డిసాయి, రాఘవ, ఎన్‌సీసీ, ఎకోరాన్ సంస్థలు దక్కించుకున్నాయి. టెండర్లను పిలిచినప్పుడు .. బిడ్‌లను దాఖలు చేసినప్పుడు .. దేశీయ బ్యాంకుల నుంచి ధరావత్తును, గ్యారెంటీని కాంట్రాక్టు సంస్థలు సమర్పించాయి. కానీ, పనులు దక్కించుకున్నాక, అడ్వాన్సు తీసుకునే సమయంలో మాత్రం విదేశీ బ్యాంకు గ్యారెంటీలను ఇచ్చాయి. రిజర్వుబ్యాంకు గుర్తింపు.. గ్యారెంటీ ఇచ్చిన బ్యాంకుకు ఉందోలేదో కూడా తెలియదనని అప్పట్లోనే రాష్ట్రంలోని కొన్ని కాంట్రాక్టు సంస్థలు గగ్గోలు పెట్టాయి. ఇలాంటి బ్యాంకు ఇచ్చిన గ్యారంటీలను సంతోషరావు, పద్మాజనార్దనరెడ్డి ఎలా ఆమోదించారని ప్రశ్నించాయి. టెండర్లు గెలుచుకున్న కాంట్రాక్టు సంస్థలు.. వెస్టిండీస్‌లోని యూరో ఎగ్జిమ్ బ్యాంకు పేరిట వరుసగా, రూ.5,80,30,885, రూ.12,91,05,834, రూ.12,9105,675, రూ.12,81,05,849, రూ.12,91,05,703, రూ.12,91, 05,847, రూ.7,96,79,052, రూ.7,96,79,047, రూ.14,39, 11,672, రూ. 14,39,11,669, రూ.14,39, 11,682, రూ.14,39,11,673,రూ.14,39,11,581, రూ.12,40, 58,949 విలువైన గ్యారంటీలను ఎస్పీడీసీఎల్‌కు, రూ.45 కోట్ల విలువైన గ్యారంటీని సీపీడీసీఎల్‌కు సమర్పించాయి. ఈ గ్యారంటీల వ్యవహారంపై తక్షణమే దర్యాప్తు చేయాలన్న డిమాండ్ సర్వత్రా వెల్లువెత్తుతోంది.

'సోలార్' నుంచి ధనుంజయ్‌రెడ్డి బామ్మర్ది అవుట్!

- సీవోవోగా మురళీకృష్ణారెడ్డి తొలగింపు.. ఏపీ జెన్‌కో డీఈఈగా వెనక్కి
- ప్రత్యేక సీఎస్ విజయానంద్ ఉత్తర్వులు.. మురళీకృష్ణారెడ్డికి అర్హత లేకున్నా లేని పదవి సృష్టించి అందలం
- సోలార్ కార్పొరేషన్, జెన్‌కో, ట్రాన్స్‌కోలపై పూర్తి పెత్తనం
- ఎండీలకు, ప్రత్యేక సీఎస్‌కూ ఆదేశాలిచ్చేంతగా తెగింపు..
- జగన్ ఓటమితో పాత పోస్టుకు పంపిన ఇంధన శాఖ.. 'సంప్రదాయేతర' డైరెక్టర్లకూ ఉద్వాసన

అమరావతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి ప్యాలెస్‌లో సీఎంవో ముఖ్యకార్యదర్శిగా అధికారం చెలాయించిన ధనుంజయ్‌రెడ్డి అండదండలు చూసుకుని విర్రవీగిన ఆయన.. వరుసకు బావమరిది అయిన ఎం.మురళీకృష్ణారెడ్డిని రాష్ట్ర సోలార్ పవర్ కార్పొరేషన్ నుంచి బయటకు పంపించారు. ఏపీజెన్కోలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(డీఈఈ)గా ఉన్న ఈయన్ను.. అర్హత లేకున్నా.. సోలార్ పవర్ కార్పొరేషన్‌లో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసరు (సీవోవో) పోస్టును సృష్టించి మరీ అందలమెక్కించారు. ఎండీని మించి ఆయన అపరిమిత అధికారాలు చెలాయించారు. కార్పొరేషన్ వ్యవహారాలన్నీ 'సెటిల్' చేసేవారు. సోలార్ కార్పొరేషన్, ఏపీ జెన్కో, ఏపీ ట్రాన్స్‌కోపై పెత్తనం చేశారు. ఎండీలనే గాక ఏకంగా ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని కూడా ఆదేశించే స్థాయికి వెళ్లిపోయారు. సార్వత్రిక ఎన్నికల్లో జగన్ ఓడిపోవడం.. ధనుంజయరెడ్డి కూడా రిటైరైపోవడంతో మురళీకృష్ణారెడ్డికి ఇంధన శాఖ చెక్ పెట్టింది. మీ సేవలిక చాలంటూ ఆయన్ను సీవోవోగా తొలగిస్త ప్రత్యేక సీఎస్ విజయానంద్ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. మాతృ సంస్థ ఏపీజెన్‌కోలో డీఈఈ హోదాలోనే చేరాలని స్పష్టం చేశారు. సీవోవో హోదా గానీ, ఆ స్థాయి జీతభత్యాలు గానీ ఉండవని తేల్చేశారు. అయితే టీడీపీ కూటమి ప్రభుత్వం ఇక్కడితో ఆగేలా లేదని.. మురళీకృష్ణారెడ్డిపై వచ్చిన ఆరోపణలపై విచారణకు ఆదేశించే అవకాశం ఉందని విద్యుత్ సౌధ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు.. సంప్రదాయేతర ఇంధన సంస్థల జిల్లాల డైరెక్టర్లు బి.మాధవరెడ్డి (శ్రీసత్యసాయి), జి.సుగుణమ్మ (అన్నమయ్య), ఎం.శ్రీనిజ (అన్నమయ్య), సందె విజయలక్ష్మి(కాకినాడ), గండి వసంతరావు (తూర్పుగోదావరి), పాటి శివ (కోనసీమ), కత్తి చిన్నపరెడ్డి (గుంటూరు), సీబీ కిశోర్‌రెడ్డి (కడప), దాసరి భాస్కరగౌడ్ (నెల్లూరు), ఎ.త్రినాథరెడ్డి (శ్రీకాకుళం), సీహెచ్ పద్మావతి (విజయనగరం), గోలి సుజాత (ఏలూరు), సానికొమ్ము తిరుపతిరెడ్డి (ప్రకాశం), ఎ.సత్యప్రియ (తూర్పుగోదావరి)లను కూడా ఆ పదవుల నుంచి తొలగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వు జారీ చేసింది.

'ప్రకాశం'లో 361 సెల్‌ఫోన్లు రికవరీ

- మూడు కేసులు నమోదుచేసిన పోలీసులు

ఒంగోలు(క్రైం), జూలై 12: ప్రకాశం జిల్లాలో చోరీకి గురైన 361 సెల్‌ఫోన్లను రికవరీ చేసిన పోలీసులు, ఇద్దరు నిందితులతోపాటు ఐదుగురు షాపుల యజమానులను అరెస్టు చేశారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ వివరాలు వెల్లడించారు. అపహరణకు గురైన సుమారు రూ.50 లక్షల విలువైన 361 సెల్‌ఫోన్లను రికవరీ చేశామన్నారు. అందుకు సంబంధించి ఇద్దరు నిందితులతోపాటు దొంగ ఫోన్లు కొనుగోలు చేసిన దుకాణ యజమానులను అరెస్టు చేశామన్నారు. ఒంగోలు వన్‌టౌన్, టూటౌన్, చీమకుర్తి పోలీసు స్టేషన్లలో మూడు కేసులు నమోదు చేశామని తెలిపారు.



వారం రోజుల్లో అనుబంధ బుక్‌లెట్లు

- సీడీల్లో మార్పు వల్లే పొరపాటు
- టెన్త్ తెలుగు పుస్తకంపై పాఠ్య పుస్తకాల విభాగం వివరణ

అమరావతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి తెలుగు పాఠ్య పుస్తకంలో పొరపాటును పాఠశాల విద్యాశాఖ అంగీకరించింది. సీడీల్లో మార్పుల వల్లే ఈ తప్పు జరిగినట్లు తెలిపింది. 'పాఠ్యాంశాలు మార్చేశారు' శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంపై పాఠ్య పుస్తకాల విభాగం డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో వివరణ ఇచ్చారు. 2024-25కి సంబంధించిన పదో తరగతి పాఠ్యపుస్తకాలన్నీ మార్చారని, అందులో భాగంగా తెలుగు పాఠ్యపుస్తకం సీడీల్లో మార్పు జరగడంతో ఉమ్మడి గోదావరి, కృష్ణా జిల్లాలకు సరఫరా చేసిన పుస్తకాల్లో కొన్ని తప్పులు దొర్లాయని వివరించారు. పొరపాట్లు జరిగిన జిల్లాల్లో విద్యార్థులకు అనుబంధంగా బుక్‌లెట్‌లు పంపిణీ చేస్తామని, ఈ ప్రక్రియ వారం రోజుల్లో పూర్తిచేస్తామన్నారు.

ప్రపంచబ్యాంకు ప్రతినిధులతో పవన్ చర్చలు

అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికీ రక్షిత మంచినీటిని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వముందని, ఈ లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు సహకరించాలని ప్రపంచ బ్యాంకు అధికారులను ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కోరారు. శుక్రవారం మంగళగిరిలోని తన నివాసంలో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో పవన్ చర్చించారు. ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసేందుకు ప్రపంచ బ్యాంక్ నుంచి సహకారం అందించాలన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ప్రపంచ బ్యాంక్ జలవనరుల విభాగం సలహాదారులు రమేష్ ముకల్లా, మాథ్యూస్ ముల్లికల్ పాల్గొన్నారు.

అమరావతి నిర్మాణాల పటిష్ఠతపై ఐఐటీ ఇంజనీర్లతో అధ్యయనం: మంత్రి నారాయణ

అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): అమరావతిలో గతంలో నిలిచిపోయిన నిర్మాణాల పటిష్ఠత ఎలా ఉందో తెలుసుకోవడానికి ఐఐటీ ఇంజనీర్లతో అధ్యయనం చేయించాలని నిర్ణయం తీసుకున్నామని మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఆయనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ ఐకానిక్ భవనాల ఫౌండేషన్ పటిష్ఠత నిర్ధారణ కోసం ఐఐటీ చెన్నైకు బాధ్యతలు అప్పచెప్తామన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు క్వార్టర్ల పటిష్ఠత నిర్ధారణ బాధ్యతలు ఐఐటీ హైదరాబాద్‌కు అప్పగిస్తామని, ఐఐటీలు ఇచ్చే నివేదికల ఆధారంగా ముందుకెళ్తామన చెప్పారు. సీఆర్‌డీఏకు గతంలో పనిచేసిన 47 మంది కన్సల్టెంట్‌లు వెనక్కి వెళ్లిపోయారని, మళ్లీ కొత్తగా టెండర్లు పిలిచి కన్సల్టెంట్‌లను నియమించుకోవాల్సి ఉందని తెలిపారు. సీఆర్‌డీఏకు సిబ్బంది కొరత చాలా ఉందని, గతంలో ఉన్న సిబ్బందిలో 528 మంది తక్కువగా ఉన్నారని పేర్కొన్నారు.

టెన్త్ రీవెరిఫికేషన్, రీకౌంటింగ్ ఫలితాలు విడుదల

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల రీవెరిఫికేషన్, రీకౌంటింగ్ ఫలితాలను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. 3873 మంది రీవెరిఫికేషన్, రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారని, సంబంధిత పాఠశాలల లాగిన్స్‌లో సమాధాన పత్రాలు అందుబాటులో ఉంచామని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

వ్యవసాయ రంగానికి పూర్వవైభవం

- కౌలురైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు
- ఏ ఇబ్బందులున్నా ప్రభుత్వాన్ని సంప్రదించండి
- రైతులకు వ్యవసాయ మంత్రి అచ్చెన్న భరోసా
- 23న రాష్ట్రవ్యాప్తంగా 'పొలం పిలుస్తోంది'

అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి పూర్వవైభవం తెస్తాం. రైతులెవరూ అధైర్యపడొద్దు. సాగు నష్టాలతో ఆత్మహత్యలు చేసుకోవద్దు. ఏ ఇబ్బందులున్నా ప్రభుత్వాన్ని సంప్రదించండి. అధికారులకు సమాచారం ఇవ్వండి. సాధ్యమైనంత వరకు సమస్యల్ని పరిష్కరించడానికి ప్రయత్నిస్తాం' అని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. కౌలురైతులకు రుణాలు, రాయితీలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. శుక్రవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో తన చాంబర్‌లో ప్రత్యేక పూజల అనంతరం ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమ ఫైలు, రైతులకు రాయితీపై వ్యక్తిగత యంత్ర పరికరాలు అందించే ఫైలు, మత్స్యశాఖ ద్వారా గత ప్రభుత్వం ఇచ్చిన జీవో 217ను రద్దు చేసే ఫైలు, బోట్లు ఉన్న మత్స్యకారులకు డీజిల్ సబ్సిడీ కోసం రూ.10కోట్లు మంజూరు చేస్తూ మరో ఫైలు, రాష్ట్రంలో పశువులకు డీవార్మింగ్, పశుగణన చేపట్టే ఫైలుపై మంత్రి సంతకాలు చేశారు. అనంతరం అచ్చెన్నాయుడు మాట్లాడుతూ 'గత ఐదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన వ్యక్తి వ్యవసాయ శాఖకు తాళం వేశారు. అసలు ఈ శాఖ ఉందో లేదో తెలియని పరిస్థితి. వ్యవసాయ రంగాన్ని సమర్థంగా వినియోగించుకుంటే రాష్ట్ర జీడీపీలో 35 శాతం ఈ శాఖల ద్వారానే వస్తుంది. మత్స్యకారుల నోళ్లు కొట్టే జీవో.217 రద్దు చేయాలని వేడుకున్నా పట్టించుకోలేదు. ఈ జీవో రద్దు కోసం కోర్టుల్లో వందల కేసులున్నాయి. అందుకే జీవో 217ను రద్దు చేసేందుకు కేబినెట్‌లో పెడతాం. కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి, పంట రుణాల వంటి సహాయ సహకారాలు అందిస్తాం. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఈ నెల 23న రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తున్నాం. ప్రతి మంగళ, బుధ వారాలు వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పొలాల దగ్గరకు వెళ్లి, రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ క్యాంపులు పెట్టి పశువులకు డీవార్మింగ్ కార్యక్రమాన్ని అమలు చేస్తాం' అని మంత్రి తెలిపారు. మంత్రులు కేశవ్, సత్యప్రసాద్, పలువురు ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు అచ్చెన్నాయుడుకి శుభాకాంక్షలు తెలిపారు.


మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న అచ్చెన్నాయుడు

ఆగ్రోస్‌లో అవకతవకలపై విచారణ జరపాలి

- మంత్రికి ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి

అనంతపురం అర్బన్/అమరావతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఆగ్రో ఇండస్ట్రీయల్ కార్పొరేషన్‌లో గత ప్రభుత్వంలో జరిగిన ఆర్థిక అవకతవకలపై విచారణ జరపాలని ఆగ్రోస్ ఎంప్లాయీస్ యూనియన్ వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడును కోరింది. 2019-24 మధ్య రైతులకు నాసిరకం పరికరాలు పంపిణీ ద్వారా సంస్థ ప్రతిష్ఠ దెబ్బతీశారని పేర్కొంది. ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు ట్రాక్టర్లు సరఫరా చేయకుండానే కంపెనీలకు రూ.33.36 కోట్లు చెల్లించడంపై విచారించి, చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో అచ్చెన్నాయుడుకు వినతి పత్రాన్ని అందజేసినట్టు యూనియన్ అధ్యక్షుడు బీవీ కృష్ణారెడ్డి తెలిపారు.

ఇది సరైన స్ఫూర్తి కాదు!

- కోర్టు ఉత్తర్వుల అమలును కిందివారికి ఎలా వదిలేస్తారు?
- ఇది కోర్టు ధిక్కరణే.. పైగా ఉత్తర్వులకు వక్రభాష్యాలా?
- మా ఆదేశాల అమలే మీ విధి
- కృష్ణబాబు, కృతికాశుక్లా, రామిరెడ్డిపై హైకోర్టు ఆగ్రహం... 2వేల జరిమానా
- కాకినాడ పూర్వ డీఎంహెచ్‌వోకు 6నెలల జైలుశిక్ష, రూ.2వేలు జరిమానా
- తీర్పు అమలు ఆరు వారాలు ఆపివేత

అమరావతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను సరైన స్ఫూర్తితో అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. తమ బాధ్యతను కిందిస్థాయి అధికారులకు అప్పగించి చేతులు దులుపుకున్న ఉన్నతాధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉత్తర్వులు అమలు పరచాలని కేవలం ప్రొసీడింగ్స్ ఇస్తే సరిపోదని, సమష్టిగా, వ్యక్తిగతంగా ఉత్తర్వుల అమలుకు చర్యలు తీసుకోవాల్సిందేనని స్పష్టం చేసింది. కోర్టు ఉత్తర్వులకు వక్రభాష్యం చెప్పకుండా యథావిధిగా వాటిని అమలు చేయడం అధికారుల బాధ్యతని తేల్చి చెప్పింది. ప్రస్తుత కేసులో ఉన్నతాధికారులు....ఆదేశాల అమలు బాధ్యతను జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారికి అప్పగించడం పై తీవ్ర అభ్యంతరం తెలిపింది. ఇలా చేయడం కోర్టు ధిక్కరణ కిందికే వస్తుందని పేర్కొంది. వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, పూర్వ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ డైరెక్టర్ వీ రామిరెడ్డి, అప్పటి కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాకు రూ.2వేలు చొప్పున జరిమానా విధించింది. కోర్టు ఉత్తర్వులు అమలు చేయకుండా, వాటి పట్ల అవిధేయత చూపిన కాకినాడ జిల్లా పూర్వ డీఎంహెచ్‌వో ఎస్.శాంతిప్రభకు 6నెలల సాధారణ జైలుశిక్ష, రూ.2వేలు జరిమానా విధించింది. అప్పీల్ దాఖలు చేసుకొనేందుకు వీలుగా సమయం ఇవ్వాలని అధికారులు అభ్యర్థించడంతో తీర్పు అమలును ఆరు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు 73 కోర్టు ధిక్కరణ వ్యాజ్యాల్లో తీర్పు ఇచ్చారు. మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్స్‌గా(ఎంపీహెచ్‌ఏ-పురుష) తమను పరిగణనలోకి తీసుకొనేలా ఆదేశాలు ఇవ్వాలని తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పలువురు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపిన న్యాయస్థానం....ఎంపీహెచ్‌ఏ నియామకం కోసం పిటిషనర్ల పేర్లను పరిగణనలోకి తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తూ 2022లో తీర్పు ఇచ్చింది. ఈ ఉత్తర్వులు అమలు కాకపోవడంతో పిటిషనర్లు వెంకటేశ్వరరావు, మరికొందరు కోర్టు ధిక్కరణ వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాల పై విచారణ పెండింగ్‌లో ఉండగానే, తమకు అనుకూలమైనవారిని ఎంపీహెచ్‌ఏలుగా నియమించారని, తమ దరఖాస్తులను తోసిపుచ్చారని పిటిషనర్లు వివరించారు. ఈ వ్యాజ్యాల పై విచారణ జరిపిన న్యాయమూర్తి.... గ్రామ సచివాలయాలు ఏర్పాటైన నేపథ్యంలో ఎంపీహెచ్‌ఏల నియామకం అవసరం లేదని డీఎంహెచ్‌వో ఎస్.శాంతిప్రభ సొంతంగా ఓ నిర్ణయానికి రావడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కోర్టు ఉత్తర్వులను డీఎంహెచ్‌వో ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారని, ఇలాంటి అధికారుల తీరుతో చట్టబద్ధ పాలనకు తీవ్ర అవరోధం కలుగుతుందని ఆగ్రహించారు. ఈ నేపథ్యంలో ఆమె పై ఎలాంటి ఉదారత చూపాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. మరోవైపు..తమ ఉత్తర్వుల అమలుకు ఆదేశాలు ఇవ్వడంతోపాటు, కోర్టుకు బేషరతుగా క్షమాపణ చెప్పిన నేపథ్యంలో కృష్ణబాబు, రామిరెడ్డి, కృతికా శుక్లాలకు రూ.రెండు వేలు చొప్పున జరిమానా మాత్రమే విధిస్తున్నామని న్యాయమూర్తి పేర్కొన్నారు.

పరిశ్రమలశాఖ డైరెక్టర్‌గా శ్రీధర్ బాధ్యతల స్వీకరణ

అమరావతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పరిశ్రమలశాఖ డైరెక్టర్‌గా చెరుకూరి శ్రీధర్ బాధ్యతలు తీసుకున్నారు. గురువారం కొంతమంది ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా సీనియర్ ఐఏఎస్ అధికారి శ్రీధర్‌ను ప్రభుత్వం పరిశ్రమలశాఖ డైరెక్టరుగా నియమించింది. శుక్రవారం ఆయన మంగళగిరిలో ని ఏపీఐఐసీ భవన్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

రేషన్ డీలర్లకు న్యాయం చేస్తాం: మంత్రి నాదెండ్ల

రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేస్తానని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారు. రేషన్ డీలర్ల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలా మాధవరావు నేతృత్వంలో 30 మందితో కూడిన ప్రతినిధి బృందం శుక్రవారం సాయంత్రం మంత్రి మనోహర్‌ను విజయవాడలోని సివిల్ సప్లయిస్ ప్రధాన కార్యాలయంలో కలిసింది. ఈ సందర్భంగా తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు.

సందర్శకుల పిలుపుతో ఆగిన చంద్రబాబు కాన్వాయ్



సచివాలయానికి వెళ్తున్న సమయంలో కాన్వాయ్‌ని ఆపి కరకట్ట రోడ్డుపై వేచి చూస్తున్న ప్రజలతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

- కారు దిగి జనం చెంతకు.. రోడ్డు మీదే వినతిపత్రాల స్వీకరణ

అమరావతి(ఆంధ్రజ్యోతి), తాడేపల్లి టౌన్, జూలై 12: సందర్శకులు గొంతెత్తి పిలవగానే ముఖ్యమంత్రి చంద్రబాబు తన వాహన శ్రేణిని ఆపుచేశారు. రోడ్డు మీదే ఆగి వారిని పిలిపించి అక్కడే వినతిపత్రాలు స్వీకరించారు. నేనున్నా.. ధైర్యంగా ఉండండి.. అంటూ స్వయానా సీఎం భరోసా ఇవ్వడంతో వారి కళ్లు చెమ్మగిల్లాయి. శుక్రవారం ఉదయం చంద్రబాబు ఉండవల్లిలోని నివాసం నుంచి రాష్ట్ర సచివాలయానికి బయలుదేరిన సమయంలో ఈ సన్నివేశం చోటుచేసుకుంది. సందర్శకులు ఆ సమయంలో ఎదురు రోడ్డులో వేచి చూస్తున్నారు. ఆయన వాహన శ్రేణిని గమనించి కొందరు 'సార్.. సార్' అంటూ అరిచారు. వారి పిలుపు వినగానే చంద్రబాబు కాన్వాయ్‌ని ఆపు చేయించి కారు దిగారు. సందర్శకులను పిలిపించి వారి సమస్యలు తెలుసుకొన్నారు. అక్కడే వారి నుంచి వినతిపత్రాలు తీసుకొని, చూస్తానని హామీ ఇచ్చారు. ఆయనను కలిసిన వారిలో అరకు దివంగత టీడీపీ నేత సివేరి సోమ సతీమణి ఇచ్చావతి కూడా ఉన్నారు. సోమను గతంలో నక్సలైట్లు కాల్చిచంపారు. తమ కుటుంబాన్ని ఆదుకోవాలని, తన కుమారుడి విద్యాభ్యాసానికి ప్రభుత్వపరంగా సాయం చేయాలని ఆమె కోరారు. సోమ కొడుకు చదువు బాధ్యత తాము తీసుకొంటామని చంద్రబాబు హామీ ఇచ్చారు. వైసీపీ గూండాల దాడిలో సర్వస్వం కోల్పోయామని, తమను ఆదుకోవాలని అరకులోయ మాజీ సర్పంచి వంతల శ్రీనివాసరావు కోరారు. మరి కొందరు పార్టీ కార్యకర్తలు సమస్యలు వివరించగా వారిని పార్టీ కార్యాలయానికి రావాలని సూచించారు. వారందరి వద్ద వినతిపత్రాలు తీసుకొని సచివాలయానికి వెళ్లారు. తాము పిలవగానే సీఎం కారు దిగి వినతి పత్రాలు తీసుకోవడంపై సందర్శకులు ఆనందం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో జగన్ ఇంటికి వెళ్లాలంటే కిలోమీటరు ఆవల నిలిపివేసి రకరకాల ప్రశ్నలు అడిగి ఆంక్షలు విధించేవారని, అదేమంటే కేసులు పెట్టడం, పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి సాయంత్రం వరకు కూర్చోబెట్టి పంపించేవారని ప్రజలు గుర్తుచేసుకున్నారు. చంద్రబాబు అందరినీ ఆప్యాయంగా పలకరించడం ఆయన గొప్ప వ్యక్తిత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న పాములు నాయక్ దంపతులు

మాట నిలబెట్టుకున్న చంద్రబాబు!

- నిరుపేద కుటుంబానికి 11 రోజులకే సొంతింటి కల సాకారం
- పాములు నాయక్ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన

తాడేపల్లి, జూలై 12: ఎన్నికల హామీలను అత్యంత వేగవంతంగా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.. తాను వ్యక్తిగతంగా ఇచ్చిన హామీలపై సైతం అంతే వేగంగా స్పందిస్తున్నారు. ఓ నిరుపేద కుటుంబానికి సొంతిల్లు కట్టిస్తానని మాటిచ్చి.. రెండు వారాలు తిరక్కుండానే ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేయించి మాట నిలబెట్టుకున్నారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీని సీఎం చంద్రబాబు గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం పెనుమాక గ్రామంలోని ఎస్టీ కాలనీ నుంచి ఈ నెల ఒకటో తేదీన ప్రారంభించిన విషయం తెలిసిందే!. నాడు కాలనీలో నివాసం వుంటున్న బాణావత్ పాములు నాయక్ ఇంటికి వెళ్లి పాములు నాయక్‌కు వృద్ధాప్య పింఛన్, ఆయన కుమార్తెకు వితంతు పింఛన్, భార్యకు రాజధాని పింఛన్‌ను స్వయంగా అందజేశారు. అనంతరం స్టీలు గ్లాసులో వారిచ్చిన టీ తాగి కుటుంబ యోగక్షేమాలను చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. తమకు ఇల్లు కట్టించి ఇవ్వాలని పాములు నాయక్ కుటుంబం అభ్యర్థించింది. స్పందించిన చంద్రబాబు అప్పటికప్పుడు ఇల్లు మంజూరు చేశారు. సరిగ్గా 11 రోజులకే ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. సొంతింటి నిర్మాణానికి పాములు నాయక్ దంపతులు శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం'పై తప్పుడు ప్రచారం

- పథకం మార్గదర్శకాలు విడుదల చేయలేదు: విద్యాశాఖ

అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): 'తల్లికి వందనం' పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు ఇంకా విడుదల చేయలేదని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ వెల్లడించారు. పథకం విధి విధానాలను ప్రభుత్వం తర్వాత ప్రకటిస్తుందన్నారు. అయితే ఈ పథకంలో అర్హతల పేరుతో తప్పుడు ప్రచారం జరుగుతోందని, వాటిని విశ్వసించొద్దని ప్రజలను కోరుతూ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆధార్ ఆధారంగా పథకాలు అమలు చేయాలనుకుంటే ప్రభుత్వం ఆధార్ చట్టం 2016 రెగ్యులేషన్స్‌పై గెజిట్ విడుదల చేయాల్సి ఉందని, దానినే ఇటీవ విడుదల చేసినట్టు వివరించారు. ఆ గెజిట్ కేవలం కేంద్ర ఆధార్ నిబంధనలకు అనుగుణంగా తీసుకున్న చర్య మాత్రమేనన్నారు. ఆ గెజిట్‌లో ఎక్కడా తల్లికి వందనం పథకం మార్గదర్శకాలు పొందుపరచలేదని పేర్కొన్నారు. కాగా.. ఆధార్ నిబంధనల గురించి ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్‌ను జగన్ మీడియా వక్రీకరించింది. వైసీపీ సోషల్ మీడియా విభాగం కూడా దుష్ప్రచారం ప్రారంభించింది. ప్రభుత్వం అర్హతల గురించి స్పష్టంచేసినట్లు, కుటుంబంలో ఒక్కరికే ఈ పథకం వర్తించనున్నట్టు ప్రచారం చేస్తోంది. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రుల్లోనూ ఆందోళన మొదలైన నేపథ్యంలో ప్రభుత్వం ఈ మేరకు వివరణ ఇచ్చింది.

'వందనం' తల్లికా.. బిడ్డలకా..?: షర్మిల



విజయవాడ, జూలై 12(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పేరుతో బడికి వెళ్లే ప్రతి బిడ్డకూ రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారని, అయితే తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన జీవోలో స్పష్టత లోపించిందని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. జీవోలో తల్లికి ఈ పథకాన్ని వర్తింపజేస్తామన్న అర్థం వచ్చేలా సారాంశం ఉందన్నారు. తల్లికి ఒక్కరికే ఇస్తారా, ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఇస్తారా అన్న విషయాన్ని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. తల్లికి వందనం పథకం గురించి ప్రశ్నిస్తున్న జగన్‌కు తాను చేసిన పనులు గుర్తులేవా అని చురకలు వేశారు. ఇక, కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్‌సిక్స్‌లో ఉన్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ఇంకా ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. దీనిపై అధ్యయనం చేసి విధివిధానాలు రూపొందిస్తామని మంత్రి ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ విషయంలో టీడీపీ నేతలు తలోమాట మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎవరికీ తోక పార్టీగా ఉండదని వైసీపీకి కౌంటర్ ఇచ్చారు. బీజేపీకి తోకపార్టీ అయినా, ఉంచుకున్న పార్టీ అయినా వైసీపీయేనని ఘాటుగా విమర్శించారు. అందువల్లే ఇటీవల జరిగిన లోక్‌సభ స్పీకర్ ఎన్నికలో బీజేపీకి వైసీపీ మద్దతు పలికిందన్నారు. వైసీపీలో వైఎస్సార్ లేరని, ఆయన ఆశయాలు నెరవేర్చాలన్న ఆశయం ఎవరికీ లేదని చెప్పారు. జగన్ ఓడిపోవడానికి ముందు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.4వేల కోట్లు పెట్టారని మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక్క నీటి ప్రాజెక్టునూ పూర్తి చేయలేదన్నారు. వైసీపీపై ఉన్న కక్షతో వైఎస్సార్ విగ్రహాల జోలికి వస్తే సహించేది లేదని షర్మిల హెచ్చరించారు.

గోతుల రోడ్లకు మోక్షం

(మొదటి పేజీ తరువాయి)



రోడ్లు, భవనాల శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు, ఉన్నతాధికారులు

చేసింది. తక్షణమే పనులు చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. రహదారి మరమ్మతుల్లో థర్మల్ విద్యుత్ ప్లాంట్ల నుంచివచ్చే బూడిద(ఫ్లైయాష్) వినియోగంపై పైలెట్ అధ్యయనం చేయాలని సూచించారు. శాస్త్ర, ఇంజనీరింగ్ నిపుణులతో కలిసి అధ్యయనం చేయాలని ఆర్అండ్‌బీని ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర రహదారులపై సమీక్ష నిర్వహించారు. ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, కార్యదర్శి కాంతిలాల్ దండే, ఇంజనీరింగ్ చీఫ్‌లు వేణుగోపాల్‌రెడ్డి, నయీముల్లా తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో 7,087 కిమీ పరిధిలో తక్షణమే మరమ్మతులు చేపట్టాల్సి ఉందని అధికారులు సీఎంకు నివేదించారు. ఈ గణాంకాలపై సీఎం విస్తుపోయినట్లు తెలిసింది. ఇన్ని వేల కిలోమీటర్ల మేర మరమ్మతులు చేయకుండా ఎలా ఉన్నారు? గతంలో అసలు ఏ పనీ చేయలేదా? అని ఆరాతీశారు. జగన్ హయాంలో రోడ్లను విధ్వంసం చేశారని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. 4,151 కిలోమీటర్ల రోడ్లపై తక్షణమే మరమ్మతులు చేపట్టి గుంతలు పూడ్చాలని, మరో 2 వేల కిలో మీటర్ల మేరకు రహదారులకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాల్సి ఉందని అధికారులు నివేదించారు. దీనికిగాను కనీసం రూ.350 కోట్ల పైనే నిధులు అవసరం ఉంటుందని సీఎంకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.

తక్షణం చర్యలు

4,151 కి.మీ. మేరకు రహదారులపై ఉన్న గుంతలు పూడ్చేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. దీనికి అవసరమైన రూ.286 కోట్ల నిధులు ఇస్తామని ఆర్అండ్‌బీకి హామీ ఇచ్చారు. ఓటాన్ అకౌంట్‌లో ఈ నిధులు కేటాయిస్తామని, రహదారుల రిపేర్లకు తక్షణమే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఇకపై ఏ సమస్య ఉన్నా తనదృష్టికి తీసుకురావాలని చంద్రబాబు ఆదేశించారు.

బూడిద వినియోగంపై..

థర్మల్ విద్యుత్ ప్లాంట్ల నుంచి వచ్చే బూడిద(ఫ్లైయాష్)ను రహదారి మరమ్మతులకు ఉపయోగించే అంశంపై పైలెట్ అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్అండ్‌బీకి సూచించారు. రోడ్లపై గుంతలు పూడ్చేందుకు బూడిదను ఉపయోగించాలని ఈ నెల 2న జరిగిన సమావేశంలో సీఎం ఆదేశించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 4 రహదారులపై ఈ ప్రయోగం చేశారు. విజయవాడలోనినున్న బైపాస్, నెల్లూరు ఎన్‌పీఎస్ రోడ్డు, ప్రొద్దుటూరు రహదారులపై ప్రయోగాత్మకంగా బూడిద వినియోగంతో గుంతలు పూడ్చారు. అయితే, ఆ ప్రయోగం పూర్తిగా విజయవంతం కాలేదు. గుంతలను పూడ్చేందుకు ఉపయోగించిన బూడిద బిట్‌మెన్, ఇతర మెటల్‌తో మిక్సింగ్ కావడం లేదు. దీంతో పొడివాతావరణంలో ఆ బూడిద వాహనాల రాకపోకలతో గాల్లోకి లేస్తోంది. ఈ ప్రయోగంపై ఆర్అండ్‌బీ ప్రజల నుంచి స్పందన కోరగా ప్రతికూలంగా వచ్చింది. ఇదే విషయాన్ని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు ఇద్దరు సీఆర్ఐకి చెందిన ఐఐటీ నిపుణులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా లైన్లోకి తీసుకొని మాట్లాడారు. వారు ఇచ్చిన సూచనలతో బూడిద వినియోగంపై పైలెట్ అధ్యయనం చేయాలని సూచించారు. ఐఐటీ ఖరగ్‌పూర్, ఐఐటీ రూర్కీ, సీఆర్ఆర్ఐ, ఢిల్లీ, ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీ అమరావతి నిపుణుల సహకారంతో అధ్యయనం చేయాలని సీఎం ఆదేశించారు.

హైకోర్టు చీఫ్ జస్టిస్‌తో సీఎం చంద్రబాబు భేటీ

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌తో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. శుక్రవారం విజయవాడ బందర్ రోడ్డులో ఉన్న చీఫ్ జస్టిస్ అధికారిక నివాసానికి వెళ్లి ఆయన్ను కలిశారు. సీఎంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రధాన న్యాయమూర్తిని ఆయన కలవడం ఇదే ప్రథమం. ఇది మర్యాదపూర్వక భేటీ మాత్రమేనని అధికార వర్గాలు తెలిపాయి. మధ్యలో ఆగిపోయిన హైకోర్టు నూతన భవన నిర్మాణం, హైకోర్టు న్యాయమూర్తుల నివాస భవనాల పూర్తికి ప్రభుత్వపరంగా తీసుకుంటున్న చర్యలు, ప్రస్తుత హైకోర్టు భవనంలో ఇంకా అదనంగా కల్పించాల్సిన వసతులు తదితర అంశాలు వారి మధ్య చర్చకు వచ్చినట్లు తెలిసింది.

అంబానీ ఇంట పెళ్లి రిసెప్షన్ నేడు ముంబైకి బాబు

రిలయన్స్ కంపెనీ అధినేత ముఖేశ్ అంబానీ ఇంట వివాహ కార్యక్రమానికి చంద్రబాబు హాజరు కానున్నారు. అంబానీ కుమారుడు అనంత్‌కు రాధికా మర్చంట్‌తో శుక్రవారం వివాహం జరిగింది. రిసెప్షన్ శనివారం రాత్రి ముంబైలో జరుగనుంది. చంద్రబాబు సాయంత్రం అక్కడకు చేరుకుంటారు. రిసెప్షన్‌కు హాజరై ఆ రాత్రి అక్కడే బస చేస్తారు. ఆదివారం మధ్యాహ్నం అమరావతికి తిరిగొస్తారు. ఈ పెళ్లిలో పాల్గొనేందుకు మంత్రి లోకేశ్ శుక్రవారమే ముంబై వెళ్లారని టీడీపీ వర్గాలు తెలిపాయి. కాగా.. చంద్రబాబు ఆయన శనివారం ఉదయం 8.30గంటలకు మంగళగిరి నియోజకవర్గం కొలనుకొండ గ్రామంలోని గోకుల క్షేత్రంలో నిర్మిస్తున్న వెంకటేశ్వర ఆలయంలో అనంత శేష స్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం టీడీపీ కేంద్ర కార్యాలయానికి వెళ్తారు. పార్టీ కార్యకర్తలను, సందర్శకులను కలుస్తారు. పార్టీ నేతలతో భేటీ అవుతారు.

ఏపీ సీఈవోగా వివేక్ యాదవ్

- మీనా స్థానంలో నియామకానికి ఆమోదం
- సీఎస్ నీరబ్‌కు కేంద్ర ఎన్నికల సంఘం లేఖ



అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి(సీఈవో)గా వివేక్ యాదవ్‌ను నియమించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) ఆమోదించింది. ఈ మేరకు ఈసీ నుంచి సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్‌కు లేఖ అందింది. ముకేష్ కుమార్ మీనా ప్రస్తుతం సీఈవోగా ఉన్నారు. మూడేళ్ల క్రితం ఈ పోస్టులోకి వచ్చారు. అసెంబ్లీ ఎన్నికలు మొత్తం మీనా నేతృత్వంలోనే జరిగాయి. రాష్ట్రంలో 81.66 శాతం ఓటింగ్ నమోదు కావడానికి ఆయన చర్యలే కారణమయ్యాయి. చంద్రబాబు ప్రభుత్వం ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించాలనే ఉద్దేశంతో కొత్త సీఈవో నియామకానికి ఈసీకిముగ్గురు పేర్లు పంపించింది. రాష్ట్ర ప్రభుత్వ విన్నపం మేరకు మీనాను ఈసీ రిలీవ్ చేయడంతో పాటు కొత్త ఎన్నికల అధికారి నియమానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మొన్నటి వరకు సీఆర్‌డీఏ కమిషనర్‌గా విధులు నిర్వహించిన వివేక్ యాదవ్ పేరును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను ఈసీ ఆమోదించింది.

ఏపీకి ఐఏఎస్ కృష్ణతేజ.. వచ్చే వారంలో రాక



అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): కేరళ ఐఏఎస్ అధికారి వీఆర్ కృష్ణతేజ ఏపీకి వచ్చేందుకు లైన్ క్లియర్ అయింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచనల మేరకు ఆయనను ఏపీకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. కేరళ ప్రభుత్వం ఆయనను ఏపీకి పంపించేందుకు ఎన్‌వోసీ ఇచ్చింది. మరోవైపు.. రాష్ట్ర ప్రభుత్వం విన్నపం మేరకు ఆయనను స్టేట్ డిప్యుటేషన్ కింద ఏపీకి పంపించేందుకు కేంద్రం ఆమోదించింది. ఈ మేరకు శుక్రవారం అపాయింట్‌మెంట్స్ కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. తొలి విడతలో మూడేళ్ల పాటు ఆయన ఏపీలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహించేందుకు కమిటీ అంగీకారం తెలిపింది. వచ్చే వారంలో ఆయన ఏపీలో రిపోర్ట్ చేసే అవకాశం ఉంది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చూస్తున్న శాఖల్లో ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించనున్నారు.

సమాచార శాఖ డైరెక్టర్‌గా హిమాన్షు బాధ్యతలు



అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారి హిమాన్షు శుక్లా బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం ఎన్టీఆర్ భవన్‌లో ఉన్న సమాచార శాఖ కార్యాలయంలో డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. తొలిరోజు వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీమ్ పథకాన్ని 2024-25 ఆర్థిక సంవత్సరానికి పొడిస్తూ నిర్ణయం తీసుకున్నారు. హెల్త్ స్కీమ్ పొడిగింపునకు సమాచార శాఖ ప్రతిపాదనలు పంపించగా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ స్కీమ్ ద్వారా జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల వరకు వైద్య సేవలు అందుతాయని శుక్లా తెలిపారు. ఇలా ఏడాదికి ఎన్నిసార్లు అయినా ఈ కార్డును ఉపయోగించుకోవచ్చని చెప్పారు. అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

పెట్టుబడుల ముఖ్య కార్యదర్శి బాధ్యతలు

రాష్ట్ర పెట్టుబడులు, మౌలికవసతుల ముఖ్య కార్యదర్శిగా ఎస్. సురేశ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. పాఠశాల విద్యా శాఖ కమిషనర్‌గా ఉన్న ఆయనను ప్రభుత్వం బదిలీ చేసింది. పెట్టుబడులు, మౌలిక వసతుల ముఖ్య కార్యదర్శిగా నియమించింది. శుక్రవారం ఉదయం సచివాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం, మంత్రి బీసీ జనార్దన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆరోగ్యశ్రీ ట్రస్ట్.. ఇక డా.ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్

అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ ట్రస్టు పేరును ప్రభుత్వం మార్పు చేసింది. వైసీపీ హయాంలో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీగా మార్చిన పేరును తిరిగి డా.నందమూరి తారక రామారావు వైద్య సేవ ట్రస్ట్‌గా తిరిగి మార్పు చేశారు. ఈ మేరకు ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ట్రస్ట్ వెబ్‌సైట్‌లో ఇప్పటికే అధికారులు పేరు మార్చారు.

జగన్‌పై హత్యాయత్నం కేసు

(మొదటి పేజీ తరువాయి)



హత్యాయత్నం కేసు నమోదైంది. గురువారం రాత్రి రఘురామరాజు మెయిల్ ద్వారా గుంటూరులోని నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు పంపగా.. దాని ప్రకారం 120బీ, 166, 167, 197, 307, 326, 465, 506(34) తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇందులో ఏ-1గా సునీల్ కుమార్, ఏ-2గా పి.సీతారామాంజనేయులు, ఏ-3గా జగన్, ఏ-4గా అప్పటి సీఐడీ అదనపు ఎస్పీ కె విజయపాల్, ఏ-5గా నాటి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్ ప్రభావతిలను పేర్కొన్నారు. మూడేళ్ల కిందట అప్పటి సీఎం జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే కారణంతో రఘురామరాజుపై సీఐడీ అధికారులు కేసు (క్రైమ్ నంబర్ 12/2021) నమోదు చేశారు. ఆయన హైదరాబాద్‌లోని తన నివాసంలో ఉండగా 2021 మే 14న సీఐడీ అధికారులు బలవంతంగా అరెస్టు చేసి వాహనంలో గుంటూరు సీఐడీ కార్యాలయానికి తరలించారు. ఆయన్ను హైదరాబాద్‌లోని స్థానిక మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచలేదు. కనీసం ట్రాన్సిట్ వారెంటు కూడా తీసుకోలేదు. అర్ధరాత్రి 11:30 గంటల సమయంలో నేరుగా గుంటూరు మెడికల్ కళాశాల వెనుక ఉన్న సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి తరలించారు. అప్పటి సీఐడీ చీఫ్ సునీల్‌కుమార్, ఇంటెలిజెన్స్ డీజీ సీతారామాంజనేయులు అక్కడకు వచ్చి తనపై హత్యాయత్నం చేయించారని రఘురామరాజు తాజాగా ఫిర్యాదు చేశారు. ఆ రోజు రాత్రి సీఐడీ కార్యాలయంలో తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని.. తనకు బైపాస్ సర్జరీ జరిగిందని చెప్పినా వినిపించుకోకుండా తన గుండెలపై కూర్చుని ఒత్తిడి పెంచారని.. లాఠీలతో కొట్టి చంపాలని ప్రయత్నించారని అందులో పేర్కొన్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో రబ్బరు బెల్టుతో, లాఠీలతో తనపై విచక్షణరహితంగా దాడి చేసి కొట్టారని.. కనీసం తనకు మందులు వేసుకునే అవకాశం కూడా ఇవ్వలేదని తెలిపారు. అనంతరం తన వద్ద నుంచి సెల్‌ఫోన్‌ను బలవంతంగా గుంజుకుని.. పాస్‌వర్డ్ చెప్పేవరకు కొట్టారని వెల్లడించారు. అంతేగాక సీఎం జగన్‌ను విమర్శిస్తే చంపేస్తానని సునీల్ కుమార్ తనను హెచ్చరించారని తెలిపారు. మర్నాడు తనను వైద్య పరీక్షలకు జీజీహెచ్‌కు తరలించగా అప్పటి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి పోలీసు అధికారుల సూచన మేరకు తప్పుడు సర్టిఫికెట్ జారీ చేశారని.. తన శరీరంపై ఎటువంటి దెబ్బలు లేవని.. ఎటువంటి సంఘటనా జరుగలేదన్నట్లుగా ఆమె తప్పుడు నివేదిక అందించారని పేర్కొన్నారు. వైద్య పరీక్షల అనంతరం రఘురామను గుంటూరులోని సీఐడీ కోర్టులో హాజరుపరిచారు. పోలీసుల దెబ్బలకు నడవలేని స్థితిలో ఉన్న ఆయన కుంటుకుంటూ కోర్టులోకి వెళ్లారు. పోలీసులు తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని, లాఠీలతో కుళ్లబొడిచారని మేజిస్ట్రేట్‌కు ఫిర్యాదు చేశారు. వారు కొట్టిన దెబ్బలకు అరికాళ్లు కమిలిపోయాయంటూ ఆ దెబ్బలను చూపించారు. మేజిస్ట్రేట్ ఆయన వాంగ్మూలం నమోదు చేసుకుని.. జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు నిర్వహించాలని ఉత్తర్వులిచ్చారు. అయితే ప్రభుత్వ వైద్యశాలలో నిర్వహించే పరీక్షలపై నమ్మకం లేదని.. తనకు ప్రైవేటు ఆస్పత్రిలో పరీక్షలు చేయించాలని కోరుతూ రఘురామ హైకోర్టును ఆశ్రయించారు. అయితే జీజీహెచ్‌లో వైద్య పరీక్షల నివేదికను స్థానిక కోర్టుతోపాటు తమకూ సీల్డ్ కవర్‌లో అందించాలని న్యాయస్థానం ఆదేశించింది. అనంతరం రఘురామ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హైదరాబాద్‌లోని ఆర్మీ ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలని, వైద్య పరీక్షల నివేదికను సీల్డ్ కవర్లో తమ ముందుంచాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. అక్కడ చికిత్స పొందిన అనంతరం ఆయన ఢిల్లీ చేరుకున్నారు. ఆర్మీ ఆస్పత్రి ఇచ్చిన వైద్య నివేదికను సీల్డ్ కవర్‌లో సుప్రీంకోర్టుకు అందజేశారు. ఒక ఎంపీ పైనే హత్యాయత్నం జరిగితే కేసు నమోదు చేసే పరిస్థితి కూడా ఆనాడు రాష్ట్రంలో లేదు. మూడేళ్ల తర్వాత ఇప్పుడు జగన్‌తో పాటు ఇద్దరు సీనియర్ ఐపీఎస్ అధికారులపై హత్యాయత్నం కేసు నమోదుకావడం సంచలనంగా మారింది. తెలుగు రాష్ట్రాల్లో కలకలం రేపుతోంది.

ఆ రోజు తనను చంపేసేవారేనని..

సీఐడీ కస్టడీలో ఆ రోజు తనను చంపేసేవారేనని ఆనాటి ఘటనను తలచుకుని రఘురామరాజు పలు సందర్భాల్లో చెప్పారు. రాష్ట్రంలో అడుగుపెడితే చంపేస్తారని కనీసం సొంత నియోజకవర్గానికి వెళ్లడానికి కూడా భయపడ్డారు. పైగా నరసాపురం నియోజకవర్గంలో ఆయనపై వైసీపీ నేతలు పలు కేసులు నమోదు చేయించారు. అడుగుపెడితే అరెస్టు తప్పదని హెచ్చరికలు చేశారు. దీంతో ఆయన ఢిల్లీ, హైదరాబాద్‌లలోనే నివసిస్తూ వచ్చారు. అయినా ఓసారి తాను హైదరాబాద్ నుంచి నరసాపురానికి రైల్లో బయల్దేరానని.. తనను చంపడానికి కుట్ర చేశారని తెలుసుకుని మధ్యలోనే రైలు దిగి వెనక్కి వెళ్లిపోయానని ఆయన ఒక సందర్భంలో ప్రకటించారు.

వివాదంలో ఐపీఎస్ సునీల్!

- సుప్రీంకోర్టు నిర్ణయం వక్రీకరణ
- రఘురామరాజు కేసులో ఎఫ్ఐఆర్‌పై అసత్యాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్ వివాదంలో చిక్కుకున్నారు. జగన్ పాలనలో వైసీపీ చట్టాన్ని అమలు చేసిన ఆయన.. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) కింద నమోదైన ఎఫ్ఐఆర్ విషయంలో చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. ఏకంగా సుప్రీంకోర్టు నిర్ణయాన్నే ఆయన వక్రీకరించారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోషల్ మీడియా వేదికగా న్యాయస్థానాల నిర్ణయాలపై డీజీ ర్యాంకు అధికారి చేసిన వ్యాఖ్యలు ఆలిండియా సివిల్ సర్వీసు రూల్స్ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని న్యాయ నిపుణులు అంటున్నారు. తనపై వచ్చిన ఆరోపణలకు వివరణ ఇచ్చే ప్రయత్నం చేసిన సీనియర్ ఐపీఎస్ అధికారి (రిటైర్డ్) ఏబీ వెంకటేశ్వరరావుపై జగన్ ప్రభుత్వం చర్య తీసుకోవడాన్ని ఇక్కడ ప్రస్తావిస్తున్నారు. తనపై కేసు పెట్టడంపై సునీల్‌కుమార్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'సుప్రీంకోర్టులో మూడేళ్లు నడిచి సాక్షాత్తూ సుప్రీంకోర్టే తిరస్కరించిన కేసులో కొత్తగా ఎఫ్ఐఆర్ వేయడాన్ని ఏమనాలో మీ విజ్ఞతకే వదిలేస్తున్నా' అని పోస్టు పెట్టారు. ఈ వ్యాఖ్య ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతోంది. రఘురామరాజు కుమారుడు వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించలేదు. 'మేం హైకోర్టుకు వెళ్తాం.. ఇక్కడ పిటిషన్ ఉపసంహరించుకుంటాం' అని ఆయన కోరడంతో అందుకు సమ్మతించింది. దీనికి సునీల్ వక్రభాష్యం చెబుతూ... ఎఫ్ఐఆర్ నమోదును బహిరంగంగా తప్పుబట్టడం ద్వారా ఆలిండియా సర్వీసు రూల్స్ ఉల్లంఘించారు. సుప్రీంకోర్టు మూడేళ్ల క్రితమే మూసేసిందనడం తప్పుడు సమాచారమేనని నిపుణులు అంటున్నారు. కేసులో ఇరుక్కుని అడ్డగోలు వాదనలు వినిపిస్తున్న సునీల్ ఇప్పుడు తనను తాను రక్షించుకోవడానికి కుల ప్రస్తావన తీసుకొస్తున్నారు. 'దళితులకు ఎక్కడ అన్యాయం జరిగినా అక్కడ నేనుంటా..' అంటూ మరో ట్వీట్ చేశారు. దీనిపై సీనియర్ ఐపీఎస్ అధికారులు స్పందిస్తూ... ఆలిండియా సర్వీసుల్లో ఉన్న వ్యక్తి ఒక వర్గాన్ని అడ్డుపెట్టుకోవడాన్ని నిలదీస్తున్నారు. 'నిజంగా ఆయన దళిత పక్షపాతి అయితే డాక్టర్ సుధాకర్‌ను నడిరోడ్డుపై చేతులు కట్టేసి చితకబాదినప్పుడు ఎక్కడున్నారు? ఎమ్మెల్సీ అనంతబాబు తన డ్రైవర్‌ను చంపి శవాన్ని డోర్ డెలివరీ చేసినప్పుడు ఏమయ్యారు? రాజమండ్రిలో దళిత యువకుడికి శిరోముండనం చేసినప్పుడు ఎక్కడ దాక్కున్నారు? అమరావతిలో దళిత రైతులపై అట్రాసిటీ కేసులు పెట్టినప్పుడు ఆయన సోషల్ మీడియాలో పోస్టులు ఎందుకు పెట్టలేదు? ఆయనపై గృహహింస కేసు పెట్టిన సహధర్మచారిణి దళిత మహిళ కాదా' అని నెటిజెన్లు ప్రశ్నలవర్షం కురిపిస్తున్నారు.



వ్యర్థాల నిర్వహణపై ఏర్పాటు చేసిన ప్రదర్శనను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

12గంటల్లోపు సేకరిస్తే చెత్త... సంపదే

- ఏడాదికి 2,643 కోట్ల ఆదాయానికి చాన్స్
- పిఠాపురంలో ఎస్ఎల్ఆర్ఎం పైలట్ ప్రాజెక్టు : పవన్ కల్యాణ్

అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): చెత్తను 12 గంటల్లోపు సేకరిస్తే సంపద అవుతుందని, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ గ్రామాల స్వయం సమృద్ధికి ఎంతో దోహదకారి అవుతుందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. శుక్రవారం తాడేపల్లి పంచాయతీరాజ్ కమిషనరేట్‌లో 'ఘన, ద్రవ వనరుల నిర్వహణ (ఎస్ఎల్ఆర్ఎం)'కు సంబంధించి స్వచ్ఛాంధ్ర సంస్థ ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో పవన్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 13,301 గ్రామపంచాయతీల్లో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ ద్వారా ఏటా రూ.2,643 కోట్ల ఆదాయం గడించవచ్చని, ఈ నిధులతో ఆయా పంచాయతీలు స్వయం సమృద్ధి సాధించే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. నదులు, సంప్రదాయాలు, పంచభూతాలకు విలువనిచ్చి గౌరవించే దేశం మనదని గుర్తుచేశారు. అవి కలుషితం కాకుండా ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. తొలుత పిఠాపురంలో పైలట్ ప్రాజెక్టు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. మనం పూజించే ఆవులు ప్లాస్టిక్ కవర్లు తిని చనిపోతున్నాయని, చెత్త నిర్వహణ లేకపోతే అనేక అనర్థాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఘన, ద్రవ వ్యర్థాలను సంపదగా మార్చేందుకు శ్రీనివాసన్ దశాబ్దాలుగా శ్రమించారని తెలిపారు. పిఠాపురంలోని 54 పంచాయతీల్లో స్వయం సహాయక బృందాలతో రోజుకు రెండుసార్లు పొడి, తడి చెత్తను సేకరించి, నిర్వహణ చేపడతామని చెప్పారు. ఈ విషయంలో ప్రజలు కూడా బాధ్యత తీసుకోవాలని కోరారు. మాస్టర్ ట్రైనర్ల ఆధ్వర్యంలో ఘన, ద్రవ వనరుల నిర్వహణపై అందరికీ అవగాహన కల్పిస్తామని తెలిపారు. ముందుగా తన క్యాంపు ఆఫీసు వద్ద మొదలుపెట్టి చెత్త తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేసిందని, దానికి పలు రాజకీయ కారణాలు కూడా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో జరిగిన ప్రతి అవినీతి వెనుక ఒక ఐఏఎస్ అధికారి పేరు వినిపిస్తోందని చెప్పారు. ఆ అధికారిపై ఏం చర్యలు తీసుకోవాలి? చర్యలు తీసుకున్నంత మాత్రాన ఎంతవరకు ప్రయోజనం ఉంటుందని అన్నారు. ఏఐఐబీ రోడ్ల కోసం రుణం మంజూరుచేస్తే 30శాతం రాష్ట్ర వాటా చెల్లించకపోవడంతో బ్యాంకు డబ్బులు విడుదల చేయక పనులు ఆగిపోయే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. జీఎస్టీ భారం పెరగడమే కాకుండా రెండేళ్లలో పూర్తికావాల్సిన ప్రాజెక్టు నిలిచిపోయిందని అన్నారు. ఇప్పుడు మళ్లీ డిసెంబరు వరకూ పనులు చేసేందుకు అనుమతి లభించిందని చెప్పారు. ప్రతినెలా రూ.200 కోట్లు ఖర్చు చేస్తే దానిని రీయింబర్స్ చేస్తామని ఏఐఐబీ చెబుతోందని వివరించారు. అంతకుముందు 'వేస్ట్ టు గోల్డ్' అనే కాన్సెప్ట్‌తో ఘన, ద్రవ వనరుల నిర్వహణపై కన్సల్టెంట్ శ్రీనివాసన్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.

తీర ప్రాంత నిర్వహణపై ప్రణాళిక విడుదల

తీరప్రాంత సంరక్షణ, నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో సముద్రపు కోత ముప్పు నివారించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. శుక్రవారం మంగళగిరిలోని తన నివాసంలో పవన్ సమక్షంలో నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్, ఏపీ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ తీర ప్రాంత నిర్వహణపై అవగాహన ఒప్పందం చేసుకున్నాయి. అలాగే ఎన్‌సీసీఆర్ నిపుణులు రూపొందించిన తీర ప్రాంత నిర్వహణ ప్రణాళికను ఆయన విడుదల చేశారు. తీరప్రాంతంలో కోత, కెరటాల శక్తిని తగ్గించడంతో పాటు వీటివల్ల వచ్చే ప్రమాదాలను తగ్గించేందుకు ఈ ప్రణాళిక ఉపయోగపడుతుందని చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

అటవీశాఖలో సీ ఫ్యాన్స్ గందరగోళం

- ఇంకా కొనసాగుతున్న దర్యాప్తు
- రోజులు గడుపుతున్న అధికారులు
- పిటిషన్లు దాఖలు చేయడంలో అయోమయం

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

దేశంలో అత్యంత ఖరీదైన సీ ఫ్యాన్స్‌ను స్వాధీనం చేసుకున్నాం. ఇదొక అరుదైన కేసు. సముద్రగర్భంలో ఉన్న సీ ఫ్యాన్స్‌ను స్వాధీనం చేసుకున్న సమయంలో అటవీ శాఖ అధికారులు చెప్పిన మాటలు ఇవి. ఇప్పుడు ఈ కేసు దర్యాప్తులో ఎలా ముందుకు వెళ్లాలో తెలియక అటవీశాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కొద్దిరోజుల క్రితం రూ.94లక్షల విలువచేసే సీ ఫ్యాన్స్‌ను స్వాధీనం చేసుకుని శ్రీనివాసరావు అనే నిందితుడిని అరెస్టు చేశారు. నిందితుడిని పోలీసు కస్టడీకి తీసుకుని విచారిస్తామని అధికారులు చెప్పారు. ఇప్పటివరకు ఈ పిటిషన్‌ను దాఖలుచేయలేదు. దర్యాప్తు ఎంత సాగిందో వివరాలు వెల్లడించడం లేదు. సీ ఫ్యాన్స్‌ను సముద్రగర్భం నుంచి పైకి తీసుకువస్తున్న వారు ఎవరన్నది ఇప్పటి వరకు తెలియలేదు. సీ ఫ్యాన్స్‌ను సముద్రగర్భం నుంచి బయటకు తీసుకురావడానికి ఒక మాఫియా పని చేస్తోందని అధికారులు అనుమానించారు. దీనివెనుక పెద్ద తలకాయలు ఉన్నాయన్న భావనకు వచ్చారు. అరెస్టు సమయంలో విచారించినప్పుడు ఈ సీ ఫ్యాన్స్‌ను ములుగు జిల్లాలోని మేడారంలో నిర్వహించిన సమ్మక్క-సారక్క జాతరలో కొనుగోలు చేశానని నిందితుడు వెల్లడించాడు. ఒక బృందం విజయవాడ నుంచి మేడారానికి వెళ్లింది. అక్కడ విచారించగా అటువంటి వస్తువులను ఇప్పటివరకు ఇక్కడ విక్రయించలేదని గిరిజనులు చెప్పారు. దీనితో శ్రీనివాసరావు కట్టుకథ చెప్పాడని నిర్ధారణ అయింది. సముద్ర గర్భంలో ఉన్న ఈ జలరాశులను పైకి తెచ్చే ముఠా వివరాలు తెలియాలంటే శ్రీనివాసరావును కస్టడీలోకి తీసుకోవాలని అధికారులు భావించారు. జుడిషియల్ రిమాండ్‌లో ఉన్న నిందితుడిని కస్టడీలోకి తీసుకోవాలంటే ముందుగా కోర్టులో పిటిషన్ దాఖలు చేయాలి. ఇప్పటి వరకు అధికారులు ఎలాంటి పిటిషన్ దాఖలు చేయలేదు. నిందితుడికి బెయిల్ ఇవ్వొద్దని మాత్రం పిటిషన్ దాఖలు చేశారు. నిందితుడి సెల్‌ఫోన్ ఆధారంగా సీడీఆర్ తీయాలని భావించినా అదీ ముందుకు సాగడం లేదు. మొత్తంగా సీ ఫ్యాన్స్ కేసు విషయంలో అటవీ శాఖ అధికారుల తీరు మాత్రం పూర్తిగా గందరగోళంగా కనిపిస్తోంది. నిందితుడి బ్యాంక్ అకౌంట్లను సీజ్ చేసినా అందులో ఎన్ని నిధులున్నాయో తెలియని పరిస్థితి. మొదట్లో హడావుడి చేసిన అధికారులు తర్వాత కేసుపై పెద్దగా దృష్టి పెట్టడంలేదన్న విమర్శలు ఉన్నాయి.



దుర్గగుడికి సారె తీసుకొచ్చిన పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, కాణిపాకం ఈవో వెంకటేశ్ తదితరులు

దుర్గమ్మకు కాణిపాకం దేవస్థానం సారె

వన్‌టౌన్, జూలై 12: ఆషాఢమాసం సందర్భంగా కనకదుర్గమ్మకు చిత్తూరు జిల్లా కాణిపాకంలోని వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం నుంచి శుక్రవారం సారె సమర్పించారు. పూతలపట్టు ఎమ్మెల్యే కె.మురళీమోహన్, ఆలయ ఈవో ఎ.వెంకటేశ్, ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ మణినాయుడు, ఏఈవో కె.విద్యాసాగర్, ఆలయ ఉద్యోగులు సారె తీసుకొచ్చారు. మహామండపం ఆరో అంతస్తులో అమ్మవారి ఉత్సవమూర్తి వద్ద పూజలు చేశారు. సారె తెచ్చిన ఎమ్మెల్యే తదితరులకు దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఈవో రామారావు, అర్చక బృందం, అధికారులు సాదరస్వాగతం పలికారు. ప్రసాదం, అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

మా ఉద్యోగాలు మాకు ఇప్పించండి

- ప్రభుత్వానికి భవానీ ఐలాండ్ టూరిజం కార్పొరేషన్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వినతి

విద్యాధరపురం, జూలై 12: తమను అన్యాయంగా విధుల నుంచి తొలగించిన భవానీ ఐలాండ్ టూరిజం కార్పొరేషన్ అధికారులపై సమగ్ర విచారణ జరిపించాలని, తమను మరలా ఉద్యోగాల్లోకి తీసుకోవాలని సంస్థలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌ను కలిసి విన్నవిస్తామన్నారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో విధుల నుంచి తొలగించిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పి.రవీంద్ర, ఎస్.రాజ్యలక్ష్మి, ఎం.శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, తిరుమలరావు మాట్లాడారు. తమను అన్యాయంగా తొలగించిన అధికారులపై విచారణ జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏడేళ్లుగా భవానీ ఐలాండ్‌లో కొందరు స్వీపర్లుగా, మరికొందరు సెక్యూరిటీగార్డులుగా, బ్యాటరీ కారు డ్రైవర్‌గా 11 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులం పనిచేస్తున్నామని తెలిపారు. సివిల్ ఏఈ శశికుమార్, ఎలక్ట్రికల్ ఏఈ షంషుద్దీన్ ఆదేశాలతో భవానీ ఐలాండ్‌లోకి వచ్చిన టూరిస్టులకు టికెట్లు ఇవ్వడం, డబ్బును బ్యాంకు అకౌంట్‌కు డిపాజిట్ చేయడం చేస్తామని, పనులన్నీ ఏఈల పర్యవేక్షణలో జరుగుతాయని తెలిపారు. గత ఏడాది మే 1న ఐదుగురు గుప్పెట్లో భవానీద్వీపం పేరిట పత్రికల్లో కథనం వచ్చిందని తెలిపారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కాస్‌లో జాయిన్ చేసేందుకు రూ.5వేలు చొప్పున తీసుకున్నారని, బకాయి పడిన మూడు నెలల జీతం ఇవ్వడానికి ఏఈ లంచం తీసుకున్నాడని ఒక పత్రికలో వచ్చిందని తెలిపారు. ఆ కథనాలకు, తమకు ఎటువంటి సంబంధం లేనప్పటికీ ఆప్కాస్‌లో చేర్పించేందుకు లంచం తీసుకున్నారని పత్రికలకు చెప్పింది మీరేనని ఏఈలు తమపై కక్ష సాధించి శారీరకంగా, మానసికంగా హింసకు గురిచేసి తమను దొంగలుగా ముద్ర వేశారని ఆవేదన వ్యక్తంచేశారు. కిందటేడాది డిసెంబర్ 11న తమందరి ఫోన్లను జనరల్ మేనేజర్ తీసుకుని తెల్లకాగితాలపైన సంతకాలు చేయించుకున్నారని తెలిపారు. ఏ తప్పు చేయనప్పటికీ తమపై నిందలు వేశారని, విచారణ లేకుండానే డిసెంబర్ 18న అందరినీ ఉద్యోగాల నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగం పోవడంతో కత్తెరశెట్టి రవిబాబు మానసిక ఒత్తిడికి గురై అనారోగ్యంతో చనిపోయారన్నారు.

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి



డీఆర్ఎం కార్యాలయం వద్ద గేట్ మీటింగ్ నిర్వహిస్తున్న ఆర్ఎంయూ నాయకులు

రైల్వేస్టేషన్, జూలై 12: నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజన్ అధ్యక్షుడు రాము గుప్తా డిమాండ్ చేశారు. విజయవాడ డీఆర్ఎం కార్యాలయం వద్ద యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కొత్త పెన్షన్, పాత పెన్షన్ విధానంలో వ్యత్యాసాలను వివరించారు. స్టాక్ మార్కెట్‌పై ఆధారపడి పెన్షన్ చెల్లించే కొత్త విధానాన్ని వ్యతిరేకించారు. సర్వీస్ చివరిలో జీతంలో సగభాగం ఇచ్చేంత వరకు యూనియన్ పోరాటం చేస్తుందని డివిజనల్ సెక్రటరీ లీల అన్నారు. సామాజిక భద్రత కల్పించే పాత పెన్షన్ విధానమే అమలు చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ సీహెచ్ శంకరరావు డిమాండ్ చేశారు. పాములు,శేఖర్‌బాబు, వాసు, వెంకటేశ్వరరావు, సుధీర్, సుబ్బారావు, షరీఫ్, శ్రీనివాసరావు, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

విజయవాడ రైల్వేస్టేషన్‌లో సీసీఎం తనిఖీలు

రైల్వేస్టేషన్, జూలై 12: విజయవాడ రైల్వేస్టేషన్‌లో శుక్రవారం ప్రయాణికుల సేవల విభాగం చీఫ్ కమర్షియల్ మేనేజర్(సీసీఎం) డి.సత్యనారాయణ తనిఖీలు నిర్వహించారు. పాత బుకింగ్ ఆఫీస్ దగ్గర నుంచి తనిఖీలు ప్రారంభించి అన్ని క్యాటరింగ్ స్టాల్స్, జన్ ఆహార్ యూనిట్లు, ప్రధాన ఫాస్ట్‌ఫుడ్ యూనిట్లను తనిఖీ చేశారు. ఆహార నాణ్యత, పరిశుభ్రత, ధరలను పరిశీలించారు. ఫుడ్‌ప్లాజా ఆహార తయారీ విభాగంలో పరిశుభ్రతపై సూచనలు చేశారు. నాణ్యమైన ఆహారాన్ని సరసమైన ధరలకు ప్రయాణికులకు అందించాలని ఆయన సూచించారు. వాటర్ వెండింగ్ మెషీన్‌ను, ఈస్ట్ సర్క్యులేటింగ్ ఏరియాలో రైల్‌కోచ్ రెస్టారెంట్‌లో సౌకర్యాలను పరిశీలించారు. ఒకటో నెంబర్ ప్లాట్‌ఫాంపై రిటైరింగ్ రూమ్‌లలో పరిశుభ్రత, నిర్వహణ, సౌకర్యాలను పరిశీలించి సూచనలు చేశారు. డీసీఎం ఎండీ అలీ ఖాన్, ఏసీఎం వి.రవివర్మ, స్టేషన్ డైరెక్టర్ ఎం.శైలజ పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర



రథయాత్రలో పాల్గొన్న ఎంపీ కేశినేని చిన్ని, మంత్రి కొల్లు రవీంద్ర

లబ్బీపేట, జూలై 12: నగరంలో శుక్రవారం నిర్వహించిన జగన్నాథ రథయాత్ర భారీ సంఖ్యలో పాల్గొన్న భక్తుల కోలాహలం నడుమ వైభవంగా సాగింది. బందరు రోడ్డులోని డీ అడ్రస్ మాల్ నుంచి రథయాత్ర ప్రారంభమై నగరంలోని పలు ప్రాంతాల్లో కొనసాగింది. కార్యక్రమంలో మంత్రులు కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) పాల్గొన్నారు. పూరీలో జగన్నాథ యాత్రను చూడలేని నగర ప్రజలు ఈ యాత్రను చూసి స్వామి ఆశీస్సులు పొందుతున్నారని వారు అన్నారు. భగవద్గీతను ప్రతీ ఒక్కరూ పఠించాలనే లక్ష్యంతో ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. జిల్లాలో శ్రీకృష్ణుడి మందిరం నిర్మాణానికి తమ వంతు సహకారం అందిస్తామని వారు తెలిపారు. విశేష పూజల అనంతరం స్వామి రథోత్సవాన్ని తాడులాగి ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. రథయాత్ర నగరంలో పీవీపీ మాల్, పాలిక్లినిక్ రోడ్డు, ఫన్‌టైం రోడ్డు, పంటకాలువ రోడ్డు, కృష్ణవేణి రోడ్డు మీదుగా స్క్యూ బ్రిడ్జి దగ్గర ఇస్కాన్ మందిరం వరకు సాగింది. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ, కోమటి జయరామ్, పాతూరి నాగభూషణం ఇస్కాన్ మందిర అధ్యక్షుడు చక్రధారిదాస్ పాల్గొన్నారు.



రథం ఎదుట నృత్యం చేస్తున్న నృత్యకారిణులు

ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని అభివృద్ధి చేస్తాం

- పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు తరలిరండి: మంత్రి కొలుసు పార్థసారథి



మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి

లబ్బీపేట, జూలై 12: కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని అభివృద్ధి చేస్తామని, పారిశ్రామిక రంగం అభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. బందరు రోడ్డులోని ఓ హోటల్‌లో శుక్రవారం ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆఫ్ ఇండియా, దళిత్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో అవకాశాలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా సారథి విచ్చేశారు. రాష్ట్రంలో పారిశ్రామిక రంగం అభివృద్ధికి సీఎం చంద్రబాబు అన్ని చర్యలు తీసుకున్నారని, పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. పరిశ్రమలు ఏర్పాటు చేసేవారికి రాష్ట్ర ప్రభుత్వం పలు రాయితీలతో పాటు అనుమతులను సింగిల్ విండో విధానంలో అందిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో సముద్ర, నదీ తీరప్రాంతం అధికంగా ఉన్నందున ఇక్కడ అనేక పంటలు పండుతున్నాయని తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంతో అనేకమందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు అనేక రాయితీలు ఇస్తుందని, దేశంలోని పలు ప్రాంతాల్లో యూనిట్లు, పరీక్ష కేంద్రాలను ఏర్పాట్లు చేస్తున్నారని మినిస్ట్రీ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ అడిషనల్ సెక్రటరీ మిన్హజ్ ఆలం తెలిపారు. ఈ రంగంలో ఎంతో భవిష్యత్తు ఉంటుందని, యువ పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చి పరిశ్రమలు ఏర్పాటు చేస్తే కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో దళిత్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ జాతీయ అధ్యక్షుడు నర్రా రవికుమార్, డిక్కీ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజానాయక్, జాతీయ వర్టికల్ హెడ్ మంజుల్ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు ఆశీర్వాదం, ఉపాధ్యక్షురాలు రాజమణి, ఎస్‌బీఐ డీజీఎం మనీష్‌కుమార్ సింధియా, పారిశ్రామికవేత్త ముత్తవరపు మురళీకృష్ణ పాల్గొన్నారు.



ప్రభుత్వాస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్లు

వైద్యులకు రక్షణ కల్పించాలి

ప్రభుత్వాసుపత్రి, జూలై 12: ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం రాత్రి వైద్యులపై జరిగిన దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ పోలీసులకు దాడిపై ఫిర్యాదు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జూనియర్ డాక్టర్లు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వాస్పత్రిలో వైద్యులకు రక్షణ కల్పించాలని, తగిన సిబ్బందిని ఆస్పత్రిలో ఉంచాలని, సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఓపీ విభాగాలను నిలుపుదల చేసి రోగులకు ఇబ్బంది కలగకుండా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆందోళన చేశారు. ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్లు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు బయటకు రాలేదని, సూపరింటెండెంట్‌ను జూడాలు కలిసినా డాక్టర్ల తరఫున ఆయన మాట్లాడలేదని వారు తప్పుబట్టారు. సూపరింటెండెంట్‌కు జూడాలు వినతిపత్రం ఇవ్వగా తీసుకునేందుకు నిరాకరించారని వైద్యులు తెలిపారు. ఫిర్యాదుకు ఎక్నాలెడ్జ్‌మెంట్ ఇవ్వలేదని ఇది దురదృష్టకరమని పేర్కొన్నారు.

డీఎంఈ హామీతో ఆందోళన విరమణ

ప్రభుత్వాస్పత్రిలో జూడాల ఆందోళన వద్దకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) నరసింహ, మాచవరం పోలీసులు వచ్చారు. ఆందోళనకు కారణాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కరిస్తామని డీఎంఈ హామీ ఇవ్వడంతో జూడాలు ఆందోళన విరమించారు. మాచవరం పోలీసులకు జూడాలు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.



వీరవల్లి వద్ద జాతీయరహదారిపై ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఆగిపోవడంతో రోడ్డుపై నిలుచున్న ప్రయాణికులు

అర్ధరాత్రి ఆగిపోయిన ట్రావెల్స్‌బస్సు

- డ్రైవర్, క్లీనర్ జంప్..పోలీసులకు ప్రయాణికుల ఫిర్యాదు.. టికెట్ డబ్బులు వెనక్కి ఇచ్చిన యాజమాన్యం

హనుమాన్ జంక్షన్ రూరల్, జూలై 12: బాపులపాడు మండలం వీరవల్లి వద్ద జాతీయరహదారిపై ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఆకస్మాత్తుగా ఆగిపోయింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు నడిరోడ్డుపై అగచాట్లు పడిన ఘటన శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..36మంది ప్రయాణికులతో విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు తెల్లవారుజామున 2 గంటలకు వీరవల్లి వద్ద జాతీయ రహదారిపై ఆగిపోయింది. సమస్య ఏమిటో చెప్పకుండా డ్రైవర్, క్లీనర్ బస్సు వదిలి వెళ్లిపోయారు. దీంతో చిన్నపిల్లలతో ప్రయాణికులు నడిరోడ్డుపై నిలుచుని పడిగాపులు పడ్డారు. యాజమాన్యానికి ఫిర్యాదు చేస్తే మీడబ్బులు తిరిగి ఇచ్చేస్తామని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పింది. దీంతో వారు వీరవల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు డ్రైవర్‌ను, క్లీనర్‌ను అదుపులోకి తీసుకుని యాజమాన్యంతో మాట్లాడారు. పోలీసుల జోక్యంతో ట్రావెల్స్ యాజమాన్యం ప్రయాణికులకు విజయవాడ వరకూ బస్సు ఏర్పాటు చేసింది. టికెట్ డబ్బులను తిరిగి ఇవ్వడంతో ప్రయాణికులు ఉదయం విజయవాడ చేరుకుని అక్కడి నుంచి గమ్యస్థానాలకు వెళ్లిపోయారు.

అనధికారికంగా దుర్గమ్మ దర్శనాలు

అగర్‌బత్తీ స్టాల్ సిబ్బంది అడ్డగోలు వ్యాపారం



ఆలయంలోకి అనధికారికంగా భక్తులను తీసుకెళుతున్న అగర్‌బత్తీ స్టాల్ సిబ్బంది

వన్‌టౌన్, జూలై 12: ఆషాఢమాసం మొదటి శుక్రవారం కావడంతో దుర్గగుడిలో అమ్మవారి దర్శనానికి ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దేవస్థానంలో వివిధ విభాగాల్లో, దుకాణాల్లో పని చేస్తున్న ప్రైవేట్ వ్యక్తులు అమ్మవారి దర్శనానికి వచ్చే కొందరిని గుర్తించి వారి వద్ద డబ్బులు తీసుకుని టికెట్లు లేకుండా వీఐపీ క్యూలో అమ్మవారి దర్శనం చేయిస్తున్నారు. విధుల్లో ఉన్న దేవస్థాన ఉద్యోగులు, సెక్యూరిటీ వారిని అడ్డగిస్తే ఫలానా అధికారుల తాలూకా అంటూ రాచమార్గంలో వారిని ఆలయంలోకి తీసుకెళ్లి దర్శనం చేయించి ఆశీర్వచనం ఇప్పిస్తున్నారు. శుక్రవారం రద్దీగా ఉండడంతో ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కొందరు ప్రైవేట్ వ్యక్తులు, ఇటీవల దేవస్థానంలో శివాలయానికి వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన ధూప్‌స్టిక్స్ అండ్ అగర్‌బత్తీ స్టాల్స్‌లో పనిచేస్తున్న సిబ్బంది మహామండపం వద్ద నుంచి నేరుగా 10మందిని లిఫ్ట్ మార్గం నుంచి కొండ పైకి తీసుకెళ్లి అమ్మవారి దర్శనం చేయించారు. పల్లకీసేవలో పనిచేసే బోయి లు కూడా పెద్దసంఖ్యలో అనధికారికంగా దర్శనాలు చేయిస్తున్నారు.

దుర్గమ్మ సేవలో ఆర్పీ సిసోడియా

కనకదుర్గమ్మను శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం కల్పించారు. అధికారులు అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు. దుర్గగుడిలోని గోపుర స్వర్ణతాపడ పనులకు శుక్రవారం హిందూపూర్ పాండురంగనగర్‌కు చెందిన బుక్కపట్నం నవీన్ నిశ్చల్ లక్ష రూపాయల చెక్కును విరాళంగా ఆలయ అధికారులకు అందజేశారు. దుర్గగుడిలోని ధర్మపథం వేదికపై భీమవరం గునుపూడికి చెందిన ఉమాసోమేశ్వరి సంగీత అకాడమీకి చెందిన కళాకారులు భక్తరంజని కార్యక్రమాన్ని నిర్వహించారు.

న్యాయవాదిపై దాడి..కేసు నమోదు

వన్‌టౌన్, జూలై 12: న్యాయవాదిపై దాడి చేసిన ఘటనలో నిందితులపై శుక్రవారం గవర్నర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. "యర్రంశెట్టి పూర్ణమహేష్ 23 ఏళ్లుగా న్యాయవాదిగా పనిచేస్తున్నాడు. సీఆర్డీయే కార్యాలయం ఎదురుగా ఆయనకు కార్యాలయం ఉంది. గురువారం రాత్రి న్యాయవాది తన కార్యాలయంలో ఉండగా లంక కుమార్‌బాబు, అతని మేనల్లుడు మహేష్ దౌర్జన్యంగా లోపలికి ప్రవేశించారు. అసభ్యకరంగా దూషించి దాడి చేశారు. టేబుల్‌పైన ఉన్న సెల్‌ఫోన్, చేతికి ఉన్న రెండు ఉంగరాలను లాక్కున్నారు." అని న్యాయవాది ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడని పోలీసులు తెలిపారు. రెండు కుటుంబాల కలహాలకు మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న కారణంగా లంక కుమార్, అతని మేనల్లుడు తనపై దాడికి పాల్పడ్డారని న్యాయవాది పోలీసులకు వివరించాడు. పోలీసులు కుమార్‌బాబు, మహేష్, మరికొందరిపై కేసు నమోదు చేశారు.

ఆస్ట్రో ఫిజిక్స్‌పై వర్క్‌షాప్

గవర్నర్‌పేట, జూలై 12: డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (కేంద్ర ప్రభుత్వం), ఆకర్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం లహరి విద్యామందిర్, ఫ్యూచర్‌పాత్ విద్యాసంస్థల్లో సైన్స్ అండ్ టెక్నాలజీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, హెల్త్ హైజీన్, ఆస్ట్రో ఫిజిక్స్‌పై వర్క్‌షాపులు నిర్వహించారు. టెక్నాలజీపై అవగాహన కల్పిస్తూ లఘుచిత్రాలను ప్రదర్శించారు. ఐవోటీ సెన్సార్లను ప్రదర్శించారు. ఆకర్ష ఫౌండేషన్ ప్రెసిడెంట్ గణేష్ శంకర్, డి.సాయిసతీష్, సైకాలజిస్ట్ శ్రావణి, ట్రైనర్లు, స్కూలు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ముద్దాడ రవిచంద్రకు సత్కారం



ముద్దాడ రవిచంద్రను సత్కరిస్తున్న బీసీ నాయకులు

విజయవాడ, జూలై 12(ఆంధ్రజ్యోతి): సీఎం ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్రను 93 బీసీ కులాల ఐక్యవేదిక నాయకులు వెలగపూడిలోని సచివాలయంలో కలిశారు. రాష్ట్ర అధ్యక్షుడు మాకిరెడ్డి భాస్కర్ గణేష్‌బాబు శాలువాతో సత్కరించి అన్నవరం సత్యదేవుడు, జ్యోతిరావుఫూలే చిత్రపటాలను అందజేశారు. పెద్దనాపల్లి సర్పంచ్ బుద్దా సూర్యప్రకాశ్, సంచారజాతుల సంఘ డైరెక్టర్ దొనకొండ పెద్దిరాజు ఉన్నారు.

లయోలాలో 68వ పుస్తక సమీక్ష

భారతీనగర్: ఆంధ్రా లయోలా కళాశాలలో 68వ పుస్తక సమీక్ష శుక్రవారం నిర్వహించారు. ఫాదర్ గార్డెన్ లైబ్రరీ హాల్‌లో రచయిత కందిమళ్ల శివప్రసాద్ రచించిన కలం నా ఆయుధం -పాత్రికేయుడి జ్ఞాపకాలు పుస్తకంపై సమీక్ష చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఫాదర్ డాక్టర్ పి.ఆర్.జాన్, ఎస్.జె.రెక్టర్ పాల్గొన్నారు. కళాశాలలో ఇప్పటికి 68 పుస్తకాలను సమీక్షించడం అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. భారత పాత్రికేయ రంగంలో కోటమరాజు రామారావు ఒక హిమాలయ శిఖరమని రచయిత కందిమళ్ల శివప్రసాద్ అన్నారు. పాత్రికేయ జ్ఞాపకాల రచనను తెలుగులో కలం నా ఆయుధంగా అనువదించారన్నారు. ప్రిన్సిపాల్ ఫాదర్ డాక్టర్ పి.కిశోర్, లైబ్రేరియన్ సెక్రటరీ డాక్టర్ జీఏ ప్రసాదరావు, ఫాదర్ జి.రాయప్ప, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నటుడు ప్రియదర్శి

నగరంలో డార్లింగ్ వై దిస్ కొలవరి సందడి

లబ్బీపేట, జూలై 12: నగరంలో డార్లింగ్ వై దిస్ కొలవరి చిత్ర యూనిట్ సందడి చేసింది. ఈనెల 19న చిత్రం విడుదలకానుండడంతో ప్రమోషన్‌లో భాగంగా శుక్రవారం బందరు రోడ్డులోని ఓ హోటల్లో విలేకరుల సమావేశం నిర్వహించింది. దర్శకుడు అశ్విన్‌రామ్ చెప్పిన కథ విన్న వెంటనే హీరోగా నటించడానికి ఒప్పుకున్నానని నటుడు ప్రియదర్శి తెలిపారు. కుటుంబసమేతంగా చూడదగ్గ సినిమా ఇదని ఆయన తెలిపారు. దర్శకుడు అశ్విన్‌రామ్, హీరోయిన్ నభ నటేష్, హాస్యనటులు కృష్ణతేజ, విష్ణు పాల్గొన్నారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో వార్షిక అవార్డుల ప్రదానం



అవార్డు ప్రదానం చేస్తున్న ఎస్.వి.ఎస్.సుదర్శన్

గుణదల, జూలై 12: చిన్ననాటి నుంచి ఓర్పు సహనం అలవర్చుకుంటే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఎన్‌సీసీ 10వ బాలికల బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ ఎస్.వి.ఎస్.సుదర్శన్ తెలిపారు. నిడమానూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో వార్షిక అవార్డుల వేడుక శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్.వి.ఎస్.సుదర్శన్ విచ్చేశారు. ఏడేళ్ల వరుసగా అన్ని సబ్జెక్టుల్లో ప్రతిభ కనబర్చిన ఉత్తమ విద్యార్థులకు స్కూల్ యాజమన్యం అవార్డులు ప్రదానం చేయడం అభినదనీయమన్నారు. ఏడేళ్లగా వరుసగా ప్రతిభ కనబర్చిన పాఠశాల విద్యార్థిని నైనా తబిత శీలంకు గోల్డ్ మెడల్ అందజేశారు. 5వ తరగతి నుంచి వరుసగా అత్యధిక మార్కులు సాధించిన ఉత్తమ బాలబాలికలకు అవార్డులు ప్రదానం చేశారు. అకడమిక్ డైరెక్టర్ డేవిడ్‌రాజు, పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్‌చంద్, కడియాల ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ఏపీఆర్‌సెట్ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 12: యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ ప్రవేశానికి చేపట్టిన ఏపీఆర్‌సెట్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలను ఏపీఆర్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ప్రొఫెసర్ దేవప్రసాదరాజు తిరుపతిలో శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏపీఆర్‌సెట్‌కు 8,651మంది హాజరయ్యారని తెలిపారు. వీరిలో 4,352మందిని ఇంటర్వ్యూలకు ఎంపిక చేయగా 3,476 మంది హాజరైనట్టు వివరించారు. వీరికి ప్రస్తుతం ర్యాంకులు ప్రకటించామన్నారు. ఫలితాల కోసం..సెట్స్‌ఏపీఎస్‌సీహెచ్‌ఈ.ఏపి.గవర్నమెంట్.ఇన్-ఆర్‌సెట్ వెబ్‌సైట్ చూడాలని కోరారు.

వైసీపీ హయాంలో ముత్తయిదువులకూ వితంతు పింఛన్లు!

- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి విస్మయం

విజయనగరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో అనర్హులకు వితంతు పింఛన్లు ఇచ్చారని, వీరిలో ముత్తయిదువులు కూడా ఉండడంపై మహిళా శిశు, గిరిజన సంక్షేమశాఖల మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆశ్చర్యం వ్యక్తంచేశారు. శుక్రవారం విజయనగరం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో.. వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులు, వృద్ధులకు అందిస్తున్న సామాజిక పింఛన్ల గురించి డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి వివరిస్తుండగా.. ఆమె కలగజేసుకున్నారు. భర్త బతికి ఉండగానే.. మహిళలు వితంతు పింఛన్లు తీసుకోవడం బాధాకరమన్నారు. కొందరు వైసీపీ నేతలు ఆధార్ కార్డులను ట్యాంపరింగ్ చేసి.. తేదీలు మార్చి.. తమ అనుచరులు, వారి కుటుంబ సభ్యులకు వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేయించారని విమర్శించారు. సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. దత్తిరాజేరు మండలంలోని ఒక గ్రామంలో 109 మంది విభిన్న ప్రతిభావంతులు పింఛన్లు తీసుకుంటున్నారని, వీరిలో చాలామంది అనర్హులన్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి పింఛన్లపై ఆరా తీసి, పూర్తిస్థాయిలో నివేదిక ఇవ్వాలని డీఆర్‌డీఏ పీడీని ఆదేశించారు. రాష్ట్రంలో అనేక చోట్ల ఇలాంటి పరిస్థితి ఉందని, 50 ఇళ్లకు ఒక వలంటీర్, పంచాయతీకి సుమారు 10 మంది సచివాలయ సిబ్బంది ఉన్నా ఇలాంటి అక్రమాలు చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు. ఇదంతా వలంటీర్లకు తెలిసే జరిగిట్లుగా ఉందని వ్యాఖ్యానించారు.

కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు కృషి

- అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్



కడప (మారుతీనగర్), జూలై 12: యుద్ధప్రాతిపదికన కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేస్తానని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ స్పష్టం చేశారు. ఎంపీగా గెలుపొందిన అనంతరం సొంత జిల్లాకు మొదటిసారి వచ్చిన ఆయనకు శుక్రవారం విమానాశ్రయంలో బీజేపీ, టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అడుగడుగునా పూలవర్షం కురిపిస్తూ టపాసులు పేల్చుతూ గజమాలలతో స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి కార్లు, బైకులతో భారీ ర్యాలీ నిర్వహించి మొదట తిరుమల తొలిగడప దేవుని కడప లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ ఎంపీ కుటుంబ సమేతంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్దదర్గాకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా దర్గా వెలుపల ఆయన మీడియాతో మాట్లాడారు. విమర్శకుల నోళ్లు మూయించేలా అనకాపల్లి ప్రజలు తనకు విజయం చేకూర్చి వైసీపీకి బుద్ధి చెప్పారని అన్నారు. అనకాపల్లితో పాటుగా సొంత జిల్లా కడపకు మంచి జరిగేలా చేసి ప్రజల రుణం తీర్చుకుంటానని చెప్పారు. జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణ స్థలం అయితే మార్చారు తప్ప చిత్తశుద్ధితో చేసిందేమీ లేదన్నారు. తాను కేంద్రంతో మాట్లాడి యుద్ధప్రాతిపదికన జిల్లాలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు.

జపాలిలో చెట్టు కొమ్మపడి భక్తురాలికి తీవ్రగాయాలు



స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న ఉమారాణి

తిరుమల, జూలై12(ఆంధ్రజ్యోతి): దైవదర్శనానికి వెళుతున్న ఓ మహిళపై భారీ చెట్టుకొమ్మ పడటంతో తీవ్రంగా గాయపడింది. బెంగళూరుకు చెందిన ఉమారాణి, వసంత్ దంపతులు బుధవారం శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చారు. సాయంత్రం జపాలిలోని ఆంజనేయస్వామి దర్శనానికి వెళ్లారు. ఆలయ సమీపంలోని ఓ చెట్టు నుంచి ఎండిపోయిన భారీ కొమ్మ విరిగి ఉమారాణి తలపై పడింది. దీంతో ఆమె అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. ఆమెను హుటాహుటిన తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తరలించారు. వెన్నెముకకు, తలకు తీవ్ర గాయం కావడంతో తిరుపతిలోని స్విమ్స్‌కు తరలించి వైద్యం అందిస్తున్నారు. ఉమారాణి వెన్నెముకకు సర్జరీ చేయనున్నట్టు వైద్యులు తెలిపారు.

ఉద్యాన వర్సిటీలోనే మాజీ వీసీ!

- రాజీనామా చేసినా రాజభోగాలు
- ఉపకులపతి భవనంలో నివాసం
- వర్సిటీ కారులో జోరుగా షికార్లు
- పదవి కోసం మళ్లీ ప్రయత్నాలు



తాడేపల్లిగూడెం రూరల్, జూలై 12: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి డాక్టర్ టి. జానకీరామ్ ఇంకా వర్సిటీ ప్రాంగణాన్ని వదిలిపెట్టడం లేదు. పదవికి రాజీనామా చేసినా కూడా ఇంకా వీసీ భవనంలోనే ఉంటున్నారు. టి.జానకీరామ్ నియామకం చెల్లదని హైకోర్టు పక్షం రోజుల కిందటే తీర్పు ఇచ్చింది. అయినా కొద్దిరోజుల పాటు ఆయన వీసీగానే కొనసాగారు. ఈ క్రమంలో ఉన్నతాధికారులు ఫోన్‌చేసి విశ్వవిద్యాలయానికి ఎందుకు వెళ్తున్నారని ప్రశ్నించారు. హైకోర్టు తీర్పును గౌరవించాలని, పదవి నుంచి వైదొలగాలని సూచించారు. దీంతో ఎట్టకేలకు వీసీ పదవికి జానకీరామ్ రాజీనామా చేశారు. వైసీపీ ప్రభుత్వంలో 'ఎస్ బాస్' అనేందుకే పరిమితమైన ఆయన.. ఇంకా రాజభోగాలు అనుభవిస్తూనే ఉన్నారు. నేటికీ వర్సిటీ ప్రాంగణంలోని ఉపకులపతి భవనంలో ఉంటూనే, వర్సిటీ కారులో షికార్లు చేస్తుండటం చర్చనీయాంశమైంది. మరోవైపు మళ్లీ వీసీ పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. వీసీగా జానకీరామ్ పదవీ కాలంలో నిధుల దుర్వినియోగంతో పాటు ఉద్యోగుల వద్ద సొమ్ములు తీసుకుని ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు వేశారని, వర్సిటీలో ఉన్నత పదవుల నియామకంలోనూ పక్షపాతం చూపించారని ఆరోపణలు వచ్చాయి. ఉద్యాన కళాశాల హాస్టళ్లకు కేటాయించిన జనరేటర్లను ఆయన తన క్వార్టర్స్ చుట్టూ పెట్టించుకోవడంతో విద్యుత్, తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఉద్యాన వర్సిటీని సందర్శించిన తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అధికారుల సమీక్షలో ఈ విషయం తెలుసుకున్నారు. వెంటనే వీసీ భవనాన్ని ఖాళీ చేయాలని రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులకు సూచించారు.

పంచాయతీలకు నిధులు విడుదలపై హర్షం

- పయ్యావులకు ధన్యవాదాలు తెలిపిన వైవీబీ

అమరావతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గతంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.250 కోట్లు విడుదల చేయడం పట్ల ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం సచివాలయంలో ఆయన మంత్రి పయ్యావులను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి పయ్యావుల కేశవ్ పదవీ బాధ్యతల స్వీకరణ నేపథ్యంలో మొదటి సంతకంగా పంచాయతీలకు నిధులు విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. గత ఐదు సంవత్సరాలుగా వివిధ పద్దుల కింద గత ప్రభుత్వం బకాయి పడిన మిగతా నిధులు కూడా త్వరితగతిన విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

అధునాతన సర్వేపై ఉద్యోగులకు శిక్షణ

- సర్వే ఆఫ్ ఇండియాతో ఏపీ ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఏపీ, సర్వే ఆఫ్ ఇండియా సంస్థల అధికారులు

ఉప్పల్, జూలై 12(ఆంధ్ర జ్యోతి): హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో ఉన్న సర్వే ఆఫ్ ఇండియా సంస్థతో ఏపీ ప్రభుత్వం అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. సర్వే ఆఫ్ ఇండియాలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ జియో ఇన్ఫర్మాటిక్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఎన్ఐజీఎస్‌టి) అడిషనల్ సర్వేయర్ జనరల్ డాక్టర్ ఎంకే స్టాలిన్, ఏపీ ప్రభుత్వ సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ విభాగం తరుపున సామర్లకోటలోని జియో ఇన్ఫర్మాటిక్స్ జాయింట్ డైరెక్టర్ వీఎస్ఎన్ కుమార్‌లు ఎంఓయూ చేసుకున్నారు. 5 ఏళ్ల పాటు కొనసాగే ఈ ఒప్పందంతో ప్రస్తుతం ఏపీలో కొనసాగుతున్న సర్వే అండ్ లాండ్ రికార్డ్స్‌ను ఆధునీకరించేందుకు సంబంధిత ఉద్యోగులకు అధునాతన సర్వే పద్ధతులు నేర్పనున్నారు. అలాగే, సర్వేకు సంబంధించిన అధునాతన శాస్త్ర పరిజ్ఞానంలో పరికరాల వాడకంపైనా శిక్షణ ఇస్తారు. దీనిలో ఏపీకి చెందిన 1,596 మంది సర్వే లాండ్ రికార్డ్స్ విభాగం ఉద్యోగులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు డ్రోన్ సర్వే, డిజిటల్ ఫొటోగ్రఫీ, డిజిటల్ లెవలింగ్, టోటల్ స్టేషన్, రిమోట్ సెన్సింగ్ అండ్ జీఐఎస్ అప్లికేషన్స్ వంటి అధునాతన సాంకేతిక సర్వే పద్ధతులను వివరించనున్నారు.

మహారాష్ట్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో 'మహాయుతి' ఘనవిజయం

- పోటీ చేసిన 9 స్థానాల్లోనూ గెలుపు

ముంబయి, జూలై 12: మహారాష్ట్ర శాసన మండలి (ఎమ్మెల్సీ) ఎన్నికల్లో బీజేపీ-శివసేన (షిండే)-ఎన్సీపీ (అజిత్) పార్టీల కూటమి అయిన 'మహాయుతి' ఘనవిజయం సాధించింది. పోటీ చేసిన మొత్తం తొమ్మిది స్థానాలను దక్కించుకొంది. మొత్తం 11 స్థానాలకు శుక్రవారం ఎన్నికలు జరిగాయి. విపక్ష కూటమి అయిన కాంగ్రెస్-శివసేన (ఠాక్రే), ఎన్సీపీ (శరద్)ల మహా వికాస్ అఘాడీ రెండు స్థానాల్లో పోటీ చేయగా రెండింట్లోనూ గెలిచింది. 11వ స్థానానికి ఎన్సీపీ (శరద్) మద్దతుతో పోటీ చేసిన పీజెంట్స్ అండ్ వర్కర్స్ పార్టీ అభ్యర్థి జయంత్ పాటిల్ ఓడిపోయారు. పార్టీ ఆదేశాలను కాదని ఏడుగురు కాంగ్రెస్ సభ్యులు క్రాస్ ఓటింగ్ చేసినట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ తరఫున 37 మంది ఎమ్మెల్యేలు ఉండగా అందులో 30 మంది తొలి ప్రాధాన్యత కింద పార్టీ అభ్యర్థి ప్రద్న సాతవ్‌కు ఓటు వేయాలని నిర్ణయించారు. మిగిలిన ఏడుగురు శివసేన అభ్యర్థి మిలింద్ నర్వేకర్‌కు వేయాలని పార్టీ సూచించింది. అయితే సాతవ్‌కు 25, నర్వేకర్‌కు 22 ఓట్లు మాత్రమే రావడంతో క్రాస్ ఓటింగ్ జరిగినట్టు అనుమానిస్తున్నారు.

విశ్వాస పరీక్షలో ఓడిన నేపాల్ ప్రధాని ప్రచండ

కాఠ్మాండు, జూలై 12: నేపాల్ ప్రధాని పుష్ప కమల్ దహల్ ప్రచండ ఆ దేశ పార్లమెంటులో శుక్రవారం నిర్వహించిన విశ్వాస పరీక్ష ఓడారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వామి అయిన సీపీఎన్-యూఎంఎల్ మద్దతు ఉపసంహరించుకోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దీంతో మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలి ఆధ్వర్యంలో నూతన ప్రభుత్వం ఏర్పాటు కానుంది. 275 మంది సభ్యులున్న నేపాల్ దిగువ సభలో ప్రధాని ప్రచండకు కేవలం 63 ఓట్లే వచ్చాయి. వ్యతిరేకంగా 194 ఓట్లు పడ్డాయి. విశ్వాస పరీక్ష నెగ్గాలంటే కనీసం 138 ఓట్లు అవసరం. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్-మావోయిస్టు సెంటర్(సీపీఎన్-ఎంసీ) చైర్మన్ అయిన ప్రచండ 2022 డిసెంబరు 25న అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు నాలుగుసార్లు విశ్వాస పరీక్ష ఎదుర్కొని గట్టెక్కారు. ఐదోసారి మాత్రం ఓడిపోయారు.

అసాధారణ సందర్భాల్లోనే బెయిల్‌పై స్టే ఇవ్వాలి

- లేకుంటే ప్రమాదంలో వ్యక్తిగత స్వేచ్ఛ: సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ, జూలై 12: కింది కోర్టులు మంజూరు చేసిన బెయిల్ ఉత్తర్వులపై స్టే విధించేటప్పుడు హైకోర్టులు యాంత్రికంగా వ్యవహరించకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సరైన కారణాలు చెప్పకుండా స్టే ఇవ్వకూడదని తెలిపింది. అసాధారణ, ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే స్టే ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొంది. ఉగ్రవాదుల కేసుల్లో చట్టాన్ని పాటించలేదని భావించే సందర్భాల్లో మాత్రమే బెయిల్‌పై స్టే ఇవ్వవచ్చని తెలిపింది. ఈ మేరకు శుక్రవారం న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జి మాసిహ్‌ల ధర్మాసనం తన ఆదేశాల్లో పేర్కొంది. మనీలాండరింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణపై పర్విందర్ సింగ్ ఖురానా అనే వ్యక్తిపై కేసు నమోదయింది. ఆయనకు గత ఏడాది జూన్ 17న ట్రయల్ కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. దీనిపై హైకోర్టు మధ్యంతర స్టే ఇచ్చింది. దీన్ని సవాలు చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. విచారణ జరిపిన ధర్మాసనం..నిందితుడు ఉగ్రవాది కాదని, బెయిల్‌పై స్టే ఇవ్వాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించింది. ఇలా స్టే ఇవ్వడం ప్రమాదకరమని, అది వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగిస్తుందని తెలిపింది. యథాలాపంగా వ్యవహరిస్తూ వ్యక్తుల స్వేచ్ఛపై ఆంక్షలు పెట్టకూడదని పేర్కొంది.



పులస రూ.24వేలు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం రామరాజులంకలో మత్స్యకారుల వలకు శుక్రవారం పులస చేప చిక్కింది. గోదావరికి ఎర్రనీరు రావడంతో పులసలు పడడం ప్రారంభమైంది. బర్రే శ్రీను అనే మత్స్యకారుని వలలో పులస చిక్కింది. రెండు కిలోల బరువున్న ఈ పులసను అప్పన రామునిలంకకు చెందిన మాజీ సర్పంచ్ బర్రే శ్రీను రూ.24వేలకు కొనుగోలు చేశాడు.

- మలికిపురం

విశాఖ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ లేనట్టే?

- పెట్టుబడుల ఉపసంహరణపై కేంద్రం వెనకడుగు
- గత నిర్ణయాలపై సమీక్ష. ప్రజావ్యతిరేకతపై విశ్లేషణ
- ప్రభుత్వ రంగ సంస్థలకు పూర్వవైభవం తెచ్చేలా యోచన
- ఈ క్రమంలోనే కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి ప్రకటన



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ ఉండబోదని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖా మంత్రి కుమారస్వామి చెప్పిన మాటలు నిజం కాబోతున్నాయి. తాజా ఎన్నికల్లో ఊహించని విధంగా సీట్లు కోల్పోయిన బీజేపీ గతంలో తాను తీసుకున్న నిర్ణయాలపై సమీక్షిస్తోంది. ప్రజల్లో వ్యతిరేకత రావడానికి దారితీసిన అంశాలేమిటో విశ్లేషించుకుంటోంది. 'పెట్టుబడుల ఉపసంహరణ-ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ' అందులో ప్రధానమైనదిగా గుర్తించి, ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ప్రధాని మోదీ నిర్ణయించినట్టు జాతీయ స్థాయిలో చర్చ మొదలైంది. దీనిపై ఇప్పటికే కొంత సమాచారం ఉండడం వల్లే విశాఖ స్టీల్ ప్లాంటును సందర్శించినప్పుడు మంత్రి కుమారస్వామి ప్రకటన చేసినట్టు తెలుస్తోంది. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఉండదని, ప్రధానికి అన్నీ వివరించి రెండు నెలల తరువాత సరైన నిర్ణయం ప్రకటించనున్నట్టు వెల్లడించారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియను పక్కనపెట్టి, వాటిని మళ్లీ పట్టాలపైకి తీసుకువచ్చి పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలని మోదీ ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఇందుకు అవసరమైన నిధులను మాత్రం నిరర్థక ఆస్తుల విక్రయం ద్వారానే సమకూర్చుకోవాలని భావిస్తున్నారు. ప్రతి ప్రభుత్వ రంగ సంస్థలోనూ ఆదాయం రాని స్థిరాస్తులు ఇప్పటికే గుర్తించారు. వాటిని సరైన రీతిలో విక్రయించి, ఆయా మొత్తాలను వాటిలోనే పెట్టుబడులుగా పెట్టి, శిక్షణ పొందినవారిని ఎగ్జిక్యూటివ్‌లుగా నియమించి, ఆయా సంస్థలు పూర్వం ఎలా సమర్థంగా పనిచేశాయో అదే స్థాయికి తీసుకువెళ్లేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఈ క్రమంలో విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ, విక్రయ ప్రక్రియ దాదాపుగా ఆగిపోయినట్టేనని అంటున్నారు. అయితే ఇక్కడ పూర్తిస్థాయిలో ఉత్పత్తికి ఎటువంటి విధానాలు అనుసరిస్తారనే దానిపై స్పష్టత లేదు. సెయిల్‌లో విలీనం చేయాలని ఉద్యోగ, కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అలా వీలుకాకపోతే యాజమాన్య బాధ్యత సెయిల్‌కే ఇచ్చి, ప్లాంటు నడపాలని కోరుతున్నారు. ఈ రెండూ కాకుంటే అవసరమైన రుణాలు తీసుకోవడానికి రాష్ట్రపతి పేరిట ఉన్న భూములను ప్లాంటు పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతున్నారు. వీటిలో ఏదైనా అభ్యంతరం లేదని చెబుతున్నారు. వీటిని ఒకవైపు పరిశీలిస్తూనే, మరో వైపు ప్లాంటుకు చెందిన నిరర్థక ఆస్తులను అమ్మడానికి తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందులో భాగంగానే చెన్నై, హైదరాబాద్‌లలో మార్కెట్ యార్డులను విక్రయించాలని ప్రతిపాదించారు. ఇలా ఎన్ని ఆస్తులు విక్రయిస్తారో తెలియదు. అయితే విశాఖ స్టీల్‌ప్లాంటు విషయంలో అనుసరించబోయే ప్రణాళిక ఏమిటో వివరించాకే ఈ ఆస్తుల ప్రక్రియ కొనసాగించాలని అధికార, కార్మిక వర్గాలు సూచిస్తున్నాయి.

ఆధార్ ఉంటేనే అపాయింట్‌మెంట్

- మండీ ప్రజలకు ఎంపీ కంగనా నిబంధన

మండీ, జూలై 12 : తనను కలవాలంటే ఆధార్ కార్డుతో రావాలంటూ నియోజకవర్గ ప్రజలకు మండీ ఎండీ, ప్రముఖ నటి కంగనా రనౌత్ నిబంధన విధించడం రాజకీయ దుమారం రేపుతోంది. కంగనా తీరు సరికాదని కాంగ్రెస్ పార్టీ విమర్శిస్తోంది. అసలేం జరిగిందంటే.. హిమాచల్ ప్రదేశ్‌లోని మండీ ఎంపీ నియోజకవర్గం నుంచి ఇటీవల కంగనా భారీ మెజారిటీతో గెలుపొందారు. తమ ఎంపీని కలవడానికి మండీ నియోజకవర్గ ప్రజలు పెద్దఎత్తున ఆమె నివాసానికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో కంగనా వారికి కొన్ని షరతులు విధించారు. ఆధార్ కార్డును వెంట తీసుకు రావాలని చెప్పడంతోపాటు, ఎందుకు కలవాలనుకుంటున్నారనేది కాగితంపై రాసుకొని రావాలని కూడా సూచించారు. తనను చూడడానికి పెద్ద సంఖ్యలో పర్యాటకులు, బయటి ప్రాంతాల వారు వస్తుంటారనీ, వారివల్ల మండీ ప్రజలు అసౌకర్యానికి గురి కాకూడదనే ఈ నిబంధనలు విధించినట్టు కంగనా వివరణ ఇచ్చారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ విరుచుకుపడింది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన నాయకులు ఇటువంటి మాటలు, నిబంధనలు పెట్టబోరని హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ నేత విక్రమాదిత్య సింగ్ విమర్శించారు. ఇటీవల ముగిసిన మండీ లోక్‌సభ ఎన్నికల్లో విక్రమాదిత్యను కంగనా ఓడించి, తొలిసారి పార్లమెంటులో అడుగుపెట్టారు.



సముద్రంలో మత్స్యకారులను ప్రశ్నిస్తున్న కోస్టుగార్డు

ఏపీ తీరంలో సాగర్ కవచ్ విన్యాసాలు

విశాఖపట్నం, జూలై 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని తీరప్రాంతాల్లో కోస్టల్ సెక్యూరిటీ సిబ్బంది 'సాగర్ కవచ్' విన్యాసాలు నిర్వహించారు. చొరబాట్లను నియంత్రించడానికి, అప్రమత్తంగా ఉన్నామని చెప్పడానికి నేవీ, ఇండియన్ కోస్టు గార్డు, సీఐఎస్ఎఫ్, కస్టమ్స్, ఆర్‌పీఎఫ్, రాష్ట్ర పోలీసులు, మెరైన్ పోలీస్, మత్స్య శాఖ, ఐబీ, పోర్టు అధికారులతో కలిసి రెండు రోజులు ఈ విన్యాసాలు చేపట్టారు. గురువారంతో ముగిసిన ఈ కార్యక్రమంలో నేవీ, కోస్టు గార్డు నౌకలు పాల్గొన్నాయి.

బిహార్‌లో పిడుగుపాటుకు 25 మంది మృతి

పట్నా, జూలై 12: బిహార్‌లో 24గంటల వ్యవధిలో చోటుచేసుకున్న వేర్వేరు పిడుగుపాటు ఘటనల్లో 25మంది మరణించారు. 39 గాయపడ్డారు. ఈ కారణంగా కిషన్‌గంజ్, అరారియా జిల్లాల్లో ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.4లక్షల వంతున పరిహారం చెల్లించనున్నట్టు సీఎం నీతీశ్ కుమార్ తెలిపారు. పిడుగుపాటు కారణంగా ఈ నెలలో ఇంతవరకు 50 మంది ప్రాణాలు కోల్పోయారని అధికారులు తెలిపారు. గురువారం బర్కాగాం గ్రామంలోని పాఠశాల సమీపంలోని తాటిచెట్టుపై పిడుగుపడడంతో 22 మంది విద్యార్థులు గాయపడ్డారు.

నేపాల్‌లో నదిలో పడిపోయిన రెండు బస్సులు

- ఏడుగురు భారతీయులు సహా 65 మంది గల్లంతు

ఖాఠ్మాండు, జూలై 12: నేపాల్‌లో కొండచరియలు విరిగిపడి రెండు బస్సులు నదిలో పడిపోయాయి. ఈ ప్రమాదంలో ఏడుగురు భారతీయులు సహా 65 మంది గల్లంతయ్యారు. ఈ విషాదం శుక్రవారం తెల్లవారుజామున చిత్వాన్ జిల్లాలో జరిగింది. 24 మంది ప్రయాణికులతో ఏంజెల్ బస్సు ఖాఠ్మాండుకు, 41 మంది ప్రయాణికులతో గణపతి డీలక్స్ బస్సు గౌర్‌కు బయలుదేరాయి. ఈ క్రమంలో బస్సులు నారాయణ్‌ఘట్-ముగ్లింగ్ రోడ్డుపైకి చేరుకున్నాక వాటిపై కొండచరియలు విరిగిపడ్డాయి. దాంతో బస్సులు పక్కన ఉన్న త్రిశూలి నదిలో పడిపోయాయి.

గ్రామ న్యాయాలయాల ఏర్పాటులో జాప్యమా?

- 6 వారాల్లో సమాధానం ఇవ్వండి: సుప్రీం

న్యూఢిల్లీ, జూలై 12: ప్రజలందరికీ న్యాయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చేందుకు ఉద్దేశించిన గ్రామ న్యాయాలయాల ఏర్పాటు అత్యవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. సత్వరమే న్యాయం అందించేందుకు, కేసుల పెండింగ్‌ను తగ్గించేందుకు వీటిని ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపింది. ఈ విషయమై ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో ఆరు వారాల్లో సమాధానం ఇవ్వాలని అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, హైకోర్టుల రిజిస్ట్రార్ జనరళ్లను ధర్మాసనం ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం 2008లో గ్రామ న్యాయాలయాల చట్టాన్ని తీసుకువచ్చింది. అయితే ఈ చట్టాన్ని అమలు చేయడం లేదంటూ 2019లో నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ సొసైటీస్ ఫర్ ఫాస్ట్ జస్టిస్ అనే స్వచ్ఛంద సంస్థ పిల్ దాఖలు చేసింది.

వివాదాస్పద రచనలను పాఠ్యాంశాలు చేసే ప్రసక్తే లేదు

న్యూఢిల్లీ, జూలై 12: వివాదాస్పద అంశాలను విద్యార్థుల పాఠ్యాంశాల్లో చేర్చే ప్రసక్తే లేదని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శుక్రవారం స్పష్టం చేశారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం(డీయూ) న్యాయ విద్యార్థులకు మనుస్మృతి బోధించాలనే ప్రతిపాదనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. డీయూ న్యాయ(లా) విద్యార్థులకు మనుస్మృతి బోధించనున్నారనే సమాచారం గురువారం తమకు అందడంతో వర్సిటీ వీసీతో మాట్లాడానని ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. అయితే, పలువురు ఆచార్యులు చేసిన ఆ ప్రతిపాదనను తిరస్కరించినట్టు వీసీ చెప్పారన్నారు.

బూతులు మాట్లాడేవారికి బూత్‌లోనే సమాధానం

- ప్రజలు దీన్నే నమ్మారు
- రాజకీయ నేతలకు అధ్యయనం, కష్టపడే మనస్తత్వం అవసరం
- రాజకీయాల్లో సిద్ధాంతం తగ్గి... రాద్ధాంతం పెరుగుతోంది: వెంకయ్యనాయుడు



ఆత్మీయ సంగమం కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు

సాగర్‌నగర్ (విశాఖపట్నం), జూలై 12: జీవితంలో ఎదగాలంటే ఒదిగి ఉండాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. రాజకీయాల పట్ల ప్రజల్లో రోజురోజుకీ గౌరవం తగ్గిపోతోందని, బూతులు మాట్లాడేవారికి బూత్‌లోనే సమాధానం చెప్పాలని ప్రజలు నమ్మారని పేర్కొన్నారు. ఆయన 75 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా మిత్రబృందం రుషికొండలోని ఫంక్షన్ హాలులో శుక్రవారం ఆత్మీయ సంగమం ఏర్పాటుచేసింది. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ రాజకీయాల్లో ఉన్నవారికి ముఖ్యంగా అధ్యయనం, కష్టపడే మనస్తత్వం ఉండాలని అన్నారు. నిత్యం ప్రజల్లో తిరగాలని సూచించారు. జీవితంలో ఎన్నో బాధ్యతలు చేపట్టానని, అవన్నీ రావడానికి మిత్రులు, పెద్దల ఆశీర్వాదమే కారణమని చెప్పారు. కార్యదీక్ష ఉంటే కార్యదక్షత అదే వస్తుందని తెలిపారు. రాజకీయాల్లో సిద్ధాంతం తగ్గిపోయి, రాద్ధాంతం పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ అంటే తనకు ఎంతో ఇష్టమని, ఈ నగరం కన్నతల్లిలా ఆదరించిందన్నారు. రాష్ట్ర విభజనతో ఏపీ నష్టపోకూడదని అప్పట్లో ఎంతో జాగ్రత్తపడ్డామని, ఈ ప్రాంతానికి ప్రాజెక్టులు తీసుకురావడానికి ఎన్నో ప్రయత్నాలు చేసి సాధించుకున్నామని వివరించారు. ఉపరాష్ట్రపతిగా ఉన్నప్పుడు కూడా మన ప్రాంతానికి మేలు చేయాలనే తపన ఉండేదని చెప్పారు. మిజోరం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ దేశంలో స్మార్ట్ సిటీలుగా ఎంపికైన మూడు నగరాల్లో విశాఖకు స్థానం దక్కిందంటే.. అది వెంకయ్యనాయుడు పుణ్యమేనని తెలిపారు. ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ ఈసారి అసెంబ్లీలో తొలిసారి ఎమ్మెల్యేలు అయిన 88 మంది ఉన్నారని, వారంతా వెంకయ్యనాయుడు ప్రసంగాలు వింటే రాజకీయాల్లో ఎదుగుతారని అభిప్రాయం వ్యక్తం చేశారు. తొలిసారి ఎమ్మెల్యేలైన వారికి ఏర్పాటు చేయనున్న శిక్షణ కార్యక్రమాలకు హాజరు కావాలని కోరగా వెంకయ్య సమ్మతించారు. హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ సమున్నత వ్యక్తిత్వం కలిగిన వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతి ప్రసంగాలు స్ఫూర్తినిచ్చే విధంగా ఉంటాయని కొనియాడారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు రాసిన పుస్తకాలను మిత్రులకు, అతిథులకు అందజేశారు. కార్యక్రమానికి శాసనసభ్యుడు కామినేని శ్రీనివాస్ అధ్యక్షత వహించగా ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, విష్ణుకుమార్ రాజు, బండారు సత్యనారాయణమూర్తి, టీడీపీ నాయకుడు దాడి రత్నాకర్, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

ఏఐ సంస్థలపై రోబో ట్యాక్స్

- ఖాళీ స్థలాలపై సంపద పన్ను
- కేంద్ర బడ్జెట్‌పై ఎస్‌జేఎం సూచనలు

న్యూఢిల్లీ, జూలై 12: త్వరలోనే ప్రవేశ పెట్టనున్న కేంద్ర బడ్జెట్‌పై సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్ఎస్ఎస్ అనుబంధ విభాగం స్వదేశీ జాగరణ్ మంచ్(ఎస్‌జేఎం) కొన్ని సూచనలు చేసింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో గత నెలలో భేటీ అయిన అశ్వినీ మహాజన్ నేతృత్వంలోని ఎస్‌జేఎం ప్రతినిధులు.. ఏఐ ఆధారిత సంస్థలపై రోబో ట్యాక్స్ విధించాలని సూచించారు. ఏఐ వినియోగంతో ఉద్యోగాలు కోల్పోయేవారికి పరిహారం కింద దీనిని చెల్లించవచ్చని పేర్కొన్నారు. అయితే.. సాంకేతికతను అడ్డుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. ఇలా వసూలు చేసే పన్నులను ఉద్యోగాలు కోల్పోయేవారు సరికొత్త సాంకేతికతలను నేర్చుకునేందుకు సాయం కింద అందించాలని సూచించారు. అదేవిధంగా ఖాళీ స్థలాలపై సంపద పన్ను విధించాలని పేర్కొన్నారు. ఉపాధి కల్పించే రంగాలను మరింతగా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. భారీ సంఖ్యలో ఉపాధి కల్పించే కంపెనీలకు పన్ను ప్రోత్సాహకాలను కొనసాగించాలని సూచించారు. ఇక, ఖాళీ స్థలాలపైనా పన్ను విధించాలని కోరారు. తద్వారా భూకబ్జాలను, ఆక్రమణలను కూడా తగ్గించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే.. దీని ద్వారా 'అందరికీ ఇళ్లు' పథకం సాకారమవుతుందని తెలిపారు. అదేవిధంగా ఆహార ద్రవ్యోల్బణాన్ని కట్టడిచేసేందుకు ప్రయత్నించాలంటూ కొన్ని సూచనలు చేశారు. సూక్ష్మ సేద్యానికి, సన్నకారు రైతులకు సబ్సిడీలు ఇవ్వాలని పేర్కొన్నారు.

పాత జీవో కొత్తగా..!

- 'జీపీఎస్' ఉత్తర్వు గెజిట్‌పై ఉద్యోగుల్లో కలకలం
- ఆ విధానంపై జూన్ 12న జీవో
- నాడు ఉన్నది వైసీపీ అనుకూల అధికారులే
- తాజాగా దానిపై గెజిట్ ప్రచురణ
- రొటీన్‌గా జరిగిందంతే.. కుట్ర లేదు
- రాష్ట్ర ఆర్థిక శాఖ వివరణ

అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తానన్న జగన్ మాటలు నమ్మిన ఉద్యోగులను వైసీపీ ప్రభుత్వం నట్టేట్లో ముంచింది. సీపీఎస్ రద్దు చేయకపోగా అత్యంత లోపభూయిష్టమైన జీపీఎస్ విధానాన్ని తీసుకొచ్చి దారుణంగా మోసం చేసింది. ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ జీపీఎస్ విధానంపై 2023 అక్టోబరు 24న విధివిధానాలు ప్రకటించింది. ఈ విధానం తప్పనిసరి కాదని.. రావాలనుకుంటే జీపీఎస్ పరిధిలోకి రావొచ్చని.. లేదంటే సీపీఎస్‌లోనే ఉండిపోవచ్చని ఆప్షన్ ఇచ్చింది. ఉద్యోగులు మాత్రం ఓపీఎస్ కావాలన్నారు. అయితే ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసిన జూన్ 12వ తేదీన.. జీపీఎస్ విధానం 2023 అక్టోబరు 20 నుంచి అమల్లోకి వచ్చినట్లు పేర్కొంటూ ఆర్థిక శాఖ జీవో ఇచ్చింది. ఆ రోజున కీలక బాధ్యతల్లో ఉన్నది వైసీపీ అనుకూల అధికారులే. అప్పటికి కూటమి ప్రభుత్వం ఐఏఎస్‌లను బదిలీ చేయలేదు. జూలై 12వ తేదీన అదే జీవో గెజిట్‌లో ప్రచురితమైంది. పాత తేదీతో కొత్త ప్రభుత్వంలో జీవో రావడంతో ఉద్యోగుల్లో కలకలం రేగింది. పలు ఉద్యోగ సంఘాలు దీనిని వ్యతిరేకించాయి. అయితే ఇది రొటీన్‌గా జరిగిపోయిందని, ఇందులో ఎలాంటి కుట్రా లేదని ఆర్థిక శాఖ అధికారులు వివరణ ఇచ్చారు. వాస్తవానికి సీపీఎస్ రద్దుపై ఎన్నికల సందర్భంగా చంద్రబాబు ఎలాంటి హామీ ఇవ్వలేదు. మేనిఫెస్టోలో కూడా పెట్టలేదు. మెరుగైన విధానం అందిస్తామని మాత్రం తన ప్రసంగాల్లో తెలిపారు.

జీపీఎస్‌పై గెజిట్ దుర్మార్గం: ఉపాధ్యాయ సంఘాలు

ప్రభుత్వ ఉద్యోగులంతా పాత పెన్షన్ విధానం కావాలని ఆకాంక్షిస్తుంటే, పాత తేదీతో జీపీఎస్ అమలుకు గెజిట్ జారీచేయడం దుర్మార్గమని యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ ధ్వజమెత్తారు. ఉద్యోగులందరినీ జీపీఎస్ పరిధిలోకి తేవడం మోసం చేయడమేనని తెలిపారు. సీపీఎస్ స్థానంలో జీపీఎస్ గెజిట్ తేవడాన్ని ఏపీటీఎఫ్ ఖండించింది. ఇది ఉద్యోగుల ఆకాంక్షకు విరుద్ధమని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి పేర్కొన్నారు. జీపీఎస్‌పై పాత తేదీతో విడుదల చేసిన గెజిట్‌ను రద్దు చేయాలని ఆప్టా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏజీఎస్ గణపతిరావు, కె.ప్రకాశ్‌రావు డిమాండ్ చేశారు. ఓపీఎస్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

మాతో బంధాన్ని తేలికగా తీసుకోవద్దు!

- భారత్‌లో అమెరికా రాయబారి వ్యాఖ్యలు
- పుతిన్-మోదీ భేటీపై పరోక్ష ఆందోళన

న్యూఢిల్లీ, జూలై 12: అగ్రరాజ్యం అమెరికాతో ఉన్న బంధాన్ని తేలికగా భావించొద్దని, తేలికగా కూడా తీసుకోవద్దని భారత్‌లో అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకరకంగా హెచ్చరికలు చేశారు. ఇటీవల రష్యాలో పర్యటించిన ప్రధాని మోదీ.. ఆ దేశ అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ అయిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పలు ఒప్పందాలు కూడా చేసుకున్నారు. అప్పట్లోనే అమెరికా ఈ భేటీపై ఆందోళన వ్యక్తం చేసింది. తాజాగా భారత్‌లోని అమెరికా రాయబారి మీడియాతో మాట్లాడుతూ.. ఈ భేటీపై బహిరంగంగానే అసహనం వ్యక్తం చేశారు. "మాతో బంధాన్ని తేలికగా తీసుకోవద్దని సూచిస్తున్నాం. కొన్ని సంక్లిష్ట సమయాల్లో వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి కూడా ఉండదు" అని ఎరిక్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇరు దేశాల బంధం శక్తిమంతమైందని, ఎవరూ ఎవరికీ నచ్చజెప్పే పరిస్థితి ఉండదన్నారు. ముఖ్యంగా యుద్ధాలకు వ్యతిరేకంగా ఇరు దేశాలు కలిసి ముందుకు సాగుతున్నాయని గుర్తుచేశారు.

ఐరాస తీర్మానానికి భారత్ దూరం

ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణను తక్షణం నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఐక్యరాజ్యసమితి(ఐరాస) జనరల్ అసెంబ్లీ ప్రవేశ పెట్టిన తీర్మానానికి భారత్ దూరంగా ఉంది. 'ఉక్రెయిన్ అణు కేంద్రాల రక్షణ, భద్రత' పేరుతో రూపొందించిన ఈ తీర్మానాన్ని ఉక్రెయిన్ సభ్యులు జనరల్ అసెంబ్లీలో గురువారం ప్రవేశపెట్టారు. దీనికి అనుకూలంగా 193 మంది సభ్యులు ఉన్న ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో 99 మంది అనుకూలంగా, 9 మంది వ్యతిరేకంగా ఓటేశారు. 60 దేశాలు ఈ తీర్మానానికి దూరంగా ఉన్నాయి. వీటిలో భారత్, బంగ్లాదేశ్, భూటాన్, చైనా, ఈజిప్ట్, సౌదీ అరేబియా, నేపాల్, దక్షిణాఫ్రికా, శ్రీలంక వంటివి ఉన్నాయి.

బత్తలపల్లి మహిళా రైతుకు అంతర్జాతీయ అవార్డు



బత్తలపల్లి, జూలై 12: అనంతపురం జిల్లా బత్తలపల్లికి చెందిన మహిళా రైతు నాగేంద్రమ్మ అంతర్జాతీయ అవార్డు అందుకున్నారు. ప్రకృతి వ్యవసాయం అభివృద్ధికి ఆమె చేసిన కృషికి ఈ గుర్తింపు లభించింది. ఏపీ సమాఖ్య ప్రకృతి వ్యవసాయానికి ప్రతిష్ఠాత్మక గుల్బెంకియన్ అవార్డు లభించింది. పోర్చుగల్‌లోని లిస్బన్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయకుమార్‌తో కలిసి నాగేంద్రమ్మ అవార్డు అందుకున్నారు. ఈ అవార్డు కోసం 117దేశాల నుంచి 181 నామినేషన్లు వచ్చాయి. వాటిలో మూడింటిని ఎంపిక చేయగా.. అందులో ఏపీ సమాఖ్య ఉండడం విశేషం. పర్యావరణ మార్పులు, జీవవైవిధ్య నష్టాలు తదితర సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్న వ్యక్తులు, సంస్థలకు ఏటా ఈ అవార్డులు అందజేస్తారని మహిళా రైతు తెలిపారు. కాగా, నాగేంద్రమ్మ ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేయడంతోపాటు పలువురికి అవగాహన కల్పిస్తూ.. వారు కూడా పంటలు సాగు చేసేలా ప్రోత్సహిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి దిక్సూచి

diksuchi@andhrajyothy.com
విజయవాడ ● శనివారం 13 జూలై 2024

డీఎస్సీ(ఎస్‌జీటీ) మోడల్ ప్రశ్నలు


మేథ్స్ కంటెంట్

1. ఒక క్రమ బహుభుజి యొక్క బాహ్య కోణ, అంతర కోణాల నిష్పత్తి 2 : 3 అయితే బహుభుజిలోని భుజాల సంఖ్య?
1. 3 2. 4 3. 5 4. 6
2. సరళరేఖకు గల అంత్య బిందువుల సంఖ్య.
1. 2 2. 4 3. అనంతరం 4. ఉండవు
3. రెండు కోణాలు తిర్యక్‌రేఖకు ఒకేవైపున ఉండి ఒకటి అంతర కోణం రెండవది బాహ్యకోణం ఆ కోణాలు ఆసన్న కోణాలు కానిచో అవి?
1. అంతర కోణాలు 2. ఏక బాహ్య కోణాలు
3. సదృశ కోణాలు 4. ఏకాంతర కోణాలు
4. రెండు వృత్త వ్యాసార్థాల మొత్తం 20మీ, వాటి భేదం 3.5మీ. అయితే వాటి మధ్య గల స్థల వైశాల్యం ఎంత?
1. 44 చ.మీ. 2. 220 చ.మీ. 3. 616 చ.సెం.మీ. 4. 88 చ.మీ.
5. 11, 17, 24, 32, 38, 45 ______
1. 50 2. 51 3. 52 4. 53
6. 8 మందికి 20 రోజులకు కావాల్సిన బియ్యం వెల రూ.480 అయితే 12మందికి 15 రోజులకు కావాల్సిన బియ్యం వెల?
1. రూ.500 2. రూ.600 3. రూ.540 4. రూ.560
7. $(4X)^3 = (4^3)^3$ అయితే X విలువ
1. 4^6 2. 4^9 3. 4^8 4. 4^7
8. P= 3750, R= 18% చొప్పున ఎంతకాలంలో రూ.5100 మొత్తం అవుతుంది?
1. 2 సంవత్సరాలు 2. 1 సంవత్సరం ఆరు నెలలు
3. మూడు సంవత్సరాలు 4. 4 సంవత్సరాలు
9. గుణకార ప్రక్రియలో a యొక్క తత్సమము
1. -a 2. 0 3. 1/a 4. ఇవేవీ కాదు
10. దీర్ఘ వృత్తానికి గల సౌష్టవాక్షాలు
1. 1 2. 2 3. 3 4. లేవు
11. కింది వాటిలో స్వీకృతం కానిది?
1. సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు
2. ఒక తలములోని రెండు దత్త బిందువులను కలిగి ఉంటూ ఒకే సరళరేఖ ఉంటుంది 3. భూమి గోళాకారంలో ఉంది
4. త్రిభుజంలో 3 కోణాల మొత్తం 180 డిగ్రీలు
12. A, B, Cలు ఒక వ్యాపారాన్ని రూ.8000, రూ.6000, రూ.10,000లతో ప్రారంభించారు. B 3 నెలలు ముందు, C 2 నెలలు ముందు వ్యాపారం నుంచి విరమించుకున్నారు. సంవత్సరం తరవాత వచ్చిన మొత్తం లాభం 25000 అయితే A వాటా ఎంత?
1. 5400 2. 9600 3. 10000 4. పైవేవీకాదు
13. $X+1/X=3$ అయితే X^4+1/X^4
1. 49 2. 47 3. 9 4. 7
14. 1 నుంచి 10 వరకు సంఖ్యలతో ప్రతిదానితో నిశేషంగా భాగించే కనిష్ఠ సంఖ్య?
1. 3576 2. 2856 3. 2520 4. 3680
15. 70984లో 0 యొక్క స్థాన విలువ?
1. 1000 2. 10,000 3. 0 4. 1
16. $[\{17-(5-\overline{6-5})\}+1]-6$ విలువ?
1. 16 2. 24 3. 8 4. 12
17. a:b= 1/4:2/3:, b:c= 3/5:2/7 అయితే a:b:c
1. 63:168:80 2. 168:80:63 3. 80:63:168 4. ఏదీకాదు
18. ఒక వృత్త రేఖాచిత్రంలో దత్తాంశములోని అంశాల్లో ఆహారానికయ్యే ఖర్చును సూచించే కోణం 60 డిగ్రీలు. అతని మొత్తం సంపాదన రూ.18000 అయితే ఆహారానికి చేసే ఖర్చు.
1. 2500 2. 3000 3. 3500 4. 4000

సమాధానాలు

1) 3 2) 4 3) 3 4) 2 5) 4 6) 3 7) 4 8) 1 9) 3 10) 2 11) 4 12) 2 13) 2 14) 3 15) 3 16) 3 17) 1 18) 2

సైన్స్ కంటెంట్



1. అల్యూమినియం ఒక లోహమైనప్పటికీ...
1. తాంతవ్యతా లక్షణాన్ని ప్రదర్శించదు
2. రేకులుగా సాగే గుణాన్ని ప్రదర్శించదు
3. అధిక సాంద్రత లక్షణాన్ని ప్రదర్శించదు
4. ఉష్ణ, విద్యుత్ వాహకంగా పనిచేయదు.
2. నిజ ప్రతిబింబం ఏర్పడటానికి కారణం
1. పరావర్తన కిరణాలు కేంద్రీకరణ చెందడం
2. పరావర్తన కిరణాలు వికేంద్రీకరణ చెందడం
3. పరావర్తన కిరణాలు సమాంతరంగా ప్రయాణించడం
4. ఏ కాంతి కిరణాలు కవల్లనైనా
3. ఏ విలువ వద్ద ఫారన్‌హీట్, సెల్సియస్ మానాలు సమానం.
1. 40 డిగ్రీలు 2. -60 డిగ్రీలు 3. +60 డిగ్రీలు 4. -40 డిగ్రీలు
4. టెలివిజన్ ప్రధానంగా ఏ సూత్రంపై ఆధారపడి పనిచేస్తుంది?
1. కాంతి విద్యుత్ ఫలితం
2. ధ్వని తరంగాలు విద్యుత్ తరంగాలుగా మారడం
3. విద్యుత్ తరంగాలు అయస్కాంత తరంగాలుగా మారడం
4. ధ్వని తరంగాలు అయస్కాంత తరంగాలుగా మారడం.
5. ఒక ఇంధనం యొక్క ఈ కింది లక్షణాలను పరిశీలించండి.
ఎ) అత్యధిక కెలోరిఫిక్ విలువ బి) కాలుష్యాన్ని ఏర్పర్చదు
సి) ద్రవ ఇంధనంగా పరిమిత వినియోగంలో ఉంది
మొదలైన ప్రత్యేక లక్షణాలను కలిగి ఉన్న ఇంధనం?
1. కిరోసిన్ 2. పెట్రోల్ 3. ఎల్‌పీజీ 4. హైడ్రోజన్
6. కింది వాటిలో వేరుగా ఉన్నది.
1. అయస్కాంత బలం 2. కండర బలం
3. స్థావర విద్యుత్ బలం 4. గురుత్వాకర్షణ బలం
7. శ్వాసక్రియ ద్వారా మనం విడుదల చేసిన గాలిలోని కార్బన్‌డైయాక్సైడ్ ఉనికిని గుర్తించడానికి ఉపయోగించే పదార్థం?
1. సున్నపునీరు 2. నిమ్మరసం 3. సున్నపురాయి 4. పొడిసున్నం
8. మంట ఎప్పుడూ నిలువగా పైకి మండుతుంది. దానికి గల కారణాన్ని కింది వాటిలో గుర్తించండి.
ఎ. మంట వల్ల ఏర్పడిన వాయువులు చల్లగా ఉండటం వల్ల
బి. మంట వల్ల ఏర్పడిన వాయువులు వేడిగా ఉండటం వల్ల
సి. వేడి వాయువులు తేలికగా ఉండి పైకి కదులుట వల్ల
డి. మంట యొక్క ఒత్తి నిలువుగా పైకి ఉండుట వల్ల
1. ఎ, బి మాత్రమే 2. బి, సి మాత్రమే
3. సి, ఎ మాత్రమే 4. ఎ, బి, సి మాత్రమే
9. కింది వాటిలో ఫలిత బలం, శూన్యమయ్యే సందర్భం కానిది.
1. వస్తువు విరామస్థానంలో ఉన్నప్పుడు
2. వస్తువు సమచలనంలో ఉన్నప్పుడు
3. వస్తువు అసమచలనంలో ఉన్నప్పుడు
4. పై మూడు సందర్భాల్లో
10. సూక్ష్మ జీవశాస్త్రం వేటిని గురించి తెలుపుతుంది.
1. శైవలాలు - శిలీంద్రాలు 2. వైరస్‌లు - బ్యాక్టీరియాలు
3. ప్రోటోజోవాలు 4. పైవన్నీ
11. మనుషుల్లో ముష్కాలు, స్త్రీ బీజకోశాల నుంచి పురుష బీజకణాలు, స్త్రీ బీజ కణాల సంఖ్య.
1. ఒకటి మరియు వేలల్లో
2. వేలల్లో మరియు ఒకటి
3. మిలియన్లు మరియు ఒకటి
4. ఒకటి మరియు మిలియన్లు
12. చనిపోయిన ఎర్రరక్త కణాల స్థానంలో కొత్త ఎర్రరక్త కణాలు ఏర్పడటానికి కారణం.
1. సమ విభజన
2. క్షయ కరణ విభజన
3. సమ, క్షయ కరణ విభజన
4. ఏదీకాదు
13. సూక్ష్మజీవులను మరిగించడం ద్వారా చంపవచ్చని ప్రయోగాత్మకంగా నిరూపించినవారు.
1. లూయిస్ పాశ్చర్ 2. ఎడ్వర్డ్ జెన్నర్
3. అలెగ్జాండర్ ఫ్లెమింగ్ 4. లజారో స్పాలాన్‌జని
14. పట్టు నూలుకు రంగు వేయడం..............
1. నిట్టింగ్ తరవాత 2. బ్లీచింగ్‌కు తరవాత
3. రోలింగ్ తరవాత 4. బ్లీచింగ్ తరవాత
15. కింది వాటిలో సరైనది కానిది.
1. పరీక్షించడానికి వీలున్న సాధ్యమయ్యే సమాధానమే పరికల్పన
2. పరికల్పన ఎల్లప్పుడూ నిజమవుతుంది
3. ప్రక్రియ నైపుణ్యాలను ఉపయోగించి ప్రయోగాలు నిర్వహిస్తుంటారు
4. ఒక ప్రయోగంలో చరరాశులు నియంత్రించబడతాయి
16. కింది వాటిలో సరికాని వాక్యాలను గుర్తించండి.
ఎ. స్వైన్‌ఫ్లూ వైరస్ వల్ల సంభవిస్తుంది. దోమల వల్ల వ్యాప్తి చెందుతుంది
బి. స్వైన్‌ఫ్లూ బ్యాక్టీరియా వల్ల సంభవిస్తుంది. గాలి ద్వారా వ్యాప్తి చెందుతుంది
సి. స్వైన్‌ఫ్లూ బ్యాక్టీరియా వల్ల సంభవిస్తుంది. నీటి ద్వారా వ్యాప్తి చెందుతుంది
డి. స్వైన్‌ఫ్లూ వైరస్ వల్ల సంభవిస్తుంది. గాలి ద్వారా వ్యాప్తి చెందుతుంది
1. ఎ మాత్రమే 2. ఎ, బి 3. ఎ, బి, సి 4. ఎ, బి, సి, డి
17. పాశ్చరైజేషన్‌లో.....
1. పాలను 700 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు 15 నుంచి 35 నిమిషాల వరకూ వేడిచేస్తారు
2. పాలను 350 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకూ 10 నుంచి 15 నిమిషాలు వేడి చేస్తారు.
3. పాలను 500 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకూ 15 నుంచి 30 సెకన్లు వేడిచేస్తారు
4. పాలను 700 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకూ 15 నుంచి 30 సెకన్లు వేడి చేసాత
18. కింది వాటిలో సాధారణ కంటిచూపు ద్వారా పరిశీలించగలిగే జీవిని గుర్తించండి.
1. స్పైరోగోరా 2. పెన్సిలియం
3. టొబాకో మొజైస్ వైరస్ 4. ప్లాస్మోడియం

సమాధానాలు

1) 3 2) 1 3) 4 4) 3 5) 4 6) 2 7) 1 8) 2 9) 1 10) 4 11) 2 12) 1 13) 4 14) 2 15) 2 16) 3 17) 1 18) 1

ప్రశ్న పత్రాన్ని హైదరాబాద్‌లోని బాసర ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన శీలం దేవేందర్‌రెడ్డి నేతృత్వంలో సీనియర్ ఫ్యాకల్టీ బృందం రూపొందించింది.

ఉస్మానియా వర్సిటీలో పీహెచ్‌డీ



హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ(ఓయూ)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో కేటగిరీ 1 అడ్మిషన్స్ కోసం దరఖాస్తులు కోరుతోంది. సోషల్ సైన్సెస్ విభాగాల్లో 18 ఖాళీలు, ఆర్ట్స్ విభాగాల్లో 47 ఖాళీలు ఉన్నాయి. వీటిని కేటగిరీ 1, కేటగిరీ 2 మోడ్‌లకు చెరి సమానంగా కేటాయిస్తారు. ఇంజనీరింగ్ విభాగాల్లో కూడా ఖాళీలు ఉన్నాయి. సంబంధిత స్పెషలైజేషన్‌లో పీజీ ఉత్తీర్ణతతోపాటు యూజీసీ/సీఎస్ఐఆర్/ఐకార్/ఐసీఎంఆర్/డీబీటీ/డీఎస్‌టీ-ఇన్‌స్పయిర్ నుంచి జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్‌ఎఫ్) అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తిగలవారు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని నింపి నిర్దేశిత ధ్రువపత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి.

సోషల్ సైన్సెస్ విభాగాలు-ఖాళీలు: ఎకనామిక్స్ 1, హిస్టరీ 6, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ 5, పొలిటికల్ సైన్స్ 3, సోషియాలజీ 1, సైకాలజీ 2 ఖాళీలు ఉన్నాయి.

ఆర్ట్స్ విభాగాలు-ఖాళీలు: ఇంగ్లీష్ 25, హిందీ 9, కన్నడ 4, లింగ్విస్టిక్స్ 5, ఫిలాసఫీ 1, సంస్కృతం 1, పర్షియన్ 2 ఖాళీలు ఉన్నాయి.

ఇంజనీరింగ్ విభాగాలు: బయో-మెడికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆర్ట్స్ విభాగాలకు జూలై 20; సోషల్ సైన్సెస్, ఇంజనీరింగ్ విభాగాలకు జూలై 22
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** జేఆర్‌ఎఫ్ సర్టిఫికెట్ రెండు కాపీలు; రీసెర్చ్ ప్రపోజల్ మూడు కాపీలు; పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ సర్టిఫికెట్లు, మార్కుల పత్రాలు; మైగ్రేషన్ సర్టిఫికెట్; కులం, వైకల్యం సంబంధిత ధ్రువపత్రాలు; ఆధార్ కార్డ్ రెండు కాపీలు; రెండు సొంత చిరునామా కవర్లు; రెండు ఫొటోలు
- **ఇంటర్వ్యూలు:** ఆగస్టు 5 నుంచి 14 వరకు
- **అడ్మిషన్స్‌కు ముగింపు:** ఆగస్టు 19
- **చిరునామా:** డీన్ కార్యాలయం, ఫ్యాకల్టీ ఆఫ్ సోషల్ సైన్సెస్/ఆర్ట్స్/ఇంజనీరింగ్, ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్-500007.
- **వెబ్‌సైట్:** www.osmania.ac.in

జాబ్ కార్నర్

హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్‌లో వివిధ పోస్టులు

ఖాళీలు 1217

ప్రభుత్వ రంగ సంస్థ- హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్...ఫిక్స్‌డ్ టర్మ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన దేశవ్యాప్తంగా ఉన్న హెచ్‌ఎల్‌ఎల్ కేంద్రాల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలున్న రాష్ట్రాలు: ఢిల్లీ, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఒడిశా,ఛత్తీస్‌గఢ్

1. అకౌంట్స్ ఆఫీసర్: **2 పోస్టులు**
2. అడ్మిన్ అసిస్టెంట్: **3 పోస్టులు**
3. ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్: **1 పోస్టు**
4. సెంటర్ మేనేజర్: **4 పోస్టులు**
5. సీనియర్ డయాలసిస్ టెక్నీషియన్/డయాలసిస్ టెక్నీషియన్/జూనియర్ డయాలసిస్ టెక్నీషియన్/అసిస్టెంట్ డయాలసిస్ టెక్నీషియన్/అకౌంటెంట్ కమ్ స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్: **1206 పోస్టులు**

వయోపరిమితి: 2024 జూలై 1 నాటికి 37 ఏళ్లు మించకూడదు

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను డీజీఎం(హెచ్‌ఆర్), హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్, హెచ్‌ఎల్‌ఎల్ భవన్, 26/4, వేలచేరి - తాంబరం మెయిన్ రోడ్డు, పల్లికరణై, చెన్నై చిరునామాకు పంపించాలి.

దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: జూలై 17

వెబ్‌సైట్: www.lifecarehll.com/

ఇండియన్ బ్యాంకులో అప్రెంటిస్‌లు

చెన్నైలోని ఇండియన్ బ్యాంక్, ప్రధాన కార్యాలయం...2024-25 సంవత్సరానికి దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంకు శాఖల్లో కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 1,500(ఆంధ్రప్రదేశ్‌లో 82, తెలంగాణలో 42 ఖాళీలు ఉన్నాయి)

కేటగిరీ వారీగా ఖాళీలు: ఎస్సీ-255; ఎస్టీ-77; ఓబీసీ-351; ఈడబ్ల్యూఎస్-137;యూఆర్-680

వయోపరిమితి: 2024 జూలై 1 నాటికి 20 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉండాలి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేట్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

శిక్షణ కాలం: 12 నెలలు

ఎంపిక ప్రక్రియ: ఆన్‌లైన్ రాత పరీక్ష, లోకల్ లాంగ్వేజ్ ప్రొఫిషియెన్సీ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా

స్టయిపెండ్: నెలకు మెట్రో/అర్బన్ శాఖల్లో రూ.15,000. రూరల్/సెమీ అర్బన్ శాఖల్లో రూ.12,000.

దరఖాస్తు రుసుము: జనరల్/ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ రాత పరీక్ష(ఆబ్జెక్టివ్ టైప్) అంశాలు: రీజనింగ్ ఆప్టిట్యూడ్ అండ్ కంప్యూటర్ నాలెడ్జ్ (25 ప్రశ్నలు- 25 మార్కులు), జనరల్ ఫైనాన్షియల్ అవేర్‌నెస్(25 ప్రశ్నలు- 25 మార్కులు)

పరీక్ష వ్యవధి: 60 నిమిషాలు

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: విజయవాడ/గుంటూరు, విశాఖపట్నం, కర్నూలు, విజయనగరం, హైదరాబాద్/సికింద్రాబాద్, ఖమ్మం, కరీంనగర్, వరంగల్

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: జూలై 31

వెబ్‌సైట్: www.indianbank.in/career/

ఎయిమ్స్ రాజ్‌కోట్‌లో సీనియర్ రెసిడెంట్స్

రాజ్‌కోట్(గుజరాత్)లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

పోస్టు: సీనియర్ రెసిడెంట్

విభాగాలు: అనస్థీషియా, అనాటమీ, బయోకెమిస్ట్రీ, డెర్మటాలజీ, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పాథాలజీ, పీడియాట్రిక్స్, గైనకాలజీ తదితరాలు.

అర్హత: సంబంధిత విభాగంలో ఎండీ/ఎంఎస్/ఎంసీహెచ్/డీఎం, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు పదేళ్లు సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: రూ.1000. ఎస్సీ/ఎస్టీలకు రూ.800. దివ్యాంగ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా **చివరి తేదీ:** జూలై 25

వెబ్‌సైట్: aiimsrajkot.edu.in/

ఇండియన్ నేవీలో 10+2(బీటెక్)క్యాడెట్ ఎంట్రీ స్కీమ్

భారత నౌకాదళం... ఎగ్జిక్యూటివ్, టెక్నికల్ బ్రాంచుల్లో 10+2(బీటెక్) క్యాడెట్ ఎంట్రీ స్కీమ్ కింద నాలుగేళ్ల బీటెక్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులైన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఎజిమల(కేరళ)లోని ఇండియన్ నేవల్ అకాడమీలో శిక్షణ ఉంటుంది.

బ్రాంచ్: ఎగ్జిక్యూటివ్, టెక్నికల్ **కోర్సు ప్రారంభం:** 2025 జనవరిలో

ఖాళీలు: 40(మహిళలకు 8 ఖాళీలు కేటాయించారు)

వయోపరిమితి: 2005 జూలై 02 నుంచి 2008 జనవరి 1 మధ్య జన్మించి ఉండాలి.

అర్హత: కనీసం 70 శాతం మార్కులతో సీనియర్ సెకండరీ పరీక్ష(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్) ఉత్తీర్ణతతో పాటు జేఈఈ(మెయిన్) 2024 ర్యాంక్, పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 20

వెబ్‌సైట్: https://www.joinindiannavy.gov.in/

లిటిల్స్



సత్య వ్రతం

కేశవ పురంలో నివసించే మాధవుడికి ఎపుడూ అసత్యం చెప్పడని మంచి పేరుండేది. ఆ దేశపు రాజుగారికి ఈ విషయం తెలిసి, 'ఒక్కసారి కూడా అబద్ధం చెప్పకుండా ఉండటం ఎలా సాధ్యంఅని, అతనితో నేను అబద్ధం ఆడిస్తాను' అన్నాడు రాజు' అదెలా మహారాజా?'అని అడిగిన మంత్రితో, 'నేను ఒక చోటికి వస్తున్నాను అని మాధవుడితో ఆ చోటికి కబురు పంపుతాను. నేను చెప్పిన ప్రకారం వెళ్లక పోతే అతను అసత్యం ఆడినట్లే కదా ఈ విధంగా అతని సత్య వ్రతంచెడిపోయినట్లే' అని నవ్వాడు రాజు. అనుకున్న ప్రకారమే తాను ఒక మారుమూల పల్లెకు రాబోతున్నట్టు మాధవుడి చేత ఆ ఊరికి వర్తమానం పంపాడు కానీ చెప్పిన సమయానికి వెళ్లలేదు ఆ మర్నాడు మంత్రిని పిలిచి ఆ పల్లెప్రజలు మాధవుడి అసత్యం గురించి ఏం అనుకుంటున్నారో తెలుసుకోమని చెప్పాడు. మంత్రి సాయంకాలం తిరిగి వచ్చి, 'మహారాజా. మాధవుడు ఆ ప్రజలకు మీరు ఆ పల్లెకు రావాలి అని అనుకున్నట్టు మాత్రమే చెప్పాడట కానీ ఖచ్చితంగా రాజుగారు వస్తారు అని మాట ఇవ్వలేదట కాబట్టి అక్కడ ఎవరూ మాధవుడిని అసత్య వాది అనుకోవడంలేదు' అని చెప్పాడు. ఈ మాటలు విన్న రాజుగారు మాధవుడి లౌక్యానికి, ముందు జాగ్రత్తకు సంతోషించి, మాధవుడికి విలువైన కానుకలు ఇచ్చాడు.



8 తేడాలు గుర్తించండి!





దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 357

1	4		2		8			
		5	6					
				5	4			7
	6		4				5	3
	1	8				6	9	
3	5				9		8	
4			3	1				
					6	3		
			8		5		6	1

సుడోకు - 356 సమాధానం

2	8	5	6	7	4	9	1	3
1	4	3	8	5	9	7	2	6
9	7	6	1	2	3	4	8	5
8	3	9	5	6	7	1	4	2
7	6	4	3	1	2	5	9	8
5	1	2	4	9	8	3	6	7
3	5	8	9	4	6	2	7	1
4	2	1	7	8	5	6	3	9
6	9	7	2	3	1	8	5	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.